
రూపాయి చెట్టు
సలీం

# రూపాయి చెట్టు

## (కథా సంపుటి)

సలీం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన్‌భవన్,
బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్ - 500 001

**రూపాయి చెట్టు**

*(కథా సంపుటి)*


*రచన :* **సలీం**

ఫ్లాట్ నెం: 306, జె.బి.అపార్ట్‌మెంట్స్,

దోమల్‌గూడ, హైదరాబాద్.



ప్రథమ ముద్రణ : మే, 2004

ప్రతులు *:* **1,000**

వెల *:* **రూ. 70/-**



© రచయిత



*ప్రచురణ :*

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

4-1-435, విజ్ఞానభవన్,

బ్యాంక్ స్ట్రీట్,

హైదరాబాద్ - 500 001

*ప్రతులకు :*

**విశాలాంధ్ర బుక్‌హౌస్,**

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం,

గుంటూరు, తిరుపతి, హన్మకొండ,

అనంతపురం, కాకినాడ.

# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | అమ్మకానికి ఆక్సిజన్ | 4 |
| 2. | బోన్సాగి | 13 |
| 3. | మూడు చలికాలాలు | 19 |
| 4. | లాకులు | 24 |
| 5. | రూపాయి చెట్టు | 34 |
| 6. | వలయం | 43 |
| 7. | వామనుడు | 54 |
| 8. | శిథిల శిల్పాలు | 62 |
| 9. | తలాక్ | 69 |
| 10. | ఆరో అల్లుడు | 82 |
| 11. | మెహర్ | 88 |
| 12. | ఉత్తరం | 96 |
| 13. | నూకలు | 103 |
| 14. | మల్లి | 110 |
| 15. | భవదీయుడు | 120 |
| 16. | పాతిల్లు | 128 |
| 17. | పిడికెడు గుండె | 135 |
| 18. | చావు | 144 |
| 19. | చేతులుంటే ఎంత బావుణ్ణు ! | 157 |
| 20. | ఆశ్రమం | 165 |

# అమ్మకానికి ఆక్సిజన్

ఆదివారం సాయంత్రం.

మా ఇంటి వెనుక ఉన్న విశాలమైన తోటలో పడక్కుర్చీ వేసుకుని కూచున్నా. ఎటు చూసినా పచ్చదనమే. కళ్ళకు హాయిగా ఉంది. చల్లటి గాలి . . . శరీరం మేఘాల్లో తేలిపోతున్న అనుభూతి . . . పక్షుల కిలకిలా రావాలు . . . వీనులవిందుగా – సంగీతం వింటున్నంత కమ్మగా ఉంది.

నాకు చెట్లంటే ప్రాణం. నా పిల్లల్ని ఎంత శ్రద్ధగా, ప్రేమగా పెంచానో ఈ తోటలోని ప్రతి మొక్కనీ అట్లాగే పెంచాను. పెళ్ళయిన కొత్తలో కొన్న జాగా ఇది. వెయ్యి గజాల స్థలం. వనస్థలిపురంలో స్థలాలు కొనడానికి వెనకాడేవారు ఆ రోజుల్లో. సిటీకి దాదాపు పన్నెండు కిలోమీటర్ల దూరం.

నాకయితే సిటీకి దూరంగా ఉండడమే ఇష్టం. ఎలాగూ పల్లెల్లో ఉండే అదృష్టం లేదాయె. ఉదర పోషణార్థం ఉద్యోగాల వేటలో కాంక్రీట్ కీకారణ్యం లాంటి ఈ సిటీలోకొచ్చి పడ్డాను. ఇక్కడి రద్దీ . . . వాతావరణ కాలుష్యం . . . మనిషికి మనిషి తగులుతున్నంత ఇరుకైన కదలిక . . . నాకు చిరాకు . . . మనుషులూ అంతే . . . మనసులనిండా రద్దీనే . . . తరచూ మెదళ్ళలో ట్రాఫిక్ జాంలు . . . నాకు సిటీ జీవితం సుతరామూ నచ్చదు.

యింట్లో అందరూ వద్దంటున్నా వినకుండా – ధర తక్కువగా ఉందని వెయ్యి గజాల స్థలం కొన్నాను. ఆఫీస్‌లో లోన్ పెట్టి వంద గజాల స్థలంలో రెండు గదులూ, కిచెన్ ఉండేట్టు ఇల్లు కట్టుకున్నాను. నేను కట్టాక చాలామంది ఇళ్ళు కట్టుకున్నారు. ఇప్పుడిది చాలా పెద్ద కాలనీగా ఎదిగింది.

మిగిలిపోయిన తొమ్మిది వందల గజాల ఖాళీ స్థలంలో రకరకాల మొక్కలు నాటాను. ఇప్పుడవి నా కొడుకుల్తోపాటు పెరిగి పెద్దవై మహావృక్షాలుగా మారాయి. అదుగో అటువైపు మామిడి, జామ, నారింజ . . . ఇటువైపు బొప్పాయి, అరటి . . . ఆ మూలన వేప . . . ఇక్కడ కరివేప . . . ఒక వైపంతా పూలమొక్కలు పెంచాను. గులాబీ, మందారం, బంతి,





Rupaye_Chettu.pm7 4 28/7/19, 12:03 AM

చామంతి . . . మల్లె, సన్నజాజుల కోసం పందిరి వేయించాను.

ఈ ఇంటికొచ్చాక కూరగాయలు బైట కొనుక్కోవాల్సిన అగత్యం రాలేదు. మా పెరట్లోనే టమేటా, వంకాయ, బెండ, చిక్కుడు, బీర, సొర, పొట్ల, మిరప . . . అలానే బచ్చలి, తోటకూర, గోంగూర, కొత్తిమీర పెంచాం.

ఉదయం పక్షుల కిలకిలా రావాల్తో నిద్ర లేవటం . . . తోటంతా శుభ్రం చేసి, మొక్కలకు నీళ్ళు పోయటం . . . ఆ రోజు వంటకు అవసరమైన కూరగాయలు కోసి శ్రీమతి కివ్వటం . . . సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికొచ్చాక మరలా చెట్లకు నీళ్ళు పెట్టి, ఈ చెట్ల కింద కుర్చీ వేసుకుని ఓ గంట విశ్రాంతి తీసుకోవటం నా దినచర్య.

యాభై ఏడేళ్ళ వయసు వచ్చినా మెడిటేషన్, యోగాభ్యాసాల అవసరం నాకెప్పుడూ రాలేదు. మార్నింగ్ వాక్‌లూ, జాగింగ్‌లూ చేయలేదు. రోజుకు రెండు మూడు గంటలు గార్డెనింగ్ చేయటం – ఓ గంట తోటలో కూచుని రిలాక్స్ కావటం . . . అంతే . . . అనారోగ్యం ఎప్పుడూ నా దరిదాపులకు రాలేదు. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది.

అమెరికా నుండి పెద్దాడు ఫోన్ చేశాడని శ్రీమతి కార్డ్‌లెస్ టెలిఫోన్ తెచ్చి చేతిలో పెడ్తూ "మీతో ఏదో మాట్లాడాలట" అంది.

రెణ్ణిముషాలు వాడితో మాట్లాడాను. వాడూ, బోస్టన్‌లో ఉన్న రెండోవాడు తమ తమ సంసారాల్తో సహా ఉగాది పండక్కి హైద్రాబాద్ వస్తున్నారట. వచ్చే వారాంతానికి ఇక్కడ ఉంటారట. అదీ సారాంశం.

నాకాశ్చర్యమనిపించింది.

నా సుపుత్రులిద్దరికీ ఇండియా రావటం ఇష్టం ఉండదు. అందునా వారికి నా ఇంట్లో దిగటం అస్సలిష్టం ఉండదు. "ఇంత ఇరుకైన ఇంట్లో ఎలా ఉండగలుగుతున్నావమ్మా" అంటూ రెండోవాడు వాళ్ళమ్మ మీద జాలి ఒలకపోశాడట. మొదటివాడి కొడుకైతే "గ్రాండ్‌పాస్ హౌజ్ ఈజ్ నాట్ బిగ్గర్ దెన్ అవర్ బాత్రూం డాడ్!" అన్నాడట. అందుకే వారు రారు.

పెళ్ళిళ్ళయి అమెరికాలో స్థిరపడ్డాక ఒక్కసారి వచ్చారు. అదీ వాళ్ళమ్మ సీరియస్సైతే వచ్చారు. స్టార్ హోటల్స్‌లో రూంలు తీసుకుని, అద్దె కారులో వచ్చి చుట్టపుచూపుగా చూసిపోయారు. ఆ తర్వాత ఇదుగో ఇప్పుడే . . . వస్తున్నట్లు కబురు.

నాకు వాళ్ల రాక రకరకాల ఆలోచనలు రేకెత్తించినా – వాళ్ళమ్మకు మాత్రం సంబరంగా ఉంది. రకరకాల పిండివంటలు వండటంలో ఆమె బిజీ అయిపోయింది.

ఎప్పటికిమల్లె కొడుకులిద్దరూ నక్షత్రాల హోటల్లో సూట్లు తీసుకున్నారు. పది రోజులకు అద్దె కారు మాట్లాడుకున్నారు.

పండగరోజు ఉదయాన్నే వేంచేసి, వాళ్ళమ్మ పెట్టిన ఉగాది పచ్చడి నసుగుతూనే తిన్నారు. ఓ అరగంట ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయినాక వాళ్ల రాకలోని అసలు రహస్యం బైటపెట్టారు.

“నెల క్రితం శేఖర్ నుంచి ఉత్తరం వచ్చిందమ్మా. శేఖర్ నీకు తెల్సుగా. నాతో పాటు ఇంజనీరింగ్ చదివాడూ – ఆ విషయం మాట్లాడిపోదామనే మాకు తీరిక లేకున్నా నేనూ, తమ్ముడు ఇంత దూరం వచ్చాం.”

అదేదో వాళ్ళిద్దరికీ ఇష్టం లేకున్నా, బలవంతంగా మా కోసం వచ్చినట్లు ఆరోపణ మిళితమైన వాక్యం వాడాడు పెద్దకొడుకు.

“ఏమని రాశాడ్రా . . . వాడీ మధ్య జూబ్లీహిల్స్‌లో పెద్ద కాంప్లెక్స్ కట్టాడు. మిమ్మల్ని కొనమని అడిగాడా ఏమిటి?” అంది వాళ్ళమ్మ.

“అలాంటిదే అనుకో. వాడికి వనస్థలిపురంలో రెసిడెన్షియల్ ఫ్లాట్స్ కట్టాలని ఎప్పటినుండో కోరిక. సరియైన స్థలం దొరక్క ఇన్నాళ్ళూ పూనుకోలేదట. ఇప్పుడన్నీ సానుకూలపడ్డాయని రాశాడు”.

“ఇంకేం? మీరిద్దరూ చెరో ఫ్లాట్ కొనుక్కోండి. మన ఇంటికి దగ్గర . . . పడి ఉంటాయి. వాటి మీద వచ్చే అద్దెలవీ మీ నాన్నగారు వసూలు చేసి మీకు పంపిస్తారు. ఎన్నారైలందరూ హైద్రాబాద్‌లో ఇళ్ళూ, స్థలాలు వేలంవెర్రిగా కొనబట్టే మాయదారి రేట్లు విపరీతంగా పెరిగిపోయాయటగా”.

తోటలో కుర్చీ వేసుకుని కూచుని తల్లీ కొడుకుల సంభాషణని జాగ్రత్తగా వింటున్నా.

“అది కాదమ్మా! మన ఇంటి స్థలం ఉంది కదా. తొమ్మిది వందల గజాల స్థలం వూర్కెనే పడి ఉంది. అది వాడికి అమ్మితే కాంప్లెక్స్ కట్టుకుంటాడట. నా ఫ్రెండ్ అయినా తక్కువకి ఇవ్వాల్సిన అవసరం లేదని రాశాడు. మార్కెట్ రేట్ ఎంతుంటే అంత ఇస్తాడట. ఇప్పుడిక్కడ ఐదువేలు నడుస్తుందట కదా. అంటే మనకు నలభై ఐదు లక్షలొస్తాయి.”

అదీ వాళ్ళ దుర్మార్గపు ప్లాన్. నాకు విపరీతమైన కోపం వచ్చింది. చెట్ల ఆకులు కదిలి ‘శాంతం శాంతం’ అన్నట్లనిపించి బలవంతంగా నిగ్రహించుకున్నా. అయినా వాళ్ళడిగినంత మాత్రాన నేను అమ్మాలని లేదుగా. ఈ స్థలం, ఇందులోని మొక్కలూ, చెట్లూ నా ప్రాణం. నేను పోయాక వాళ్లిష్టం. అప్పటివరకు మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకున్నట్లు, నేనీ స్థలాన్ని అంటిపెట్టుకుని ఉంటాను.

"అది సరేరా. వాడంత పెద్ద కాంప్లెక్స్ కడితే దాని ముందు మన వంద గజాల యిల్లు వెలవెలపోదా? మర్రిచెట్టు నీడన తులసిమొక్కలా అసహ్యంగా ఉండదూ?" అంటోంది వాళ్ళమ్మ.

అంటే ఆమెకూ ఇష్టమేనన్మాట. ఎందుకుండదూ? ఇరుకిరుకు గదుల కన్నా లక్షల డబ్బు ముద్దు కదూ. బ్యాంకులో వేసుకుంటే బోల్డంత వడ్డీ. సుఖంగా, దర్జాగా కలర్ టీవీలు, ఫ్రిజ్‌లూ, సోఫాలూ, ఎయిర్‌కండీషన్ రూంలు అనుభవించొచ్చు.

"ఆ విషయం మాకు తెలీదా మమ్మీ. అందుకే శేఖర్‌తో ఓ ఒప్పందానికొచ్చాం. ఈ యిల్లు కూడా అతనికే ఇచ్చేస్తే యాభై లక్షలిచ్చి, హిమాయత్‌నగర్‌లో టూ బెడ్‌రూం ఫ్లాట్ ఇస్తానన్నాడు" అది రెండోవాడి గొంతు.

"మరొకరైతే ఒప్పుకోకపోను. నా క్లాస్మేట్ కాబట్టి ఎలాగోలా ఒప్పించగలిగాను. మనకెంత లాభమో తెలుసా అమ్మా? ఈ ఇంటికి పదిహేను లక్షల ధర పలికినట్లు. నువ్వే ఆలోచించు. బ్యాంక్‌లో యాభై లక్షలు వేసుకుంటే నెలకు నలభైవేల వడ్డీ వస్తుంది. సిటీకి పన్నెండు కిలోమీటర్ల దూరంలో, ఇంత ఇరుకింట్లో ఉండే ఖర్మ తప్పుతుంది" – ఆమె ఆశలకు పెద్దాడు రంగులద్దుతున్నాడు.

"ఇది గోల్డెన్ ఛాన్స్ మమ్మీ. నెలకు నలభైవేల ఆదాయమంటే మీరే పదిమందిని పోషించవచ్చు. హార్ట్ ఆఫ్ ది సిటీలో విశాలమైన ఫ్లాట్‌లో ఉండొచ్చు" రెండోవాడు వూరిస్తున్నాడు.

ఇపుడు మేమేదో వేరే వాళ్ళ పోషణలో ఉన్నట్లు మాట్లాడుతున్నాడు. వీడు సంపాదనలో పడ్డాక మేము ఒక్క డాలర్ ముట్టుకుంటే ఒట్టు.

"ఇవన్నీ మీ నాన్నగారికి చెప్పండి బాబూ . . . మొదట ఆయన ఒప్పుకోవాలిగా" అందామె.

"యిల్లు ఆడవాళ్ళ కింగ్‌డమ్ మమ్మీ. అందుకే మొదట నీకు చెప్పాం. నీ అంగీకారం అయినాకే నాన్నగారు".

బాగానే కాకా పట్టున్నాడు రెండోవాడు.

"మొదట నాన్నగార్ని ఒప్పించండ్రా".

వాళ్ళిద్దరూ నా ఎదురుగా వచ్చి నిలబడ్డారు.

చెట్టంత ఎదిగిన కొడుకులు – ఒకటే తేడా . . . వీళ్ళ దగ్గర స్వార్థపు దుర్వాసన వేస్తోంది.

"నాన్నా! విన్నారుగా. చాలా మంచి అవకాశం. ఓన్లీ ఫూల్స్ మాత్రమే ఇలాంటి ఛాన్స్ వదులుకుంటారు".

"నేను ఫూల్‌నే బాబూ. వచ్చిన అవకాశాల్ని వదులుకోవటం తప్ప వాడుకోటం తెలీని వెర్రివాణ్ణి. మీ పెళ్ళిళ్ళప్పుడు మిమ్మల్ని అమ్ముకోవటం చాతకానివాణ్ణి. మీ సంపాదనలోంచి

పైసా రాబట్టుకోలేని వాణ్ణి. నాకు ఆడంబరాల మీద మోజు లేదు బాబూ. నేను బ్రతుకుతున్న ఈ సాదాసీదా బ్రతుకు చాలా హాయిగా ఉంది".

"యాభై లక్షలు బ్యాంకులో వేసుకున్నాక సింపుల్‌గానే బ్రతకండి. మేము కాదంటామా? ఈ ఇల్లూ, స్థలం మాత్రం అమ్మేద్దాం".

"అమ్మేద్దాం అంటూ మిమ్మల్ని కూడా కలిపేసుకుంటున్నారు. ఇది నా స్వార్జితం. అమ్మితే నేను అమ్మాలి. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది నేను. ఇప్పుడు చెప్తున్నాను వినండి. ఇందులో గజం స్థలం కూడా అమ్మేది లేదు".

"ఏం? ఎందుకని అమ్మరు?"

పెద్దవాడి గొంతులో కోపం నాకు తెలుస్తూనే ఉంది.

"ఎందుకంటే నేను మిమ్మల్ని అమ్ముకోలేదు కాబట్టి"

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

"ప్రేమగా పెంచుకున్న దేన్నైనా అమ్ముకోవటం అమానుషం. నేను మిమ్మల్ని ఎంత ప్రేమగా పెంచానో, ఇక్కడి మొక్కల్ని కూడా అంతే ప్రేమగా పెంచాను. ఈ స్థలం మీద నేను పెంచుకున్న మమకారం మీకు అర్థం కాదు".

"చూడమ్మా! ఈ ముసలాయన ఎట్లా మాట్లాడుతున్నాడో" పెద్దాడు వాళ్ళమ్మ వైపు తిరిగి అన్నాడు.

"చూడు యంగ్‌మాన్! నేనింకా ముసలివాణ్ణి కాలేదు. వయసురీత్యా రిటైర్‌మెంట్‌కి ఇంకో ఏడాది ఉన్నా నేను యంగ్ ఎట్ హార్ట్. మీ మనసులకే ముసలితనం వచ్చింది. తీరని కోరికల్తో, అశాంతితో, అత్యాశల్తో అది ముడతలు పడిపోయింది".

"మేమిక్కడికి కవిత్వం వినడానికి రాలేదు. ఈ స్థలం విషయం తేల్చుకోడానికొచ్చాం."

"తేల్చుకోవడానికి ఏమీ లేదురా అబ్బాయిలూ! ఈ స్థలం నాది. నా సంపాదనతో కొన్నది. దీనిపైన మీకేరకమైన అధికారమూ లేదు. ఇక ఈ విషయాన్ని ఇంతటితో ఆపేయటం మంచిది" చాలా ప్రశాంతంగా చెప్పాను.

అప్పటివరకూ మౌనంగా ఉన్న ఇద్దరు కోడళ్ళూ లంకించుకున్నారు.

"ఇదన్యాయం అత్తయ్యా! మీ పిల్లలకు మీరేమీ ఆస్తులు ఇవ్వలేదు సరే. కనీసం మీ మనవళ్ళకూ, మనవరాళ్ళకైనా ఇవ్వరా?"

"మన పిల్లలిద్దరినీ ఇంజనీరింగ్ చదువులు చదివించాం. అదే మనం వాళ్లకిచ్చిన అతి విలువైన ఆస్తి. అమెరికాలో వాళ్ళకు కూడు దొరుకుతోంది దాని వల్లనే. ఇక మనవళ్ళూ,



Rupaye_Chettu.pm7 8 28/7/19, 12:03 AM

మనవరాళ్ళుంటావా – వాళ్ళకివ్వటానికి మన దగ్గర అంతులేనంత ఆప్యాయత ఉంది – అనురాగం ఉంది. అది అమెరికాకు వలసపోయిన వాళ్ళ దగ్గర దొరకదని చెప్పు” అన్నాను నా భార్యను ఉద్దేశించి చెప్తున్నట్లు.

“నా దగ్గరేముందీ బూడిద అన్నట్లు చెప్తున్నారండీ మీ నాన్న . . . ఉన్నదాని గురించేగా అడుగుతోంది. ఈ స్థలం వారిది కాబట్టే దేబిరింపు . . .” అంది పెద్దకోడలు.

“చదివించడమే పెద్ద ఉద్ధరింపులా ఎలా మాట్లాడుతున్నారో చూడు? మీ బావగారు బాగా చదివి సీట్ తెచ్చుకున్నారు. తన స్వశక్తితో అమెరికాలో ఉద్యోగం తెచ్చుకున్నారు. ఈయనగారేమైనా డొనేషన్లు లక్షలు కట్టారా లేక ఉద్యోగం కోసం లక్షలు లక్షలు లంచాలు పెట్టారా?”

“మీ మరిది విషయమూ అంతే కదక్కా – ఈయనగారు ఏం చేశారని?” అంది రెండో కోడలు.

“నేను వెలగబెట్టిన గుమాస్తాగిరీ ఉద్యోగానికి పిల్లలిద్దర్నీ అంతంత పెద్ద చదువులు చదివించడమే నా శక్తికి మించిన పని. దాన్ని సక్రమంగా నిర్వర్తించినందుకు సంతోషించండి. నాకు చాతనైంది అంతే!”

నా ఇద్దరు కొడుకులూ కస్సుమని లేచారు.

“ఇప్పుడు మేమడుగుతున్నది మీ శక్తికి మించిందీ కాదు – మీకు చాతకానిదీ కాదు. డాక్యుమెంట్లన్నీ మేము రెడీ చేసి తెస్తాం. మీరు చేయవలసిందల్లా సంతకాలు పెట్టటమే” తన అమెరికా తెలివిని ప్రదర్శిస్తున్నాడు రెండోవాడు.

“మీకు శేఖర్ ఇచ్చే ఫ్లాట్‌లో ఫర్నీచర్ అంతా మేమే అరేంజ్ చేస్తాం. మీరూ, అమ్మా ఇక్కడ కారెక్కి, అక్కడ దిగి, మీ అందమైన ఫ్లాట్‌లో హాయిగా ఉండడమే” మొదటి వాడి వూరింపు.

“చూడండి . . . మీరెంతమంది ఎన్ని చెప్పినా ఈ స్థలం అమ్మను. యాభై లక్షలు కాదు కదా యాభై కోట్లయినా నా నిర్ణయంలో మార్పుండదు” అక్కడి నుంచి లేచి లోపలికి వెళ్తూ చివరి తీర్పిచ్చాను.

పండగపూట మధ్యాహ్నం ఎవ్వరూ మెతుకు ముట్టలేదు. వండిన పిండివంటలన్నీ అలానే ఉండిపోయాయి. పిల్లలు ఆకలని ఏడిస్తే కోడళ్ళిద్దరూ రెండు వడ్డించినట్లున్నారు – వాళ్ళు ఏడుపు లంకించుకున్నారు.

ఇంటినిండా విషాద వాతావరణం. నాతో ఎవ్వరూ మాట్లాడడం లేదు. అంతా నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నారు. చివరికి నా భార్య కూడా . . .

రాక రాక కొడుకులిద్దరూ తమ సంసారాల్తో సహా వచ్చి నా పొదరిల్లులాంటి ఇంట్లో

వసంతాగమనాన్ని స్ఫురణకు తెస్తారనుకుని సంబరపడ్డాను. ఇప్పుడు వాళ్ళ గుండె చప్పుడు 'నువ్వు దుర్మార్గుడివి' అన్నట్లు వినిపిస్తోంది. వాళ్ళ కళ్ళు నా వైపు 'నువ్వు హృదయంలేని రాయివి' అన్నట్లు చూస్తున్నాయి.

నా పిల్లలిద్దరూ పెరిగి ప్రయోజకులైనారు. కానీ నా పెరట్లోని చెట్లు నోరు లేనివి. వాటి ఆలనాపాలనా చూసుకోవాల్సిన బాధ్యత నా మీదుంది. పిల్లలు సంపాదనాపరులైనాక వారి నుంచి డాలర్‌లో నూరోవంతు కూడా నేనాశించలేదు. కానీ ఈ చెట్లు నేనడక్కుండానే నాకు చల్లని నీడనిస్తున్నాయి. నాకవసరమైన కూరగాయలిస్తున్నాయి. పండ్లిస్తున్నాయి. మంచి గాలినిస్తున్నాయి. అన్నిటినీ మించి నా మనసుకు హాయినిస్తున్నాయి. మరి నా కొడుకులో...

రోజంతా ఇంటి వాతావరణం వేడిగా ఉండింది.

వాళ్ళమ్మకు ఏం నూరిపోశారో ఏమిటో – రాత్రి నాతో దెబ్బలాట పెట్టుకుంది. కొడుకుల మాట వినకపోతే ఉరేసుకుంటానంది. శేఖర్‌గాడిచ్చే ఫ్లాట్‌లో తప్ప ఈ ఇరుకింట్లో క్షణమైనా ఉండనని ఖరాఖండిగా చెప్పింది. నన్నొదిలేసి అమెరికా వెళ్ళిపోతానంది.

పిచ్చిది. అమెరికా వెళ్తే దానికింత ముద్ద కూడా పడేయరన్న సంగతి తెల్సుకోలేక పోతోంది. ముప్పయ్యేళ్ళ కాపురం – అదెంత అమాయకురాలో నాకు తెలుసు. కొడుకులంటే దానికెంత వెర్రి వాత్సల్యమో నాకు తెలుసు.

పండగెళ్ళిన రెండోరోజు వాళ్ళడిగిన కాగితాల మీద సంతకాలు పెట్టాను. నా హృదయం కార్చిన కన్నీళ్ళు ఎవ్వరూ గమనించలేదు.

మాకిచ్చిన ఫ్లాట్‌ని కూడా కలిపి లెక్కేసి యాభై లక్షల్ని మూడు భాగాలు చేసి కొడుకులిద్దరూ చెరో ఇరవై లక్షలు తీసేసుకున్నారు. మా వాటాకొచ్చిన పది లక్షల్లో రెండు లక్షలు ఖర్చు చేసి ఫ్లాట్‌కి అవసరమైన సామగ్రినంతా కొని, మిగిలిన ఎనిమిది లక్షలు బ్యాంక్‌లో వేసి వాళ్ళు అమెరికా వెళ్ళిపోయారు.

వెయ్యి చదరపు అడుగుల ఆ ఫ్లాట్ నాకు జైలు గదిలా అనిపించింది. ఖరీదైన కొత్త ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు చూసి నా భార్య మురిసిపోయింది.

సాయంత్రమయ్యేసరికి పిచ్చి పట్టినట్లయ్యేది. ఎటు చూసినా ఎత్తయిన కాంప్లెక్స్‌లు తప్ప పచ్చని చెట్లు దర్శనమిచ్చేవి కావు.

బస్సెక్కి వనస్థలిపురం వెళ్ళటం – నా ఇంటి ప్రహారీగోడ బైట నిలబడి పొందిగ్గా కట్టుకున్న నా ఇంటినీ, వెనక తోటలో మూగగా రోదిస్తూ నిలబడి ఉన్న చెట్లనీ, మొక్కల్నీ కళ్ళారా చూసుకుని – కదలి కదలి ఏడుస్తున్న నా గుండెని ఎలాగోలా ఓదార్చి – యిల్లనబడే సిమెంటు



Rupaye_Chettu.pm7 10 28/7/19, 12:03 AM

గదుల మధ్యకు చేరటం నా దినచర్యగా మారింది.

ఓ రోజు అలవాటు చొప్పున వెళ్ళాను. బైట రెండు లారీలు నిలబెట్టి ఉన్నాయి. వాటి మీద – నేను గుండెల మీద పసిపిల్లల్లా పెంచుకున్న చెట్ల మొండాలు . . . వాటి శరీరాల్ని ఖండఖండాలుగా నరికి . . . మొక్కల్ని ముక్కలు ముక్కలుగా తరిగి . . . కొమ్మల్ని ఏ కండ కాకండ చీల్చినట్లు చీల్చి . . . నా కళ్ళెదురుగానే శవవాహకాల్లా ఆ లారీలు కదిలి పోతుంటే . . . గుండె కలుక్కుమంది. ఛాతీలో సన్నగా మొదలైన నొప్పి . . .

వారం వరకూ అన్నం సయించలేదు. ఏదో గుబులు . . . భరించలేనంత దిగులు . . . గుండెమీద మోయలేనంత బరువు . . . రెండు లారీల్ని నిలబెట్టినట్లు . . .

నాకు ఆత్మీయమైన వాటిని అమ్ముకున్నానన్న గిల్టీ ఫీలింగ్ . . . నన్ను నిలువునా దహిస్తూ, నా అణువణువూ కాల్చేస్తూ . . .

భయపడ్తూనే నా పాత ఇంటివైపు కెళ్ళానా రోజు.

అక్కడ నా ఇల్లు లేదు. అంతా చదునుగా నేల . . .

గుండెల్లో నొప్పి ఎక్కువైంది.

ఇంటికెలా చేరానో తెలీదు. స్పృహ తప్పి పడిపోయాను. పక్క ఫ్లాట్ వాళ్ళ సాయంతో అపోలో ఆసుపత్రిలో చేర్పించిందట నా భార్య.

గుండె నొప్పి తీవ్రంగా వచ్చిందట. మరోసారి ఇలా వస్తే ఏకంగా టపా కట్టేస్తానని చెప్పాడు డాక్టర్. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలన్నాడు. పిల్లలిద్దరికీ ఫోన్ చేసింది వాళ్ళమ్మ. పనుల ఒత్తిడి వల్ల రాలేకున్నామని చెప్పారట.

వాళ్ళు రారని నాకు తెలుసు. నా దగ్గర మరో వెయ్యి గజాల స్థలం లేదుగా . . .

బ్యాంకులో వేసుకున్న డబ్బుల్లోంచి మూడు లక్షలు ఖర్చు చేసి నా బలహీనమైన గుండెకి రిపేర్ చేయించుకున్నాను.

ఆపరేషన్ అయినప్పటినుంచీ నీరసంగా ఉంటోంది. ఉత్సాహమే ఉండడం లేదు.

ఆక్సిజన్ క్లినిక్ కెళ్ళమని డాక్టర్‌గారు సలహా ఇచ్చారు. ఈ మధ్య నా కొలీగ్ రామనాథం కన్పించి చెప్పాడు. “గంటకు మూడు వందల రూపాయలు . . . స్వచ్ఛమైన ఆక్సిజన్ . . . మన సిటీ మరీ పొల్యూటెడ్ అయిపోయింది . . . ఏం చేస్తాం . . . తప్పదు . . . నాకు బాగానే ఉందనిపించింది. ఓసారి వెళ్ళి చూడు”.

మరో వారం తర్వాత సికింద్రాబాద్‌లో ఉన్న ఆరెంజ్ ఆక్సిజన్ క్లినిక్‌కెళ్ళాను. ఆక్సిజన్

మాస్కుని ముక్కుకి తగిలించుకున్నాను. బుస్సుమంటూ ఆక్సిజన్ నా ముక్కుపుటాల దగ్గర వేగంగా వెలువడుతోంది.

కళ్ళు మూసుకుని బలంగా గాలిని లోపలికి పీల్చాను. స్వచ్ఛమైన ఆక్సిజన్ నా వూపిరితిత్తుల్లోకి పాకుతోంది.

సాయంకాలాలు నా తోటలో పడక్కుర్చీ వేసుకుని పడుకున్న జ్ఞాపకం గుండెని కత్తిలా కోస్తూ . . .

ఆక్సిజన్ కొనుక్కోవాల్సి వచ్చిన నా దుస్థితికి కన్నీళ్ళాగలేదు.

నన్ను చూసి, నేను ప్రేమగా పెంచుకున్న చెట్ల ఆత్మలు కూడా మౌనంగా రోదిస్తున్న దృశ్యం . . .

*(రచన ఇంటింటి పత్రిక, మే 2002; కథాపీఠం అవార్డు పొందిన కథ)*

JKJKJ

# బోన్సాగి

మేరు పర్వతంలా ఉందా కొండ. దాని పాదం దగ్గర నిలబడ్డ తొమ్మిదేళ్ళ బబ్లూ మట్టి రేణువులా ఉన్నాడు. వాడి లేత చేతులు ఎఱ్ఱగా కందిపోయి అగ్నిపుష్పాల్లా కన్పిస్తున్నాయి. వళ్ళంతా చెమటతో ముద్దగా తడిసిపోయిన వాడి వాలకం చూస్తుంటే ఏ క్షణంలో అయినా స్పృహ తప్పిపడిపోయేలా ఉన్నాడు.

"అలా ఆపేస్తే ఎలారా బబ్లూ? సేద తీరేంత సమయం మనకు లేదు. నీ శక్తినంతా కూడ గట్టుకో. ఈ కొండను వేగంగా తవ్వేసేయ్" వాణ్ణి ఉత్సాహపరుస్తూ అంది వాడి మమ్మీ.

వాడు దీనంగా మొహం పెట్టి – చేతిలోని గునపాన్ని కిందికి జారవిడిచి, "ఇంక నా వల్ల కాదమ్మా" అన్నాడు కూలబడుతూ.

"ఇంకెంతుందని? తవ్వటం ప్రారంభించావుగా. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇపుడు వెనుకంజ వేయకూడదు. నువ్వలా ఓడిపోతే నా పరువూ, మీ నాన్న పరువూ ఏమౌతాయో ఆలోచించు. తొందరగా ఆ గునపం అందుకో . . . ఈ కొండను పిండి చేసెయ్" బాక్సింగ్ రింగ్‌లో ఉన్న ప్రత్యర్థిని చిత్తు చేయమని రెచ్చగొడ్తున్న శిక్షకురాలిలా ఆమె . . .

కన్నీటి పొర కప్పేసిన తన అమాయకమైన కళ్ళెత్తి వాడొకసారి కొండపైకి చూశాడు. కొండ ఎక్కడానికి చక్కటి కాలిబాట ఉంది. ఇరవై-పాతికేళ్ళ మధ్య వయసున్న యువతీ యువకులు వందలాదిగా ఆ దారెంట కొండెక్కి అటువైపుకి దిగిపోతున్నారు.

"అమ్మా! వాళ్ళందరూ నడుస్తున్న దారి ఎంచక్కా ఉందో చూశావా . . . నేనూ వాళ్ళతోనే నడుస్తానమ్మా . . . కొండనిలా తవ్వి అటుకి చేరటం కన్నా, ఎక్కి అటువైపుకి దిగటం సులభం కదమ్మా" బొబ్బలెక్కిన తన అరచేతుల్ని చూసుకుంటూ అన్నాడు బబ్లూ.

"హవ్వ! నీకేమైనా మతి పోయిందా? వాళ్ళతో పాటే వెళ్ళాలంటే నువ్వు మరో పదేళ్ళు ఆగాలి. అంత వయసొచ్చాక ప్రతివాడూ సునాయాసంగా అటువైపుకి చేరుకుంటాడు. మరి నీ ప్రత్యేకత ఏముంది? నువ్వు అందరిలాంటి వాడివి కాదు బాబూ . . . బాలమేధావివి. ఆలస్యం చేయకు . . . ఆ గునపం అందుకో . . . లే . . . త్వరగా లే . . . "

బబ్లూకి చప్పున మెలకువొచ్చింది.

"లే . . . త్వరగా లేచి చదవడానికి కూచో. అప్పుడే అయిదు దాటింది" వాళ్ళమ్మ అరువులు విన్పించాయి.

"ఇంకొద్దిసేపు పడుకుంటానమ్మా . . . ప్లీజ్" అభ్యర్థనగా అడిగాడు.

"నో ఛాన్స్ – ఇప్పటికే పదినిముషాలు ఎక్కువ పడుకున్నావ్. తొందరగా తెములు."

బబ్లూ బద్ధకంగా లేచి బాల్కనీలో కొచ్చి నిలబడ్డాడు.

రాత్రి వర్షం పడి వెలిసిన దానికి గుర్తుగా నేలంతా తడిగా ఉంది. వాళ్ళింటి ముందున్న పున్నాగ  పూలచెట్టు తొలకరి జల్లుకి పులకించి–పూలన్నీ రాల్చుకుంది.

పక్కింటి శీను వాళ్ళ పెరట్లోని బాదం చెట్టు 'బాగున్నావా' అని పల్కరిస్తున్నట్లు ఉల్లాసంగా ఆకులు కదిపింది.

వాడికి తన ఐదేళ్ళ వయసులో పోగొట్టుకున్న బాల్యం 'రారమ్మని' చేతులు చాపి పిలుస్తున్నట్లనిపించింది.

బబ్లూ, పక్కింటి శీనుగాడు, ఎదురింటి తమిళ పిల్ల మీనాక్షి . . . ముగ్గురూ ఒకే ఈడు వాళ్ళు . . . నర్సరీ నుండి వాళ్ళ ముగ్గురిదీ ఒకే జట్టు.

మీనాక్షికి పున్నాగ పూలంటే ఇష్టం. నేలమీద రాలిన నక్షత్రాల్లా ఉన్న ఆ పూలని ఏరి– దోసిట్లో నింపుకుని – మీనాక్షి ఇంటికి పరుగెత్తేవారు శీను, బబ్లూ.

బాదంకాయల్ని గురిగా రాళ్ళతో కొట్టడంలో శీనుదే పైచేయి. పదో పన్నెండో కాయల్ని కొట్టి – వాటిని రాళ్ళతో పగుల కొట్టి అందులోని పప్పుని ముగ్గురూ సమంగా పంచుకొని తినటంలో అద్వితీయమైన ఆనందం అనుభవించే వారు.

రకరకాల ఆటలు . . . అల్లరి . . . అంతలోనే అలకలు . . . కోపాలు . . . జట్టు విడిపోవటాలు . . . మళ్ళా మరునాటికి అన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకోడాలు . . . ఎంత తీయటి అనుభూతి!

బబ్లూ వాళ్ల బాల్కనీలో నిలబడి చూస్తే ఎదురుగ్గా గుణదల కొండ, దాని శిఖరాన పెద్ద శిలువ కన్పిస్తాయి. ఓసారి శీనుగాడు బైనాక్యులర్స్ తెచ్చాడు. ముగ్గురూ పోటీలు పడి శిలువను– దానిమీదున్న క్రీస్తును చూశారు.

అరచేతుల్లో, పాదాల్లో చీలలు గుచ్చబడి, రక్తం ఓడుతూ . . . ముళ్లకిరీటాన్ని ధరించి . . . అనంతమైన బాధని భరిస్తూ . . . నిస్త్రాణగా తల వాల్చేసి ఉన్న శిలువ మీది క్రీస్తుని చూస్తే బబ్లూకి దుఃఖం ఆగింది కాదు.

"ఒరేయ్ శీనూ . . . ఎందుకురా పాపం క్రీస్తుకి శిలువ వేశారు?' అని అడిగాడు.

శీను ఆరిందాలా కళ్ళు తిప్పి "మరేమో . . . మరేమో . . . ఎవరో చేసిన పాపాలకు ఆయన్ని శిక్షించారంట" అన్నాడు.

ఆ వయసులోనే బబ్లూకున్న అపారమైన గ్రాహ్యశక్తి, అద్భుతమైన ధారణశక్తీ వాడి తల్లిదండ్రులకు అర్థమైంది. అప్పటినుండీ వాణ్ణి కట్టడి చేశారు. అతి సుందరమూ–అపురూపమూ అయిన వాడి బాల్య ప్రపంచం నుంచి వాణ్ణి విడదీశారు.

వాడికోసం మేడమీద ప్రత్యేకమైన గదిని ఏర్పాటు చేశారు. అందులో వాడికవసరమైన పుస్తకాల్తో ఓ చిన్నసైజు లైబ్రరీనే ఏర్పాటు చేశారు. కంప్యూటర్ కొన్నారు. అందరికి మల్లే స్కూల్లో చేర్పించకుండా స్పెషల్గా ఇంటి దగ్గరే కోచింగ్ ఇప్పించారు. ఏడేళ్ళకు బబ్లూ పదో తరగతి పరీక్షలు రాసి, ఫస్ట్ క్లాస్లో పాసైనాడు.

వాడి నాన్న విద్యాశాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని కల్సుకుని వాడికోసం ప్రత్యేకమైన పర్మిషన్ తీసుకుని తొమ్మిదేళ్ళకే డిగ్రీ పరీక్ష రాయించాడు. వారం క్రితమే రిజల్ట్స్ వచ్చాయి. వచ్చే సంవత్సరం వాడి చేత పీ.జి. పరీక్ష రాయించాలని వాడి తల్లిదండ్రుల ప్రయత్నం.

బబ్లూకి ఆడుకోవటమంటే ఎంతిష్టమో! కానీ సమయమే దొరకదు. తనతోటి పిల్లల్తో సరదాగా గడపటానికి అవకాశమే లేదు. అసలు వాణ్ణి ఎవ్వరూ తమ జట్టులోకి రానివ్వరనే విషయం రెండేళ్ళ క్రితమే తెల్సింది.

ఓసారి బాల్కనీలో నిలబడి ఉంటే పక్కింటి శీనుగాడు, మీనాక్షి బాదంచెట్టుకింద కూచుని తేగలు తింటూ కన్పించారు.

"మీరిద్దరూ పైకిరండిరా. మనం ఎంచక్కా ఆడుకుందాం" ఆశగా పిలిచాడు బబ్లూ.

"అమ్మో . . . మీ మమ్మీ కోప్పడుతుంది. నువ్వు మేధావివటగా– అప్పుడే పదో తరగతి పాసైనావని మా మమ్మి చెప్పింది. మేమింకా సెకండ్ స్టాండర్డ్లోనే ఉన్నాం" అన్నాడు మీనాక్షి వైపు 'అవును కదూ' అన్నట్లు చూసి.

"పోనీరా . . . నేనే మీ దగ్గరకు వస్తాను. మీ తేగల్లో కాకెంగిలి అడగన్లే. ప్రామిస్" అన్నాడు బబ్లూ.

"నువ్వు మాతో ఆడుకుంటే పాడైపోతావని మీ మమ్మి మా మమ్మీతో చెప్పిందట. వద్దురా . . . నువ్వు రావద్దు. నీ క్లాస్ వాళ్ళతో ఆడుకో" అంటూ మీనాక్షి చేయి పట్టుకుని శీనుగాడు యింట్లోకెళ్ళిపోయాడు.

వాడి సమాధానం విని బబ్లూకి ఏడుపు వచ్చేసింది.

"మమ్మీ-శీనుగాడు నాతో ఆడుకోడట" అంటూ వాళ్ళమ్మతో చెబితే, "ఇంకా ఆటలేమిటి? నువ్వింకా చిన్నపిల్లాడిననుకుంటున్నావా? నువ్వు మేధావివి . . . కాబోయే గొప్ప వ్యక్తివి. నీ రూంలో కెళ్ళి బుద్ధిగా చదువుకో" అంటూ కసురుకుంది.

వాడికి తను చిన్న పిల్లాడిననే అనిపిస్తుంది. మరి అమ్మానాన్నేమో కాదంటుంటారు.

"బబ్లూ-ఏం చేస్తున్నావు బాల్కనీలో? లోపలి కొచ్చి చదువుకో" అమ్మ అరుపుతో ఆలోచనల్లోంచి బైట పడ్డాడు.

అప్పుడే మీనాక్షి ఇంట్లోంచి బైటికి వస్తూ కన్పించింది. బబ్లూని చూసి ఎవరో అపరిచితుణ్ణి చూసినట్లు మొహం తిప్పుకుని – పున్నాగపూల చెట్టుకిందికెళ్ళి పూలేరుకోవడంలో నిమగ్నమైంది.

బబ్లూ చిన్నారి హృదయం చివుక్కుమంది.

ఆ పూలన్నీ తనే ఏరి – మీనాక్షి దోసిట్లో పోసి 'ప్లీజ్ – నన్ను నీతో ఆడుకోనియ్యవూ' అని అడగాలనిపించింది.

వాడు దుఃఖాన్ని దిగమింగి – తన రూంలో కెళ్ళి పుస్తకాలు ముందరేసుకుని కూచున్నాడు.

ఆరింటికి వాళ్ళమ్మ విప్పారిన మొహంతో చేతిలో న్యూస్ పేపర్ పట్టుకుని వచ్చింది.

"బబ్లూ . . . చూశావా? ఈ రోజు పేపర్‌లో నీ గురించే రాశారు. ఇదిగో నీ ఫోటో . . . తథాగత్ అనే బాల మేధావి పదకొండేళ్ళకే పీ.జి. పూర్తి చేశాడట. నువ్వు పదేళ్ళకే పూర్తిచేస్తే అది రికార్డ్ అవుతుందని రాశారు. పేపర్ వాడిచేతికిస్తూ అందామె.

వాడు తన ఫోటోవైపు అనాసక్తిగా చూసి – పక్కన పడేశాడు.

"సర్లే . . . నువ్వు చదువుకో . . . డిస్టర్బ్ చేయను. అయినా ఇలాంటి విషయాలన్నీ నేనూ, డాడీ చూసుకుంటాం. నువ్వు మాత్రం పదేళ్ళకే పీ.జి.పూర్తి చేసిన బాలమేధావిగా రికార్డులకెక్కాలి. సరేనా" అంటూ వాడి బుగ్గలు నిమిరి, పేపర్ పట్టుకుని వెళ్ళిపోయింది.

క్రీస్తుని శిలువ ఎక్కించినట్లు తనను రికార్డుల కెక్కిస్తారు.

వాడు చదవడానికి ప్రయత్నించాడు. మనసు లగ్నం కావటం లేదు.

వాడికి అయిదేళ్ల వయసప్పుడు వాళ్ళమ్మ బోల్డు కథలు చెప్పేది. బాల్కనీలో పడుకుని ఆకాశాన్ని . . . మెరుస్తూ మురిసే నక్షత్రాల్ని . . . తెల్లటి మేఘాలరెక్కలు తగిలించుకుని ఎగిరే చందమామని చూస్తూ . . . కథ వింటూ . . . నిద్రలోకి జారుకోవటం మరపురాని మధురమైన అనుభూతి వాడికి.

వాడికెందుకో ఎక్కడికైనా పారిపోతే బావుండుననిపించింది. తనకంతటి మేధస్సు లేకుండా – తనూ అందరిలానే ఉండి ఉంటే బావుండేదనిపించింది. తన బాల్యాన్ని అయిదేళ్ళ

వయసుకే సమాధి చేసేశారన్న విషయం వాడికి కొద్ది కొద్దిగా అర్థమౌతోంది.

పేపర్లో బబ్లూ గురించి రాసిన విషయాలు చదివి వాడి మేనత్త, డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న వాళ్ళబ్బాయి శేఖర్ వచ్చారు.

బబ్లూ తల నిమిరి, "కీపిట్ అప్ మై బోయ్" అంది వాడి మేనత్త. వాడి మమ్మీతో, "నీకేం వదినా – వజ్రం లాంటి కొడుకుని కన్నావ్" అంది మెచ్చుకోలుగా. అపుడు వాడి మమ్మీ కళ్ళు గర్వంగా మెరిశాయి.

ఆడవాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళిపోయాక, "నువ్వు నాకు సీనియర్‌వి, నేనింకా ఫైనలియర్లోనే ఉన్నాను. నువ్వు ఆల్రెడీ గ్రాడ్యుయేట్‌వికదా" అన్నాడు శేఖర్. అందులో ధ్వనించిన ఎగతాళి బబ్లూకి అర్థం కాలేదు.

"అవునూ – పీ.జి.చదివి ఏం చేస్తావు? ఉద్యోగమా?" శేఖర్ వెక్కిరింపుగా అడిగాడు.

బబ్లూకి ఏం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు.

తను పీ.జి. పాస్ అయి ఏం చేస్తాడు? ఉద్యోగమా? పన్నెండేళ్లకే ఉద్యోగం అనేది మరో రికార్డ్ అవుతుందేమో?

"మాకు లెక్చరర్‌గా వస్తావేమో – కుర్ర లెక్చరర్ బదులు పిల్ల లెక్చరర్" శేఖర్ తమాషాగా నవ్వాడు.

వాళ్ళమ్మ – పేపర్ వాళ్ళకు చెప్పమన్న చిలుకపలుకులు వల్లిస్తూ, "లేదు. నేను గొప్ప సైంటిస్ట్‌నవుతా" అన్నాడు వాడు బింకంగా.

"అదేదో మామూలుగానే కావచ్చుగా . . . కొంపలేమైనా అంటుకుంటున్నాయా తొందరపడి పోడానికి" శేఖర్ ఎగతాళిగా నవ్వాడు.

బబ్లూ ఏమీ మాట్లాడలేదు.

"నువ్వు బోన్సాగివి" అన్నాడు శేఖర్.

అదేదో తిట్టులాంటిదని వాడికి చూచాయగా అర్థమై, "అంటే ఏమిటి" అని అడిగాడు.

"నువ్వు బోన్సాయ్ గురించి చదివి ఉంటావుగా. అది వృక్షం. వయసుంటుంది – కానీ పెరగకుండా నిరోధించి మరుగుజ్జులా మార్చేస్తారు. నీకు వయసులేదు. కానీ మెదణ్ణి అదనంగా పదేళ్ళ వరకు సాగదీసి మేకులు బిగించారు. అందుకే నువ్వు బోన్సాగివి" తెరలు తెరలుగా నవ్వుతూ అన్నాడు శేఖర్.

వాడి మేనత్తా, శేఖర్ వెళ్ళి పోయిన చాలాసేపటి వరకు వాడు ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆలోచనలు తెగక – చిరాకేసి – పుస్తకాల్ని గిరాటేసి – బాల్కనీలో కొచ్చి నిలబడ్డాడు.

ఎదురుగ్గా కొండమీద శిలువ కన్పిస్తోంది.

దానిమీద సాగదీసి – మేకులు కొట్టడంవల్ల రక్తం ఓడుతున్న వాడి మెదడు... విలవిల్లాడుతున్న వాడి బాల్యం . . .

కన్నీళ్ళు నిండిన వాడి కళ్ళకు శిలువ మీద క్రీస్తుకి బదులు మసక మసగ్గా వాడి ప్రతిరూపమే కన్పించింది.

*(ఆకాశవాణి, విజయవాడ కేంద్రం నుండి ప్రసారం 29 జూన్ 2001)*

JKJKJ

# మూడు చలి కాలాలు

ఈసారి చలికాలం మరీ నిర్దయగా అన్పిస్తోంది. డిసెంబరు నెల చివరి వారం– శరీరం మంచు ముద్దలా ఘనీభవించినట్లు . . . రక్తం గడ్డకట్టించేలాంటి చలి . . . దుప్పటి నిండుగా కప్పుకుని మునగదీసుకుని పడుకున్నా చలికి కనికరం లేదు. కసిగా నా ఎముకల్లోకి దూరి కసాబిసా నమిలేస్తోంది.

నిజంగానే చలి తీవ్రత తట్టుకోలేనంత ఉందా లేక వయసు పైబడినందువల్ల నా శరీరం సుడిగాలిలో చిగురుటాకులా చలికి గజగజ వణికిపోతోందా . . . ఆలోచనల్తో సరిగ్గా నిద్ర పట్టని నాకు ఈ చలి కూడా కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

పదవీ విరమణ చేసి నాలుగు సంవత్సరాలైంది. రెండేళ్ళ క్రితం భార్యావియోగం . . . ఎందుకో ఒంటరితనమనిపిస్తోంది . . . భయంకరమైన ఒంటరితనం . . . ముసలి తనంతోపాటు ముంచుకొచ్చే ఆరోగ్య సమస్యలు . . . ఒక్కోసారి జీవితం దుర్భరమనిపిస్తోంది. దేనిమీదా అనురక్తి కలగటం లేదు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటం లేదు. ఆలోచనలు . . . మెదణ్ణి తొల్చు కుంటూ . . . గతం బొరియలోకి జారుకుంటూ . . . మెలికలు తిరుగుతూ . . . మనసుని పదునైన కత్తిలా సర్రున కోసుకుంటూ . . . ఆలోచనలు . . .

అర్ధరాత్రి దాటాక ఎప్పటికో మాగన్నుగా నిద్ర పట్టిన కొద్ది సేపటికే కోడలి పిలుపుతో మెలకువొచ్చేసింది.

“మామయ్యా–లేవండి. వెళ్ళి పాలప్యాకెట్ తీసుకురావాలి” అంటోంది కోడలు.

నేను సమాధానం చెప్పేలోపలే నా కొడుకు గొంతు మంద్ర స్థాయిలో విన్పించింది. “ఈ వయసులో ఆయన్నెందుకు ఇబ్బంది పెట్టటం . . . చలి విపరీతంగా ఉంది. మంచు కూడా కురుస్తున్నట్లుంది. ఆయన్ని పడుకోనీ. నేను వెళ్తాను”

“మీరు బైటికెళ్ళాక పొరపాటున ఏ ఫ్రెండో దొరికితే యిక యిల్లూ, యిల్లాలు గుర్తుండవు. మీరిక్కడ చేయాల్సిన పన్లు బోల్డున్నాయి. మొదట కూరగాయలు తరిగివ్వండి. పిల్లల్ని లేపి చదువుకోమని చెప్పండి. పాలకోసం మామయ్య వెళ్తార్లెండి” అంది కోడలు. ఆమె గొంతులోని





Rupaye_Chettu.pm7 19 28/7/19, 12:03 AM

స్థిరత్వానికి వెంటనే లేచి కూచున్నాను.

కోడలు నా చేతిలో పాల కార్డుతో పాటు స్వెట్టరూ, మఫ్లరూ పెట్టి, “తల చుట్టూ మఫ్లర్ని గట్టిగా కట్టుకోండి. చలిగాలి తగలదు” అంటూ ఉచిత సలహా కూడా ఇచ్చింది.

శరీరాన్ని ఎంతగా కప్పుకున్నా చలిగాలి సూదుల్లా గుచ్చుకుంటూనే ఉంది. మసక చీకటి . . . . మెల్లగా నడుస్తున్నాను. కీళ్లు కదలడానికి మొరాయిస్తూ కరకర శబ్దంతో తమ నిరసనని తెలియచేస్తున్నాయి. పల్చబడిన కండరాలు వెచ్చదనం కోసం ఆరాట పడ్తున్నాయి.

నాకు చప్పున మా అమ్మ గుర్తొచ్చింది. ఇలాంటి చలిలోనే కదూ అందరికంటే ముందుగా లేచి ఇంటిపనంతా చేసేది . . . ఎంత చలికాలమైనా ఉదయం నాల్గింటికే లేచేది. నూతి నుంచి నీళ్ళు తోడుకొచ్చేది. ఇంటి ముందు కళ్ళాపి చల్లి ముగ్గులేసేది. అంట్లన్నీ తోమేది.

అమ్మకు చలి వేయదా? చన్నీళ్ళలో చేతులుంచి పన్లన్నీ ఎలా చేస్తుందో? వేళ్ళు కొంకర్లు పోవా? అమ్మ శరీరం ప్రత్యేకంగా తయారుచేయబడలేదుగా. మరెందుకు పాపం మాకు మల్లే వెచ్చగా దుప్పటి కప్పుకుని పడుకోవాలనుకోదూ? పదేళ్ళ వయసున్న నాలో సవాలక్ష ప్రశ్నలు...

అసలే పల్లెటూరు. విపరీతమైన చలిగా ఉండేది. నాన్న ముసుగు తన్ని పడుకుని గురకపెడ్తుంటే నాకు వళ్ళు మండేది. పాపం అమ్మ... తనొక్కతే చాకిరీ చేస్తుంటే ఈయనకు నిద్రెలా పడ్తోందీ అనుకునే వాడిని. ఇలా వెచ్చగా దుప్పట్లో మహరాజులా పడుకోకపోతే లేచి అమ్మకు సాయం చేయవచ్చుగా . . . అమ్మా మనిషే కదా . . . తనకూ ఉండదా ఆరింటి వరకూ మహరాణిలా ముసుగు తన్నిపడుకోవాలనీ . . .

అమ్మనోసారి ఇదే ప్రశ్న అడిగాను. ఆమె వెన్నెల కురిసినట్లు చల్లగా నవ్వి “ఎందుకుండదూ . . . కానీ అప్పుడు పనులెలా అవుతాయి? వంటెలా అవుతుంది? నీకు పెళ్ళిచేస్తే నాకు కోడలొస్తుంది కదా. అప్పుడు నీ కోరిక ప్రకారమే చలికాలంలో హాయిగా, వెచ్చగా ఆరింటి వరకూ పడుకుంటాన్లే” అంది.

నాన్న ఎలిమెంటరీ స్కూల్లో బడిపంతులుగా చేసేవారు. ఎనిమిదింటికి స్కూలు . . . ఆయన మగమహారాజు కదా. ఆరింటికి లేచి, అమ్మ తోడిపెట్టిన వేన్నీళ్ళ స్నానం చేసి, అమ్మ వండిపెట్టిన ఫలహారం తిని, చేతిలో పేంబెత్తం పట్టుకుని దర్జాగా నడుచుకుంటూ స్కూలుకెళ్ళే వారు. అంట్లు తోమడం . . . వంట చేయడం . . . లాంటివి ఆడవాళ్ళే చేయాలని శాసనమేం లేదుగా. చలిపొద్దున అమ్మతో పాటు లేచి పన్లు చేయవచ్చుగా . . . అమ్మను ఇదీ అడిగాను.

“ఆయనంటే మగాడు కదా . . . మరి నన్ను పెళ్ళి చేసుకున్నది చాకిరీ చేయడానికేగా నాయనా” అంది. ఆమె మాటల్లో చాకిరీ చేస్తున్నందుకు బాధలేదు . . . సంతోషం ఉంది. తన

జన్మ సాఫల్యం అందులోనే ఉన్నట్లు మాట్లాడింది అమ్మ.

చేతులు కొంకర్లు పోయేంత చలిలో చన్నీళ్లతో పనులు చేస్తున్న అమ్మను చూసి నేను బాధ పడటం తప్ప అమ్మకు కించిత్తు విచారం కూడా లేకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

“అంటే మగవాడు పెళ్ళి చేసుకునేది ఆడదానిచేత నానా చాకిరీ చేయించుకోడానికేనా అమ్మా . . . ఆడది కష్టపడాలా . . . మగవాడు సుఖపడాలా . . . ఇలా అని దేవుడేమైనా చెప్పాడా” అని అడిగాను.

అమ్మ మరలా నవ్వింది. “నువ్వు పెళ్ళి చేసుకున్నాక భార్యని సుఖపెడ్దువు గానీలే బాబూ” అంది మురిపెంగా. నేను పెందలకాడే లేచి నీకు సాయపడ్తానమ్మా అంటే వినేది కాదు. “నువ్వు బాగా చదువుకో నాన్నా. చాలు. నాకు సాయపడినదాని కన్నా ఎక్కువ సంతోషపడ్తాను” అనేది.

నా పెళ్ళి కాకముందే అమ్మ చనిపోయింది. చలికాలంలో కూడా అమ్మ వెచ్చగా దుప్పటి కప్పుకుని ఆరింటివరకూ పడుకుంటే చూడాలనే నా కోరిక తీరకుండానే అమ్మ వెళ్ళిపోయింది.

పాల ప్యాకెట్లిచ్చే చోటు సమీపించే కొద్దీ నా ఆలోచనల్నించి బైట పడ్డాను. పక్కింటి రాఘవయ్య కన్పించాడక్కడ. “నిన్నూ నీ కోడలు రాక్షసి ఇంత చలిలో ముసలాడివనైనా చూడకుండా రోడ్డు మీదికి తరిమింది కదూ” అన్నాడు.

నాలో మరలా ఆలోచనలు.. ఇంత చలిలో బైటికి రావడం, అందునా ఈ వయసులో . . . ఇబ్బందిగానే ఉంది. కానీ కోడలిది రాక్షసత్వమా . . . అంత ధృఢంగా తనకేం కావాలో అడిగి చేయించుకోవడం గయ్యాళితనమా . . .

నేనేమీ మాట్లాడకపోవడం చూసి రాఘవయ్యే మరలా అన్నాడు “నా కోడలి గురించి తెల్సుగా . . . సూర్యకాంతానికి చెల్లెలు, ఛాయాదేవికి అక్కగారు... నా కొడుకేమో చవట దద్దమ్మ. పెళ్ళాం కొంగట్టుకు తిరగటం తప్ప మగవాడిలా దాష్టీకం చెలాయించటం తెలీని వాజమ్మ. రిటైర్మెంట్ సొమ్మంతా మింగేశారుగా. ఇక నాదగ్గర పీక్కుతినడానికేముందని? శుష్కమైన నా శరీరం, ఛిద్రమైన నా హృదయం తప్ప”

రాఘవయ్యా, నేనూ పాల ప్యాకెట్లు తీసుకున్నాం.

“కొడుకుల్ని పెంచి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించి, ఇంతవార్ని చేయడానికి నా జీవితాన్నంతా ధారపోశాను. ఈ ముసలి వయసులోనైనా కాసింత సుఖపడదామంటే నా కోడలు పడనివ్వటం లేదు. నేనేదో పనీపాటాలేకుండా ఆమె పెట్టే తిండిని తేరగా తింటున్నానని ఆమె ఆలోచన . . . ఏదో ఒక పని చెప్తోనే ఉంటుంది. నాచేత ఏదో ఒక రోజు అంట్లు కూడా

తోమిస్తుంది చూడు. జీవితం ఇంత దుర్భరమౌతుందని నేనెప్పుడూ వూహించలేదు" రాఘవయ్య గొంతు దుఃఖంతో వణికింది.

దారిలో రమణమూర్తి మాతో కలిశాడు. మాయింటికి నాలుగిళ్ళవతల ఉండే రమణమూర్తిది దాదాపు మా వయసే. బ్యాంకులో ఉద్యోగం చేసి రెండేళ్ళక్రితం రిటైరైనాడు. ముగ్గురం కబుర్లలో పడ్డాం. ఎన్ని రకాల సంభాషణలు ఎత్తుకున్నా, చివరికవి కొడుకుల దుర్మార్గాలు, కోడళ్ళ దాష్టికాల వైపుకే మరలుతున్నాయి.

"కొడుకుల్ని కంటే పున్నామ నరకం నుంచి రక్షిస్తారనుకుంటే కొడుకులే ఆ నరకాన్ని ప్రత్యక్షంగా మనకు చూపిస్తున్నారు. వూరికే అలా ఖాళీగా గోళ్ళు గిల్లుకుంటూ కూచోకపోతే ఏదైనా ప్రైవేట్ కంపెనీలో చేరి నాలుగు డబ్బులు సంపాయించొచ్చుగా అంటోంది నా కోడలు. ఇన్నాళ్ళూ సంపాయించే కదా దాని మొగుణ్ణి పోషించింది? ఈ వయసులో శరీరం కొద్దిగా విశ్రాంతి కోరుకుంటుందన్న ఇంగితం కూడా లేదాయె. మన బతుకులు చూశావా.... పదవీ విరమణ చేసినా ప్రశాంతత కరువైంది" అన్నాడు రమణ మూర్తి.

"నువ్వేమీ మాట్లాడవేమిటి? నీ కొడుకూ కోడలూ పెట్టే హింసలకు నోట మాట కూడా రావడం లేదా ఏమిటి?" అన్నాడు రాఘవయ్య.

నేను నవ్వి "నా విషయం సరే . . . మీరెందుకలా అనుకుని దుఃఖ పడ్తారు? ఈ వయసులో పనిచేయటం ఆరోగ్యానికి చాలామంచిది. అయినా ఎవరికోసం చేస్తున్నాం . . . మన వాళ్ళ కోసమేగా . . . ఇలా అనుకుంటే మనసుకెంత సాంత్వన! మనసునెందుకు అనవసరంగా కష్టపెట్టుకుంటారు? శారీరక శ్రమ కన్నా మనసుకు కలిగే కష్టమే మనల్ని ఎక్కువ క్రుంగదీస్తుంది. పని చేయటం తప్పనపుడు దాన్ని సంతోషంగా చేయండి" అన్నాను.

వాళ్ళిద్దరూ ఏమనుకున్నారో ఏమో మౌనంలో ఒదిగిపోయి మిగతా దూరం నడిచారు. నేను మరలా నా ఆలోచనల అగాధాల్లోకి దిగిపోతూ... నిజంగానే కొడుకుల్లో ప్రేమలూ ఆత్మీయతలూ నశించాయా . . . కోడళ్ళు అమానవీయంగా ప్రవర్తిస్తున్నారా . . .

నా భార్య గుర్తొచ్చింది. పెళ్ళయాక ఉద్యోగరీత్యా మకాం పట్నానికి మారింది. చలికాలంలో కూడా నా భార్య ఉదయం ఐదింటికే లేచి హడావిడి పడిపోయేది. నాకు మనసు పీకుతూనే ఉండేది. అయ్యో పాపం . . . వెచ్చగా పడుకోకుండా చన్నీళ్ళలో చేతులు పెట్టి పనులన్నీ చేసుకుంటుందే . . . లేచి సాయపడ్దామని రోజూ అనుకునేవాణ్ణి.

కానీ దుప్పటికిందున్న వెచ్చదనం లేవనిచ్చేది కాదు. శరీరం సుఖాన్ని కోరుకునేది. అమ్మ చెప్పిందిగా ఆడది చాకిరీ చేయడానికే పుట్టిందని . . . నా భార్య కూడా ఆడదేగా . . . చేయనీ

అని మనసుకు సమాధానం చెప్పుకునే వాడిని. మగవాడినన్న అహం నన్ను డామినేట్ చేసేది. అమ్మ కష్ట పడ్తుంటే అల్లాడిపోయిన నేను భార్య విషయానికొచ్చేప్పటికి వక్ర భాష్యం చెప్పుకునే స్థితికి దిగజారిపోయాను.

ఓ రోజు నా కొడుకు అడగనే అడిగాడు.

"అమ్మ చేతులు చూశావా చలికి ఎలా పగిలిపోయాయో... ఇంతపనీ అమ్మ ఒక్కర్తే చేసుకోవాలా? అలా ముసుగు తన్ని పడుకోకపోతే నువ్వులేచి సాయం చేయొచ్చుగా"

నా చెంప మీద ఎవరో ఛెళ్ళుమని చరిచినట్లయింది. నేను నా చిన్నప్పుడు మనసులోనే మథన పడి నాన్నని అడగడానికి వెనుకాడిన ప్రశ్నని నా కొడుకు నన్ను నిలదీసి అడుగుతున్నాడు. ఏం సమాధానం చెప్పాలో నాకు తోచలేదు. నిజమే కదా . . . మా అమ్మకో నీతీ వాడి అమ్మకో నీతీనా . . .

నీళ్ళు నములుతున్న నన్ను అటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి నుండి నా భార్యే కాపాడింది. "పాపం చేస్తానన్నార్రా . . . నేనే వద్దన్నాను. పర్లేదులే. ఈ మాత్రం పని నేను చేసుకోగల్ను. నాకేమీ కష్టంగా లేదులేరా" అంది.

బ్రతుకు జీవుడా అనుకుని నా భార్యకు మనసులోనే ధన్యవాదాలు తెల్పుకున్నాను తప్ప ఆ తర్వాతైనా నా భార్యకు కనీసం చలికాలాల్లోనయినా సహాయపడాలని అనుకోలేదు. మగవాడిని కదా . . .

ఇన్నేళ్ళ తర్వాత నా కోడలు నువ్వీపని చేయి అని స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పటం . . . నా కొడుకుని కూడా లేపి శ్రమ విభజనలో భాగంగా తనవంతు పనులేం చేయాలో నిర్మొహమాటంగా చెప్పటం నాకు సంతోషాన్ని కలుగచేసింది. ఈ మార్పు నేను కోరుకున్న మార్పు. ఆనందకరమైన మార్పు . . .

చిన్నప్పుడు అమ్మ విషయంలో తీరని నా కోరిక . . . పెళ్లయ్యాక భార్య విషయంలో నేను నిర్లక్ష్యం చేసిన కోరిక . . . ఇప్పుడు కోడలు తీరుస్తున్నందుకు సంతోషం నాలో . . .

పాల ప్యాకెట్ నా కోడలిచేతికిచ్చి, "యింకేమైనా పనుంటే చెప్పు తల్లీ. చేస్తాను" అన్నాను.

"చలి వేసిందా మామయ్యా" అంటూ ఆప్యాయంగా అడుగుతున్న నా కోడలి కళ్ళలో వింత మెరుపు . . . నాలో కూడా . . .

*(మయూఖ పబ్లికేషన్స్ వారి సంక్రాంతి కథల పోటీ 2004లో*

*మొదటి బహుమతి పొందిన కథ)*

★★★

# లాకులు

లాకుల దగ్గర రాబందులా మెడసాచి నిలబడి ఉన్నాడు కోటేశు. అతని చూపు దూరంగా నీళ్లల్లో నీడల్ని నిశితంగా పంచనామా చేస్తోంది. రంగుల మేళవింపులో ఏదో తేడా . . . అనుమానం లేదు. వయ్యారంగా కదుల్తూ తనవైపుకు వస్తోన్న ఎఱ్రటి వస్తువు – తడిచి – విశాలంగా పర్చుకున్న చీరకొంగులా ఉంది. కళ్లు చిట్లించి – సూర్యకిరణాలకు అడ్డుగా అరచేయుంచి చూశాడు. ఎఱ్రచీర . . .

కోటేశు బలహీనమైన శరీరం ఆశను నింపుకుని నిలబడింది. అతని డేగ కళ్లు కాంతితో మెరిశాయి. రెండు గంటల్నించీ కాచుకుని కూచున్నందుకు తన శ్రమ వృథా కాలేదు. చుట్టూ ఓసారి చూసుకున్నాడు. అపుడొకరూ అపుడొకరూ తప్ప పెద్దగా జనసంచారం లేదు. వాళ్లెవరూ అతన్ని పట్టించుకోవటం లేదు. ఓమారు యథాలాపంగా చూసినా – మాసిపోయి, చిరుగులు పట్టిన బట్టలూ – చింపిరి జుట్టూ – చప్పిదవడలూ – పీక్కుపోయిన మొహం చూసి ఎవరో బిచ్చగాడై ఉంటాడనుకుని వడివడిగా అతన్ని దాటుకొని వెళ్లిపోతున్నారు.

బిచ్చమెత్తుకోవడం నీచమా? తను చేస్తున్న పని నీచమా? అని ఆలోచించాడు. అడుక్కోవటం కన్నా ఉలుకూపలుకూ లేని శవాల్ని దోచుకోటం . . . నీచమేనేమో . . . దీన్ని దోచుకోవడం అంటారా . . . తనక్కావల్సింది ఇవ్వటానికో, లేదనటానికో శవాలు మాట్లాడవు కదా . . . తను బలవంతంగా లాక్కోవటం లేదుగా . . . తనకు తెల్సిన కొంతమంది పాతిపెట్టిన శవాల్ని తవ్వి తీసి – వాటి మీదున్న బట్టల్ని, విలువైన వస్తువుల్ని వల్చుకుని అమ్ముకుంటారు. తన పనే కొంత నయం. నీళ్లలో కొట్టుకొస్తున్న శవం లాకుల దగ్గరకు రాగానే – శవం ఒంటి మీదున్న బంగారాన్ని, వాచి, ఉంగరాల్ని ఒడుపుగా వల్చుకుని . . . సీ – ఎదవ జనమ . . .

ఊహ తెల్సినప్పటినుండీ ముదనష్టపు బతుకే తనది. ఆకలి–దరిద్రం–అవమానాలు . . . అంతా రోత . . . రొచ్చు . . . నాన్న తాగొచ్చి పశువులా అమ్మను చావగొట్టిన ప్రతిసారీ–తను పెద్దయ్యాక తాక్కూడదనుకున్నాడు. కానీ పదిహేను సంవత్సరాల వయసు రాకముందే తాగటం

అలవాటు చేసుకున్నాడు. జులాయి వెధవలా రోడ్లెమ్మట తిరగటం – లీలామహల్లో ఆడే బూతు సినిమాలు చూడటం . . . బీడీలు కాల్చటం . . .

నాన్న అనే జంతువు చనిపోయాక మొదట సంతోషపడ్డా తన కష్టాలు పెరిగాయని అర్థమైందతనికి. నాన్న ఉన్నప్పుడు ఆవారాగా తిరిగినా ఏమీ అనని అమ్మ – ఏదో ఓ పని చేసి నాలుగు డబ్బులు సంపాయించమని పోరటం మొదలుపెట్టింది.

ఉదయాన్నే అమ్మ తిట్లు తిని ఓసారిలానే లాకుల దగ్గర కూచుని ఉంటే–గేట్ల దగ్గర తేలుతోన్న స్త్రీ శవం కన్పించింది. ఆ శవం గుండెల మీద మెరుస్తోన్న మంగళ సూత్రం అతన్ని ఆకర్షించింది. మెడలో సన్నటి బంగారు గొలుసు కూడా ఉంది. కోటేశు అరనిమిషం మాత్రమే ఆలోచించాడు. తను చేయకపోతే మరెవరో చేసేస్తారాపని. ఎవ్వరూ చేయకపోతే పోలీసులే వాటిని నొక్కేస్తారు. అందుకే అమాంతం నీళ్లలోకి దూకి శవం వంటిమీది గొలుసునీ, మంగళ సూత్రాల్నీ వల్చుకున్నాడు.

వాటిని అమ్మి–వచ్చిన డబ్బులతో పూటుగా తాగేసి–శ్రీనివాస హోటల్లో చికెన్ బిర్యాని తిని యింటికెళ్ళి పడుకుంటే రాత్రంతా పీడకలలే . . . తను గొలుసు తీసేసుకునే లోపల శవం హఠాత్తుగా కళ్లు తెరిచినట్లు . . . వికృతంగా నవ్వినట్లు . . . అర్థరాత్రి తన గుడిశె లోపలికి గాల్లో ఎగురుకుంటూ వచ్చి 'నా తాళి ఇచ్చేయరా' అని తన మెడ కొరుకుతూ అడిగినట్లూ . . .

మరోనెల వరకూ లాకుల వైపుకు వెళ్లటానికే భయపడ్డాడు. కానీ అవసరాలు . . . దయ్యాల్లా పిశాచాల్లా . . . పీక్కుతింటూ . . . శవాలే నయమనుకుని మెల్లగా అలవాటు చేసుకున్నాడు. అర్జునుడికి పక్షికన్ను మాత్రమే కన్పించినట్లు అతని పంచేంద్రియాలు శవం వంటి మీదున్న బంగారు నగల మీదే కేంద్రీకరించబడ్డాయి. భయానకంగా వుండే శవం మొహం వాడి కళ్లకు కన్పించదు. కుళ్లిన వాసన వాడి ముక్కుకు అందదు. శవాన్ని తాకినప్పుడు వాడి వళ్లు జలదరించదు. గోడకున్న మేకుకి వేలాడదీసిన నగల్ని తీసుకున్నంత యధాలాపంగా, సునాయాసంగా వల్చుకుంటాడు.

ఉబ్బిన ఎర్ర చీర దగ్గరకొస్తోంది. వాడు తయారుగా నిలబడ్డాడు. మరికొన్ని గజాలు లాకుల వైపుకు కొట్టుకొస్తే చాలు. నీళ్లలోకి దూకి–చేపల్ని వల వేసి పట్టుకున్నట్లు పట్టుకోవచ్చు. అయినా లాకుల దగ్గర ఆగిపోతుందిగా . . . అప్పుడైనా వెళ్లొచ్చు . . . అమ్మో . . . నారిగాడు . . . వాడు చుట్టూతా భయం భయంగా చూశాడు. మాంసం ముక్క కోసం కాచుక్కూచున్న గద్దలా నారిగాడు ఎక్కడైనా ఉన్నాడేమో . . .

వాడివల్ల కోటేశుకి చెడ్డ చిరాకుగా ఉంది.

దాదాపు ఎనిమిది నెలలు పోటీ లేకుండా గడచిపోయాయి. నారిగాడు వచ్చినప్పటినుండీ తన నోటికాడి కూడు లాగేసుకుంటున్నాడు. వాడు తన కంటే వయసులో పెద్దవాడు . . . తనకన్నా బలంగా ఉంటాడు . . . వాడితో దెబ్బలాటలో తను గెలవలేడు. ఇప్పటికే మూడు నాలుగు సార్లు వాడివల్ల చావు దెబ్బలు తిని ఉన్నాడు.

మరోసారి చుట్టూ చూశాడు. శవం దగ్గరగా వచ్చేవరకూ ఆగటం మంచిది కాదనుకుని నీళ్లలోకి దూకబోతూ ఆగిపోయాడు. ఎట్నుంచి వచ్చాడో నారిగాడు శరంలా దూసుకొచ్చి నీళ్లలోకి దూకాడు. కన్ను మూసి తెరిచేలోపల వాడు శవం వైపుకు వేగంగా ఈత కొడ్తున్నాడు.

కోటేశుని దహిస్తూ కోపం . . . వాణ్ణి చంపేయాలన్నంత కోపం . . . ఆకలిలా ఎర్రగా, భగభగ మండుతూ కోపం . . . కలియబడి కసితీరా తన్నాలనే కోరిక అతని బలహీనమైన గుండెల్లో గుబగుబలాడింది. ఈ ఒక్కసారికి అడ్డుపడకురోయ్–కావాల్నంటే మరో నెల వరకు ఈ ఛాయలకు రాను. ఆ శవాన్ని నాకొదిలేయి–నాకోసం కాదు–నా చెల్లి కోసం – ఒక్క ఐదొందల కోసం దాని మొగుడు దాన్నొదిలేశాడు–కట్నం బాకీ తీరిస్తే అది కాపురానికెళ్తుంది–అరచేయంత వెడల్పుండే దాని కళ్లలో ఆకాశమంత దుఃఖం నేను చూడలేనొరేయ్ – ఐదొందలు చాలు – తాగడానికో, ముండల్తో తిరగడానికో కాదు – నా చెల్లి కోసం, దాని కాపురం కోసం– ఐదొందలు – శవం మీది తాలిబొట్టంత ఖరీదు నా చెల్లి జీవితం . . .

నారిగాడు వేగంగా ఈదుతున్నాడు. చేతికి చిక్కినట్టే చిక్కి చేజారిపోయిన ఎర్రచీర శవం వైపు నిరాశగా చూసిన కోటేశు కళ్లు అకస్మాత్తుగా మెరిశాయి. మరోసారి పరిశీలనగా చూశాడు. నిజమే . . . గట్టు వెంబడి కొద్దిదూరం నడచి ఆసక్తిగా చూస్తూ నిలబడ్డాడు.

నారిగాడి చేతిలో ఎర్రచీర . . . ఉత్తచీర . . . అందులో శవం లేదు. వాడు అసహనంగా నీళ్లలో అటూ ఇటూ వెదికాడు. చీర వూడిపోయి శవం మాత్రం లాకుల దగ్గరకు చేరుకునుంటుందని, వేగంగా వెనక్కి ఈది లాకుల సమీపంలో వెదికాడు. మూడుసార్లు లోపలికంటా మునిగి పైకి తేలాడు. చెత్తంతా వాడి నెత్తి మీద మందగా పేరుకుంది తప్ప శవం జాడ లేదు.

అప్పుడొచ్చింది కోటేశుకి నవ్వు . . . వాడి శరీరం నవ్వుతో తరంగాలు తరంగాలుగా ఎగసి పడింది. నమిలేసేలా కోపంగా చూస్తున్న నారిగాడి వైపు చూస్తూ "ఆ నగలన్నీ నీకే – నాకేం వద్దులే" అంటూ కసికసిగా నవ్వాడు. కత్తితో వాడి గుండెల్లో కసుక్కు కసుక్కున పొడుస్తున్నట్లు నవ్వాడు.

"దమ్ముంటే అక్కడే నిలబడ్రా – ఈ రోజు నా చేతిలో నీ చావు మూడింది" నారిగాడు ఒడ్డువైపుకు ఈదుకుంటూ వస్తున్నాడు.

"సరే రారా – నువ్వో నేనో తేల్చుకుందాం" వాడు గట్టుపైకి వచ్చే లోపల పారిపోవాలని నిర్ణయించుకుని అక్కడే నిలబడ్డాడు కోటేశు.

గట్టుకి సమీపంగా వచ్చిన నారిగాడు ఎదురుగా పాముని చూసి భయపడినట్లు ఓక్షణం ఆగిపోయి మరలా వెనక్కి నీళ్లలోకి దూకాడు.

కోటేశుకి అయోమయంగా ఉంది. శవం కన్పించిందా . . . మరి కళ్లలో బెదురెందు కుంది . . . వెనక్కితిరిగే లోపల మెడ దగ్గర బలమైన చేయి పడింది. పోలీసు . . . పిశాచంలా నవ్వుతూ . . . తనకు తెల్సిన పోలీసోడే . . . తనది శవాలవంటిమీద నగలు వల్చుకు తినే నీచపు బతుకైతే తనలాంటి వాళ్ల దగ్గర కమీషన్లు నొక్కేసే అతి నీచపు బతుకు పోలీసోడిది.

"ఏరా –ఏం చేస్తున్నావిక్కడ?" పోలీసు గొంతులోనే కాదు కళ్లలో కూడా గదమాయింపు.

"ఏంలేదు సారూ–వూరికే నిల్చున్నా"

"నోర్మొయ్యరా లమ్డీ కొడకా–నీ వేషాలు నాకు తెలీదనుకున్నావా? ప్రకృతి సౌందర్యం చూడ్డానికో, చల్లగాలికో నిలబడ్డావని నేననుకుంటాననా నీ వెధవైడియా . . . తోలు వొలిచేస్తానొరేయ్ . . . తియ్ బైటికి . . . ఏమేం నగలు కాజేశావో తియ్‌రా బైటికి . . . శవాల్ని దోచుకునే దొంగనాయాలా . . . తియ్‌రా" లాఠీతో కాళ్లమీద ఒక్కటిచ్చుకున్నాడు.

"నీకు దండంపెడ్తా సారూ . . . సత్యపెమాణకంగా నేను నీళ్లలోకే దిగలా . . . అదుగో . . . ఆడు చూశాడు మొదట . . . ఆడే దిగాడు. నేను నీల్లలోకి దిగుంటే తడి ఉండాలి కదా సారూ . . . చూడండి నా చొక్కా ఎంత పొడిగా ఉందో . . . " చొక్కాను ముందుకు లాగి చూపిస్తూ అన్నాడు.

"ఛీ! వెధవ కంపు . . . ఒరేయ్ . . . తెలివిగా మాట్లాడ్తున్నావనుకుంటున్నావా . . . నీ నాటకాలు నా దగ్గర సాగవు, మీరిద్దరూ తోడు దొంగలని నాకు తెల్సురొరేయ్ . . . నాకివ్వాల్సిన మామూళ్లు ఎగదొబ్బి మీరిద్దరూ పంచుకుంటున్న విషయం నాకు తెలీదనుకోకు" ఎడం చేతి పిడికిట్లో ఉన్న చొక్కాని వదలకుండానే నారిగాడి వైపు తిరిగి "ఏరా! నీకు బొట్టెట్టి పిలవాలా? బైటికొస్తావా లేక వచ్చి లాఠీతో పెళ్లి చేయమంటావా?"

వాడు భయం భయంగా ఒడ్డుకొచ్చి – బట్టల్ని వంటి మీదే పిండుకుని మెల్లమెల్లగా పోలీసోడి దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"ఏవిరా సొమ్ములు? ఏమేం కాజేశావో బైటికి తియ్"

"ఏమీ కాజేయలేదు సారూ" పులిలా ఉండే నారిగాడు పిల్లిలా మ్యావ్ అన్నాడు.

"శవం నీ అమ్మదట్రా నీకు హక్కుండటానికి? తొందరగా బైటికి తియ్. నాకవతల అర్జంట్ పనుంది. సర్కిల్‌గారింటికెళ్లాలి"

"శవం ఏమిటి సారూ? ఉంటే నీల్లలోనే ఉండాలి కదా . . . ఉత్తచీర సారూ . . . మా అమ్మ మీదొట్టు"

పోలీసోడు లాకుల దగ్గర తేలుతోన్న ఎఱ్ఱటి చీరవైపు నిశితంగా చూశాడు. నారిగాడి వైపు తిరిగి "ఏరా! పోలీసోణ్ణి నన్నే ప్రశ్నిస్తున్నావా? నేనడగాల్సిన ప్రశ్నరా అది . . . ఇంతకూ శవం ఏమైందో చెప్పు" అన్నాడు.

"శవంలేదు సారూ . . . ఉత్తచీర . . ."

ఫెడీమని లాఠీతో వాడి నడుం మీద కొట్టాడు.

"మర్డర్ కేసు కింద బొక్కలో తోసేస్తానొరేయ్....శవం ఏమైందో చెప్పు...శవం మీద నగలేమైనాయో చెప్పు" కోటేశు చొక్కాని వదిలేసి నారిగాడి చొక్కాని ఒడిసి పట్టుకున్నాడు.

అదే అదనుగా "సారూ!నేనెళ్లొచ్చా"అన్నాడు కోటేశు.

"ఎక్కడికెళ్తావురా . . . మీరిద్దరూ తోడు దొంగలు . . . మొదట నీ జేబుల్లో ఏముందో బైటికి తియ్‌రా" అంటూ అతనే చేయి పెట్టి చొక్కాజేబులో వెదికాడు. అందులో ఓ బీడీ ముక్క, రెండు రూపాయి బిళ్లలు, ఒక అర్ధరూపాయి బిళ్ల వున్నాయి. ప్యాంటు జేబులో నలిగి, మాసిపోయిన ఐదు రూపాయల నోటుంది.

ఏడున్నర రూపాయల్ని తన జేబులో వేసుకుంటూ "ఇక పోరా!వీడి సంగతేందో నేను తేల్చుకుంటా" అని నారిగాడి వైపు తిరిగి "ఇప్పుడు చెప్పరా . . . శవం ఏమైంది? శవం మీది నగలేమైనాయి?" లాఠీతో నడ్డిమీద ఒకటిచ్చుకుంటూ అన్నాడు.

కోటేశు కదలకుండా అక్కడే నిలబడ్డాడు.

"ఏరా! ఇంకా నిలబడ్డావు . . . నీక్కూడా నాలుగు వడ్డించాలా?"

"సారూ . . . ఉదయం నించి పచ్చి మంచినీల్లు తాగలా . . . ఆకలేస్తోంది . . . డబ్బులిప్పించండి."

"ఏం డబ్బుల్రా . . . కష్టపడి, కూలి చేసి సంపాదించిన డబ్బులా . . . దొంగ నా కొడకా . . . శవాల మీద చిల్లర నాణేలు ఏరుకున్నట్లు – ఆడ శవాల మీంచి పుస్తెలతాళ్లు, మంగళ సూత్రాలు వల్చుకుని అమ్ముకుంటే వచ్చిన పాపిష్టి డబ్బే కదరా! ఫోరా . . . నోరెత్తకుండా వెళ్లిపో"

"పాపిష్టి డబ్బే సారూ! ఆకలి కూడా పాపిష్ఠిదే సారూ! టీ తాడగానిక్కూడా డబ్బుల్లేవు. మీకు దండం పెడతా . . . నా డబ్బులు నాకిచ్చేయండి."

"ఛీ ఎదవ నాయాలా! నీలాంటోళ్లు దేశానికి పట్టిన చీడపురుగుల్రా . . . ఇదుగో . . . చావు" రెండున్నర రూపాయల చిల్లర వాడికి తిరిగిచ్చాడు.

కోటేశుకు అక్కడే ఉండి తమాషా చూడాలని సరదాగా ఉన్నా–మరలా పోలీసోడి మనసు మారి ఈ చిల్లర కూడా లాగేసుకుంటాడేమోనని భయమేసి అక్కడి నుంచి వడివడిగా నడిచాడు.

పోలీసు కనుమరుగు కాగానే నడక వేగం తగ్గింది. నీరసంగా ఉంది . . . నిస్సత్తువగా ఉంది . . . కాళ్లీడ్చుకుంటూ నడుస్తున్నాడు . . . ఓవైపు ఆకలేస్తోంది . . . మరోవైపు నాలిక సారా కోసం మారాం చేస్తోంది.

రెండున్నర రూపాయలు . . . రెండు రూపాయిబిళ్లలు . . . ఒకటి అర్ధరూపాయి బిళ్ల . . . థూ . . . కాండ్రించి వూశాడు. ఎదవ బతుకు . . . ఎదవ జనమ . . . పోలీసోడు తనను చీడపురుగన్నాడు. అవును...తనది పురుగు లాంటి బతుకే. చీడ పురుక్కాదు . . . పేడ పురుగు . . . పెంటమీద బతికే హీనమైన పురుగు . . .

కానీ తనలాంటి నీచమైన పురుగుల రక్తం తాగి బతికే ఆ పోలీసోడి బతుకో . . . లాకుల దగ్గర ఆగిపోయిన శవాల్ని కాల్చడమో పూడ్చడమో చేయాల్సి వస్తుందని–లాకులు ఎత్తించేసి– గుంటూరు పరిధిలోకి శవాన్ని నెట్టేసి – చేతులు దులుపుకోవటం . . . ఈళ్లనేం పురుగు లనాలో . . .

సగం కాలిన బీడి ముక్కని తీసి, ముట్టించి, గుండెనిండా పొగ పీల్చాడు. హాయిగా అన్పించింది. ఆకాశం మబ్బుమబ్బుగా ఉంది. చల్లని గాలి వీస్తోంది. వర్షం పడేలా వుంది.

ఈ రోజు తప్పకుండా శవం దొరుకుతుందని ఆశ పడ్డాడు. ఆశించింది జరగనందుకు బాధగా ఉంది. ఇంటికెళ్తే అమ్మ శాపనార్థాలు . . . చెల్లి దీనమైన మొహం . . . వెడల్పాటి కళ్లలో విషాదం నింపుకుని 'కట్నం బాకీ తెచ్చావా' అని అడిగితే ఏం సమాధానం చెప్పగలడు?

నారిగాడి మీద పగ తీర్చుకున్నందుకు మాత్రం తెగ సంబరంగా వుంది. దెబ్బకు దెబ్బ . . . నవ్వుకు నవ్వు . . . అవమానానికి అవమానం . . .

నెలక్రితం జరిగిందా సంఘటన . . .

ఆరోజు కాలువలో కొట్టుకొస్తున్న శవాన్ని మొదట చూసింది నారిగాడే. వాడు కాలువలో దూకడానికి పరుగెత్తుతుంటే తను కాలడ్డం పెట్టి పడేశాడు. వాడు లేచి కలియబడ్డాడు. చాచి తన మోహం మీద రెండు మూడు దెబ్బలు కొట్టాడు. కళ్లుబైర్లు కమ్మాయి. ముక్కు దూలం



Rupaye_Chettu.pm7 29 28/7/19, 12:03 AM

పగిలి రక్తం కారసాగింది. అదను చూసి వాడి పొట్టలో కాలితో బలంగా తన్నాడు. వాడు అదాటున కింద పడ్డాడు. తను కాలువ వైపుకు పరుగెత్తాడు. నారిగాడు అడ్డుకున్నాడు. పెనుగులాడుతున్నప్పుడు తను వాడి చేతిని గట్టిగా కొరికాడు. వాడు బాధతో అరుస్తూ తనని బలంగా కాలువ వైపుకు తోశాడు. తనకూ నారిగాడికీ పది అడుగుల దూరం ఉంది. తను కాలువకు దగ్గరగా ఉన్నాడు. కాలువలోకి దూకి శవం మీది మంగళసూత్రాలు, చెవికమ్మలు లాంటివి లాగేసుకొని ఆవలిగట్టుకు ఈదుకుంటూ పోతే చాలు. ఆ ఆలోచన రావడమే తరువాయి నీళ్లలోకి దూకాడు. తన వెనకే నారిగాడూ దూకాడు.

తను వేగంగా ఈదుతూ శవాన్ని సమీపించాడు. శవం మొహం లాకుల వైపుకు తిరిగుంది. మెడలో పసువు తాడుంది. తప్పకుండా మంగళ సూత్రాలుంటాయన్న ఆశతో శవాన్ని వెల్లకిలా తిప్పాడు. అది తమ ఇళ్ల దగ్గర అడుక్కుతినే పిచ్చిదాని శవం . . .

ఎదురుపడిన ప్రతివాడినీ “నన్ను లగ్గం చేస్కుంటావా” అని అడుగుతూ ఉండేది. ఆ మధ్య ఎవరో దానికి కడుపు చేశారు. పేటలోని ఆడాళ్లు జాలిపడి “నీకు లగ్గం ఐపోయిందే వెర్రిదానా– ఇదుగో ఈ పసుపుతాడు మెళ్లో వేసుకో” అని తాడుకు పసుపు కొమ్ము కట్టి ఇచ్చారు. అది మెళ్లో వేసుకుని కన్పించిన ప్రతి వాళ్ల దగ్గరకెళ్లి “నాకు లగ్గం అయ్యింది తెలుసా? ఇదిగో పసుపుతాడు” అని చూపించేది.

ఇపుడు దాని మెళ్లో పసుపుతాడుంది. దానికి వేలాడుతూ పసుపు కొమ్ము . . .

వెనక్కి తిరిగి చూస్తే నారిగాడు పకపక నవ్వుతున్నాడు. “దానివళ్లంతా బంగారమేరా . . . తీస్కోరా . . . నా కొద్దు . . . అంతా నువ్వే తీసుకో . . . ” అంటూ ఒకటేనవ్వు . . .

అప్పటి కసి ఈరోజు తీరినందుకు సంతోషంగా వుంది. మందు కొట్టి జల్సా చేసుకోవాలనిపించింది. సారాయి కొట్లో అరువు పెట్టొచ్చన్న ఆలోచన రావటమే తరువాయి కాళ్లు అప్రయత్నంగా అటు వైపుకు లాక్కెళ్లాయి.

పీటమీద దిలాసాగా కూచుని చీకులు కాలుస్తోంది రాధాబాయి. నగ్నంగా నిగనిగలాడ్తున్న పిక్కలు . . . పిటపిటలాడుతున్న వళ్లు . . . కోటేశు గుటకలు మింగాడు. చీకులు అమ్ముతూనే మధ్యమధ్యలో సారాయి కొట్టుకెనకున్న తన గుడిశెలోపలికెళ్లి ఐద్రూపాయలకు వళ్లప్పగిస్తో వుంటుంది రాధాబాయి.

సారాయా రాధాబాయా అనేది తేల్చుకోలేకపోతున్నాడు. చీకుల్ని చూస్తూ ఓ నిముషం నిలబడి పోయాడు. ఏది ఎక్కువ నిషాగా ఉంటుంది? భగ్గున గొంతును మండించే మందా . . . శరీరాన్నంతా ఆవిర్లుగా మార్చేసే పొందా . . .

"సీకులు కావాలా?" రాధాబాయి మత్తుగా చూసింది. ఎన్ని పొట్లాల సారాయి తాగినా ఆ కళ్లలోని కైపు ముందు బలాదూర్ . . .

"నీ గుడిశెకు పోదాం" కోటేశు గొంతు ముద్ద ముద్దగా ఉంది. తాగకుండానే మాట తడబడింది.

"పది రూపాయలవుద్ది"

"ఐదేగా . . . నాల్రోజుల ముందు కూడా ఐదేగా ఇచ్చాను"

"రేటు పెంచాను. అన్నిటి రేట్లు పెరగలేదా . . . అక్కడ బేరం సేయకుండా నోర్మూసుకుని కొంటావుగా . . . ఇక్కడికొచ్చేసరికి బేరాలు . . . ఎల్లవయ్యా . . . ఎల్లు."

"ఐనా అంతకు అంత పెంచేస్తే ఎలా . . . నేను పాత కష్టమర్ని . . . కన్సెసన్ ఇచ్చుకో . . . "

"నాలుగేళ్లనుంచీ సారాయి తాగుతున్నావు కదా . . . ఆణ్ణడిగావా కన్సెసన్ . . . బేగి చెప్పు. పది రూపాయలకు పైసా తగ్గదు"

"సరే పద"

"మొదట డబ్బులివ్వు"

కోటేశు నీళ్లు నమిలాడు. జేబులో ఉన్న రెండున్నర రూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"మిగతాది అరువు"

తన ఎడమ అరచేతిలో ఉన్న రెండు రూపాయి బిళ్లలవైపు – ఒక అర్ధరూపాయి బిళ్ల వైపు అసహ్యంగా చూసింది రాధాబాయి.

"థూ – ఎదవ సచ్చినోడా . . . ఈ చిల్లర నీ పాడె మీద వేసుకో. డబ్బుల్లేవుకానీ పంది దొర్లినట్లు దొర్లడానికి పిల్ల కావాల్సొచ్చిందా . . . నీ జిమ్మడిపోను" చేతిలో చిల్లర్ని విసిరి నేలకేసి కొట్టింది.

కోటేశు వాటిని ఏరుకుంటూ 'నువ్వు పిల్లవా . . . పందిలా బలిసిన ముండవు . . . అది బురదలో దొర్లినట్టే వుంటుంది నీతో పాటు గుడిశెలో కెళ్తే' అనుకున్నాడు. ఆమె నోటికి జడిసి పైకేమీ అనలేదు.

సారాయి కొట్టువాడు అరువిచ్చాడు. కోటేశు కసిగా తాగాడు . . . పోలీసోడు చీడ పురుగన్నందుకు తాగాడు . . . రాధాబాయి పంది అన్నందుకు తాగాడు . . . ఆ రోజు ఎవ్వరూ కృష్ణాలో దూకి ఆత్మహత్య చేసుకోనందుకు తాగాడు . . . అమ్మ గుర్తొచ్చి తాగాడు . . . 'కట్నం డబ్బులు తెచ్చిస్తే వెళ్లి నా పెనిమిటితో కాపురం చేస్కుంటానన్నా'

అంటూ తన వెడల్పాటి కళ్లతో . . . ఆ కళ్లనిండా కాల్వలౌతున్న కన్నీటితో వేడుకునే చెల్లెలు గుర్తొచ్చి తాగాడు.

*****

ఎప్పటికి మల్లే అమ్మ తిట్లతో వాడికి మెలకువొచ్చింది.

"రాత్రుల్లు పూటుగా తాగొచ్చి తొంగోటం తప్ప ఇంటి ఇసయాలు పట్టించుకోటం ఏమైనా ఉందా . . . పెల్లయిన నెలకే కట్నం బాకీ ఐదొందలివ్వలేదని పిల్లని తెచ్చి వదిలేసెల్లి మూణ్ణెల్లు దాటిపోయింది. పిల్ల ఏడ్వని రోజు లేదు. నేను నాలుగిల్లలో చాకిరీ చేయబట్టే దాని కడుపుకింత కూడైనా పెట్టగలుగుతున్నాను. ఇదిగో అదిగో అనటం తప్ప సెల్లెల్ని అత్తారింటికి పంపాలన్న ఇంగితం లేకుండా పోయింది ఎదవ సచ్చినోడికి. బారెడు పొద్దెక్కే వరకూ పడుకోటం తప్ప పనాపాటా . . ."

కోటేశు కాలువ గట్టుకి వెళ్లబోతూ తిట్ల దండకం ఆపని అమ్మవైపు చూసి "ఈరోజెట్లయినా డబ్బులు తెస్తానులేవే–నువ్వు తిట్టడం ఆపు" అన్నాడు.

"మూణ్ణెల్ల నుంచీ ఇదేమాట. నెల్లోపలే కట్నం బాకీ తీరుస్తామని ఒప్పుకుని తీర్చకపోటం మన తప్పు. ఆల్ల తప్పు లేదు. అసలు తప్పంతా నాది. నీలాంటి చాతకాని కొడుకుని కన్నానే అదీ తప్పు. దాన్ని మరలా కాపురానికి పంపేదేమైనా ఉందా . . . లేకపోతే మొగుడుండీ ముండమోసిన దాన్లా యింట్లో కూకోబెడ్తావా?"

గుడిశె లోపల . . . దిగులంతా కుప్పగా పోసినట్లు కూచుని ఉన్న చెల్లెలి వైపు చూశాడు. అదే సమయంలో ఆమె తలయెత్తి అతని వైపు చూసింది. ఆమె పెద్ద పెద్ద కళ్లనిండా గుండ్రటి నీటి చుక్కలు . . . ఆ చూపులో 'నీవల్ల కాదులే' అన్న చులకన భావం . . . నిజంగా అలానే చూసిందా . . . తను భ్రమపడ్డాడా . . . అమ్మ చూపులోని అసహ్యం తనకు తెలుసు . . . అందులో అనుమానం లేదు . . . కానీ చెల్లి చూపులో ఏంటదీ . . . అదీ అసహ్యమేనా . . .

తను తాగుతాడని తెల్సు . . . ముండల్తో తిరుగుతాడని తెల్సు . . . కానీ శవాల మీద పడి బతుకుతున్నాడని తెలీదు. తెలిస్తే అమ్మా, చెల్లి ఏమంటారో? ఇంకా అసహ్యంగా చూస్తారా...పురుగుని చూసినట్టు . . . పేడ పురుగు . . . విదిలించుకుంటారా . . . పందిని విదిలించినట్టు . . .

లాకుల దగ్గరకు చేరుకున్నాడు. కృష్ణలో వారానికి ఒకరిద్దరైనా పడి ప్రాణాలు తీసుకుంటుంటారు. అదేంటో మరి వారం నుంచీ ఒక్క శవమూ దొరకలేదు. ఈ రోజైనా



Rupaye_Chettu.pm7 32 28/7/19, 12:03 AM

తప్పకుండా దొరుకుతుందన్న ఆశ . . . ఆ శవం మీద కాసు బంగారమైనా దొరకుతుందన్న ఆశ . . . దొంగ సొత్తు కొనే అంగట్లో అమ్మితే ఐదొందలైనా ఇస్తాడన్న ఆశ . . .

మొగుడు కొట్టాడనో, అమ్మ తిట్టిందనో, మార్కులు రాలేదనో, పరీక్ష తప్పామనో, ప్రేమ విఫలమైందనో . . . ఇలాంటి సవాలక్ష కారణాల్తో ఆత్మహత్యలు చేసుకుంటుంటారు. బంగారం వంటి మీద ఉండగానే బతుకు చాలిస్తారు వీళ్లు. హత్య కావింపబడ్డ శవాలైతే ప్రయోజనం ఉండదు–వంటి మీది విలువైన అభరణాలు వొల్చుకున్నాకే కాలువలోకి తోసేస్తారు.

కోటేశు ఆలోచనల్ని ఆపి రాబందులా కళ్లు చిట్లించి – అద్దంలా మెరుస్తోన్న నీటి ఉపరితలాన్ని చూశాడు. వెండి పోగుల్లా నీటి పాయలు కదుల్తున్నాయి.

గోతి కాడ కాచుక్కూచునే నక్కలా . . . శవం కోసం రెండు గంటల్నించీ ఎదురు చూపు . . . నీళ్లలో వచ్చిన రంగుల కదలికల్లో మార్పుని అతను పసిగట్టాడు. నీటి పైన ఏదో తేలుతోంది. మనిషంత పొడవైన నల్లటి నీడ . . . వాడి కళ్లు ఆశగా మెరిశాయి. అది శవమే . . . ఆడదాని శవంలానే అన్పిస్తోంది. మగవాడి శవమైతే గిట్టుబాటు కాదు. ఆడ శవమైతే చెవుల్లో కమ్మలు, ముక్కులో బేసర్లు, బంగారు గాజులు, గొలుసులు ఏవైనా ఉండే అవకాశం ఉంది. ఇవేవీ లేకున్నా మంగళసూత్రాలు తప్పకుండా ఉంటాయి.

మొగుడి దుర్మార్గాల కారణంగా చనిపోయే ఆడాళ్లు కూడా, మిగతా నగలన్నీ తీసేసి యింట్లో వదిలేసి వచ్చినా మంగళసూత్రం మాత్రం తీయరన్న విషయం అతనికి అనుభవం వల్ల తెల్సింది.

తనక్కావాల్సింది ఐదొందలు . . . చాలు . . . తన చెల్లి బతుకు బాగు పడ్తుంది. అది కాపురానికెల్లేటప్పుడు తనవైపు అభిమానంగా చూస్తుందా . . . చూస్తుంది . . . తన పెద్దపెద్ద కళ్లలో వెలుగంతా నింపుకుని చూస్తుంది. తను ఇంటినుంచి బయల్దేరినపుడు ఆ చూపులో ఏముంది? అసహ్యమా – ఆవేదనా – అసహాయతా – బాధా . . . ఐదొందలు చాలు . . . నేనే పురుగులా . . . పందిలా ఐదొందలు ఏరుకుంటాను . . . కుళ్లిన శవమైనా, కుక్కలు పీక్కుతిన్న ముఖమైనా నాకు అసహ్యం వేయదు. మెడలో పిసరంత బంగారం ఉంటే చాలు. ఆ మొహాన్ని ఆప్యాయంగా తడుముతాను.

తన చెల్లెలి జీవితం ఖరీదు ఐదొందలు . . . దాని కాపురం ఖరీదు ఐదొందలు . . . అరచేయంత వెడల్పుండే ఆమె కళ్లలోని వెలుగు ఖరీదు ఐదొందలు . . .

శవం దగ్గరకంటా వచ్చింది. ముదురు నీలంరంగు చీర . . . శవం బోర్లా పడి ఉంది. జుట్టంతా విడిపోయి వెంట్రుకలు విశాలంగా పర్చుకుని ఉన్నాయి.

లగెత్తుకుంటూ వెళ్లి నీళ్లలోకి దూకాలన్న ఆలోచన . . . లేకపోతే మరెవరో పోటీగా వస్తారన్న భయం . . . నారిగాడు ఏ మూల నుంచైనా వస్తాడా . . . ఎక్కడైనా నక్కి ఉన్నాడా . . . తన మీద కలబడి . . . కొట్టి . . . శవంమీది బంగారం లాక్కుంటాడా . . .

కోటేశు అటూ ఇటూ పరిశీలనగా చూశాడు. నారిగాడి జాడలేదు. పోలీసోళ్లు వదిలి ఉండరు. వదిలినా కుళ్ళబొడిచి వదిలేసి ఉంటారు. వంటి నొప్పుల్తో మంచంలో మూల్గుతూ పడి ఉంటాడు. ఆ ఆలోచనకే చాలా సంతోషమనిపించింది.

శవం లాకుల దగ్గరకెళ్లి ఆగిపోయింది.

ఈ శవం నాదే . . . ఎంగిలిస్తరాకు కోసం కాట్లాడుకునే కుక్కలా నారిగాడితో పోటీ పడక్కరలేదు. శవం మీది బంగారం నాదే. అది అమ్మగా వచ్చే డబ్బంతా నాదే.అందులో ఐదొందలు చెల్లివి. మిగిల్తే సారా కొట్టు బాకీ చెల్లించాలి. రాధాబాయి గీర దిగే వరకూ గుడిసెలోంచి బైటికి రాకూడదు. ఎంత పొగరు ముండకి . . . చిల్లర డబ్బుల్ని మొహం మీద విసిరి కొడ్తుందా . . . బిచ్చగాడు ఏరుకున్నట్టు ఏరుకోవాలా? పది రూపాయల నోట్లు పది దాని మొహం మీద విసిరేయాలి. అప్పటిగ్గాని తన కసి చల్లారదు.

కోటేశు నింపాదిగా నడచి నీళ్లలోకి దిగాడు. నీళ్లు చల్లగా ఉన్నాయి. మండుతున్న తన మనసు చల్లబడాలంటే తనకు డబ్బులుండాలి . . . అందుకు లాకుల దగ్గర బోర్లా పడుకుని లాకుల్ని కౌగిలించుకుంటున్న శవం వంటి మీద వీసమంతైనా బంగారం ఉండాలి.

మెల్లగా ఈదుకుంటూ శవాన్ని చేరుకున్నాడు. మెడలో పసుపుతాడు కన్పిస్తోంది. అంటే పెళ్లైన ఆడదే . . . తప్పకుండా మంగళ సూత్రాలుండి ఉంటాయి. శవాన్ని రెండు చేతుల్తో పట్టుకుని వెల్లకిలా తిప్పాడు.

తన చెల్లి మొహం . . . ప్రశాంతంగా ఉంది. వెడల్పాటి కళ్లు మౌనంగా – మూసుకున్న కిటికీ రెక్కల్లా ఉన్నాయి.

*(ఆంధ్రజ్యోతి, ఆదివారం 19 జనవరి 2003; 2002-03 ఉత్తమ కథగా డి.వి.కె. మెమోరియల్ ట్రస్ట్ వారి గోల్డ్‌మెడల్ పొందిన కథ)*

☆☆☆

# రూపాయి చెట్టు

విజయవాడ–హైద్రాబాద్ హైవే మీద – విజయవాడకు సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్టీడీ బూత్‌లో – దాని యజమాని రమేష్ అసహనంగా కూచుని ఉన్నాడు.

అరనిమిషానికోసారి బుయ్యిమని శబ్దంచేస్తూ – విజయవాడవైపుకో, హైద్రాబాద్ వైపుకో– దూసుకెళ్తున్న లారీలు, మోటారు వాహనాలు – అతనిలోని అసహనాగ్నిలో ఆజ్యం పోస్తున్నాయి. తను వూహించిందో, ఆశించిందో జరగనప్పుడు కలిగే నిస్పృహ అతనిలో . . .

సెల్‌ఫోన్లు వచ్చాక ఎస్టీడీ బూత్ వల్ల వచ్చే ఆదాయం పడిపోయింది. టాటా సెల్యులార్ వాళ్ళు ఆ హైవేనంతా తమ కాల్ పరిధిలోకి తెచ్చుకున్నాక – ఒక చేత్తో స్టీరింగ్ తిప్పుతూ, మరో చేతిలో బుల్లి సెల్యులార్ పట్టుకుని విలాసంగా మాట్లాడే వాళ్ళు తప్ప – బూత్ దగ్గర ఆగి ఎస్టీడి చేసే వాళ్లే కరువైపోయారు.

ఆర్థిక ఇబ్బంది అతన్ని కుదురుగా కూచోనివ్వటం లేదు. ఆలోచనల్తో మెదడు అతలాకుతలమైపోతోంది. ఇరవై రోజుల క్రితం గామోసు ఒక్కసారిగా వెయ్యిరూపాయలు చేతిలో పడ్డాయి. శ్రమా గిమా ఏం లేదు. ఒక్క ఫోన్ కాల్.. అంతే . . . రూపాయి పావలా ఖరీదు చేసే ఒక్క ఫోన్ కాల్ వల్ల తన చేతిలో పది వందరూపాయలనోట్లు గువ్వపిట్టల్లా వాలి ఒదిగిపోయాయి. ఇంకొక్క ఛాన్స్ అలాంటిది తగిలితే చాలు – ఈ నెలకు సరిపోద్ది.

రమేష్ కళ్ళు విప్పార్చి – దేగలా రోడ్డు కన్పించేంతమేరా ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ సర్వే చేశాడు.

రోడ్డు ఆహారాన్ని మింగిన కొండచిలువలా స్తబ్దుగా పడుకుని ఉంది. వాహనాలు ఆహారకుహరంలోకి జారిపోతున్న కుందేలుపిల్లల్లా ఉన్నాయి.

రమేష్‌కి పిల్లాడి అనారోగ్యం గుర్తొచ్చింది. వాడికి నిండా ఏడేళ్ళు లేవు. బతికినంత కాలం బలంగా పనిచేయాల్సిన గుండె–వాడి బాల్యంలోనే బలహీనమై పోయింది. వాడి మందులకే నెలకు వెయ్యిరూపాయలౌతున్నాయి. డబ్బు అవసరాలు ఆకలిగొన్న సింహాల్లా అతన్ని చీల్చుకు తింటున్నాయి.





Rupaye_Chettu.pm7 35 28/7/19, 12:03 AM

పెద్ద శబ్దం చేస్తూ లారీ ఒకటి దూసుకెళ్ళింది. బాగా పాత లారీలా ఉంది. డొక్కైపోయినా, తన యజమాని డొక్క నింపడానికి జవజీవాల్ని పోగుచేసుకుని పరుగు పెడ్తోన్న ముసలి ఒగ్గులా ఉంది. అది వదిలిన దట్టమైన పొగ-రమేష్ మొహాన్ని మేఘంలా కప్పేసింది. దాంతో పాటు దగ్గుతెర కమ్మేసి వూపిరాడలేదు. చేత్తో పొగని తరిమేసే ప్రయత్నం చేస్తూ "ఛీ-ఎదవ బతుకు . . . ఈ దుమ్మూ, ధూళీ, పొగా . . . ఇవి తిని – తాగి – బతుకుని బుగ్గిచేసుకుంటున్నా రెండు పూటలా ఇంత తిండి దొరకటం కనాకష్టంగా ఉంది" అని తిట్టుకున్నాడు.

"ధడ్" మంటూ ఏదో పడినచప్పుడు . . . కీచుమంటూ . . . బ్రేకులు బావురుమన్న ఏడుపు శబ్దం . . .

రమేష్ అలర్ట్ అయినాడు. తనకు బాగా పరిచయమైన చప్పుడది. తను ఆశగా ఎదురుచూస్తున్న శబ్దం అదే. యాక్సిడెంట్ జరిగినపుడు వచ్చే శబ్దం . . . బలంగా బ్రేకుల్ని నొక్కటం వల్ల వచ్చే శబ్దం . . . పొగవల్ల సరిగ్గా కన్పించక బూత్ నుంచి బైటికొచ్చి రోడ్డు వైపు చూశాడు. అరఫర్లాంగు దూరంలో ఉన్న పెట్రోల్‌బంకుకు ఎదురుగా ఓ లారీ ఆగి ఉంది. దాని చక్రాల కింద అడ్డదిడ్డంగా పడివున్న స్కూటర్ . . . కొద్దిగా అవతలగా పడివున్న మనిషి శరీరం . . . పెట్రోల్ బంకులోని సిబ్బంది అటువైపుకు పరుగెత్తుతున్నారు.

రమేష్‌లో విద్యుత్తులా చైతన్యం . . . పరుగెత్తినంత వేగంగా ఫోన్ దగ్గర కెళ్ళి ఓ నెంబర్ డయల్ చేసి వివరాలు చెప్పాడు.

అరగంట గడవక ముందే సైరన్ మోగించుకుంటూ అక్కడో అంబులెన్స్ వచ్చి ఆగింది.

"హమ్మయ్య! నా చేతికి వెయ్యిరూపాయలు వచ్చినట్లే" అప్పటి వరకూ గోతికాడ నక్కలా ఎదురుచూసిన రమేష్ ఆనందాతిరేకంతో అంబులెన్స్‌ను సమీపించి నిర్ఘాంతపోయాడు.

అది అనుపమా హాస్పిటల్ వాళ్ల అంబులెన్స్ . . . మరి తను ఫోన్ చేసిందేమో అనురాధ హాస్పిటల్‌కు.

అతనికి నోరెండిపోయింది. దుఃఖం వచ్చింది. ఇదెలా జరిగింది? తనకూ అనురాధ హాస్పిటల్ వాళ్లకూ మధ్య కదా ఒప్పందం కుదిరిందీ? మధ్యలో అనుపమా హాస్పిటల్ ఎక్కడనుండి వూడిపడిందీ?

ఆ హైవే మీద రమేష్ ఎస్టీడీబూత్ ఉన్న ప్రాంతం యాక్సిడెంట్ ప్రోన్‌జోన్. ఎక్కువగా మోటారు వాహనాల ప్రమాదాలు అక్కడే ఓ ఫర్లాంగు అటూ ఇటూగా జరుగుతుంటాయి.

రమేష్ తన కొడుకు ట్రీట్‌మెంట్‌కోసం ఓసారి అనురాధ హాస్పిటల్‌కెళ్లాడు. నాలుగు రోజులు కుర్రవాణ్ణి ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని – ఇంటికి పంపేముందు నాలుగువేల బిల్ చేతిలో పెడితే

లబోదిబోమన్నాడు. తను యస్టీడీ బూత్ నడుపుకునే చాలా చిన్నా చితకా మనిషిననీ – అంతంత లావు బిల్లులు కట్టలేననీ మొరపెట్టుకున్నాడు.

"అంతంత బిల్లులు కట్టలేని వాడివి ఇంతింత పెద్ద ఆస్పత్రికి ఎందుకు అఘోరించావు? ఏ ప్రభుత్వాస్పత్రిలోనో పడి ఏడ్వలేకపోయావూ" అంటూ మొరిగిన ఆ ఆస్పత్రి యజమానికి రమేష్ ఎస్టీడీ బూత్ ఎక్కడుందో తెలిశాక మెరుపులా ఓ ఆలోచన తట్టింది.

యాక్సిడెంట్ కేసుల్లో లక్షలకు లక్షలు బిల్లులు చేసి రెండు చేతులా సంపాదించవచ్చని ప్రతి హాస్పిటల్ యాజమాన్యానికీ తెలుసు. ఇన్సూరెన్స్ బిల్లులో తొంభైశాతమో లేక మొత్తమో అప్పనంగా నొక్కేసి పదో పరకో పేషంట్ చేతిలో పెడ్తేసరి. అందుకే రమేష్‌తో అతనో ఒప్పందానికొచ్చాడు. యాక్సిడెంట్ జరిగిన వెంటనే సమాచారం అందచేస్తే అతని చేతిలో వెయ్యి రూపాయలు – అక్షరాలా వెయ్యిరూపాయలు పడ్తాయి. పేషంట్ మొదట తమ అంబులెన్స్‌లోపడి – ఆ పై తమ ఐసియూలో ధబాల్న పడతాడు. వాడికొచ్చే ఇన్సూరెన్స్ సొమ్ము, కాంపెన్సేషన్ సొమ్ము స్వాహా చేసే అదృష్టం తమకు పడ్తుంది.

ఆ విధంగానే ఈ మధ్య రమేష్ పుణ్యమా అంటూ నెలకు ఒకటి రెండు యాక్సిడెంట్ కేసులు తగిలి అనురాధ హాస్పిటల్ ఆర్థిక పరిస్థితి అద్భుతంగా ఉంటోంది.

ఓ ఇరవై రోజుల క్రితం ఇలానే రమేష్ నుంచి ఫోన్ అందుకుని అక్కడికెళితే పేషంట్ స్పృహలోనే ఉన్నాడు. మాట్లాడ్తున్నాడు. అతని మారుతి నుజ్జునుజ్జయింది. ఖరీదయిన పేషంట్ కదా ఎందుకయినా మంచిదని వాళ్ళింటికి ఫోన్ చేయించి అనురాధ హాస్పిటల్‌కు వెళ్తున్నట్లు చెప్పించారు.

ఆ డాక్టర్‌కి అనుమానంగానే ఉండింది. అతను భయపడినట్టే హాస్పిటల్‌కు చేరేలోపలే పేషంట్ 'హరీ' అన్నాడు. పేషంట్ బతికే ఉన్నాడనే రుజువుకోసం సెల్‌ఫోన్లో పేషంట్‌చేత మాట్లాడించిన డాక్టర్ తన తెలివికి తనే మురిసిపోయి – ఆ శరీరాన్ని ఆపరేషన్ థియేటర్‌లోకి తరలించి రెండు మేజర్ సర్జరీలు జరిపాడు. పేషంట్ బంధువులొచ్చాక "ఆపరేషన్ సక్సెస్ – అయినా కొన్ని గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలి. దేవుడిపైన భారం వేయండి" అని చెప్పి మరికొన్ని గంటలు గడిచాక 'సారీ – దేవుడికి దయ లేదు. మా శాయశక్తులా పోరాడినా కాపాడలేకపోయాం' అంటూ బాధని నటించి లక్షరూపాయల బిల్లు వాళ్ల చేతుల్లో పెట్టి – శవాన్ని డబ్బుతో బార్టర్ సిస్టంలో బదిలీ చేశాడు.

ఇపుడు రమేష్ నుంచి ఫోన్ రాగానే ఆఘమేఘాల మీద బయల్దేరారు. ఎటొచ్చీ అనుపమా హాస్పిటల్ అంబులెన్స్ వచ్చిన రెణ్ణిమిషాల తర్వాత స్పాట్‌కి చేరుకోగలిగారు.

అనురాధ హాస్పిటల్ అంబులెన్స్ చూశాక రమేష్‌కి పోయిన ప్రాణం తిరిగివచ్చినట్లయింది.

కానీ ఒక పేషంట్‌ను తీసుకెళ్ళడానికి రెండు అంబులెన్సులు రావటంతో అయోమయం ఏర్పడింది.

స్ట్రెచర్‌ని పేషంట్ పక్కన పెట్టి అతన్ని చెరో వైపూ పట్టుకుని ఎత్తబోతున్న మేల్ నర్సుల వైపు అనురాధ హాస్పిటల్ డాక్టర్ గుడ్లురిమి చూశాడు.

"ఆ పేషంట్ కోసమే మేము నలభై కిలోమీటర్లు ప్రయాణించి వచ్చింది. మీరెనక్కి వెళ్ళిపోండి. పేషంట్‌ని మాకు వదిలేయండి" అని హుంకరించాడు.

"మేమూ ప్రయాణించాం నలభై కిలోమీటర్లు – మీకంటే ముందొచ్చింది మేము. పేషంట్ మా హాస్పిటల్‌కి చెందుతాడు" అన్నాడు అనుపమ హాస్పిటల్ డాక్టర్.

"గత ఆర్నెల్లనుంచి ఇక్కడ ఏ యాక్సిడెంట్ జరిగినా మేం వచ్చి పేషంట్స్‌ని తీసుకెళ్తున్నాం . . . మిమ్మల్ని మొట్టమొదటిసారి చూస్తున్నానిక్కడ . . . ఈ ప్రాంతం మాది– మీకిక్కడి పేషంట్స్ మీద ఏ రకమైన హక్కులేదు."

"ఈ ఏరియాను మీకు ధారాదత్తంచేస్తూ ఎవరైనా బాండ్ పేపర్ రాసిచ్చారా? మీ స్వంత ఆస్తి అనుకుంటున్నారా ఈ రోడ్డుని? ఇది గవర్నమెంటు వాళ్ళ రోడ్డు . . . పేషంట్ పైన మీకెంత అధికారం ఉందో మాకూ అంతే అధికారం ఉంది. మేం మీలా పేషంట్‌ని బట్ట పిండినట్లు పిండి పిప్పిచేయం."

"అబ్బో సేవాశ్రమమా మీ హాస్పిటల్? మొన్ననేగా పిల్లలు లేని దంపతులకు ఆశ కల్పించి– లక్షలు పిండుకుని – కడుపొచ్చిందని ఫాల్స్ రిపోర్ట్ తెప్పించి – మూణ్ణెల్ల తర్వాత అబార్షన్ అయిందని నమ్మించి – మరో ప్రయత్నం చేస్తే తప్పకుండా నిలుస్తుందని ఒప్పించి – ఇలా అన్ని రకాలుగా వాళ్ళని దోచుకున్నారు! మీరెన్నెన్ని ఘోరాలు చేసి సంపాదిస్తున్నారో మాకు తెలీదనుకోకండి."

"మేం మీలా శవాల మీద ఆపరేషన్లు చేయటం లేదు. పేషంట్ ఇంకా బతికే ఉన్నాడని బంధువుల్ని నమ్మించి – ఐసియూని మార్చురీ కింద మార్చేసి దోచుకోవడంలేదు".

"మా హాస్పిటల్‌ని ఏమైనా అన్నావంటే పుచ్చెలు ఎగిరిపోతాయ్."

"మా హాస్పిటల్‌ని తప్పుపట్టావంటే పళ్ళు రాలిపోతాయి."

వాళ్ళిద్దరూ కలబడేందుకు సిద్ధపడ్డారు.

పేషంట్‌ని లేపబోతున్న అనురాధ మేల్ నర్సులపైన అనుపమ హాస్పిటల్ మేల్ నర్సులు విరుచుకుపడ్డారు.

"పేషంట్‌ని ముట్టుకుంటే కాళ్ళిరగ్గొడతాం" అన్నారు.

"ఎవరివి! పేషంట్‌వా? మీరంతటి ఘనులే... కాలికేదో దెబ్బతగిలిందని వస్తే – మందిస్తే తగ్గిపోయేదానికి మేజర్ ఆపరేషన్ చేసి – చివరికది సెప్టిక్ అయ్యి – కాలు తీసేసిన వైనం విజయవాడ మొత్తం గుప్పుమనలేదా?"

"మీ దోపిడీ గురించి ఎవరికీ తెలియదనుకుంటున్నారా? ఓ పేషంట్ తలనొప్పని వస్తే– కళ్ళద్దాలు ఇస్తే సరిపోయేదానికి – సీటీస్కాన్‌లు చేయించి డబ్బు దోచుకున్న దొంగలు మీరు. కడుపు నొప్పని వస్తే అపెండిసైటిస్ అని భయపెట్టి – పొట్టకోసి కుట్టేసి – ఆపరేషన్ చేశామంటూ వేలకువేలు దొబ్బిన దగుల్బాజీలు మీరు."

"మమ్మల్ని దొంగలంటావా? మీరు దళారులు . . . రిక్షావాళ్ళకు కమీషన్లిచ్చి పల్లెటూరి పేషంట్లను రప్పించుకునే దుర్మార్గులు . . . పెళ్ళికి పిల్చినట్లు 'సుస్వాగతం' అంటూ హాస్పిటల్ బయట ఆ బోర్డేమిటి మీ పిండాకూడు . . . పేదవాళ్ళ అజ్ఞానాన్ని, డబ్బున్నోళ్ళ భయాన్ని సొమ్ముచేసుకుంటున్న గజదొంగలు మీరు . . ."

వాళ్ళుకూడా జుట్లు పట్టుకుని కొట్టుకోడానికి సమాయత్తమైనారు.

అక్కడ యాక్సిడెంట్ జరిగిన భీభత్సవాతావరణానికి తోడు రెండు హాస్పిటళ్ళ సిబ్బంది మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.

ఫస్ట్‌ఎయిడ్‌కి వాడే కత్తెరల్ని, బ్లేడుల్ని ఆయుధాలుగా మలుచుకుని దొమ్మీకి దిగిపోవడానికి సిద్ధమై పోతున్నారు.

బలమైన గాయాలు తగిలి వళ్ళంతా రక్తంతో తడిసి పోయి – చావుకి అతి సమీపంగా పడి విలవిల్లాడుతున్న పేషంట్ పరిస్థితి దయనీయంగా ఉంది.

అప్పటికి యాక్సిడెంట్ జరిగి గంట దాటి పోయింది. కొద్దికొద్దిగా స్పృహలో కొచ్చిన పేషంట్ మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని నోటినిండా రక్తం వూరుతోంది. మాట పెగలటం లేదు. అతి కష్టంమీద చేతులు ఒకచోట చేర్చి దండం పెడ్తున్నాడు. అతనికి తను చనిపోవడం ఖాయమని భయమేస్తోంది. ఏ పుణ్యాత్ముడో హాస్పిటల్‌కి తీసుకెళ్తే తను బతకొచ్చన్న ఆశా ఉంది.

మనుషులు కళ్ళకు మసకమసగ్గా కన్పిస్తున్నట్లే – అతని ఆలోచనలు కూడా బూజర బూజరగా బ్లర్ అయి తేలిపోతున్నాయి. ఎవరెందుకు అరుచుకుంటున్నారో – తనని ఎందుకు ఆస్పత్రికి తీసుకెళ్ళటం లేదో అతనికి అర్థం కావటంలేదు. అసలు తను బతికే ఉన్నాడా? అనే అనుమానం . . . నొప్పి తెలుస్తోంది. నడుం విరిగిందా? తల పగిలిందా? గాయాలనుండి

రక్తం స్రవించి జిగటజిగటగా తగుల్తోంది.

"అయ్యా! నన్ను బ్రతికించండి – నన్ను రక్షించండి – మీకు దండం పెడ్తాను ఎవరైనా హాస్పిటల్‌కు తీసుకెళ్ళండి" అని చెప్పాలనుకున్నాడు– చెప్పాననుకున్నాడు . . . నోట్లోంచి మాటలకు బదులు రక్తపు బుడగలు బైటికి వచ్చాయి. గుండెల మీద నిస్త్రాణగా పడి ఉన్న అరచేతుల్ని అతికష్టంమీద మోడ్చి మరలా నమస్కారం పెట్టాడు.

గుంపులో నిలబడి ఇదంతా గమనిస్తున్న ఓ వ్యక్తికి బోల్డు జాలి కలిగింది.

"ఎవరో ఒకరు తొందరగా పేషంట్‌ని హాస్పిటల్‌కు తీసుకెళ్లండి. మీలో మీరిలా వాదులాడుతూ కూచుంటే పేషంట్ చచ్చివూరుకుంటాడు. ఇప్పటికే చాలా రక్తం కారింది" అన్నాడు.

"పేషంట్ చచ్చినా వాళ్ళకేం పర్లేదు . . . శవాన్ని అడ్డం పెట్టుకుని బిజినెస్ ఎలా చేయాలో వాళ్ళకు బాగా తెలుసు. హృదయం లేని రాక్షసులు వాళ్ళు" అన్నారు అనుపమ హాస్పిటల్ సిబ్బంది.

"మీరసలు మనుషులేకాదు మృగాలు. మీకసలు మనసనేదేలేదు – బండరాళ్ళు. పేషంట్ గిలగిలా కొట్టుకుంటున్నా జాలనేదే లేకుండా అరగంటపైగా మాతో పోట్లాడుతున్నారు . . . ఇప్పటికైనా వదిలేయండి. పేషంట్‌ని మేము తీస్కెళ్తాం" అన్నారు అనురాధ హాస్పిటల్ సిబ్బంది.

"వీల్లేదు మేము తీస్కెళ్తాం"

"కాదు మేమే"

మరలా వాగ్యుద్ధం ప్రారంభమైంది.

రమేష్‌కి అసహనంగా ఉంది. తనకు రావాల్సిన వెయ్యిరూపాయలు రానందుకు కోపంగా కూడా ఉంది. ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు. ఫోన్ చేశాక – అంబులెన్స్ రాగానే – మొదట తన చేతిలో వెయ్యిరూపాయలున్న కవరు పెట్టాక – పేషంట్ దగ్గరకెళ్ళేవారు.

తన డ్యూటీ తను చేశాడు. మరో అంబులెన్స్ రావటంలో తన ప్రమేయం ఏమీలేదు. ఒప్పందం ప్రకారం తనకు వెయ్యిరూపాయలు రావాల్సిందే.

అనురాధ హాస్పిటల్ డాక్టర్ని పక్కకు పిలిచి. "నా డబ్బులు నాకివ్వండి" అని అడిగాడు.

"ఏ డబ్బులు?"

"మీకు ఫోన్ చేశానుగా . . . నాకు రావాల్సిన వెయ్యిరూపాయలు ఇచ్చేయండి."

"పేషంట్‌ని మా హాస్పిటల్‌కు తీసుకెళ్తేనే కదా మాకు లాభం వచ్చేది. అందుగ్గాను కమీషన్ కింద నీకు డబ్బులిస్తాం. అంతే గాని పేషంట్ ఇప్పుడు ఎవరి హాస్పిటల్‌కు వెళ్తాడో తెలీని పరిస్థితిలో నీకెలా డబ్బులిస్తాను?"

"నాకదంతా తెలీదు. మన ఒప్పందం ప్రకారం యాక్సిడెంట్ జరిగిన వెంటనే నేను ఫోన్ చేశాను. కాబట్టి నాకు రావల్సిన వెయ్యిరూపాయలు మీరివ్వాల్సిందే."

"అసలు అనుపమ హాస్పిటల్ వాళ్ళకు కబురెలా అందింది? వాళ్ళకూ నువ్వే చెప్పావా? ఇద్దరినుంచీ కమీషన్ కొట్టేయాలని ప్లానా?"

ఆ మాటకు రమేష్ ఖంగుతిని డిఫెన్స్‌లో పడ్డాడు.

"నేను చెప్పలేదు–పెట్రోల్ బంకులోని కుర్రాడెవరైనా ఫోన్ చేశాడేమో"

"నీకెలా తెలుసు?"

"ఇందాక ఒక మేల్‌నర్స్ వెళ్ళి పెట్రోల్ బంకులోని అబ్బాయికి కవరు ఇవ్వడం నేను చూశాను" అబద్ధం చెప్పాడు – వాళ్ళిచ్చారు కాబట్టి తనకూ ఇవ్వాలనే రూలు వర్తిస్తుందన్న ఆశతో . . .

"వాళ్ళిస్తే ఇవ్వనీ . . . నేనివ్వను."

"ఎలా ఇవ్వరో నేనూ చూస్తాను."

"ఏం చేస్కుంటావో చేస్కో ఫో"

"ఇకనుంచీ నేను ఫోన్లు చేయను"

"మానెయ్ – నువ్వుగాక పోతే మరో గన్నాయిగాడు. ఇలాంటి పనులకు కో అంటే కోటి మంది"

"అంతేనా"

"అంతే"

విజయవాడలో ఉన్న తన కూతుర్ని, అల్లుణ్ణి చూసుకుని కార్లో హైద్రాబాద్‌కి తిరిగి వెళ్తున్న డా॥ రఘు యాక్సిడెంట్ జరిగిన చోటికి రాగానే కారుదిగి విషయం ఏమిటో క్షణాల్లో గ్రహించాడు.

అతనికి హైద్రాబాద్‌లోని అమీర్‌పేటలో స్వంత హాస్పిటల్ ఉంది.

పేషంట్ పరిస్థితిని అంచనా వేశాడు. అక్కడినుంచి హైద్రాబాద్‌కు ప్రయాణం నాలుగ్గంటలు పడ్తుంది. మనిషి అన్ని గంటలూ బ్రతికే ఉంటాడా లేదా అని బేరీజు వేసుకున్నాడు. పేషంట్ పక్కన కూచుని ప్రాథమిక పరీక్షలు చేశాడు. గుండె, వూపిరితిత్తులు పరీక్షించాడు.

నాలుగ్గంటల వరకు వైద్యసహాయం లేకున్నా బ్రతికేలానే ఉన్నాడు. ఓ వేళ పోతేనో? అప్పుడు ఏం చేయాలో ఆలోచించుకోవచ్చనుకున్నాడు. బంధువులొచ్చేలోపల పేషంటో లేక అతని శవమో అపరేషన్ థియేటర్ లోపల ఉండేట్లు జాగ్రత్త పడితే చాలనుకున్నాడు.

పేషంట్‌ని తను తీసుకెళ్ళటం వల్ల లాభం తప్ప నష్టం ఉండదని నిర్ధారణకు వచ్చాక, తన

విజిటింగ్ కార్డు అక్కడి పోలీసులకిచ్చి, వారి సహాయంతోనే పేషంట్‌ని కారు వెనకసీట్లో చేర్పించాడు.

నలభై కిలోమీటర్ల దూరంలో విజయవాడ ఉండగా – అక్కడ ఇసుకేస్తే రాలనన్ని హాస్పిటళ్ళుండగా – రెండువందల కిలోమీటర్ల దూరంలో ఉన్న హైద్రాబాద్‌కి పేషంట్‌ని తీసుకెళితే – మధ్యలో ఏమైనా జరక్కూడనిది జరిగితే – పేషంట్ పరిస్థితి ఏమిటి? అని ఎవరైనా అడిగే అవకాశం – వ్యవధి ఇవ్వకుండా కారు స్టార్ట్ చేశాడు.

హైద్రాబాద్ వైపుకు దూసుకుపోతున్న ఆ కారు వెనక సీటులో రక్తం ఓడుతూ, పడుకుని ఉన్న ఆ పేషంట్ డాక్టర్ రఘు కళ్ళకి వంద రూపాయల నోట్లు గుత్తులుగుత్తులుగా పూసిన పూలచెట్టులా కన్పించాడు.

*(ప్రియదత్త వారపత్రిక - 13 ఫిబ్రవరి, 2002)*

★★★

# వలయం

ఉదయం ఆరింటి నుండీ అడ్డా మీద నిలబడి ఉన్న జంగయ్యకు కాళ్ళు పీకుతున్నాయి. ఎండ కసికసిగా మండుతోంది. సమయం పదో పదకొండో తెలీనంత వేడిమి . . . కుంపటిలా ఉంది కడుపు . . . ఆకలి ఆవురావురుమంటూ పొట్టని కొరుక్కుతినేస్తున్నదేమో . . . మెలితిప్పుతున్నట్లు బాధ . . . నిన్న రాత్రి తాగిన దోసెడు అంబలి . . . అంతే . . . ఈ రోజు పని దొరికితేనే తిండి . . . లేదంటే పస్తు.

అతనికి భార్యా పిల్లలు గుర్తొచ్చి – పచ్చి గాయమైనాడు. “సీ . . . ఎదవ బతుకు . . .” తుపుక్కున పక్కకు వూశాడు. అడ్డా మీద నలుగురు ఆడ కూలీలు, ఏడుగురు మగ కూలీలు మిగిలి పోయారు.

“ఈ రోజిక పని దొరకనట్లే” అనుకోగానే ఎక్కడలేని నిస్సత్తువ ఆవహించింది. మూడ్రోజుల క్రితం దొరికిన కూలీ . . . పదింటికి ఎవరో సివిల్ మేస్త్రీ వచ్చి జంగయ్యనీ, మరో ఆడకూలీని పిల్చుకెళ్ళాడు.

మూడంతస్తుల భవంతి నిర్మాణం జరుగుతోందక్కడ.. యిసుకని బస్తాల్లో నింపుకుని మూడో అంతస్తుకి చేరవేయాలి . . . ఉదయం పదినుంచి సాయంత్రం ఆరు వరకూ జంగయ్య బస్తాలు మోస్తూనే ఉన్నాడు . . . యిసుక బస్తాని నెత్తిమీద ఎత్తుకుని మెట్లు ఎక్కటం . . . దిగటం . . . ఎక్కటం . . . దిగటం . . .

విశ్రాంతి కోసం క్షణం నిలబడినా, మేస్త్రి పశువుల్ని అదిలించినట్లు “బేగీ కానీ...గట్ల నిల్చుంటె పైసల్ ఫూకట్ల గిన వస్తయా” అంటూ కసురుకుంటున్నాడు. కొంతమంది గానుగెద్దుల్లా పనులు చేస్తుంటే, ఏ పనీ ముట్టుకోకుండానే అజమాయిషీ చేసి, ఆధిపత్యం చలాయిస్తున్నారు కొందరు . . .

రకరకాల పనులు ఒకేసారి జరుగుతున్నాయి. సిమెంటు పని కొందరు . . . చలువరాతి బండలు కోసే పని కొందరు . . . బండలు పరిచే పని కొందరు . . . చెక్క తలుపులు, కిటికీలు చేసే పని . . . వాటి మీద నగిషీలు చెక్కే పని . . . అన్ని పనుల్లోకి తను చేసే పనే



Rupaye_Chettu.pm7 43 28/7/19, 12:03 AM

శ్రమతో కూడుకున్నదని జంగయ్యకు అర్థమైంది.

తను అడ్డా మీద కూలి . . . ఇలాంటి పనులకు తప్ప బేల్దారీ పనికో, బండల పనికో, చెక్క పనికో అవసరమైన పనితనం తన దగ్గర లేదు. పునాదులు తవ్వడానికి . . . మట్టి మోయ డానికి . . . ఇసుకనీ, ఇటుకనీ పైకి మోయడానికి పనికొస్తాడంతే . . . రోజంతా పనిచేసి రెక్కలు ముక్కలు చేసుకుంటే వంద రూపాయలు చేతిలో పడ్తాయి. అదీ ఓ రోజు పని దొరికితే మరునాడు దొరుకుతుందో లేదో తెలీని పరిస్థితి . . .

దొరికిన రోజు తిండి . . . లేనప్పుడు పస్తు . . .

అతనికి తను వదిలేసి వచ్చిన కన్నతల్లిలాంటి పల్లెటూరు గుర్తొచ్చింది. తనూ తన ఆడది కలిసి పొలంలో వ్యవసాయ కూలీలుగా చేసిన రోజులు గుర్తొచ్చాయి. కూలీలందరూ కలివిడిగా ఉండేవారు . . . సరదాగా ముచ్చట్లాడుకుంటూ పనులు చేసేవారు . . . సందడిగా . . . పాటలు పాడుకుంటూ . . . నాట్లు వేసేటప్పుడు, కలుపు తీసేప్పుడు, విత్తనాలు నాటేప్పుడు . . .  పనిని కబుర్లతో అద్దుకుని మరీ ఆస్వాదించేవారు.

"ముచ్చట్లాపి పని కానీండి" అని రైతు కసురుకున్నా "నీకు తెల్వదా . . . ఆడుతు పాడుతు పని సేస్తుంటే శెమ తెలీదు" అంటూ ఆడకూలి తిరుగు జవాబిచ్చేది.

వర్షాలు పడక . . . పంట చేతికి రాక . . . అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు . . . ఉన్న కాసిని పొలాల్ని అమ్ముకుని పనులు వెతుక్కుంటూ పట్నాలకు వలస పోతున్నారు. మరి తనలాంటి వ్యవసాయ కూలీల పరిస్థితి వేరే చెప్పాలా . . . వర్షాకాలం వస్తే చాలు పచ్చని తివాచి పర్చినట్లు కళకళలాడిపోయే పొలాలు గత ఐదారేళ్ళ నుంచి వర్షాభావం వల్ల బీళ్ళుగా మారి కన్పిస్తున్నాయి. గత్యంతరం లేక కొంతమంది కూలీల్తో పాటు జంగయ్య మూటాముల్లె సర్దుకుని పెళ్ళాం బిడ్డల్తో హైద్రాబాద్ చేరుకున్నాడు.

గాంధీనగర్ మెయిన్ రోడ్డుకిరువైపులా ఉన్న గుడిశెల్లో ఓ దాంట్లో అద్దెకి దిగాడు. పొరుగున వాకబు చేస్తే "పట్నంల బిల్డింగుల కట్టుడుపని మస్తుగ నడుస్తా ఉండాది. సేస్కున్నోడికి సేతినిండా పని" అని తెలిసి మురిసిపోయాడు. అజాద్ కేఫ్ దగ్గర అడ్డా మీద నిలబడితే కూటికి కొదవుండదని అమాయకంగా నమ్మి, తన జీవితాన్ని ఈ అడ్డాకు అంకితం చేశాడు.

మొదట్లో అలా గంటల తరబడి నిలబడి నిలబడి ఎవరు పనికి పిలుస్తారా అని ఎదురుచూట్టం అవమానంగా అన్పించేది. కూలీలు కావాలని ఎవరైనా మనిషి రాగానే నేనంటే నేనని ఎగబడిపోయే వారు. ఓ వారం రోజులు జంగయ్య ఎగబడకుండా ఉన్నాడు. పని దొరకలేదు. తెచ్చుకున్న కాసిని పైసలు అయిపోయాయి. ఆకలి . . . యింట్లో పెళ్ళాంతోపాటు పదమూడేళ్ళ



Rupaye_Chettu.pm7 44 28/7/19, 12:03 AM

కొడుకు, పదేళ్ళ బిడ్డ . . .

ఆకలి మహమ్మారి...మనిషిని తినేసే జబ్బులన్నింటి కంటే భయంకరమైన జబ్బు . . . అది సిగ్గునీ, అభిమానాన్ని చంపేసింది. మరునాడు జంగయ్య కూడా పని కోసం ఎగబడ్డాడు. ఆ తర్వాత నుంచీ అదే అలవాటైపోయింది. పోరాటమే జీవితం . . . ఇక్కడ పోరాడితేనే ఆ రోజు కూలీకి అర్హత . . . ఆ తర్వాత సాయంత్రం ఆరుదాకా కండల్ని కరిగిస్తే వంద రూపాయలు దొరుకుతాయి.

అడ్డాలో కలకలం . . . అలోచనల్నుంచి బైటపడి పరిసరాల్ని గమనించాడు. కూలీల్ని పరీక్షగా చూస్తూ అడ్డాను సమీపిస్తున్నాడో వ్యక్తి . . . కొనేముందు బానిసల శరీరాల్ని తడిమేలాంటి చూపు . . . జంగయ్యలో ఆశ . . . అతను నోటి కాడి కొస్తున్న అన్నం ముద్దలా కన్పించాడు.

కానీ మనిషిని పరిశీలనగా చూస్తే మేస్త్రీలా లేడు . . . బట్టలు మామూలుగా ఉన్నా మాసిపోయిలేవు. మనిషి నలిగినట్టు కాకుండా, నదురుగా కన్పిస్తున్నాడు. చేతిలో సిగరెట్ ఉంది . . . అది తాగే విధానంలోనే నేను మీ జాతి వాణ్ణి కాదు అనే ఆధిక్యభావం కన్పిస్తోంది.

అతను కూలీల్ని సమీపించి, విలాసంగా సిగరెట్ పొగ వదుల్తూ “రోజంతా పని చేస్తే ఎంత కూలి ముడ్తుంది?” అని అడిగాడు.

ప్రత్యేకంగా ఎవర్నీ ఉద్దేశించి కాకుండా, గుంపుని ప్రశ్నించడం వల్ల రాములు కల్పించుకుని “నీకు తెల్వనిదేముంది? వందిత్తారు” అన్నాడు. అక్కడున్న కూలీల్లో రాముడొక్కడే నాలుగో తరగతి వరకు చదువుకున్నాడు. వయసులో పెద్దవాడు. కాస్తోకూస్తో లోకజ్ఞానం ఉన్నవాడు.

“ఎన్ని గంటల పనికి?”

“పొద్దుటేల పది నుండి పొద్దుగూకేవరకు . . . ఆరు ఆరుంబావు వరకనుకో . . . సేత్తాం. మద్దిలో బోయనానికి అర్ధగంటైనా విడవాలి”

అతనడుగుతున్న తీరు చూసి, అతని వాలకం చూసి ఇదేదో పనికిమాలిన వ్యవహారమని అర్థమై మిగతా కూలీలు అనాసక్తంగా చూపు మరల్చుకుని బాతాఖానీలో పడ్డారు.

“మీకు ఒక్కొక్కరికి రోజుకు వెయ్యి రూపాయలు దొరికే పని చూపిస్తాను చేస్తారా?” కొద్దిగా గొంతు పెంచి అందరికీ విన్పించేట్లు అన్నాడతను.

“ఎయ్యి రూపాయలా! ఒక్క దినాంకా!” రాములు గొంతులో అడ్డం పడిన ఆశ్చర్యం.

మిగతా కూలీలందరూ కుతూహలంగా – అపనమ్మకంగా చూశారతని వైపు. జంగయ్య ముందుకు జరిగి రాములు పక్కకొచ్చి నిలబడ్డాడు.

“అవును. ఒక్క రోజుకి వెయ్యి రూపాయలిప్పిస్తాను”



Rupaye_Chettu.pm7 45 28/7/19, 12:03 AM

"మేమెవ్వరం సదూకున్నోలం కాదు సారూ... కూలి పని తప్పితే మరే ఇద్యా తెల్వనోల్లం. మా కెవరిత్తారు ఎయ్యి రూపాయలు?"

"ఆ పని చేయడానికి చదువుతో పనిలేదు. మీరందరూ చేయగలరు"

జంగయ్యకు అదేదో చిక్కుముడిలా – అర్థం కాని పొడుపు కథలా అన్పించింది. చదువక్కర లేదంటాడు. పనితనం అక్కరలేదు. కూలీలు చేయగల పనే . . . రోజుకు వెయ్యి రూపాయలు . . .

"పరాసికాలాడకు సారూ" అన్నాడు రాములు.

"మీతో పరాచికాలాడితే నాకేమొస్తుంది? నేను చెప్పింది నిజం. మీలో ఎంతమంది వస్తారో చెప్పండి. రేపుదయం ఎనిమిదింటికి ఇక్కడుంటే చాలు. వచ్చి పిల్చుకెళ్తాను" అన్నాడు.

అప్పటికే కూలీలందరూ అతని చుట్టూ మూగారు.

జంగయ్యకెందుకో నమ్మకం కుదరటం లేదు. వెయ్యి రూపాయలిచ్చే పనంటే ఏ దొంగతనమో, దోపిడీనో చేయమంటారేమోననే అనుమానం వచ్చింది.

"పోలీసు కేసయ్యేలాంటి అన్యాయమైన పనులేమైనా చేయిస్తారా?" పైకే అనేశాడు.

అందరి మనుసుల్లో అదే భయం మెదిలింది. లేకపోతే బడాబడా చదువులు చదివిన మారాజులకే అంతంత లావు జీతాలు రావు కదా – మరి తమలాంటి కూలోళ్ళకు ఎందుకిస్తారు?

ఆ వచ్చినతను పెద్దగా నవ్వాడు. "అలాంటి విషయమే అయితే ఇంత పబ్లిగ్గా మాట్లాడ్తానా?" అన్నాడు.

"ముసుగులో గుద్దులాట ఎందుకు సారూ – పనేంటో సెప్పు" అన్నాడు జంగయ్య.

"చాలా సులువైన పని... ఉదయం మీ చేత టాబ్లెట్ మింగిస్తారు. మిమ్మల్ని విశ్రాంతిగా పడుకోబెట్టి రెండు గంటలకోసారి రక్తం శాంపిల్స్ తీసుకుంటారు. అంతే"

"ఓస్ – గింతేనా . . . రకతం అమ్ముకోటం అంటే జల్ది సమఝైతది" అన్నాడు నర్సింగ్.

"రక్తం శాంపిల్ అంటే సీసాలు సీసాలు తీసుకోరు. సూది మందు ఎంతుంటదో ఎరికేగదా. అంత తీస్తారు"

"ఆళ్లిచ్చే బిల్లలు మింగితే ఏమౌతది?" జంగయ్య అడిగాడు.

"ఏమీ కాదు"

"మనకేమైనా పెమాదమా?"తన ప్రశ్నని మరోలా విడమర్చి అడిగాడు.

"పిసరంత కూడా ప్రమాదం లేదు అనడానికి రుజువు నేనే. నన్ను చూస్తున్నారుగా . . . నెలకు పదిసార్ల చొప్పున ఇప్పటికి నలభైసార్లు వేసుకున్నాను. రాయిలా ఉన్నాను.

ఒప్పుకుంటారుగా . . . నాలుగు నెలల్లో నలభై వేలు సంపాయించుకున్నాను. నేనూ ఒకప్పుడు మీలా అడ్డామీద కూలీనే. ఇప్పుడు సుఖంగా, దర్జాగా బతుకుతున్నాను. ఆలోచించుకోండి. రేపుదయం సరిగ్గా ఎనిమిదింటికి వస్తాను. మీ తిండి, వసతి లాంటి ఖర్చులన్నీ నావే. ఒక్కోసారి రాత్రికి ఉండిపోవాల్సి రావచ్చు. మీ సదుపాయాల సంగతి నాకొదిలేయండి". అతను వేగంగా వెళ్ళిపోయాడు.

"ఆల్లిచ్చే బిల్ల మింగి పడుకుంటే సాలు ఎయ్యి రూపాయలిత్తున్నారంటే గిందులో ఏదో తిరకాసుంటది. గీ జమానాల పైసలూర్కే ఇచ్చే మడుసులెవరున్నరు? ఇసం గాని ఇస్తరెమో ఎవరికెరుక? బతికుంటే సాలు గాని గా బిల్లలు మింగి పేనం మీదికి తెచ్చుకోకండ్రి- నా మాట జరంత యినుకోండ్రి" అన్నాడు రాములు.

"వూరుకో రాములన్నా . . . ఇసం గెందుకిత్తారు . . . గా సారు నలభై మాత్తర్లు మింగినాడంట కదా. ఓ మాత్తరిత్తారు . . . గింత రకతం తీసుకుంటరు. ఎయ్యి రూపాయలంటే వూకట్లో వత్తాయా? ఓలమ్మో . . . ఒకటారెండా . . . ఎయ్యి రూపాయలు" గుండెల మీద చేతులేసుకుంటూ చెప్పింది లక్ష్మమ్మ. ఆమెని మొగుడొదిలేసి మూడు సంవత్సరాలైంది.

"ఇసం ఎక్కడలేదు రాములూ . . .ఈ పట్నంలో మనం పీల్చే గాలిలో ఇసం లేదా . . . మనం తినే తిండిలో ఇసం లేదా . . . మనం తాగే నల్లాల్లోని మురికి నీరు ఇసం కన్నా పెమాదకరమైంది కాదా . . . అంతా ఇసం మయం . . . మడుసుల్లో కూడా ఇసమే నాయె . . . ఇన్ని ఇసాల మద్దిన బతుకుతున్న మనకు అదో ఇసం . . . అంతే – ఎయ్యి రూపాయల కోసం యిసం తాగడానికైనా నేను సిద్ధమే" అన్నాడు నర్సింగ్. అతనికి పెళ్ళికెదిగిన ముగ్గురు కూతుర్లున్నారు.

"మన కూలి బతుకుల్లోనే పెమాదం తాచు పాములా పొంచుంది కదయ్యా . . . మా బావ బేల్దారీ పని చేసేవాడు. సిమెంటులో చేతులు నానీ- పుండ్లు పడి – మంచంలో తీస్కుని తీస్కుని చచ్చాడు. మా అన్న గోడలకి సున్నం, రంగులు ఏసేవాడు. మొన్నీ మద్దెనే వూపిరితిత్తులు పాడై పానం వదిలాడు. మార్బుల్ బండలు కోసే ఎంకటేసుని పెద్దాసుపత్రిలో చేర్పించారు. ఆడి వూపిరితిత్తుల్లోనే కాదు రకతంలో కూడా మార్బుల్ బండల్ని కోసేప్పుడు రాలే సన్నటి రజను నిండి ఉందట. అలాగని తెల్సిన పనిని మానుకోగలమా? కడుపులోకి యింత ముద్ద దిగందే పానం వూరుకుంటుందా సెప్పు . . . పేదోడి బతుకులో పెమాదం లేనిదెక్కడ?" అన్నాడు ఈరయ్య. అతని కూతుర్ని అల్లుడు తన్ని తగలేశాడు. మూడు వేలిస్తేగాని అది కాపురాని కెళ్ళటం కుదర్దు.

జంగయ్య కాళ్ళీడ్చుకుంటూ ఇంటి దారి పట్టాడు. ఎండ నడినెత్తికొచ్చింది. అతని బుర్ర నిండా మందుతూ ఆలోచనలు . . .

రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. పక్కనే పడుకుని ఉన్న భార్యని లేపి చెప్పాలనుకున్నాడు. మనసొప్ప లేదు. అయినా దానికేం తెలుస్తుంది . . . పిచ్చిది . . .

తామిద్దరూ కలిసి పొలం పన్లకెళ్ళే రోజుల్లో ఎలాగుండేది . . . వయ్యారంగా గట్టెమ్మట నడుస్తూ . . . గండిపడిన చెరువులా ఉరకలెత్తుతూ . . .

ఇపుడు నాలుగిళ్ళలో పాచిపనికెళ్తోంది. మొదట్లో తనతోపాటు కొన్నాళ్ళు అడ్డామీద కూలిగా పనిచేసింది. నడుంనొప్పి, మోకాళ్ళ నొప్పులు మొదలైనాయి. పని చేయకుండా విశ్రాంతి తీసుకోమని ఎంత పోరినా విన్లేదు. పాచిపనికి కుదురుకుంది.

"యిద్దరు పిల్లలున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయాల్సిన బరువు నెత్తిమీదుంది. నీ ఒక్కడి సంపాదన మీద ఎలా జరుగుద్ది" అంటూ తన మాటని తోసి పుచ్చింది.

రాత్రి పదివరకూ చదువుకున్న కొడుకు నిద్దట్లో ఏదో కలవరిస్తున్నాడు. ఆణ్ణి బాగా సదివించాలంటే డబ్బు కావాలి. కూతురి లగ్గం సేయాలంటే డబ్బు కావాలి.

"ఈ కాల్వ పక్కన వచ్చే చెడువాసన వల్ల జబ్బులొస్తాయని మా టీచరు చెప్పింది నాన్నా" అని కొడుకొక రోజు అన్నప్పుడు – "అద్దె తక్కువని కదా యిక్కడ ఉంటున్నాం. మరో చోటికి మారాలంటే నా సంపాదనలో సగం అద్దెలకే పెట్టాలి" అన్నాడు తను. మంచి లొకాలిటీలో గుడిశె అద్దెకు కావాలంటే డబ్బులుండాలి.

అతనికి ఆగంతకుడి మాటలు గుర్తొచ్చాయి. నాలుగునెలల్లో నలభై వేలు. నలభైవేలు . . . చాలు . . . తన కష్టాలన్నీ తీరిపోతాయి. మనిషి ఎంత నున్నగా ఉన్నాడో . . . ఆడూ ఒకప్పుడు తనలానే అడ్డా మీద కూలీ . . . చెప్తే కానీ తెలీనంత నాజూగ్గా ఉన్నాడిప్పుడు. డబ్బు మహిమ . . .

ఏదో అలికిడైంది. యింటినిండా ఎలుకలే. ప్రాణాలు కొరుక్కు తినేస్తున్నాయి. బోనులో బెల్లమ్ముక్క పెట్టాడు. ఈరోజు ఎట్లాగైనా అది బోనులో పడి తీర్తుంది.

తెల్లవారుజామున ఎప్పుడో మగతగా నిద్ర పట్టింది

"నాన్నా – ఎలుక బోనులో పడింది" కొడుకు అరుపులకు జంగయ్యకు మెలకువొచ్చింది.

బోనులో ఎలుక బిక్కుబిక్కుమంటూ చూస్తోంది. అసహనంగా బోనంతా కలియ తిరుగు తోంది . . . తప్పించుకునే దారి లేక దీనంగా చూస్తోంది. ఓ క్షణం అతనికెందుకో జాలేసింది.

మనసు తను చేయబోతున్న పని మీదికి మళ్ళింది. భార్యకు చెప్పాలని అనుకున్నాడు. మరలా వద్దని నిర్ణయించుకున్నాడు.

"గుత్తకు పని దొరికింది. రాత్తిరంతా చేసుకుంటే మంచిదన్నాడు మేస్త్రీ. రేపుదయం వచ్చేస్తాను. కంగారుపడకు" అన్నాడు భార్యతో.

ఎనిమిదింటికి అడ్డా మీది కెళ్ళేప్పటికే అతనూహించినట్టే లక్ష్మమ్మ, నర్సింగ్, ఈరయ్య వచ్చి ఉన్నారు. వాళ్ళని చూసి బెరుగ్గా నవ్వాడు జంగయ్య.

చెప్పిన సమయానికి సరిగ్గా వచ్చాడతను. నలుగుర్నీ చూసి మందహాసం చేసాడు. తన పేరు ప్రసాద్ అని పరిచయం చేసుకున్నాడు. ఉప్పల్ వెళ్ళే బస్ ఎక్కారందరూ.

మమత ల్యాబ్స్‌కు పిల్చుకెళ్ళాడు. వీళ్ళని విజిటర్స్ లాంజ్‌లో కూచోబెట్టి లోపలికి వెళ్ళి ఎవరితోనో మాట్లాడి వచ్చాడు. వచ్చిన నలుగురికీ బిస్కట్లు . . . చాయ్ ఇచ్చారు. జంగయ్యకు వాళ్ళ రాచమర్యాదలు చూస్తే ఏనుగెక్కినంత సంబరంగా అన్పించింది.

ఓ అమ్మాయి సిరంజితో వచ్చి నలుగురి దగ్గరా రక్తం నమూనాలు తీసుకుని లోపలికెళ్ళింది.

"మొదట మీ రక్తాన్ని పరీక్షించి . . . జబ్బులేమైనా ఉంటే వాళ్ళని బైటికి పంపించేస్తారు" వివరణ ఇస్తున్నట్లు చెప్పాడు ప్రసాద్.

జంగయ్యకు కొద్దిగా భయమేసింది. తనకు తెలీకుండా తన లోపల ఏమైనా జబ్బులున్నాయేమో? ఇప్పటివరకూ తనెప్పుడూ రక్తపరీక్ష చేయించుకోలేదు. అటువంటి అవసరం రాలేదు. ఇపుడలాంటివి బైటపడి తనని బైటికి పంపించేస్తారా . . . నలభై వేలు సంపాయించాలన్న తన కల కలగానే మిగిలిపోతుందా . . .

నలుగురూ ఏమీ మాట్లాడుకోలేదు. అపరిచితుల్లా ఎవరి ఆలోచనల్లో వారుండిపోయారు. వాళ్ళ కళ్ళల్లో భయం స్పష్టంగా కన్పిస్తోంది. దాంతో పాటు వెయ్యి రూపాయల మీద ఆశ కూడా . . .

అరగంట గడిచాక నలుగుర్నీ లోపలకు పిల్చుకెళ్ళారు.

మమత ల్యాబ్స్ చేయ తలపెట్టిన డ్రగ్ ట్రయల్స్‌కి తాము స్వచ్ఛందంగా ఒప్పుకుని వచ్చామని, సైడ్ ఎఫెక్ట్స్ గురించి తమకు పూర్తి అవగాహన ఉందనీ, దీని వల్ల తమకెలాంటి హాని జరిగినా సదరు లేబొరేటరి బాధ్యత ఏమీ లేదని రాసి ఉన్న పేపరు మీద నలుగురి వేలిముద్రలూ, సంతకాలూ తీసుకున్నారు. వాళ్ళ పేర్లూ, వయసూ, చిరునామా అడిగి రాసుకున్నారు.

జంగయ్యను ఓ క్యూబికల్‌లోకి పిల్చుకెళ్ళి పడుకోబెట్టారు. ఏసీ గది చల్లగా ఉంది. అతని

చేతికి ఓ క్యాప్సూల్ ఇచ్చి వేసుకోమన్నారు. తర్వాత కళ్ళు మూసుకుని హాయిగా రెస్ట్ తీసుకోమన్నారు.

రెండు గంటల విరామం తర్వాత మొదట్లో రక్తం నమూనా తీసుకున్న అమ్మాయే వచ్చి మరలా సిరంజి ద్వారా రక్తం తీసుకుంది. బీపీ చెక్ చేసింది. హార్ట్ బీట్స్ ఎలా ఉన్నాయో పరీక్షించింది

మధ్యాహ్నానికి రెండు చపాతీలు, కూర, అన్నం, సాంబారు ఇచ్చారు. నాల్గింటికి పళ్ళరసం ఇచ్చారు. సాయంత్రం ఆరింటికి బిస్కట్లు, టీ . . . రాత్రికి రెండు రకాల కూరల్తో భోజనం. రెండు గంటలకో మారు బ్లడ్ శాంపిల్స్ తీసుకోవటం, బీపీ చెక్ చేయడం లాంటివి జరుగుతూనే ఉన్నాయి.

మరునాడుదయం చక్కటి అల్పాహారం ఇచ్చారు. పన్నెండూ, ఒంటి గంట మధ్యలో చివరిగా రక్తం శాంపిల్ తీసుకుని ఓ స్లిప్ చేతికిచ్చి "క్యాషియర్ దగ్గరకెళ్ళి ఇది చూపిస్తే డబ్బులిస్తారు" అన్చెప్పారు.

జంగయ్య తనతోపాటు వచ్చిన మిగతా ముగ్గురి కోసం చూశాడు. కన్పించలేదు. ముందే వెళ్ళిపోయారేమో . . . కొద్దిసేపు వేచిచూద్దామనుకున్నాడు. తల తిరిగినట్లనిపించింది . . . రాత్రంతా నిద్ర లేనందువల్ల కామోసనుకున్నాడు. అన్నిసార్లు రక్తం తీయడం వల్ల కూడా నేమోననుకున్నాడు.

రెవిన్యూ స్టాంప్ అంటించి ఉన్న రసీదు మీద వెయ్యి రూపాయలు ముట్టినట్లు జంగయ్య దగ్గర వేలి ముద్ర తీసుకుని, ఓ కవర్లో నోట్లు పెట్టి అతనికందించాడు క్యాషియర్. లెక్క పెడ్తే అందులో ఎనిమిది వందల రూపాయలే ఉన్నాయి.

"ఇదేమిటి ఎయ్యి రూపాయలిప్పిస్తామని కదా పిల్చుకొచ్చాడు . . . బోయనాల కర్సులన్నీ మీయేనట కదా . . . మరి రెండొందలు తక్కువున్నాయేం" తను లొట్టలేసుకుంటూ తిన్న భోజనానికి ఖరీదు కట్టి తీసేసుకున్నారేమోనన్న అలోచనకే అతనికి దుఃఖం వచ్చింది. అలాగని తెలిస్తే పచ్చి మంచినీళ్ళు తాక్కుండా ఆ రెండొందల్ని మిగుల్చుకునుండే వాణ్ణి కదా అన్పించింది.

"నువ్వు తిన్న భోజనాలు, పండ్ల రసాలు, ఫలహారాలు అన్నీ ఫ్రీనే. కానీ మిమ్మల్ని పిల్చుకొచ్చినందుకు ఒక్కొక్కరికి వంద రూపాయల చొప్పున ప్రసాద్‌కి కమీషన్ ఇవ్వాలి. మరో వంద నా కమీషన్ . . . మీరు పనికి రారని ముందే పంపించేయకుండా మీ రక్తం శ్యాంపిల్స్ సరిగ్గానే ఉన్నాయని చెప్పిన ల్యాబ్ టెక్నీషియన్‌కి ఇందులో షేర్ ఇవ్వాలి" క్యాషియర్ వంకరగా నవ్వాడు.

అతను మాట్లాడింది పూర్తిగా అర్థం కాకున్నా ఆ రెండొందలు మాత్రం రావని అర్థమైంది.

ఐనా సంతోషంగానే అన్పించింది. ఒకటిన్నర రోజు . . . శ్రమేమీ లేదు . . . హాయిగా పడుకోమన్నారు . . . ఓ మాత్ర మింగించారు . . . మధ్యమధ్యలో టీలు, టిఫిన్లు, పండ్ల రసాలు, చక్కటి భోజనం, చల్లటి గది . . . ఎనిమిది వందలు చేతికొచ్చాయి. చాలా బావుందనిపించింది.

బైటికి వస్తున్నప్పుడు మరోసారి వళ్ళు కొద్దిగా తూలింది.

రెండ్రోజులైనా పూర్తి కాకుండానే మమత ల్యాబ్స్ వాళ్ళిచ్చే రాచమర్యాదల్ని రెండోసారి అనుభవించడానికి తయారైనాడు. ఈ సారి జంగయ్య అనే పేరు రాయకుండా వేరే పేరు రాసుకుని వేలిముద్ర తీసుకున్నారు.

“అదేమిటి? మమ్మల్ని తెచ్చిన ప్రసాద్ నలభైసార్లు మాత్తర్లు మింగాడట కదా” శాంపిల్ తీసుకోడానికొచ్చిన అమ్మాయిని అడిగాడు.

ఆ అమ్మాయి జాలిగా చూసిందతని వైపు. వయసులో చిన్నదైనా ఆమె కళ్ళలో కరుణ కన్పిస్తోంది.

“అలా చెప్పబట్టే కదా మీరందరూ అతని మాటలు నమ్మి వచ్చారు. అతను మా కంపెనీ నియమించిన ఏజంట్. అంటే బ్రోకర్ అన్మాట. మిమ్మల్ని పిల్చుకొచ్చినందుకు కంపెనీ అతనికి ఒక్కో వాలంటీర్కి రెండొందలు చొప్పున కమీషన్ ఇస్తుంది”.

“మా ఎయ్యి రూపాయిల్లోంచా”.

అమె నవ్వింది. “అలాగని క్యాషియర్ చెప్పాడా? వాడో రక్తం పీల్చే జలగ . . . ఇక్కడందరూ జలగలే . . . వీళ్ళు పీలుస్తున్న మీ రక్తంతో పోలిస్తే నేను సిరంజితో తీస్కుంటున్న రక్తం నథింగ్ . . . బ్రోకర్లకు కమీషన్ కంపెనీయే చెల్లిస్తుంది. వెయ్యి రూపాయలు కేవలం మీ కోసమే”

కొద్దిసేపాగి ఆమె మెల్లగా హితోపదేశం చేస్తున్నట్లుగా చెప్పింది. “ఈసారి క్యాషియర్ డబ్బులు నొక్కేస్తే వూర్కోకు. గట్టిగా అడుగు . . . అవసరమైతే దెబ్బలాడి తీసుకో. బోల్డు రిస్క్ తీసుకుని సంపాయిస్తున్న డబ్బు . . . వీళ్ళు మీ ఆరోగ్యంతో ఆడుకుంటున్న విషయం మీ కర్థం కాదు. నా మాట విని మరోసారి రాకు. ఎలుకలు, గినియా పందుల మీద పరీక్షలు జరిపితేనే జీవకారుణ్య సంఘాల వాళ్ళు గొడవచేస్తున్నారు. వీళ్ళు ఏకంగా మీ ఆర్థిక బలహీనతని ఆసరాగా తీసుకుని మీమీద పరీక్షలు నిర్వహిస్తున్నారు”.

ఆమె మాటల్లో మరోసారి రావద్దు అన్నది స్పష్టంగా అర్థమై జంగయ్య కలవరపడ్డాడు. మరి తను సంపాయించాలి అనుకున్న నలభైవేలో . . .

"ప్రసాదు నలభై మార్లు మింగినా ఏంకాలేదట కదా" అన్నాడు.

"యిందాకటి నుంచీ చెప్తున్నది అదేకదా . . . ప్రసాద్ ఒక్కసారి కూడా ఈ బిళ్ళలు మింగలేదు. గొర్రెల మందల్లా వస్తున్న మిమ్మల్ని చూస్తుంటే జాలేస్తుంది. ఒక్కో వాలంటీర్‌పైన కంపెనీ దాదాపు రెండువేలు ఖర్చు చేస్తే, సదరు మందుల కంపెనీ నుంచి పన్నెండు వేలు వసూలు చేస్తుంది. అంటే ఒక్కొక్కరి మీద పదివేలు లాభం . . . మీరెన్ని సార్లు వస్తే అన్ని పదివేలు . . . మీ ఆరోగ్యాన్ని, మీ ప్రాణాల్ని పణంగా పెట్టి చేస్తున్న వ్యాపారం ఇది. దయచేసి మరోసారి రాకు" అందామె.

మరునాడు ఎనిమిది వందలు చేతిలో పెట్టిన క్యాషియర్‌తో జంగయ్య ఏమీ అనలేక పోయాడు. ఏమంటే ఏమొస్తుందో . . . చివరికి ఈ డబ్బు కూడా అందకుండా పోతుందేమోనన్న భయం . . .

ఎనిమిదినెలల కాలంలో జంగయ్య ఇరవైసార్లు వాలంటీర్‌గా వెళ్ళి – వాళ్ళిచ్చిన మాత్రల్ని వేసుకుని – రక్తం శాంపిల్స్ ఇచ్చి వచ్చాడు.

గాంధీనగర్‌లోని కాలువ పక్కన గుడిశెలోంచి మారి, అశోక్‌నగర్‌లో చిన్న రేకుల షెడ్డు అద్దెకు తీసుకున్నాడు. మమత ల్యాబ్ పుణ్యమా అంటూ భోజనానికి ఇబ్బంది లేకుండా గడిచిపోతోంది. వీలైనన్ని ఎక్కువసార్లు వెళ్ళి బోల్డంత డబ్బు సంపాయించాలన్న ఆశ అతన్లో . . . వారం దాటకముందే వెళ్తే రానివ్వటం లేదు గానీ లేకపోతే వారానికి మూడుసార్లయినా వెళ్ళి పిల్ల పెళ్ళి కోసం డబ్బులు జమ చేయాలన్న కోరిక . . .

జంగయ్యకు కొన్ని రోజులుగా నీరసంగా ఉంటోంది. ఆకలి మందగించింది. కొద్ది పనికి కూడా నిస్త్రాణ అన్పిస్తోంది.

ఆ రాత్రి వూపిరాడటం చాలా కష్టమైంది. ఉబ్బసం రోగికిమల్లే విలవిల్లాడిపోయాడు.

మరునాడు డాక్టర్ దగ్గరకెళ్ళాడు. డాక్టర్ క్షుణ్ణంగా పరీక్షించి "కిడ్నీలు పాడైనట్లు అనుమానంగా ఉంది. మొదట ఈ చీటీలో రాసిన టెస్టులన్నీ చేయించుకుని రా. ఎందుకైనా మంచిదని లివర్‌కి సంబంధించిన టెస్టులు కూడా రాశాను. లివర్ కొద్దిగా పెరిగినట్లు తెలుస్తోంది. రిజల్ట్స్ చూశాక మందులు రాసిస్తాను" అన్నాడు ప్రిస్క్రిప్షన్ స్లిప్ మీద చేయించుకోవాల్సిన పరీక్షలు రాస్తూ.

"ఈ పరీచ్చలన్నిటికి ఎంతవుద్ది డాట్రుగారూ" అతనికివ్వాల్సిన ఫీజు సమర్పించుకున్నాక అడిగాడు జంగయ్య.

"దాదాపు ఏడెనిమిది వందలైనా అవుతాయి. తొందరగా చేయించుకో. ఆలస్యంచేస్తే జబ్బు ముదిరే ప్రమాదముంది" అన్నాడు హెచ్చరికగా.

ఒక్కసారిగా అన్ని డబ్బులు ఎక్కడనుంచి వస్తాయి? జంగయ్యకు దిక్కు తోచలేదు. అతనికి అక్కరలో ఆదుకునే ఆప్తమిత్రుడిలా మమతా ల్యాబ్ గుర్తొచ్చింది. తను క్రితం సారి వెళ్ళి వారం దాటింది కాబట్టి పర్వాలేదు. ఏదో ఓ పేరు రాసుకుని వాలంటీర్‌గా తీసుకుంటారు.

మరునాడుదయం జంగయ్య ఉప్పల్ వెళ్ళే బస్ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

*(ఆదివారం వార్త - 17, ఆగస్టు 2003)*

★★★



Rupaye_Chettu.pm7 53 28/7/19, 12:03 AM

# వామనుడు

చాన్నాళ్ళ విరామం తర్వాత నా చిననాటి స్నేహితుల్ని కల్సుకోబోతున్నానన్న ఉద్విగ్నత . . . గాల్లో తేలిపోతున్న అనుభూతి . . . మనోహరమైన దృశ్య కావ్యంలా కళ్ళముందు కదుల్తూ . . . పాత జ్ఞాపకాల మధురిమ . . . మేం గోలీకాయలు ఆడినప్పుడు చేతులకంటిన మట్టి వాసన ఇప్పుడే వస్తున్నంత ఫ్రెష్‌గా . . . చింతతోపులో రాళ్ళు విసిరి నేల రాల్చిన చింతకాయల పులుపు గుర్తొచ్చి ఇప్పుడు నోట్లో నీళ్ళూరుతున్నాయి.

పదిరోజుల క్రితం రమణ నుంచి ఉత్తరం వచ్చినప్పటినుండీ హడావుడి . . . రమణా, నేను, రాము బాల్య స్నేహితులం. తోపులో బడిలో ఎలిమెంటరీ స్కూలు నుంచి కల్సి చదువుకున్నాం. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ చదువుకోసం రాము పిలాని వెళ్ళిపోయాడు. రమణ బి.కాం పాసైనాక, హైద్రాబాద్‌లో యం.బి.ఎ. చదివి, అక్కడే స్వంతంగా వ్యాపారం పెట్టాడు. నేను బి.యస్సీ పాసై, ఉద్యోగాల వేటలో విసిగిపోయి, చివరికి మేం చదువుకున్న ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా చేరాను.

ఒంగోలు నుంచి హైద్రాబాద్‌కు పది గంటల ప్రయాణం . . . రైల్లో కూచున్న క్షణం నుంచీ నా కొడుకు సిద్ధార్థని కబుర్లతో ముంచెత్తాను. వాడు నా వైపు ఆత్మీయంగా చూస్తూ “మరీ పసిపిల్లాడిలా ఆ సంబరమేమిటి నాన్నా” అన్నాడు.

“ఒరేయ్! మా స్నేహం వయసు నలభై యేళ్ళపైనే. చింతకాయ పచ్చడి పాతబడేకొద్దీ శ్రేష్ఠమౌతుంది. స్నేహం కూడా అంతే. జీవన సమరంలో తలమునకలై గత ఇరవై యేళ్ళుగా కల్సుకోలేకపోయాం. ఇపుడు మరికొన్ని గంటల్లో వాళ్ళను చూడబోతున్నానన్న వూహకే మనసు పులకరిస్తోంది” అన్నాను.

అలా అన్నానేగానీ మనసులో ఏదో మూల బెరుకు . . . దానిక్కారణం నాకూ, వాళ్ళిద్దరికీ ఉన్న స్థాయీ భేదం. రాము ఢిల్లీలో బాగా పేరున్న కంపెనీలో పెద్ద హోదాలో ఉన్నాడు. రమణ వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి పెద్ద పారిశ్రామికవేత్త అయినాడు. నేనే . . . బతకలేక



Rupaye_Chettu.pm7 54 28/7/19, 12:03 AM

బడిపంతులైనాను. రెండు మహావృక్షాల మధ్య బోన్సాయ్‌లా . . . కుంచించుకు పోయినట్లు కన్పిస్తానేమోనన్న భయం . . .

నాకు మల్లేనే నా కొడుకూ ఆత్మన్యూనతకు లోనై . . . కుదించుకుపోయి . . . మరుగుజ్జులా ఫీలై . . . మథన పడ్తాడేమోనని నా దిగులు.

వాడివైపు చూశాను. ఏదో పత్రిక చదువుతున్నాడు. డిగ్రీ అయిందనిపిచ్చాక ఇంకా పై చదువులు వద్దన్నాడు. ఉద్యోగాలూ చేయనన్నాడు. "ఒకరి కింద పనిచేసే ఉద్యోగాలు నాకు సరిపడవు నాన్నా. స్వతంత్రంగా చేయగలిగేవి రెండే. ఒకటి వ్యాపారం, రెండోది వ్యవసాయం. బిజినెస్ పెట్టుకునే స్థోమత మనకు లేదు. ఇక మిగిలింది వ్యవసాయం. నేను రైతుని కావాలనుకుంటున్నాను నాన్నా" అన్నాడు.

వర్షాభావం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులూ, రైతుల ఆత్మహత్యలు గుర్తొచ్చి "బాగా ఆలోచించుకునే నిర్ణయం తీసుకున్నావా? నువ్వు పెద్దవాడివైనావు. నీ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు నువ్వు తీసుకోవటమే మంచిది. ఎటొచ్చీ ఓ నిర్ణయం తీసుకున్నాక వెనక్కి తిరిగి చూసుకోకూడదు. ఎప్పుడూ పశ్చాత్తాప పడకూడదు" అన్నాను.

"బాగా ఆలోచించుకునే చెప్తున్నాను నాన్నా. ఫ్యాను కింద కూచుని ఫైళ్ళు చూసే పనికన్నా వ్యవసాయం చేయటమే నాకిష్టం. లాభనష్టాల మాటెలా ఉన్నా మనసుకు నచ్చిన పని చేసుకోటమే ఉత్తమం కదా" అన్నాడు. గత ఐదేళ్ళనుంచీ వాడు వ్యవసాయం చేస్తున్నాడు.

రమణ యింట్లో మా యిద్దరికీ సాదరస్వాగతం లభించింది.

గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు రమణ. బాగా లావైనాడు . . . పొడుచుకొస్తూ బొజ్జ . . . మెళ్ళో దిట్టమైన బంగారు గొలుసు . . . దానికో పులిగోరు . . . దట్టంగా పెరిగి, మెలితిరిగిన మీసాలు . . . దర్పం, ధనబలం ప్రతి కదలికలో ప్రస్ఫుటమౌతూ. . . .

రాము బాగా తెల్లబడ్డాడు. బట్టనెత్తి . . . రిమ్‌లెస్ చలువ కళ్ళద్దాలు . . . స్టయిల్‌గా ఉన్నాడు.

సాయంత్రం ఆరింటికి లాంజ్‌లో కూచుని, స్నాక్స్‌తోపాటు కాఫీ సేవిస్తూ కబుర్లలో పడ్డాం. రమణ, అతని భార్య, యిద్దరు కొడుకులు ఒకవైపు – రాము, అతని శ్రీమతి, కొడుకూ, కూతురూ మరోవైపు – నేనూ, సిద్ధార్థ యింకోవైపూ . . . వలయంలా కూచున్నాం. పచ్చటి తివాచీలా పర్చుకున్న విశాలమైన లాంజ్ . . . చుట్టూ రకరకాల అందమైన పూల మొక్కలు . . . ఎండాకాలపు సాయంత్రాల్లో వీచే మంద్రమైన చల్లటి గాలి . . . వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది.

"బాలక్రిష్ణ మేష్టారు ఫిజికల్ సైన్స్ పాఠాలు ఎంత అద్భుతంగా చెప్పేవాడో కదరా" అంటున్న రమణ నా వైపు తిరిగి "మన పిల్లల పరస్పర పరిచయాలు మర్చేపోయాంరా" అన్నాడు. తన కొడుకువైపు చూపిస్తూ – "వీడే మా పెద్దబ్బాయి సుధాకర్. బి.టెక్. ఇన్ ఎలక్ట్రానిక్స్. టి.సి.యస్. కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. రెండోవాడు దివాకర్. మెడిసిన్ ఫైనలియర్లో ఉన్నాడు. నాకెప్పుడూ ఒక డ్రీం ఉండేది. యిద్దరు పిల్లలు పుడితే ఒకర్ని ఇంజనీర్ని, మరొకర్ని డాక్టర్ని చేయాలని. నా కొడుకులిద్దరూ ఆ కోరిక తీర్చారు" అన్నాడు. అతని మాటల్లో సంతృప్తితోపాటు కించిత్తు గర్వం కూడా తొణికింది.

రాము తన పిల్లల్ని పరిచయం చేస్తూ "వీడు కిరణ్. సివిల్ సర్వీసెస్ రాసి ఐ.ఆర్.యస్. కేడర్‌కి సెలెక్టయినాడు. ఐ.ఎ.యస్. కావాలనేది వీడి జీవితాశయం. ఇంకా రెండు ఛాన్సెస్ ఉన్నాయి. ప్రయత్నిస్తున్నాడు. ఇక నా కూతురు ప్రణీత వెరీ బ్రిలియంట్. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం. నెలకు అరవైవేల జీతం" అన్నాడు.

నా వంతు రాగానే సిగ్గుతో ముకుళించుకుపోయాను. మహాకాయుల పాదాల దగ్గర నిలబడిన లిల్లీపుట్‌లా . . . అందరూ నావైపూ, సిద్ధార్థవైపూ చూస్తున్నారు. వాళ్ళ చూపు గుచ్చు కుంటూ . . . నత్తగుల్లలోకి నత్త ముడుచుకున్నట్లు నేను . . .

"మీ వాడు . . . పేరు సిద్ధార్థ అని కదూ చెప్పావు. ఏం చేస్తున్నాడో చెప్పరా" రమణ అడుగుతున్నాడు.

నేను తల వొంచుకోబోతున్నప్పుడు సిద్ధార్థ గొంతు ఖంగుమంటూ విన్పించింది.

"నేను వ్యవసాయం చేస్తున్నానండీ"

తలయెత్తి వాడివైపు చూశాను. వాడి కళ్ళు సంతృప్తితో మెరుస్తున్నాయి. నా మిత్రులిద్దరూ తమ పిల్లల గురించి ఎంత గర్వంగా చెప్పారో సిద్ధార్థ కూడా అంతే గర్వంగా తను రైతునని చెప్పుకున్నాడు. వాడిలో కించిత్తు కూడా ఆత్మన్యూనత కన్పించకపోవటం నాకు ఆనందాన్ని కలిగించింది.

పిల్లలకూ, ఆడవాళ్ళకి డిన్నర్ డైనింగ్ టేబిల్ మీద ఏర్పాటు చేసి – మా ముగ్గురికీ మాత్రం ప్రత్యేకంగా తన గదిలో ఏర్పాటు చేశాడు. స్కాచ్ విస్కీ బాటిల్ వోపెన్ చేశాడు రమణ. నా కొద్దన్నాను.

రమణ నవ్వి "నువ్వేమీ మారలేదురా. మనం ఇంటర్ చదువుకునే రోజుల్లో ఎలా ఉన్నావో ఇప్పుడూ అలానే ఉన్నావు. గత ఇరవై పాతికేళ్ళలో సమాజం ఎలా మారిపోయిందో గమనించావా . . . ప్రతిదానిలో వేగం . . . విపరీతమైన పోటీ . . . మనుషుల్లో

స్వార్థం . . . అంతా ప్రాక్టికల్ . . . మంచితనం, మానవత్వం, మట్టీమశానం అనుకుంటూ కూచుంటే మనం వెనకబడిపోతాం. మరొకడు మనల్ని నెట్టేసి, కింద పడేసి ముందుకెళ్ళిపోతాడు. జీవితంలో గెలుపు ముఖ్యం. గెలవాలంటే మనం ఎప్పుడూ ముందుండాలి" అన్నాడు.

వాళ్ళిద్దరూ రెండో రౌండ్‌లో ఉన్నారు. నేను గ్లాస్లోని కూల్‌డ్రింక్‌ని మెల్లగా చప్పరిస్తూ వాళ్ళు చెప్పేది వింటున్నాను.

రాము నావైపు జాలిగా చూసి రమణతో అన్నాడు. "ప్రశాంతత కోరుకునే వాడు నెంబర్‌వన్ కాలేడు. లక్ష్యాలు . . . పరుగు . . . వత్తిడి . . . మనవాడికివేవీ నచ్చవు కదరా. మన ఒంగోల్లోని తోపులో బడిలో ఎలిమెంటరీ క్లాస్ పిల్లలకు పాఠాలు చెప్పుకుంటూ సంతృప్తిపడి పోతున్నాడు. ఇపుడు మనమేం చెప్పినా వాడి చెవికెక్కదు".

వాడి మాటలకు మృదువుగా నవ్వి, కబుర్ల కాక్‌టెయిల్‌ని ఆస్వాదిస్తూ మిన్నకుండిపోయాను.

"అవున్రా. మనం ఇంటర్‌లో ప్రకాష్‌గాడి రూంకెళ్ళి చదూకునేవాళ్ళం కదా. వాడిప్పుడు ఏం చేస్తున్నాడు?" రాము అడిగాడు.

ప్రకాష్‌ది ఒంగోలు దగ్గర సంతనూతలపాడనే వూరు. రోజూ వూరెళ్ళి రావటం కష్టమని ఒంగోల్లో రూం అద్దెకు తీసుకుని చదువుకునేవాడు.

"వాడు ట్రంకు రోడ్డులో లేడీస్ ఎంపోరియం అనే షాపు పెట్టుకున్నాడు. బిజినెస్ బాగానే ఉన్నట్టుంది. ఈ మధ్యనే మరో షాపు తెరిచాడు" అన్నాను.

ఉన్నట్టుండి రాము పెద్దగా నవ్వాడు. ఆగి మరలా నవ్వాడు. ఈసారి తెరలు తెరలుగా నవ్వాడు.

నావైపు చూపిస్తూ "ఒరేయ్ రమణా . . . నీకు గుర్తుందిరా . . . వీడోసారి బోల్డు జాలిగుండెతో . . . మంచుముక్కలా కరిగిపోయి . . . ఓ ప్రాస్టిట్యూట్ మీద బోల్డంత సానుభూతి కురిపించి . . . ఏం చేశాడో గుర్తుందిరా" అంటూ మరలా నవ్వాడు.

రమణకూడా పెద్దగా శబ్దం వచ్చేలా నవ్వి "ఆ సంఘటన ఎలా మర్చిపోతాన్రా . . . అప్పట్నుంచే కదా మనం వీడికి కరుణామయుడని నిక్‌నేం పెట్టింది" అన్నాడు.

నాకా సంఘటన గుర్తొచ్చింది.

ప్రకాష్ అద్దెకుండే గది చాలా పెద్దది. దానికి పైన రెండు చిన్న గదులుండేవి. వాటిలో శర్మా కాలేజీలో డిగ్రీ చదువుతున్న కుర్రాళ్ళు అద్దెకుండేవారు.

ఆ రోజు రాత్రి పదకొండైనా నల్గురం చదువుకుంటున్నాం. మరో పదిరోజుల్లో పరీక్షలున్నాయి. గదిబైట వసారాలో నేను, రమణ చదువుకుంటున్నాం.

అప్పుడో మెరుపు మెరిసినట్లు మా ముందునుంచి వెళ్తున్న అమ్మాయి కన్పించింది. ఆమె సన్నగా, చాలా నాజూగ్గా ఉంది. విద్యుత్‌లా చలాకీగా ఉంది. తెల్లటి నైలాన్‌చీర మీద ఎంబ్రాయిడరీ చేసిన ఎర్రటిపూలు . . . జడలో తురిమిన మల్లెపూల గుబాళింపు . . . చకచకా మెట్లెక్కి వెళ్తున్నప్పుడు గలగలా నవ్వినట్లు కాలి మువ్వల రవళి . . .

మాకిలాంటి సీన్లు చూడటం అలవాటే. పైన అద్దెకున్న కుర్రాళ్ళు తరచూ అమ్మాయిల్ని ఇలా రూంకి తెచ్చుకుంటుంటారు. మేము మరలా పుస్తకాల్లో తలదూర్చి – సైన్స్ పాఠాల్లో మునిగిపోయాం.

గంటా గంటన్నర తర్వాత ఆ అమ్మాయి మెట్లు దిగుతూ కన్పించింది. అడుగుతీసి అడుగు పెట్టటం నరకంలా . . . ఒక్కో మెట్టు బరువుగా . . . బాధగా . . . దిగుతోంది. ఆమె వెక్కిళ్ళు రాత్రి నిశ్శబ్దాన్ని బలంగా చెదరగొడ్తూ . . . మనిషి వడలిపోయి, రేకులు చిదిమేసిన గులాబీలా ఉంది. శోక దేవతలా కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

నాకు గుండె పట్టేసినట్లయింది. "ఒరేయ్ రమణా . . . పాపం ఏడుస్తోందిరా. ఏం జరిగిందో కనుక్కుందాంరా" అన్నాను.

"నీకేమైనా పిచ్చా? మనకెందుకురా అయన్నీ. నాకు నిద్రొస్తోంది. వెళ్ళి పడుకుంటాను. నువ్వూ ఎమ్మట్నే రారా" అంటూ లేచి లోపలికెళ్ళిపోయాడు.

ఆమె మెట్ల చివర కూలబడి హృదయవిదారకంగా ఏడుస్తోంది.

రాము, ప్రకాష్ గడప దగ్గర నిలబడి చోద్యం చూస్తున్నారు. నా గుండె ద్రవించి పోతోంది.

"నాకు బాధనిపిస్తుందిరా. ఆమె ఏడుపుని చూడలేకుండా ఉన్నాను. ఆమెనలా ఏడ్పించినవాణ్ణి కసితీరా తన్నాలనిపిస్తోందిరా" అన్నాను వాళ్ళతో.

"ఆమెను బలవంతంగా ఎవరూ ఎత్తుకుని రాలేదుగా. వళ్ళమ్ముకుని బతికే బజారు ఆడది. తనిష్టపడేగా వచ్చింది. ఇపుడు అనుభవిస్తోంది. జాలి పడాల్సిన విషయం ఏముందిందులో" అన్నాడు రాము.

వాళ్ళ మాటలు ఖాతరు చేయకుండా ఆమె దగ్గరకెళ్ళి నిలబడ్డాను. తలవొంచుకుని కుమిలికుమిలి రోదిస్తున్న ఆమెను "ఏమండీ . . . ఎందుకేడుస్తున్నారు? ఏం జరిగింది?" అని అడిగాను.

"విన్నార్రా . . . ఏమండీ అట . . . వ్యభిచారం చేసేదైనా ఎంత గౌరవమో మన వాడికి . . . ఇంకా నయం. మేడం గారండీ అన్లేదు" రాము మిగతా ఇద్దరితో అంటూ ఎగతాళిగా నవ్వటం విన్పించింది.

ఆమె వెక్కిళ్ళను ఆపుకునే ప్రయత్నం చేస్తూ చెప్పింది. "ఒక్కణ్ణే ఉన్నానని . . . పాతిక్కి బేరమాడి పిల్సుకొచ్చాడు. మొత్తం నలుగురు . . . వంతులవారీగా . . . నా శరీరంతో ఆడుకుని . . . డబ్బులివ్వకుండా నీ దిక్కున్న సోట సెప్పుకో ఫో అన్నారు. కాల్లట్టుకుని బతిమాలుకున్నా కనికరం సూపలేదు బాబూ" అంటూ మరోసారి భోరుమని ఏడ్చింది. "యింటికాడ రెండేళ్ళ బాబున్నాడు. ఆడికి నిన్నటి నుండీ జొరం . . . యింట్లో సిల్లి గవ్వ లేదు. మందులకు లేకుంటే మానె ఆడికి బన్ను ముక్క కొనిపెడ్దామన్నా పైసా లేదు. మూడ్రోజుల్నించీ ఒక్క గిరాకీ లేదు బాబూ. ఆడొచ్చి పాతికిత్తానంటే ఆశపడ్డాను – పిల్లాణ్ణి డాట్టరుకాడికి పిల్చుకెళ్ళొచ్చనీ – ఆకలితో మలమల మాడుతున్న కడుపులో కాసిని గంజినీల్లయినా పోయొచ్చని . . . సేసింది ఎదవపని బాబూ. . . ఎవరికి సెప్పుకోను? పోలీసోడిని నాయం సేయమని అడగనా . . . నిన్నసలు సానిపని ఎవరు సేయమన్నారే అంటూ నా మక్కెలిరగదంతాడు. లేదా నాకాడ పడుకోయే . . . ఆ తర్వాత నీ ఇసయం ఆలకిస్తానంటాడు. ఎదవ బతుకైపోయింది బాబూ . . . ముదనష్టపు జనమ బాబూ" మరలా వలవలా ఏడ్చింది.

"ఇప్పుడే వస్తానుండు" అని రూం లోపలికెళ్ళాను. మిత్రులందరూ "ఏం చేయ బోతున్నావురా?" అని అడుగుతున్నా పట్టించుకోకుండా గోడకు వేలాడదీసి ఉన్న నా చొక్కా జేబులోంచి పదకొండు రూపాయలూ, మరికొంత చిల్లర పట్టుకెళ్ళి ఆమె చేతిలో పోశాను.

"నా దగ్గర యింతే ఉంది" అన్నాను గిల్టీగా . . .

ఆమె నా వైపు ఆశ్చర్యంగానో . . . ఆనందంగానో . . . ఆరాధనగానో చూసినట్లు గుర్తు.

"నా కంటే వయసులో సిన్నోడివైపోయావు. లేకుంటే సేతులెత్తి దండం పెట్టేదాన్ని" అందామె వెళ్ళబోతూ.

వాళ్ళిద్దరూ ఇప్పుడు ఐదో పెగ్గులో సోడా కల్పుకుంటున్నారు.

"నీ స్టూడెంట్స్ అందరికీ కొంపదీసి కరుణామయుడి కబుర్లే చెప్తున్నావా . . . ప్రాపంచిక విషయాలు . . . బతుకుదెరువుకు ఉపయోగపడే విషయాలు కూడా అప్పుడప్పుడూ చెప్తో ఉండు" అన్నాడు రమణ.

"స్టూడెంట్స్ విషయం తర్వాత. సిద్ధార్థని అపర బుద్ధుడిలా . . . దేనికీ కొరగాని పరమ పప్పుసుద్దలా చేసినట్లు అన్పిస్తోందిరా" అన్నాడు రాము

నేను మౌనంగా ఉండిపోయాను.

★ ★ ★ ★ ★

రెండ్రోజులు హాయిగా గడిచిపోయాయి.

ఉదయం ఆరున్నరకు రైలుంది. ఐదున్నరకు అలారం పెట్టుకుని పడుకున్నాం.

బైట ఏదో గొడవ జరుగుతున్నట్లనిపించి నిద్రాభంగమైంది. సమయం ఉదయం ఐదుంపావు. ఇంకా చీకట్లు పూర్తిగా తొలగిపోలేదు. ఆ శబ్దాలకు సిద్దార్థ కూడా లేచాడు.

రమణ గొంతు పెద్దగా విన్పిస్తోంది. అరుస్తున్నట్లు . . . చాలామంది ఒకేసారి మాట్లాడ్తున్నట్టు రణగొణ ధ్వని . . . గోలగోలగా . . .

మేమిద్దరం బైటికొచ్చాం. గేటు దగ్గర గుంపుగా జనం . . . రమణతో పాటు రాము కూడా కోపంగా ఏదో అంటున్నాడు.

విషయమేమిటో అర్థం కావటానికి కొంత సమయం పట్టింది. పనిమనిషి ఎప్పటి మాదిరిగానే ఉదయం ఐదింటికి యింటికొస్తూ గేటు దగ్గర ముతకచీరలో చుట్టి ఉన్న మూటని చూసి ఆగిపోయిందట. తీరా మూటని విప్పి చూస్తే అందులో కళ్ళు కూడా పూర్తిగా తెరవని పసిబిడ్డ . . . ఆడపిల్ల . . . ఎవరో కని వదిలేసి పోయిన పసిగుడ్డు . . . ఆకుపచ్చని ముతక చీరలో మూటలా చుట్టి, రమణ ఇంటి గేటు ముందు వదిలేసి వెళ్ళారెవరో . . . రమణకున్న వ్యాపార సంస్థల్లో పనిచేసేవాళ్ళ తాలూకు బిడ్డయి ఉంటుందని అనుకుంటున్నారక్కడ.

"ఈ ఛండాలాన్ని నా యింటి ముందు వదిలేసి వెళ్ళిందెవత్తె? అదెవరో తెలిస్తే దాన్ని నరికి పోగులు పెడ్తాను. ఆ దరిద్రపు ముండ సిగ్గుమాలిన పనేదో చేసింది చాలక, పిల్లని కని పడేసి పోతుందా . . . ఏ చెత్తకుండీలోనో పడేసి చావొచ్చుగా . . . నా యిల్లేమైనా ధర్మసత్రమనుకుందా ఎవడితోనో కులికి కని పడేసిన బాస్టర్డ్స్ అందర్నీ పోషించడానికి? వీళ్ళ కుళ్ళునంతా కడిగేసుకోటానికి నా యిల్లే దొరికిందా?" రమణ కోపంగా, ఆవేశంగా అరుస్తున్నాడు.

మిగతా బస్తీవాసులందరూ తలోరకంగా మాట్లాడ్తున్నారు.

నేలమీద పడుకోబెట్టి ఉన్న పాప గుక్కపట్టి ఏడుస్తోంది.

రాము కొడుకు – కాబోయే కలెక్టర్ కలుగచేసుకుని "తొందరగా పోలీసులకి కబురు పెట్టండంకుల్. వాళ్ళే చూస్కుంటారు. దీన్ని తీస్కెళ్ళి ఏ అనాథాశ్రమంలోనో వదిలేసి వస్తారు" అన్నాడు.

యిక్కడ యిన్ని కుటుంబాల వాళ్ళు గుమికూడి ఉన్నారు. ఇందులో పిల్లలు లేని దంపతులుంటారు. పిల్లలున్నా ఆడపిల్లలు లేని వాళ్ళుంటారు. ఆడపిల్లలున్నా దయార్ద్ర హృదయులూ ఉంటారు. ఒక్కరైనా ముందుకొచ్చి ఆ పిల్లని దత్తత తీసుకుంటే బావుంటుందనిపించింది. నా భార్య మూడు సంవత్సరాల క్రితం చనిపోకుండా ఉండి ఉంటే ఆ పని నేనే చేసి ఉండేవాణ్ణి.

"ఈ పిల్లని ఏ సానిముండ కని పడేసి, తన బిజినెస్‌కి అడ్డమని వదిలేసి పోయిందో . . . ఇది ఏ గూండాకో, రౌడీకో, ఖూనీకోరుకో పుట్టిన సంతానమేమో ఎవడికి తెలుసు. చూస్తూ చూస్తూ రోడ్డుమీద పడేసిన పెంటని ఎత్తుకుని నెత్తికెవరు రాసుకుంటారు? ఇలాంటి పిల్లల్ని అయ్యో పాపమని చేరదీస్తే మన సంసారాలు మట్టిగొట్టుకు పోతాయి" అన్నారెవరో గుంపులోంచి.

"ఆసలే ఆడపిల్ల. పెంచటమే కష్టమనుకుంటే పెళ్ళీ పెటాకులు చేయటం మరో తద్దినం . . . అసలు ఆడపిల్ల కాబట్టే ఆ తల్లి వద్దనుకుని వదిలించుకుందేమో . . . కన్న తల్లికే కడుపుతీపి లేనపుడు మనకేం పట్టింది" మరొకతను అన్నాడు.

"అర్జెంట్‌గా ఈ అసహ్యాన్ని ఇక్కడ్నించి తీసెయ్యండి. చూస్తుంటేనే కంపరంగా ఉంది. డర్టీపిగ్స్ . . . రోగ్స్ . . . " రాము అరుస్తున్నాడు.

నా పక్కనే నిలబడి ఉన్న సిద్ధార్థ నన్ను దాటుకుని ముందుకెళ్ళాడు. గుక్కపట్టి ఏడుస్తున్న పాపని భుజానికెత్తుకున్నాడు.

"ఈ పాపని అనాథని చేసిన సమాజం సిగ్గుతో తల వొంచుకోవాలి. కళ్ళైనా పూర్తిగా తెరవని పసికందుని వదిలేసి వెళ్ళే పరిస్థితుల్ని ఆ తల్లికి కల్పించిన వ్యవస్థని మనం తప్పు పట్టాలి. పాపని వదిలేసే క్షణంలో ఆ తల్లి ఎంతటి కడుపుకోతని అనుభవించి ఉంటుందో మనకేం తెల్సు? ఎవ్వరూ పుట్టుకతో తప్పుడు మనుషులు కారు. తప్పటడుగులు వేసేప్పుడే సరిదిద్దగలిగితే ఎవ్వరూ తప్పులు చేయరు. ఈ పాపని నేను పెంచుకుంటాను" అన్నాడు.

రమణ, రాము, వాళ్ళ పిల్లలూ సిద్ధార్థవైపు ఓ పిచ్చివాణ్ణి చూస్తున్నట్లు చూస్తున్నారు.

నా కళ్ళకు వాడు భూమినీ, ఆకాశాన్ని రెండు పాదాల్తో ఆక్రమించుకున్న వామనావతారంలా ఉన్నాడు.

మా వూరికి బయల్దేరే ముందు వీడ్కోలు తీసుకుంటూ నా మిత్రుల వైపు గర్వంగా చూశాను.

ఈసారి నన్నెవరైనా 'నీ కొడుకుని డాక్టర్ని చేశావా? ఇంజనీర్ని చేశావా లేక కలెక్టర్ని చేశావా' అని అడిగితే వెంటనే తల యెత్తుకుని సమాధానం చెప్తాను. "నా కొడుకుని మానవత్వం ఉన్న మనిషిని చేశానని".

*(ఆంధ్రభూమి, ఆదివారం 18 జనవరి 2004;*
*సంక్రాంతి కథల పోటీలో రెండో బహుమతి పొందిన కథ)*

★★★

# శిథిల శిల్పాలు

తాం డూర్‌లో ఉదయం ఆరింటికి బయల్దేరితే హైద్రాబాద్ చేరుకునేప్పటికి ఎనిమిదింబావైంది. అప్పట్నించీ బంజారాహిల్స్ అనబడే రాతి సముద్రంలో పడి, శ్రీనివాసరావనే శాస్త్రీ కోసం వెతుక్కుంటున్నా.

మైదానాల్లా విస్తరించిన ప్రదేశాలూ . . . రాతి వనాల్లా అందంగా, హుందాగా తలయెత్తి నిలబడిన భవంతులూ . . . పెద్ద పెద్ద గేట్లూ . . . చప్పుడైతే చాలు భీకరంగా మొరిగే కుక్కలు . . . ఘాట్ రోడ్లను తలపించేలా ఎత్తుపల్లాలు . . . వీటన్నిటికి తోడు నెత్తిని మాడ్చేస్తున్న ఎండా . . .

ఐనా పట్టువదలని విక్రమార్కుడిలా తిరుగుతూనే ఉన్నా . . . ఎదురు పడిన వాడినల్లా వాకబు చేస్తూనే వున్నా . . . ఎక్కువ మంది ఎగాదిగా నా వైపు చూసి “తెల్వదు” అని వెళ్ళిపోయినోళ్ళే . . . వాళ్ళే నయమనిపించేలా కొందరైతే “శ్రీనివాసరావా? ఏ శ్రీనివాస రావూ . . . ” అంటూ నింపాదిగా మాటల్లోకి దిగుతున్నారు. నేను “ఫలానా” అనటమే ఆలస్యం “ఏం చేస్తుంటాడూ?” అంటూ ప్రశ్నని సంధిస్తారు. సమాధానం వచ్చీరాకముందే, “ఇంటి నంబరెంతా?”, “ఏమైనా కొండ గుర్తులుతెలుసా?” లాంటి ప్రశ్నల శరపరంపర . . . అన్నిటికీ ఓపిగ్గా చెప్పిన సమాధానాలు విన్నాక, ఓసారి ఆకాశం వైపుకూ, మరోసారి నా మొహంలోకి చూసి, “ముందుకెళ్ళి . . . అదుగో . . . అక్కడ అడిగి చూడు” అంటూ ఉచిత సలహా . . .

“ఆగే జాకే పూఛో”కి అంతమెక్కడో తెలీక అవస్థ... తిరిగి తిరిగి నీరసం . . . సమయం పన్నెండు గంటలు కావస్తోంది. చిన్నగా మొదలై బంజారాహిల్స్ అంత విశాలంగా వ్యాకోచించిన ఆకలి . . .

ఆదివారం కావటం వల్ల పోస్ట్‌మేన్‌ని ఎలాగోలా పట్టుకుని ‘నీవే తప్ప నితః పరం బెరుగ’ అనటానికి అవకాశం లేదాయె . . . తిరిగి వెళ్ళిపోదామని శరీరం మొరాయిస్తున్నా మనసొప్పటం



Rupaye_Chettu.pm7 62 28/7/19, 12:03 AM

లేదు. ఇంత దూరం వచ్చి, ఇన్ని గంటలు వెదికాక సదరు శ్రీనివాసరావుని కల్సుకోకుండా వెళ్ళటం సబబు కాదనిపించింది.

మరలా కాళ్ళీడ్చుకుంటూ యింటి నెంబర్లను చూసుకుంటూ బయల్దేరాను. ఓ ఫర్లాంగు నడిచాక కొంగలా మెడ చాచి నడుస్తున్న ముసలాయన్ని ఆపి అడిగాను.

"ఓ . . . అతనా . . . పురావస్తు శాఖలో పని చేస్తున్నాడనుకునేవాణ్ణి . . . కాదు పాత వస్తువుల్ని బోల్డు డబ్బు తగలేసి కొంటాడట . . . అదో పిచ్చి . . . పొరపాట్న అతనింటికెళ్ళానోసారి . . . ఇల్లంతా పాత సామాన్లని భద్రపరిచే గదిలా ఉందంటే నమ్ము . . . వూపిరాళ్ళా . . . అదుగో అటు వైపున నాలుగో ఇల్లే" అన్నాడు అదోలా నవ్వుతూ.

మరో సందర్భంలో అయితే అతని అతి వాగుణ్ణి భరించలేక పోయేవాడినేమో . . . కానీ ప్రస్తుతం నాక్కావలసిన యిల్లు చూపించడమే కాకుండా, నేను కలుసుకోబోయే వ్యక్తి గురించి కొంత సమాచారం అందించినందుకు సంతోషపడ్తూ ఆ యింటి వైపుకు నడిచాను.

గేటు దగ్గరున్న కాలింగ్ బెల్ నొక్కబోయి భయం భయంగా చూశాను . . . 'కుక్క ఉన్నది జాగ్రత్త' అనో, 'బివేర్ ఆఫ్ డాగ్స్' అనో బోర్డు కన్పిస్తుందేమోనని వెతికాను . . . కన్పించలా.

కొంగ మెడతను చెప్పినదాన్ని బట్టి చూస్తే ఈ ఇంట్లో సింహం అంత పెద్దదో, పులిలా పైనబడి చీల్చి చెండాడే బాపతు కుక్కనో ఉండే అవకాశం లేదు . . . మరీ ముసలిదై పోయి– మొరగడానికి కూడ ఓపిక లేనంత ముసల్ది . . . యజమానిని చూసి తోకాడించడానికి కూడా సత్తువ లేని . . . కళ్ళు కనిపించని . . . చెవులు వినిపించని . . . ముసలికుక్క . . . ఉండాలి. ఆ ఆలోచనకే నవ్వొచ్చింది.

బెల్ మోగించాను. తాపీగా వచ్చి 'ఎవరు కావాలి?" అంటూ పనిమనిషి అడుగుతుందను కుంటే నా అంచనాని తారుమారు చేస్తూ నలభై ఐదో, యాభయ్యో వయసున్న వ్యక్తి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. చెట్టంత మనిషి . . . కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. మీసాలు గుబురుగా వుండి చివర్లు మెలితిరిగి వున్నాయి. మిలిట్రీలో మేజర్లా వున్నాడు . . . ఖరీదైన వాసన . . . పెళపెళలాడే కొత్త వంద రూపాయల నోటులా... మడతలు నలక్కుండా . . .

కళ్ళతోనే 'ఎవరు కావాలి?' అన్నట్లు ఉరిమాడు.

"నమస్కారం సార్! నా పేరు సుధాకర్. శ్రీనివాసరావుగార్ని కలుసుకోవాలి" అన్నాను వీలైనంత వినమ్రంగా.

వెంటనే అతన్లో అనూహ్యమైన మార్పొచ్చింది. కళ్ళు సంతోషంతో మెరిశాయి . . . మొహం

నిండా నవ్వు వ్యాపించింది.

గేటు తీసి నన్ను కౌగిలించుకున్నంత పని చేశాడు.

"మీ కోసమే ఎదురు చూస్తున్నా.. రండి లోపలికి" అన్నాడు.

నేను కొద్దిగా కంగారుపడ్డాను. నా కోసం ఎదురు చూడట మేమిటి?

నేనొస్తున్నానని ఇతనికెలా తెల్సింది? పురాతన వస్తువులంటే ఇష్టంతో పాటు మేజిక్కులు . . . మనోబలంతో భవిష్యత్తుని దర్శించటం . . . మాయలు . . . మంత్రాలు వచ్చేమోనని అనుమానం కలిగింది.

డ్రాయింగ్ రూమ్‌లో మెత్తటి తివాచీ మీద అలంకరించిన అందమైన సోఫాలో కూచోబెట్టాడు. మంచీ మర్యాదా తెలిసిన వ్యక్తి అనుకుని సమాధానపడ్డాను.

గది నిండా అలంకరించిన అద్భుతమైన శిల్పాలు . . . మూలల్లో నిల్చున్న గంధర్వ, యక్షిణి, కిన్నెర, కింపురుష జాతి సుదతుల నిలువెత్తు రాతి విగ్రహాలు . . . గోడలకు పొయిటిక్‌గా అమర్చిన అజంతా, ఎల్లోరా శిల్ప సౌందర్యాన్ని తలపించే పడతుల కళాఖండాలు . . . అప్పుడెప్పుడో నాగార్జునసాగర్ వెళ్ళినప్పుడు అక్కడి మ్యూజియంలో చూశానిలాంటి రాళ్ళలోంచి జాలువారే సౌందర్యాన్ని . . . రాతి అక్షరాలతో పొదిగిన కమ్మని కవిత్వాన్ని . . . ప్రాచీనశిల్ప సంపదతో అలంకరించిన మ్యూజియం గదిలో కూచున్న అనుభూతి నాకు . . .

అతను నా సంభ్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తూ అదోలా గర్వంతో తడిసిన నవ్వు నవ్వాడు.

"నాకు ఏంటిక్స్ అంటే చిన్నప్పటినుండీ అమితమైన ఆసక్తి. పాత వాటిని పారేయటం నచ్చదు. నేను నాలుగో తరగతిలో ఉన్నప్పుడు మా నాన్న కొనిచ్చిన ఇంకు పెన్ను నా దగ్గర ఇంకా భద్రంగా ఉంది తెలుసా! ఇలాంటివి ఇష్టం కాబట్టే నాన్న ఉద్యోగంలో చేరమన్నా వినకుండా బషీర్‌బాగ్‌లో ఏంటిక్స్ షాపు పెట్టాను. అదృష్టం కలిసొచ్చి వ్యాపారంలో రాణించాను. సో . . . ఈ ఇల్లు, ఆస్తి, అంతస్తు . . . అన్నీ ఏంటిక్స్ చలవే" – నిశ్శబ్దంగా పని చేసుకుపోతున్న ఎయిర్ కండిషన్ మెషిన్ కన్నా చల్లగా నవ్వాడతను.

ఇవన్నీ నాకెందుకు చెప్తున్నాడో అర్థంకాని అయోమయ పరిస్థితి నాది.

కాఫీ వచ్చింది. అసలే ఆకలిగా వుండటం వల్ల ఆ వాసనకే ప్రాణం లేచొచ్చింది. 'ఎంతటి మర్యాద!' – అనుకోకుండా ఉండలేక పోయాను.

"కింద ఆరు గదులు, పైన ఆరు గదులూ ఉండేట్టు కట్టించిన ఇల్లిది. పై పోర్షన్‌లో నేనూ, నా సంసారం. కింది పోర్షన్‌లో ఇదిగో . . . యిలా నేను సేకరించిన ప్రాచీన వస్తువులు, కళా ఖండాలు . . . ఇవి భద్రపరచడానికే వినియోగిస్తున్నా. మీరు కాఫీ తాగాక అన్ని గదులలో

ఉన్న నా కలెక్షన్ చూపిస్తాను” అన్నాడతను.

అందులో ‘తొందరగా కాఫీ తాగు’ అనే శ్లేష ధ్వనించి – నోరు కాలుతున్నా గటగటా తాగేశాను.

ఇతను ఇవన్నీ నాకెందుకు చూపించాలనుకుంటున్నాడో అంతుబట్టటం లేదు. అంత కష్టపడి సేకరించిన వస్తువుల్ని పదిమందికీ చూపించి తృప్తిపడే మనస్తత్వం అనుకుంటా. ఎందుకైనా మంచిదని నా భుజానికి వేలాడ్తున్న ఖద్దరు సంచిలోంచి అతనికి ఇవ్వాల్సిన వాటిని తీయబోయాను.

“అప్పుడే తొందరేమొచ్చింది? తర్వాత ఇద్దురుగానీ. మొదట నా కలెక్షన్స్ చూపిస్తాను రండి” అన్నాడు.

నాకు తప్పలేదు. కాఫీ ఋణం ఉండిపోయింది కదా . . .

డ్రాయింగ్ రూంని ఆనుకుని ఉన్న విశాలమైన గది నిండా రకరకాల నాట్య భంగిమల్లో ఉన్న శిల్ప సుందరీ మణులు . . .

“ఇవన్నీ సేకరించడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? అదుగో . . . ఆ శిల్పం ఉంది చూశారూ. కుడి చేయి విరిగి పోయి . . . నడుం దగ్గర పగిలిపోయి . . . శాతవాహనుల కాలం నాటిది. బోల్డు డబ్బు పోసి కొన్నాను” అన్నాడు.

మరో గదిలోకి పిల్చుకెళ్ళాడు. అక్కడ చాలా అందమైన పట్టెమంచం ఉన్నది. ఎర్ర చందనంతో చేసిన పట్టె మంచం . . .

“ఇది ముత్తాతల కాలం నాటి మంచం . . . చూశారా . . . ఇప్పటికీ ఎంత గట్టిగా వుందో . . . దీని కోళ్ళు చూశారా . . . ఎంతందంగా చెక్కారో . . . కోళ్ళకు పై భాగాన సింహం తలలు చూశారా . . . వాటి జూలు . . . ఆ నగిషీలు . . . అప్పటి కళాకారుల నైపుణ్యం తెలుస్తుంది కదూ” అన్నాడు.

మరో గది నిండా రకరకాల గడియారాలున్నాయి. ఇసుక గడియారాలు, నీడ గడియారాలు, ఎనిమిదడుగుల ఎత్తున్న గడియారం, రకరకాల రూపాల్లో వింత వింత గడియారాలు . . . టెలిఫోన్ కనుక్కున్న కొత్తలో వాడిన గొట్టాల్లాంటి పరికరం.. గ్రామఫోన్ రికార్డు, భోషాణం పెట్టెలా ఉన్న పాతకాలం నాటి రేడియో.

మరో గదిలో రకరకాల కత్తులూ, డాళ్ళూ, ఇనుప కవచాలూ, కచ్చడాలూ . . .

కొన్ని నాణాల్ని చూపిస్తూ, “వీటిని పెదవేగి వెళ్ళినప్పుడు ఓ ముసలాడి దగ్గర చూశాను. ఎంత ప్రలోభపెట్టినా అమ్మడే . . . నేను వదుల్తానా . . . సాలార్‌జంగ్ అంత కాకున్నా నేను

కూడా ఛోటా మోటా ఏంటిక్ కలెక్టర్ని కదా . . . నాలుగు మాయ మాటలు చెప్పి, డబ్బుతో పాటు ఓ బాటిల్ స్కాచ్ విస్కీ సమర్పించుకుని వీటిని స్వంతం చేసుకున్నా" అన్నాడు.

నేను ఆ గదుల మాయాజాలంలో – మిస్టిసిజంలో లుప్తమైపోయాను.

అన్ని గదుల్లో ఉన్న పురాతన వస్తు సంగ్రహాన్ని చూడటానికి దాదాపు గంట పైనే పట్టింది.

తిరిగొచ్చి డ్రాయింగ్ రూంలో కూచున్నాక అన్నాడతను – "మనం పాతవని పారేసే వాటి విలువ నేటి మనుషుల్లో చాలా మందికి తెలీదండి. పాత చింతకాయ ఎంత శ్రేష్ఠమో మీకు తెల్సు కదా . . . పాత బంగారంలో ఉన్న నాణ్యత కొత్త దాంట్లో ఉంటుందా చెప్పండి? అందుకే 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అన్నారు. మీ సంస్థ జరుప తలపెట్టిన అతి పెద్ద ఏంటిక్ ఎగ్జిబిషన్‌కి నన్ను ఆహ్వానించటం సంతోషంగానూ, గర్వంగానూ ఉంది. మీరు వచ్చే ముందే మీ బాస్ వరప్రసాద్ గారు ఫోను చేసి మీ ద్వారా ఇన్విటేషన్ పంపిస్తున్నట్లు చెప్పారు."

నేను శూన్యంగా అతని వైపు చూశాను. శిలాశాసనాలు రాసిన ప్రాకృత భాషలో మాట్లాడినట్లున్నాడు. అందుకే ఒక్క ముక్కా అర్థం కాలేదు.

అతను అసహనంగా కదిలాడు.

"ఇన్విటేషన్ తెచ్చినట్లున్నారుగా – ఇచ్చేయండి" అన్నాడు.

"ఏం ఇన్విటేషన్?"

"మీ పేరు సుధాకర్ అని కదా చెప్పారు."

"అవును."

"మిమ్మల్ని వరప్రసాద్‌గారు పంపలేదా?"

"ఆయెనెవరో నాకు తెలియదు"

అతని మొహం వివర్ణమయింది. క్రోధం కోరలు సాచింది.

"మరి ఆ విషయం ముందే చెప్పి ఉండొచ్చుగా . . . బెల్లం కొట్టిన రాయిలా ఉలుకూ పలుకూ లేకుండా . . . నా చేత వాగించావు."

అతను ఏక వచన ప్రయోగంలోకి దిగాడు. మొహంలో రంగులు వేగంగా మారుతున్నాయి. ఓ రకమైన నగ్న క్రూరత్వం కనిపిస్తోందిప్పుడు. ఇందాకటి నుండీ ఏ ముసుగులో దాచుకున్నాడో ఈ మొహాన్ని...

"మీరు చెప్పే అవకాశం ఇవ్వలేదండీ . . . క్షమించాలి . . . నేను తాండూర్‌లో ఉన్న 'సరస్వతీ వృద్ధాశ్రమం' నుండి వచ్చాను" అన్నాను.

"ఏం పని?" అతనిలో కోప ఛాయలు . . . ఏ క్షణమైనా గెటవుట్ అనేట్టుంది అతని వాలకం.

"మీ అమ్మగారు వారం రోజుల క్రితం చనిపోయారు. ఆమె చివరి కోరిక మేరకు మీకందించాల్సిన వాటిని ఇచ్చిపోదామని వచ్చాను."

ఆ వార్త విని అతను దుఃఖపడ్తాడని ఊహించాను. ఇంత ఆస్తి, అంతస్తు ఉన్నప్పటికీ తల్లిని అనాథాశ్రమంలో వదిలి, చివరి చూపుకు కూడా నోచుకోనందుకు బాధతో కుమిలిపోతా డనుకున్నాను. పాత వస్తువులంటే ప్రాణం అని నా దగ్గర గంట సేపు ఉపన్యాసం దంచిన వ్యక్తి – ప్రాణమున్న ముసలి తల్లిని నిర్దయగా బైటికి విసిరేసినందుకు నా ముందు సిగ్గుతో, అవమానంతో చితికిపోతాడనుకున్నాను.

నన్ను మరోసారి విస్మయపరుస్తూ అతను భావ రహితంగా ఉండిపోయాడు.

ఆ అవకాశాన్ని జారవిడవకుండా నేను చెప్పాలనుకున్న నాలుగు మాటల్ని చెప్పడానికే నిర్ణయించుకున్నాను.

"మీ అమ్మగారు పదేళ్ళ క్రితం ఆశ్రమంలో చేరినప్పటి నుంచీ తనతో పాటు ఓ జీవచైతన్యాన్ని తీసుకు వచ్చారు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ మిగతా వృద్ధుల్లో ఉత్సాహాన్ని నింపేవారు. ఎవరికి చేతనైన పని వాళ్ళ చేత చేయించి ఆశ్రమానికి ఆదాయం వచ్చే రకరకాల మార్గాలను అన్వేషించేవారు.

ఈ పదేళ్ళ కాలంలో ఆమె మీ గురించి ఎప్పుడూ చెడుగా మాట్లాడలేదు. ఎవరైనా కదిపినా మృదువుగా మాట దాటేసేవారు తప్ప మీ మీద ఈగ వాలనిచ్చేవారు కాదు.

ఆశ్రమం పెట్టినప్పటినుంచీ దానికి సంబంధించిన ఎకౌంట్స్ చూసుకోవడానికి నేను నియమించబడ్డాను. బైటి పనులేమైనా ఉంటే ఇన్‌మేట్స్ అందరూ నాకే చెప్తారు.

మీ అమ్మగారు అద్భుతమైన పెయింటింగ్స్ వేసేవారు. అంత గొప్ప కళాహృదయం ఉండబట్టే ఆమె కొడుకైన మీకు ఏంటిక్స్‌లో అందాల్ని వెతుక్కునే నైపుణ్యం అలవడిందనుకుంటాను.

ఆమె వేసిన పెయింటింగ్స్‌ని అమ్మగా వచ్చిన ఆదాయంలో సగం మా ఆశ్రమానికి ఇచ్చేవారు. మిగతా సగం మీ కోసమని బ్యాంకులో జమ చేసేవారు. "నా సంపాదన నా ఒక్కగానొక్క కొడుక్కి చెందాలన్న కోరికతో దాచి పెట్టటంలో ఎంత సంతృప్తి ఉందో నీకు తెలుసా?" అనేవారు నాతో.

గత ఎనిమిది నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడ్డారు. ఆ సమయంలో మీకు ఎన్నో ఉత్తరాలు రాశారు. మిమ్మల్ని ఒక్కసారి చూడాలని ఉందనీ – ఆ తర్వాత తృప్తిగా చనిపోతాననీ

అనేవారు. ఓ పాతిక వరకూ ఉత్తరాలు రాసి ఉంటారు. నాకు గుర్తుంది – వాటిని పోస్ట్ చేసింది నేనే.

అవసానదశలో ఆమె మీ రాక కోసం అలమటించారు. చూపు ఎప్పుడూ గది తలుపు వైపే ఉండేది. ఏ చిన్న అలికిడైనా 'శీను వచ్చాడా' అని అడిగేవారు. ఎవరి పాదాల శబ్దం విన్నా 'అదుగో మా శీనూనే . . . నన్ను చూడటం కోసం వస్తున్నాడు' అనేవారు.

లేవలేని స్థితిలో ఉండి కూడా ఆమె మీ కోసం ఓ పెయింటింగ్ వేశారు. పక్షవాతంతో కుంచె పట్టుకోలేకపోయినా నా సహాయంతో అతికష్టం మీద పూర్తిచేసిన అపురూప కళాఖండం అది.

చనిపోయే రోజు డెలీరియంలో కూడా ఆమె కలవరించిన పేరు 'శీనూనే'.

ఆమె చివరి కోరిక ప్రకారం బ్యాంకులో జమ చేసిన డబ్బుకి మీరు హక్కుదారులని తెలిపే పత్రం ఇది."

సంచిలోని కాగితం తీసి టేబుల్ మీద పెట్టాను. దాంతో పాటు బ్యాంకు ఖాతా పుస్తకం కూడా పెట్టాను.

"ఇది ఆమె మరణ ధృవీకరణ పత్రం. ఇది ఆమె చివరిగా వేసిన పెయింటింగ్. చూశారా . . . ఇందులో శిథిలమైన భవంతీ, కూలిన గోడలు చిత్రించబడ్డాయి. యిది క్షీణించిన ఆమె శరీరానికి ప్రతీక . . . ఆ భవంతిలో మినుకు మినుకుమంటూ ఓ చిన్న దివ్వె కన్పిస్తుంది చూశారా... అది మీ రాక కోసం అణగారిపోతున్న ఆశతో ఎదురుచూస్తున్న ఆమె ప్రాణం . . . పైన అనంతమైన ఆకాశం చిత్రించబడింది చూశారా . . . ఆమె అంతలా మీ కోసం ఎదురు చూశారు.

మీ ఇంటి నిండా అద్భుతమైన కళాఖండాల్ని సేకరించి పెట్టుకున్న మీ రసజ్ఞతకు జోహార్లు. ఇవన్నీ నిర్జీవ కళాకృతులే. మా ఆశ్రమంలోని వృద్ధులందరూ శరీరం శిథిలమైన సజీవ మూర్తులు.

మీరీ విషయాన్ని ఎప్పటికైనా గుర్తిస్తే మీ అమ్మగారి ఆత్మ శాంతిస్తుంది. శెలవు."

సంచి భుజానికి తగిలించుకుని లేచాను. బైటికి వెళ్ళబోతూ గడప దగ్గర ఓ క్షణం నిలబడి వెనక్కి తిరిగి చూశాను.

ఆ గదిలో అతని చుట్టూ అలంకరించబడి ఉన్న నల్లరాతి విగ్రహాల మధ్య అతనూ ఓ రాతి విగ్రహంలా కనిపించాడు.

*(రచన ఇంటింటి పత్రిక, జనవరి 2004; 'తెలుగు పలుకు' తానా రజతోత్సవ సంచిక)*

★★★

# తలాక్

ఇబ్రహీంకి ఆ రోజు చాలా సంబరంగా ఉంది.

తను ఎంతటి కళాకారుడో తనవాళ్లకు చాటుకునే అవకాశం వచ్చిందతనికి. దాన్ని జారవిడుచుకోకుండా చాలా పకడ్బందీగా అన్ని సన్నాహాలు పూర్తి చేశాడు. ప్రతిపనినీ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించుకున్నాడు.

ఆ రోజు 'తలాక్' నాటకం ప్రదర్శన మొదటిరోజు. దానికి రచనా, దర్శకత్వం అతనే. అందులోని ముఖ్య భూమికని పోషిస్తుంది కూడా అతనే.

నగరంలోని ముస్లిం ప్రముఖులందరికీ ఆహ్వానాలు అందాయి. గత దశాబ్దకాలంగా ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు మెంబర్ ఖాజా మొహియుద్దీన్ గారూ, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్, మిగతా మెంబర్లూ, సహాయమంత్రి హోదాలో ఉన్న ఫరూక్‌గారూ . . . చాలామంది వచ్చారు.

ముందు వరుసల్లో కూచున్న వాళ్లందరూ అరవైపైబడిన ముస్లిం పెద్దలే. పురప్రముఖుల్ని దగ్గరుండి తోడ్కొని వెళ్ళి ఉచిత స్థానాల్లో మర్యాదపూర్వకంగా కూచోబెడ్తున్న ఇబ్రహీంకి ఫజులుల్లా గారు వస్తూ కన్పించారు. వారి వయసు డెబ్భైపైనే ఉంటుంది. చేతికర్రని వూతంగా తీసుకుంటూ మెల్లగా నడిచి వస్తున్నారు. ఇబ్రహీంకి చిన్నప్పుడు ఉర్దూ నేర్పిన ఉస్తాద్ ఆయనే.

కృష్ణాజిల్లా వాస్తవ్యుడైన ఇబ్రహీంకి చిన్నప్పటినుంచీ తెలుగు చక్కగా అబ్బింది. ఉచ్ఛారణ కూడా స్పష్టంగా, స్వచ్ఛంగా ఉండేది.

"ఇబ్రహీం బేటా – థోడా ఉర్దూ, అరబ్బీ భీ సీఖో . . . మన మాతృభాషని మనం నిర్లక్ష్యం చేయకూడదు. చదవటం, రాయటం రాకపోతే ఎలా? మన పవిత్ర గ్రంథం ఖురాన్ పారాయణం చేయటం కోసమైనా నాలుగు ముక్కలు నేర్చుకోనాయనా" అనేవారు ఫజులుల్లా.

తన ఝోపడీలో ఉదయం, సాయంకాలం పిల్లల్ని పోగేసి, ఉచితంగా ఉర్దూ, అరబ్బీ నేర్పేవారాయన. ఎంత పేదరికంలో ఉన్నా, ఎవ్వరి దగ్గరా డబ్బులు తీసుకునేవారు కాదు. ఎవరైనా ఇవ్వబోయినా "అల్లా పర్‌వర్‌దిగార్ కనికరం నా మీద ఉన్నంతకాలం నాకే ఇబ్బందీ

ఉండదు. నేను పిల్లలకు చదువు నేర్పేది అల్లా సేవకోసమే. దానికి ప్రతిఫలం ఆశించటం తప్పు. ఖుదా మెచ్చడు" అనేవారు.

ఇబ్రహీం వారికి ఎదురెళ్ళి "అస్సలామలేకుం ఉస్తాద్ సాబ్" అంటూ అభివాదం చేశాడు.

వారు తలయెత్తి, అతన్ని గుర్తు పట్టడానికి ప్రయాసపడి, "బర్ఖుర్దార్! సలామత్ రహో" అన్నారు.

వారిని జాగ్రత్తగా నడిపించుకుని వెళ్ళి ముందు వరుసలో కూచోబెట్టాడు.

ఇబ్రహీం పదో తరగతి తప్పి, నాటక సంఘాల్లో తిరుగుతున్నాడని తెల్సినపుడు, ఫజులుల్లాగారు అతన్ని పిలిచి మందలించారు.

"బేటా! నాటకాలు కడుపునింపవు. కష్టపడి చదువుకో. ఏదో ఓ నౌకరీలో చేరు. ఆ తర్వాత బేఫికర్‌గా నీకు నచ్చిన వ్యాపకం చేసుకో. లేకపోతే దేనికీ కొరకాకుండా పోతావు" అన్నారు.

ఇబ్రహీంకి వారి మాటలేవి రుచించలేదు. మొహానికి రంగు పూసుకోవటం అతనికి వ్యసనంలా మారింది. విధవరాలైన తల్లి అతని చెవిలో ఇల్లు కట్టుకుని పోరినా ప్రయోజనం లేకపోయింది. ఆమె చనిపోయాక, అడ్డు చెప్పేవాళ్ళు లేక దొరికిన స్వేచ్ఛని సద్వినియోగం చేసుకున్నాడు. ఉన్న వూరు వదిలేసి నాటకాలంటూ వూళ్ళు పట్టుకుని తిరిగేవాడు. అలా తిరుగుతున్నప్పుడే జమీలున్నిసాతో నిఖా జరిగింది.

"దేశదిమ్మరిలా తిరిగే నీకు పిల్లనెవరిస్తార్రా" అని గేలి చేసేవారు అతని వూరి జనాలు. 'కాణీకి ఠికాణా లేదు. మొహానికి రంగు పులుముకుని బలాదూర్‌గా బతికే నిన్ను నమ్మి, ఆడపిల్లని నీ చేతిలో పెట్టి గొంతు కోయడానికి ఏ తండ్రీ ఇష్టపడడు' అని ఎద్దేవా చేసేవారు అతని బంధువులు. అలాంటి ఇబ్రహీంకి జమీలున్నిసాలాంటి ముగ్ధ బేగంసాహెబా కావటం అల్లా లీల కాకపోతే మరేమిటి?

ఆ రోజు తెనాలిలో నాటకం వేస్తున్నారు. ఇబ్రహీంకి విడిది ఫరీద్‌గారింట్లో ఏర్పాటు చేశారు. ఫరీద్‌కి ఆ వూర్లో పాత ఇనుపసామానుల షాపుంది. అతనికున్న ఏడుగురు సంతానంలో జమీలున్నిసా చివరిది.

నాటకం బాగా రక్తికట్టింది. ఇబ్రహీం స్వతహాగా స్ఫురద్రూపి. దానికితోడు చక్కటి అభినయం – వాక్పటిమ – ఖంగుమనే కంఠం . . . ప్రేక్షకులందర్నీ అతని నటన ఆకట్టుకుంది– ఫరీద్‌ని కూడా.

అతని రూపంతో పాటు అతని మృదువర్తన – పెద్దలంటే అతనికున్న గౌరవం – నిష్ఠగా ఐదుపూటలా నమాజు – ఆరోగ్యకరమైన అలవాట్లు . . . అన్నీ ఫరీద్‌కి నచ్చాయి. అందుకే

అతను తెనాలి వదిలి వెళ్ళేముందు పెళ్ళి ప్రస్తావన తీసుకు వచ్చారు. మరో నెలకి ఇబ్రహీంకి జమీలున్నిసాతో నిఖా జరిగింది.

గ్రీన్‌రూంలో మొహానికి పెట్టుడు గడ్డం అతికించుకుంటూ – పక్కనే బుగ్గలపై గులాబీరంగు అద్దుకుంటున్న జమీలున్నిసాని చూసి చిన్నగా నవ్వుకున్నాడు ఇబ్రహీం.

నాజూగ్గా బంగారుతీగలా . . . కలువరేకుల్లా మురిపించే విశాలమైన కనుదోయితో . . . గులాబి రేకుల్లాంటి పల్చటి పెదాల్తో . . . స్నిగ్ధ సౌందర్యంతో . . . జన్నత్‌కీ పరీలా ఉండే జమీలున్నిసాని వదిలి నాటకాల కోసం వేరే వూళ్ళు వెళ్ళాల్సి వచ్చినప్పుడు ప్రాణం విలవిల్లాడిపోయేది ఇబ్రహీంకి. నాటకాలు మానేద్దామనుకున్నాడు. మనసొప్పింది కాదు. అలాగని అందమైన భార్యని వదిలి వెళ్ళటమూ ఇష్టముండేది కాదు. అతనికి నాటకం ఎంత ప్రాణమో జమీలున్నిసా కూడా అంతే ప్రాణం. ఈ రెండిట్లో ఒకదాన్నే కోరుకుని, మరోదాన్ని వదిలేయటం మరణంతో సమానం.

చాన్నాళ్ళు ఈ రెండింటి మధ్య నలిగీ నలిగి చివరికి ఓ నిర్ణయానికొచ్చి జమీలున్నిసాని కదిపిచూసాడు. మొదట కస్సుమంది. బుజ్జగించి, బ్రతిమాలి చివరికెలాగయితేనేం ఒప్పించ గలిగాడు. పరిషత్ నాటకాలప్పుడు రోజుల తరబడి ఒంటరిగా ఉండాల్సి రావటం దుస్సహంగా ఉన్న జమీలున్నిసా అయిష్టంగా ఉన్నా, అంగీకారం తెలిపింది. ఆ విధంగా ఆమె కూడా నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తూ ఇబ్రహీంతో పాటే ఉండసాగింది.

ఈ రోజు మొట్టమొదటిసారి ముస్లిం జీవితాన్ని కథా వస్తువుగా తీసుకుని రాసిన నాటకం వేయబోతున్నారు. దీనికి అంకురార్పణ రాజమండ్రిలో పరిషత్ నాటకాల పోటీలప్పుడు జరిగింది. ఆ పోటీల్లో ఇబ్రహీంకి ఉత్తమ నటుడిగా బహుమతి వచ్చింది. బహుమతి ప్రదానానికి విచ్చేసిన కలెక్టర్ రెహమాన్ గారు సభా కార్యక్రమాలు ముగిశాక ఇబ్రహీంని పక్కకు పిలిచి వ్యక్తిగతంగా అభినందనలు తెలిపారు.

“ఈ పోటీలో దాదాపు ఇరవై నాటకాలు ప్రదర్శించబడ్డాయి. అన్నీ హిందూ జీవితాల చుట్టూ తిరిగేవే. మన ముస్లిం సాంప్రదాయాల గురించీ, జీవిత విధానం గురించీ, మనవాళ్ళు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన సాంఘిక సమస్యల గురించీ నాటకాలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది” కాదంటావా అన్నట్టు ఇబ్రహీం వైపు చూశారాయన.

“అలాంటి నాటకాలు ఎవరైనా రాస్తే వేయడానికి నేను సిద్ధమే” అన్నాడు ఇబ్రహీం. “ఎవరో రాయాలని మనం ఎదురుచూస్తూ కూచోవటం తప్పు. ఆ పని మనమే ఎందుకు చేయకూడదు? మీరే పూనుకోండి. ముస్లిం జీవితాల గురించి ముస్లింలకు తెల్సినంత క్షుణ్ణంగా – వివరంగా



Rupaye_Chettu.pm7 71 28/7/19, 12:03 AM

వేరే వాళ్ళకు తెలిసే అవకాశం లేదు" అన్నారాయన.

ఆ మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని కథను తనే తయారు చేసుకుని, డైలాగులు రాసుకుని, స్వయంగా దర్శకత్వం కూడా వహిస్తున్నాడు ఇబ్రహీం.

తనకు నిఖా జరిపించిన ఖాజీ షాబుద్దీన్‌గారు వస్తున్నారని విని గ్రీన్‌రూంలోంచి బైటికొచ్చి వారికెదురెళ్ళి స్వాగతం పలికాడు.

"ఆదాబ్ అర్జ్‌హై ఖాజీ సాబ్"

"జీతే రహో బేటా" ఇబ్రహీం పెట్టుడు గడ్డంవైపు అదోలా చూస్తూ అన్నాడతను. ఇబ్రహీంకి అనుమానం వచ్చి తన గడ్డాన్ని మెల్లగా తడుముకుని చూసుకున్నాడు. వూడిపోలేదు. అతుక్కునే ఉంది. చిన్నగా నవ్వుకున్నాడు. నిఖా అప్పుడు ఖాజీగారు "ఆజ్‌కల్‌కె ఛొకరే దాడీ పాలనా గునాః సమఝుతేహై" అంటూ ముస్లిం యువకులు గడ్డాలు పెంచుకోడానికి విముఖంగా ఉంటున్నారని తెగ బాధ పడిపోవటం గుర్తొచ్చింది.

ఖాజీగార్ని నాటకానికి రప్పించడం ఇబ్రహీంకి చాలా కష్టమైంది. వారిని నాటకానికి ఆహ్వానించడానికి వెళ్ళినపుడు "దేఖో బేటా ! ఈ నాటకాలూ, సినిమాలూ మన ఇస్లాం సాంప్రదాయాలకు విరుద్ధం. నేనురాను. అసలు నువ్వు ఇవన్నీ మానేస్తే సంతోషపడ్తాను" అన్నారు. చాలాసేపు బ్రతిమాలాక, కథ ముస్లిం జీవితానికి సంబంధించింది కాబట్టి వారి అమూల్యమైన అభిప్రాయం అవసరమని నచ్చచెప్పాక, అందరి బలవంతం మీద అయిష్టంగానే ఒప్పుకున్నారు.

ఖాజీగార్ని ఫజులుల్లాగారి పక్కన కూచోబెట్టి గ్రీన్‌రూంలోకి వెళ్ళిపోయాడు. నాటకం మొదలయ్యింది. మామూలు మధ్యతరగతి సంసార కథ. కథానాయకుడు హమీద్. అతని భార్య అక్తరున్నిసా. వారికిద్దరు పిల్లలు. అన్యోన్య దాంపత్యం. హమీద్ మజ్దూర్‌గా దుబాయ్ వెళ్తాడు. తిరిగి వచ్చినపుడు భార్యమీద అనుమానపడ్తాడు. తనకు లొంగలేదన్న కోపంతో పక్కింటి మజహర్ రాసిన ఉత్తరం ఆధారంగా ఆమెకు అక్రమ సంబంధం అంటగట్టి, ఆవేశంలో మూడుసార్లు తలాక్ చెప్పేస్తాడు. ఆమెను వదిలి మరో పెళ్ళి చేసుకుని దుబాయ్ తిరిగి వెళ్ళిపోతాడు. అభంశుభం తెలీని అక్తరున్నిసా తన ఇద్దరు పిల్లల్తో ఎన్ని కష్టాలు పడిందో కంట తడిపెట్టించేలా చెప్తుంది నాటకం.

హమీద్ పాత్రని ఇబ్రహీం పోషిస్తున్నాడు. అక్తరున్నిసాగా జమీలున్నిసా అద్భుతంగా నటిస్తోంది.

నాటకం రసరమ్యంగా సాగుతోంది. ప్రేక్షకులు మైమరచి చూస్తున్నారు. హమీద్ తన

భార్యకు విడాకులిచ్చే సీన్ వచ్చింది. ఆ పాత్రలో పూర్తిగా లీనమైపోయిన ఇబ్రహీం జమీలున్నిసా వైపు తీక్షణంగా చూస్తూ, "నువ్వంటే నాకసహ్యం. ఇక నువ్వూ నేను కలిసి ఉండటం కల్ల. ఈ క్షణమే నీకు విడాకులిస్తున్నాను. తలాక్ తలాక్ తలాక్" అన్నాడు. జమీలున్నిసా అనంతమైన బాధని మొహంలో చూపిస్తూ, 'యా ఖుదా' అంటూ కుప్పకూలిపోయింది.

నాటకాన్ని అయిష్టంగా చూస్తున్న షాబుద్దీన్ ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు. తన కళ్ళముందు ఏం జరుగుతోంది? తన చెవులు ఏం విన్నాయి? తను నిఖా జరిపిన ఇబ్రహీం కొన్ని వందల సాక్షుల ఎదురుగా తన భార్య జమీలున్నిసాకు తలాక్ మూడుసార్లు చెప్పాడు. అయినా ఇదంతా నాటకంలో భాగం కదా అన్పించిందో క్షణం. మరుక్షణం అది సరికాదనిపించింది. ఇంత మంది కళ్ళెదురుగా జరిగింది నిజం కాకుండా ఎలా ఉంటుంది? ఇంతమంది విన్న మాట ఉత్తుత్తిదని ఎలా కొట్టేయడానికి వీలవుతుంది?

ముస్లిం మతాచారం ప్రకారం భర్త నోటినుంచి మూడుసార్లు తలాక్ అనే పదం భార్యనుద్దేశించి ఉచ్చరించబడితే విడాకులు ఇచ్చేసినట్లే.

అతని మనసులో అలజడి . . . నాటకంలో హమీద్ అనే పాత్ర తన భార్య పాత్ర అయిన అక్తరున్నిసాకు విడాకులిచ్చింది – అంతేగానీ ఇబ్రహీం తన భార్య జమీలున్నిసాకు విడాకులివ్వలేదు. మరెందుకు తన మనసు ఆందోళనకు గురౌతోంది?

అతను అస్థిమితంగా కుర్చీలో అటూ ఇటూ కదిలాడు.

తన పక్కన కూచుని ఉన్న ఎం.పీ. గారి వైపు చూశాడు. అతను ఆసక్తిగా నాటకం చూస్తున్నాడు. తనకు మరో పక్క కూచుని ఉన్న ఫజులుల్లా గారివైపు చూశాడు. వారు ఏదో విషయం గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు తన పొడవాటి గడ్డాన్ని నిమురుకుంటూ దిక్కులు చూస్తున్నారు.

"జనాబ్! కొద్దిగా బైటికెళ్దాం వస్తారా" అతన్ని ఉద్దేశించి అన్నారు షాబుద్దీన్‌గారు. ఫజులుల్లా ఏమనుకున్నారో ఏమో "జీ! పదండి" అంటూ లేచారు. ఆ ఇద్దరు ముసలివాళ్ళు ఒకర్నొకరు ఆసరాగా పట్టుకుంటూ, మెల్లగా నడిచి బైటికొచ్చారు.

అక్కడ వేపచెట్టుకింద కట్టిన చప్టామీద కూచున్నారు. కొద్దిసేపు ఎవ్వరూ ఏదీ మాట్లాడుకోలేదు. ఏదో అనర్థం జరిగిపోయిందన్న భావం ఇద్దరి మొహాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. మొదట షాబుద్దీన్‌గారే విషయాన్ని కదిపారు. "జరిగిన దాని గురించి మీరేమను కుంటున్నారూ?"

ఫజులుల్లాగారికి విషయం అర్థమైనా తనకు తానుగా ఎందుకు బయటపడాలని "దేని గురించి?" నొసలు ముడుస్తూ అడిగారు.

"ఈ నాటకం గురించి"

"దానికేం? అవ్వల్ క్లాసుగా ఉంది. ఇబ్రహీం బేటా నటన బావుంది. కహానీ బఢియా – బహుత్ అచ్ఛాహై".

"ఆ విషయం సరే – నేనడిగింది తలాక్ గురించి".

"తలాక్ గురించి నేను మీకు చెప్పగలవాడినా? మీరు ఖాజీలు" దాటవేయడానికి ప్రయత్నించాడు.

"ఇందాక నాటకంలో ఇబ్రహీం తన భార్య జమీలున్నిసాతో మూడుసార్లు తలాక్ అన్నాడు కదా – మీ అభిప్రాయం ఏమిటి?"

"నాటకంలో కదా".

"కానీ వారిద్దరూ భార్యాభర్తలు. మన ఇస్లాం ప్రకారం భార్యతో భర్త మూడుసార్లు తలాక్ చెబితే వాళ్ళిద్దరూ ఆ క్షణం నుంచీ భార్యాభర్తలు కాదు. విడిపోయినట్లే"

ఫజులుల్లాని అరగంట నుండీ తినేస్తున్న సమస్య అదే. కాదని ఎట్లా అనగలడు? అయినా ఇబ్రహీం మీద ఉండే అభిమానం కొద్దీ కొంత, తన మనసుకు తను సమాధానం చెప్పుకునే ధోరణిలో కొంత ఇలా అన్నాడు. "అనంత కరుణామయుడూ, అపార కృపాశీలుడు అయిన అల్లాకు తెలియదా – ఇబ్రహీంకి తన భార్యతో విడిపోయే ఉద్దేశం ఏదీ లేదని – నాటకంలోని ఓ పాత్ర మరో పాత్రతో . . ."

"ఆ మరోపాత్ర మరెవరో అయి ఉంటే అసలు సమస్యే ఉండకపోను. ఆమె అతనికి భార్య. నిఖా జరిపింది నేను. నా సమక్షంలో . . . మనందరి సమక్షంలో . . . ఇంతమంది సాక్షుల మధ్య తలాక్ మూడుసార్లు చెప్పాక . . . ఆ నిఖా ఇంకా ఉన్నట్లా లేక విడాకులు ఇచ్చేసినట్లా? మీరు బుజుర్గ్ . . . బాగా చదువుకున్నవారు . . . మీరే చెప్పండి."

ఫజులుల్లాకు పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డట్టయింది. కొద్దిసేపు నీళ్ళు నమిలి, ఎలాగోలా గొంతు పెగుల్చుకుని చెప్పారు. "మీరు చెప్పిందే సహీ అన్పిస్తోంది ఖాజీ సాబ్".

"ఇప్పుడు మనమేం చేయాలి?"

తన శిష్యుణ్ణి రక్షించుకోటం కన్నా మతమే ముఖ్యమని నిర్ధారణకు వచ్చిన ఫజులుల్లా గారు "ఆప్‌హీ ఫర్మాయియే" అన్నారు.

"ఆడిటోరియంలో ఎంతోమంది పెద్దలున్నారు. వారి ఉద్దేశం కూడా కనుక్కుని తుది

నిర్ణయానికి రావటం మంచిదేమో".

"ఠీక్ కహా! మీరిక్కడే కూచుని ఉండండి ఉస్తాద్ సాబ్. నేను మిగతా వారిని పిల్చుకు వస్తాను" అంటూ షాబుద్దీన్ గారు మెల్లగా నడుచుకుంటూ ఆడిటోరియం లోపలికి వెళ్ళారు. ముగ్గురు ముసల్మానుల్తో గుసగుసలుగా మాట్లాడివారిని బైటికి పిల్చుకు వచ్చారు. వాళ్ళు విషయం విని "హౌ – మైభీ వైసాచ్ సోచా" అంటూ మిగతా వాళ్ళను పిల్చుకు రావడానికి లోపలికి వెళ్ళారు.

ఓ అరగంట వ్యవధిలో మంత్రి ఫరూక్‌గారు, యం.పి. ఖాజా మొహియుద్దీన్‌గారు తప్ప మిగతా ముస్లిం పెద్దలందరూ వేపచెట్టు కింద ఆసీనులై – జరిగిన విషయం గురించి వాదోపవాదాల్లో పడిపోయారు.

నాటకం వేస్తున్న ఇబ్రహీంకి విషయం ఏమిటో అర్థం కాక పిచ్చెక్కుతున్నట్లుంది. తను ఎన్నో నాటకాలు వేశాడు. తన హావభావ ప్రకటనల్ని, తను డైలాగులు పలికే విధానాన్ని మెచ్చుకుని ఈలలు వేసి వన్స్‌మోర్ అన్నవారే తప్ప ఇలా నాటకం మధ్యలో సగానికి పైగా జనం లేచి వెళ్ళిపోవటం ఎప్పుడూ జరగలేదు. అతనికి చాలా అవమానంగా అన్పించింది. దుఃఖం ముంచుకొచ్చింది.

డైలాగులు చెప్తూనే మిగిలి ఉన్న ప్రేక్షకులవైపు పరిశీలనగా చూశాడు. ఒకరిద్దరు తప్ప గడ్డాలు పెంచుకున్నవారు ఆడిటోరియంలో కన్పించలేదు. అంటే ముస్లిం పెద్దలందరూ లేచి వెళ్ళిపోయారన్నమాట . . . తనేమైనా నాటకాన్ని తప్పుగా రాశాడా? డైలాగుల్లో ముస్లింలను కించపర్చే వాక్యాలేమైనా దొర్లాయా? 'యా అల్లా! ఇదేం ఉపద్రవం!' అనుకున్నాడు.

తను కూడా ముస్లిమే కదా. కాఫిర్ కాదుగా . . . అల్లాకు విధేయుడు. రోజూ నిష్ఠగా ఐదుపూట్లా నమాజ్ చదువుతాడు. అలాంటిది తను తన మతాన్ని కించపర్చే విధంగా ఎందుకు రాస్తాడు?

అతనికి సాల్మన్ రష్దీ గుర్తొచ్చాడు. లజ్జ నవల రాసిన తస్లీమా నస్రీన్ గుర్తొచ్చింది. వాళ్ళమీద ముస్లిం మతవాదులు జారీ చేసిన ఫత్వా గుర్తొచ్చింది.

'పర్‌వర్‌దిగార్! నేనేమైనా తప్పుగా రాశానా? నా వాళ్ళు నా మీద ఫత్వా జారీ చేస్తారా? నన్ను మతంలోంచి బహిష్కరిస్తారా? యా ఖుదా! మొట్టమొదటిసారిగా ముస్లిం జీవితాల గురించి నాటకం రాసి నా వాళ్ళకేదో మేలు చేస్తున్నానని అపోహపడ్డానే! అనాలోచితంగా ఏ కీడు చేశానో? చివరికిది ఎలా పరిణమిస్తుందో?'

అతని ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. సగం ఖాళీ అయిన ఆడిటోరియం



Rupaye_Chettu.pm7 75 28/7/19, 12:03 AM

తెరుచుకున్న పులి నోరులా భయపెడుతోంది. ఆ మానసిక వ్యథతో కొన్ని డైలాగులు మర్చిపోయాడు. ఎలాగోలా నాటకం అయిందనిపించాడు.

ముస్లిం పెద్దల విన్నపంతో మంత్రిగారూ, యం.పి.గారూ ఉండిపోయారు. మిగతా ప్రేక్షకులు వెళ్ళిపోయాక ముస్లింలందరూ ఆడిటోరియంలో సమావేశమైనారు.

విషయమేమిటో అర్థం కాకున్నా – అది గంభీరమైన విషయమేనని అర్థమై – వూపిరి బిగపట్టి విషణ్ణ వదనంతో నిలబడ్డాడు ఇబ్రహీం. ఏం జరుగుతుందో అర్థంకాని జమీలున్నిసా చాటుగా గ్రీన్‌రూంలో బితుకుబితుకుమంటూ కూచుంది.

ముందుగా షాబుద్దీన్‌గారు స్టేజీ ఎక్కి గొంతు సవరించుకున్నారు. "సబ్ లోగోంకో ఆదాబ్! ఇబ్రహీంకి నిఖా జరిపించిన ఖాజీని నేను. నా పేరు షాబుద్దీన్. ఇక్కడ మన కళ్ళెదుట ఓ ఘోరం జరిగిపోయింది. నాటకం చూసి, బర్ఖుర్దార్ ఇబ్రహీంని దీవించి వెళ్ళటానికి వచ్చిన మనందరికి అనుకోకుండా ఓ అజీబ్ పరిస్థితి ఎదురైంది. ఇబ్రహీంమియా తన భార్య జమీలున్నిసా బేగంతో మూడుసార్లు తలాక్ చెప్పటం వల్ల విడాకులిచ్చేసినట్లే. ఇకముందు వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా కలిసి ఉండటానికి మతం ఒప్పుకోదు. ఇది నాటకమే కదా– అందులోని పాత్రలే కదా ఆ మాటలు పలికింది అని కొందరు వితండవాదులు వాదించవచ్చు. వాళ్ళందరూ కాఫిర్లు. మత నియమాల గురించి సరియైన అవగాహన లేనివారు. మన షరియత్‌లో ఇలాంటి సర్దుబాట్లు ఏవీ లేవు. ఒకసారి భర్త తన భార్యతో మూడుసార్లు తలాక్ చెప్పాక మరలా వెనక్కి తీసుకునే వెసులుబాటులేదు. వింటిని వదిలిన బాణాలు ఎలానో ఇదీ అలానే. ఏ సందర్భంలో అన్నాడూ ఏ పరిస్థితిలో అన్నాడూ అనేది ముఖ్యం కాదు. కాబట్టి ఈ క్షణం నుంచీ ఇబ్రహీం, జమీలున్నిసా భార్యాభర్తలు కాదని ఈ జమాయత్‌లో నిర్ణయించడమైంది."

వింటున్న ఇబ్రహీం ఇందాక నాటకంలో తన భర్త తనకు విడాకులిచ్చినపుడు అక్తరున్నిసా 'యా ఖుదా' అంటూ కుప్పకూలినట్లు 'యా అల్లా' అంటూ దబ్బున కూలబడిపోయాడు.

అతనింతసేపూ మతానికి విరుద్ధంగానో, మతపెద్దలకు కోపం తెప్పించే విధంగానో కథో, డైలాగులో తను రాసి ఉంటాడని వూహించి భయపడ్డాడు. కానీ చివరికిలా తను రాసిన పదాలే పాములై తన మెడకు చుట్టుకుంటాయని, అవి కసిగా తన జీవితాన్నే కాటేస్తాయని తెల్సుకోలేకపోయాడు.

ఒక్కసారిగా అతనికి చుట్టూ చీకట్లు అలుముకున్నట్లనిపించింది. అంతా గాఢాంధ కారం . . . చిక్కగా . . . ముద్దలా ఘనీభవించి . . . మృత్యువులా నోరు తెరుచుకుని . . . తనూ, జమీలున్నిసా ఒకరికోసం ఒకరు వెతుక్కుంటున్నారు. ఆమె తనని పిలుస్తోంది ఆర్తిగా.

తను ఆమెని పిలుస్తున్నాడు బాధగా. ఒకర్ని ఒకరు పిల్చుకుంటున్న శబ్దం పెద్దగా విన్పిస్తోంది. ఒకరికొకరు అతి సమీపంగా కదుల్తున్నట్లు భారంగా శ్వాస తీసుకుంటున్న ధ్వని . . . కానీ ఒకరికొకరు అనంతమైన దూరంలో . . .

జమీలున్నిసాకు కొన్ని నిముషాలు వాళ్ళేమంటున్నారో అర్థం కాలేదు. అర్థమయాక పిడుగు నెత్తిమీద పడ్డట్లు ప్రాన్పడిపోయింది. తలాక్ ఏమిటి? ఎవరు ఎవరికి తలాక్ ఇచ్చారు? అసలు వీళ్ళందరూ ఏం మాట్లాడ్తున్నారు? తన ఇబ్రహీం తనకు విడాకులివ్వటం ఏమిటి? అలా ఎన్నటికీ జరగదు. తనకు ఇబ్రహీం అంటే ప్రాణం. ఇబ్రహీంకి తనన్నా ప్రాణమే. అందరూ మతిభ్రమించినట్లు మాట్లాడ్తున్నారు.

తలాక్ అనే పదాన్ని మూడుసార్లు పలికి భార్యని వదిలించుకునే పద్ధతి సరియైంది కాదని – చాలామంది ముస్లిం యువకులు ఈ సాంప్రదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ– అమాయకమైన ముస్లిం ఆడపిల్లలు దీనికి బలైపోతున్నారనీ – ఇబ్రహీం తనతో చాలాసార్లు చెప్పాడు. అందుకే కొంతమందికైనా కనువిప్పు కలగాలనే సదుద్దేశంతో తలాక్‌ని కథా వస్తువుగా తీసుకుని నాటకం రాశాడు. దీనివల్ల తలాక్‌ని తల్వార్‌లా వాడి స్త్రీల జీవితాల్ని నాశనం చేసి, వాళ్ళ మనసుల్ని ముక్కలుగా నరకటం తగ్గుతుందని తామిద్దరూ ఆశించారు. ఏ నాటకం వల్ల తోటి ముస్లింలకు ప్రయోజనం కలగాలని కోరుకున్నారో అదే నాటకం వల్ల తమ జీవితాలు చీకటిమయమౌతాయని ఆలోచించలేకపోయారు.

అంతటి విషాదంలోనూ తన బ్రతుకుని తల్చుకుని ఆమెకు నవ్వొచ్చింది. ఇబ్రహీంకి దగ్గరగా ఉండాలన్న కోరికతో నాటకాల్లో వేషాలు వేయడానికి ఒప్పుకుంది. అలా చేయడమే ఇప్పుడు తన కొంప ముంచింది. వీళ్ళందరూ ఇబ్రహీంని తనకుకాకుండా చేయడానికి బీడా ఎత్తుకుని వచ్చినట్లుంది. ‘యా మాలిక్! నా షొహర్‌ని నాకు దూరం చేయకు’ అని వేడుకుంది.

అక్కడి మనుషులు రెండు వర్గాలుగా విడిపోయారు. షాబుద్దీన్ చెప్పినదాన్ని సమర్థించే వర్గం ఒకటి. అది నాటకంలో భాగం కాబట్టి తలాక్ కిందికి రాదని వాదించే వర్గం మరొకటి. నూటికి తొంభైమంది షాబుద్దీన్ పక్షం వహించారు. ఇబ్రహీంకి వత్తాసుగా నిలబడిన వాళ్ళలో ఎక్కువమంది నాటక సమాజం వాళ్ళే. అందులో ముసల్మానులు లేరు. “మా మతం గురించి మీకు తెలియదు. మీరిందులో దఖల్ కాకండి” షాబుద్దీన్ గుడ్లురిమి వాళ్ళ నోళ్ళు మూయించాడు.

“నిజమే. మాకు మీ మతం గురించి తెలియదు. కాని సాటి మనిషిగా ఇబ్రహీం గురించి బాగా తెలుసు. అతనికి తన భార్యకు విడాకులిచ్చే ఉద్దేశం లేనప్పుడు మీరు బలవంతంగా వాళ్ళని విడదీయటం అమానుషం” అంటూ వాళ్ళు నెత్తీనోరు బాదుకుని చెప్పినా ఎవ్వరూ

వినిపించుకోలేదు.

"మీరేమంటారు జనాబ్ ఖాజా మొహియుద్దీన్ సాబ్" అప్పటివరకూ జరుగుతున్న విషయాల్ని మౌనంగా పరిశీలిస్తున్న ఎం.పి. గార్ని అడిగారు. అతనప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి ఉన్నాడు. తన పలుకుబడి పది కాలాలపాటు నిలబడాలంటే తను మెజారిటీ పక్షమే వహించాలి. మతానికి వ్యతిరేకంగా మాట్లాడి ముల్లాలకూ, ఖాజీలకు కోపం తెప్పించకూడదు. ప్రజల్ని మతం పేరుతోనే తన చుట్టూ తిప్పుకోవటం సాధ్యపడ్తుంది. తన అధికారం మతంతోనే ముడిపడి ఉంది. అతను లేచి నిలబడి, "మన షరీయత్‌ని తు.చ. తప్పకుండా పాటించడం ప్రతి ముస్లిం కర్తవ్యం. పొరపాటున ముట్టుకున్నా నిప్పు కాలుతుంది. తలాక్ అని మూడుసార్లన్నాక దానికి తిరుగులేదు. వాళ్ళిద్దరూ విడాకులు తీసుకున్నట్లే" అన్నాడు.

ఫరూక్ గారు అర్జెంట్ పనులున్నాయంటూ మెల్లగా జారుకున్నారు.

"తలాక్ వెంటవెంటనే చెప్పటం ధర్మసమ్మతం కాదు. ఓ వేళ విడిపోవాలన్న ఉద్దేశం ఉన్నా ఒకసారి తలాక్ చెప్పాక కొన్ని రోజులు ఆగాలి. అప్పటికీ భార్యలో ఆశించిన మార్పు రాకపోతే, లేక ఆమె తన తప్పుని సరిదిద్దుకోకపోతే అప్పుడు రెండో తలాక్ చెప్పాలి. మరలా కొన్ని రోజుల విరామం తర్వాత గత్యంతరం లేని పరిస్థితుల్లో మూడో తలాక్ చెప్పటం న్యాయం. కాబట్టి నేను వరుసగా మూడుసార్లు తలాక్ చెప్పటం చెల్లదు కదా" ఆశగా అడిగాడు ఇబ్రహీం.

"విరామం ఇచ్చి చెప్పాలని ఉంది. కానీ వరసగా చెప్పటం వల్ల చెల్లదని ఎక్కడా లేదు. మూడుసార్లు తలాక్ అనే పదం భర్త నోటి నుండి రావడమే ముఖ్యం" షాబుద్దీన్ గారు వివరణ ఇచ్చారు.

"సరే మీ నిర్ణయాన్ని నేను కాదనను. కానీ నాకు జమీలున్నిసా అంటే చాలా ఇష్టం. ప్రేమ. ఈ జన్మకి నాకు తనే భార్య. మనకున్నది ఒకే జన్మ. నాకు జమీలా దక్కే మార్గం సూచించండి. ఎంత కష్టమైనా సరే. నేను జమీలాను నాదానిగా చేసుకుంటాను" కన్నీళ్ళ పర్యంతమౌతూ వేడుకున్నాడు ఇబ్రహీం.

"దీనికి పరిష్కారం ఒక్కటే. జమీలున్నిసా మరొకర్ని నిఖా చేసుకుని, అతను విడాకులిస్తే, అప్పుడు భర్త వదిలేసిన ఆ స్త్రీని నువ్వు మరలా నిఖా చేసుకోవచ్చు."

"యా అల్లా! వినడానికే నాకింత కష్టంగా ఉంటే అలా జరిగితే నా జమీలా గుండె పగిలి చచ్చిపోవటం ఖాయం. తను లేకుండా నేను బతకలేను కాబట్టి నాకు ఆత్మహత్యే శరణ్యం. ఇద్దరి జనాజా లేస్తేగాని మీకు మనశ్శాంతి ఉండదనుకుంటాను".

"బర్‌ఖుర్దార్! మాకు నువ్వంటే దుష్మనీ ఏదీ లేదు. నేను నిమిత్తమాత్రుణ్ణి. షరీయత్ ప్రకారం

నడుచుకోవటం తప్ప మనకు మరో దారి లేదు".

"గుల్‌మొహర్‌లా ఉండే జమీలాని వేరెవరైనా నిఖా చేసుకుంటే తలాక్ ఇవ్వటం కల్ల. చూస్తూ చూస్తూ రుచికరమైన పలావ్‌ని మరొకరి థాలీలో వేస్తే, తినకుండా తిరిగి ఇచ్చేస్తాడా? పొరపాటున తలాక్ చెప్పి, పశ్చాత్తాపపడినా తలాక్ రద్దు కాదా? ఎంతగానో ప్రేమించే భార్యని మరొకరికి అప్పగించడానికి ఏ మగవాడికైనా మనసొప్పుతుందా?" ఇబ్రహీం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

జమీలున్నిసాకి ఆలోచనల్తో పిచ్చెక్కేట్టుంది. తను మరో మగవాణ్ణి నిఖా చేసుకోవాలా? తోబా తోబా . . . తను మనిషి కాదా? తనకంటూ ఓ మనసుంటుందని వీళ్ళకు తెలియదా? తన ఇష్టాఇష్టాలతో అసలు ప్రమేయమే లేదా? తనేమైనా వస్తువా? ఒకడు వదిలేస్తాడట. మరొకడు నిఖా చేసుకుంటాడట. వాడు మరలా తలాక్ అంటాడట. అప్పుడు మొదటివాడు మరలా నిఖా చేసుకుంటాడట . . . అయ్యా! జనాబ్! బుజుర్గ్! మీ అందరికీ నా కన్నీటి సలాం. నాలో రక్తమాంసాలే కాదు స్పందించే మనసు కూడా ఉంది. నాకంటూ కొన్ని కలలూ, కోరికలే కాదు నిర్దిష్టమైన అభిప్రాయాలూ ఉన్నాయి. వాటికి పూచిక పుల్లకిచ్చినంత విలువ కూడా ఇవ్వరా?

నిజమే – ఇస్లాం స్త్రీ పైన పురుషుడికి ఒకింత ఆధిక్యతను ప్రసాదించింది. అంతేగాని బానిసలా చూడమనలేదు. బానిసలకే తమ అభిప్రాయాల్ని వెల్లడించే స్వాతంత్ర్యం ఉండదు. నా భర్త నాకు విడాకులు ఇవ్వలేదు. భార్యాభర్తల మధ్య సఖ్యతకు, సర్దుబాటుకు అవకాశం లేనపుడే విడాకులివ్వాలని మన మతం చెప్తోంది. మరి నా భర్తకూ, నాకూ మధ్య ఏ కలతలూ లేవు. కొట్లాటలు అసలే లేవు. మాది అన్యోన్య దాంపత్యం. మమ్మల్ని మా మానాన వదిలేయండి. ఇంకెప్పుడూ ముస్లిం జీవితాల గురించిన నాటకాలు వేయం. నేను హామీ ఇస్తున్నాను. మిమ్మల్ని సంస్కరించాలనుకున్న నా భర్త అమాయకుడు. అతన్ని క్షమించండి. నా నుంచి నా ప్రాణాన్ని వేరు చేయకండి.

ఆమె మనసు ఆక్రోశిస్తోంది.

అప్పటికే రాత్రి పదకొండు దాటింది.

"తుది నిర్ణయం రేపటికి వాయిదా వేయటం మంచిది. రేపు మనందరం మసీదులో మగరిబ్ నమాజ్ తర్వాత సమావేశమౌదాం. మత పెద్దలందరితో చర్చించి వారి రాయ్ తీసుకున్నాకే ఇబ్రహీం ఇచ్చిన తలాక్ గురించి నిర్ణయిద్దాం. ఏమంటారు?" అందరివైపూ చూసి షాబుద్దీన్ గారు అడిగారు.

అందరూ అంగీకారం తెల్పుతూ “ఆమేన్” అన్నారు.

“ఇబ్రహీం మియా! ఇప్పుడు మీరిద్దరూ భార్యాభర్తలు కారు. ఆ విషయంలో నాకెటువంటి అనుమానమూ లేదు. ఈ చర్చంతా కేవలం నీ సంతృప్తి కోసం. నువ్వూ, జమీలున్నిసా ఈ రోజు నుంచీ ఒకే ఇంట్లో ఉండకూడదు. నీకు మన మత నియమాలు తెలీనివి కాదు. భార్య కాని స్త్రీతో కలిస్తే వ్యభిచారం చేసినట్లే. ఆ నేరానికి మన షరీయత్ ప్రకారం శిక్ష ఎంత కఠినంగా ఉంటుందో నీకు చెప్పక్కరలేదనుకుంటాను. హెచ్చరించటం నా ధర్మం కాబట్టి చెప్పాను. జత్తన్ రహనా. సమఝేనా?” షాబుద్దీన్ గారు అందరూ వినేట్టు పెద్దగా చెప్పారు.

తెల్సినవారింట్లో జమీలున్నిసా ఆ రాత్రి గడపాలని నిర్ణయించబడింది.

ఎవరెంత బ్రతిమాలినా ఆమె మెతుకు ముట్టలేదు. పిన్ని వరసయ్యే వాళ్ళింట్లో ఓ మూలన చాప పర్చుకుని పడుకుంది. నిద్ర పట్టటం లేదు. ఎంతటి ఘోరం! తను మనుషులుండే సమాజంలోనే ఉందా లేక ఇదేమైనా మృగాలు సంచరించే అడవా? ఇబ్రహీం తనను తాకితే వ్యభిచార నేరం చేసినట్లా? విడ్డూరం కదూ! భార్యని భర్త తాకకూడదు. భార్యాభర్తలిద్దరూ ఒకే ఇంట్లో ఉండకూడదు. తనని మరో మగాడు నిఖా చేసుకుని కాపురం చేశాక వదిలేస్తే మరలా ఇబ్రహీం నిఖా చేసుకుని తనను తాకితే తప్పులేదు. ‘అల్లా ! నా జీవితాన్ని అంధకారం చేయకు. నేనే పాపమూ చేయలేదు. నాకీ శిక్ష విధించకు.’ పదే పదే అల్లాని వేడుకుంటూ, జాగారం చేసింది.

ఇబ్రహీంకి బాధతో గుండె చెరువైంది. నిద్ర రావటం లేదు. జమీలా జ్ఞాపకాలు దొంతర్లుగా వస్తున్నాయి. గదంతా చిక్కని చీకటి . . . నల్లటి బాకులా మెదళ్ళో గుచ్చుకుంటున్న చీకటి . . . తన జీవితంలో నిన్నటివరకు పండువెన్నెల . . . నేడు కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి . . . కసాయి చీకటి . . . తన జమీలాని అమాంతం కొండ చిలువలా మింగేసిన చీకటి . . .

తలాక్ అనే మూడక్షరాల పదం అణుబాంబులా పేలి తన జీవితాన్ని భస్మీపటలం చేస్తుందని తనెన్నడూ వూహించలేదు. ముస్లిం యువకులు ఈ మధ్య టెలిగ్రాముల ద్వారా, టెలిఫోన్ల ద్వారా, ఈమెయిల్స్ ద్వారా తలాక్ తెలిపి భార్యల్ని వదిలించుకుంటున్నారని విని తనెంత అశాంతికి గురైనాడూ! మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకునే ఈ సాంప్రదాయం అమానుషమని పదిమందికి చాటాలని కలలు కన్నాడు. కానీ ఇప్పుడు తనే అన్యాయంగా బలైపోతున్నాడు.

అతని చుట్టూ వ్యూపాలా అల్లుకుని అన్యాయం లాంటి చీకటి . . .

వందల, వేల ఆలోచనలు చెదపురుగుల్లా మెదణ్ణి తినేస్తున్నాయి. నిమిషాలు యుగాల్లా భారంగా కదులుతున్నాయి. జమీలా తన పక్కన లేని ఆ రాత్రి కాళరాత్రిలా భయపెడుతోంది. ఏవేవో అస్పష్టమైన రూపాలు వికృతంగా తన వైపుకు దూసుకువస్తున్నాయి. చీకటి తనని కబళించటానికి పొంచి ఉన్న చిరుతపులిలా ఉంది.

తొందరగా తెల్లారితే ముల్లాల, ఖాజీల గడ్డాలూ, కాళ్ళూ పట్టుకునైనా తన జమీలాని దక్కించుకోవాలని అతని ఆరాటం.

ఎన్ని గంటలు ఎదురుచూసినా కళ్ళలోకి తారులా జారుతున్న చీకటి తప్ప సంధ్యారుణ కాంతుల ఛాయలే లేవు.

అతనికాక్షణం భయమేసింది.

అసలెప్పటికైనా తెల్లారుతుందా?

తప్పకుండా తెల్లారుతుందన్న నమ్మకం కలిగితే ఎన్ని యుగాలు ఎదురు చూడటానికైనా అతను సంసిద్ధంగా ఉన్నాడు.

జమీలాకు తెల్లారేవరకూ ఆగాలనిపించలేదు. ఇబ్రహీం తన భర్త – అది అల్లా నిర్ణయం. దాన్ని మార్చే అధికారం ఈ ముల్లాలకు, ఇమాంలకు ఎవరిచ్చారు? షరీయత్‌ను వాళ్ళ ఇష్టానుసారం వక్రీకరించి తన జీవితంతో ఆడుకుంటుంటే తను చేతులు ముడ్చుకుని కూచోలేదు. తను విధేయత చూపాల్సింది అల్లాకే – మానవత్వం మరిచిన మనుషులకు కాదు.

ఆమె లేచి వడివడిగా తయారైంది. తనిప్పుడు ఎవర్నీ లెక్క చేయదు. తన ఇబ్రహీంని తననుంచి ఎవ్వరూ వేరు చేయలేరు. తామిద్దరూ ఏకం కావటం కోసం అవసరమైతే లోకమంతా ఏకమైనా ఎదిరిస్తుంది.

ఆమె అడుగు బైటికి పెట్టింది. ఇబ్రహీం ఉన్న ఇంటిని సమీపిస్తున్నప్పుడు అరుణారుణ సంధ్య ఆమెకెదురొచ్చి స్వాగతం పలికింది.

*(ఆంధ్రప్రభ ఆదిత్య హృదయం - ఆదివారం 2 నవంబర్, 2003;*
*ఆటా - వార్త 2002 కథల పోటీలో ఎన్నికైన కథ)*

☆☆☆

# ఆరో అల్లుడు

నిఖా జరుగుతోందక్కడ . . .

దుల్హన్ పదహారేళ్ళ యాస్మిన్ – లేత గులాబీ మొగ్గలా వికసించీ వికసించని పరువం – బుగ్గల్లో మెరిసే పసితనపు నిగారింపు – కళ్ళల్లో విరిసే అమాయకత్వపు గుబాళింపు.

దూరంగా నిలబడి – నిరాశలో నలిగిపోతూ నేను. నా స్వంతం అనుకున్నది నాది కాకుండా పోతోందన్న దిగులు – నేను ప్రేమించిన రాకుమారిని ఒంటికొమ్ము రాక్షసుడు బలవంతంగా లాక్కెళ్ళిపోతున్న భావన – నా ప్రాణాన్ని ఏడు సముద్రాల అవతల ఏ గుహలోనో పంజరంలో చిలకలా చేసి బంధిస్తాడన్న భయం.

యాస్మిన్‌కి సంబంధాలు చూస్తున్నారని తెలిసి, మనసు వికలమై, చివరికి ధైర్యం చేసి అమ్మతో చెప్పాను – నాకు యాస్మిన్‌ని పెళ్ళి చేసుకోవాలనుందని.

వినకూడని విషయమేదో విన్నట్లు అమ్మ నా వైపు వింతగా చూసిందో క్షణం – వెంటనే తేరుకుని "నీకు నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. అప్పుడే పెళ్ళేమిట్రా అమీర్" అన్నప్పుడు నేనూ ఆమె వైపు వింతగా చూశాను. "యాస్మిన్‌కి పదహారు నిండకుండానే పెళ్ళి చేయాలనుకుంటున్నప్పుడు పద్దెనిమిదేళ్ళకే నేనెందుకు పెళ్ళిచేసుకోకూడదూ" అన్నాను.

అమ్మ నవ్వింది. "అదంటే ఆడపిల్ల – ఎన్నాళ్ళని ఇంట్లో పెట్టుకుంటారు? మంచి సంబంధం వస్తే పెళ్ళి చేసి పంపించాలనే కోరుకుంటారు."

'మనది మంచి సంబంధం కాదా అమ్మీజాన్' అని అడగబోయి, అమ్మను ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక వెల్డింగ్ షాపు కెళ్ళిపోయాను.

ఆ రోజంతా ఎంతటి క్షోభను అనుభవించానో ఆ అల్లాకే తెలుసు. పనిలో మనసే లగ్నం కాలేదు. అమ్మ అడిగిందో లేదో? అడిగితే ఏమన్నారోలాంటి సవాలక్ష ప్రశ్నలు మనసులో నిప్పురవ్వల్లా ఎగిరిపడుతూ . . . ఖాన్ చాచాదీ, మాదీ పక్క పక్క ఇళ్ళు. మా నాన్న నా పన్నెండో ఏట చనిపోయాక మాకు పెద్ద దిక్కుగా, మా మంచిచెడ్డల్ని పట్టించుకున్న ఖాన్ చాచా అంటే నాకు గౌరవం. ఖాన్‌చాచాకున్న ఎనిమిది మంది సంతానంలో యాస్మిన్ మొదటిది.





Rupaye_Chettu.pm7 82 28/7/19, 12:03 AM

పదేళ్ళ క్రితం యాస్మిన్‌ని మొదటిసారి స్కూలుకు పంపుతూ వాళ్ళ అమ్మీజాన్ అన్నమాటలు నాకింకా గుర్తు – "అమీర్ బేటా – ఇక నుంచి యాస్మిన్ బాధ్యతంతా నీదే. జాగ్రత్తగా పిల్చుకెళ్ళి, వచ్చేప్పుడు భద్రంగా పిల్చుకుని రావాలి. నీ జాన్‌లా చూసుకోవాలి" అన్నప్పుడు ఐదేళ్ళ యాస్మిన్ తన విశాలమైన కళ్ళతో నా వైపు ఆత్మీయంగా చూసి – నా చిటికెన వేలిని పట్టుకుని స్కూలుకు నడవడం నేనెన్నటికీ మరువలేను.

ఆ రోజు సాయంత్రం ఆరాటంగా ఇంటికెళ్ళాను. అమ్మ విచారవదనం సగం జవాబు చెప్పినా ఆశ చంపుకోలేక అడిగాను.

"వాళ్ళ పిల్లని వెల్డింగ్ షాపులో పనిచేసే కుర్రాడికెందుకిస్తారు బాబూ? యాస్మిన్ బంగారుబొమ్మలా ఉంటుంది. ఓ అమీర్ సంబంధం చేసి ఆ విధంగానైనా మిగతా ఏడుగురు పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ జరుపుకోవాలని ఆశపడ్తున్నారు" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగటం నాకు లీలగా కన్పించింది.

ఖాన్ చాచాది మాకు మల్లేనే పేద కుటుంబం. ఐదుగురు ఆడపిల్లలు–ముగ్గురు మగపిల్లలు. ఖాన్‌చాచా వాచ్‌మన్‌గా పనిచేసి సంపాయించే రెండు వేలతో పది మంది కడుపులు నిండాలి. తనలా తన కూతురు దరిద్రం అనుభవించకూడదని ప్రతి తండ్రీ కోరుకుంటాడు. తమ కన్నా ఎక్కువ హోదా ఉన్న ఇంట్లోనే ఆడపిల్లని ఇవ్వాలనుకోవడంలో తప్పేముందీ?

ఉర్దూ మీడియంలో ఏడో తరగతి వరకూ చదువుకున్న నన్ను ఖాన్‌చాచాయే వెల్డింగ్‌షాపులో పనికి పెట్టించాడు. అలా వచ్చే కూలి డబ్బుల్తో అమ్మను పోషించుకోవటమే కష్టంగా ఉంటే, నన్ను చేసుకుని యాస్మిన్ ఏం సుఖపడ్తుంది?

ఇలా ఆలోచించుకుని నాకు నేను సమాధానపడ్డాను తప్ప పరిస్థితి మరీ ఇంత దుర్భరంగా, దుస్సహంగా ఉంటుందని ఊహించనైనా లేదు.

ఏదో కోలాహలం–ఆలోచనల్లోంచి బైటపడి చూశాను. ఖాజీ, సాక్షులూ మసీదులో ఉన్న పెళ్ళి కొడుకుని 'దుల్హన్ కబూల్ హైక్యా' అని మూడుసార్లడిగి 'కబూల్‌హై' అన్పించుకుని యాస్మిన్‌ని అంగీకారం అడగడానికొచ్చారు.

ఏదైనా అద్భుతం అంటూ జరిగితే ఇప్పుడే జరగాలని మనసు ఆశపడ్తోంది. పెళ్ళింకా పది రోజులుండనగా – ఎవ్వరూ దరిదాపుల్లో లేరని నిర్ధారించుకుని యాస్మిన్‌తో చెప్పాను 'వాణ్ణి పెళ్ళి చేసుకోనని చెప్పు. నిఖా నీకు కబూల్ కాదని చెప్పు. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం' అని. తన విశాలమైన కన్రెప్పల్ని ఓ క్షణం పైకెత్తి, విస్మయంగా నా వైపు చూసి, అతి నెమ్మదిగా కళ్ళను దించేసి, తలవొంచుకుని, సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయిందా రోజు.

ఈ పది రోజులూ యాస్మిన్ ప్రశాంతంగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికొచ్చి ఉంటుంది. ఇప్పుడు వీళ్ళు 'కబూల్ హైక్యా' అని అడగటమే తరువాయి 'నహీ' అని పెద్దగా అరచి పాకీజా సినిమాలో మీనాకుమారిలా పరుగెత్తుకుంటూ నా దగ్గరికొస్తుందన్న పిచ్చి ఊహ.

ఖాజీ, సాక్షులూ యాస్మిన్ వద్దకెళ్ళి నిలబడ్డారు. యాస్మిన్ ఎర్రటి చీరలో ముడుచుకు కూచున్న అగ్ని పుష్పంలా ఉంది. నేను వళ్ళంతా చెవులు చేసుకుని ఆ గడప దగ్గర నిలబడ్డాను. 'మెహర్ ఏ ముఅజ్జల్ పచీస్ హజార్ సే దూల్హా కబూల్‌హైక్యా' అని అడిగారు. నా గుండెని తూట్లు పొడుస్తూ, 'కబూల్‌హై' అని తీయటి మంద్రమైన స్వరం విన్పించింది.

నాకు దుఃఖం ఆగింది కాదు .ఆమె బదులు నేనే 'నహీ' అని అరవాలనిపించింది. ఉబుకుతున్న కన్నీళ్లు ఎవ్వరూ చూడకుండా మా ఇంట్లోకెళ్ళిపోయాను.

జల్వా జరుగుతోంది రమ్మంటే అయిష్టంగానే బైటికొచ్చాను.

పెళ్ళి కొడుకునీ, పెళ్ళికూతుర్ని ఎదురెదురుగా కూచోబెట్టారు. ఎర్రటి మేలిముసుగులో ఒదిగిన గులాబీ రేకుల కుప్పలా ఉంది యాస్మిన్. వాడు – ఎర్రతోలు కప్పుకున్న ఎలుగ్గొడ్డులా ఉన్నాడు. బట్టనెత్తి, బండ కళ్ళద్దాలు – పై వరుసలో ఓ పన్ను విరిగి వికృతంగా కన్పిస్తోంది. ఖాన్‌చాచా కన్నా ఐదారేళ్ళు పెద్దాడిలా ఉన్నాడు. యాస్మిన్ గొంతు కోయటానికి వధ్యశిలకు పిల్చుకెళ్తున్న తలారీలా ఉన్నాడు వాడు.

నెలరోజుల క్రితం నేను పని నుండి తిరిగొచ్చేప్పటికి ఖాన్‌చాచా వసారాలో మంచం వేసుకుని కూచుని ఉన్నాడు. అక్కడి వాతావరణం నాకు కొత్తగా, వింతగా అన్పించింది.

మెరిసిపోయే కొత్త షేర్వాణీ, పైజమా వేసుకుని మురిసిపోతూ కూచుని ఉన్నాడు ఖాన్‌చాచా. తలమీద రుమాలీ టోపీ – అతని పక్కన ఎర్రటి టేప్‌రికార్డర్ – అందులోంచి హిందీపాట విన్పిస్తోంది. ఖాన్‌చాచా పాన్ నములుతూ దిలాసాగా కన్పించాడు.

"ఆదాబ్ చాచాజాన్–క్యాబాత్‌హై–ఖుషీగా కన్పిస్తున్నారు–లాటరీ ఏమైనా తగిలిందా" అని అడిగాను అతని లాటరీ టిక్కెట్ల పిచ్చిని గుర్తుకు తెచ్చుకుంటూ.

"అలాంటిదే అనుకో బేటా – మంచి అల్లుడు దొరకడం కూడా అదృష్టమేకదా. అల్లా దయ మా మీద ఉండబట్టే యాస్మిన్‌కి బంగారం లాంటి సంబంధం కుదిరింది. అల్లుడు దుబాయ్‌లో పండ్ల వ్యాపారం చేస్తాడు. బాగా ధనవంతుడు. ఈ డ్రెస్సూ, ఈ టేప్‌రికార్డరూ, పిల్లలకు బట్టలూ, యాస్మిన్‌కి ఖరీదైన రెండు జతల చుడీదార్లు, ఒక వాచీ, మెడలో గొలుసూ ఇవన్నీ అతనే పంపించాడు" ఖాన్‌చాచా మొహంలో ఆనందం నగ్నంగా నర్తించటం నాకు స్పష్టంగా కన్పించింది.



Rupaye_Chettu.pm7　84　28/7/19, 12:03 AM

"మీరతన్ని చూశారా చాచాజాన్?" గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న బాధను నొక్కి పెడుతూ అడిగాను.

"హోటల్లో దిగినాడని తెలిసి వెళ్ళి కల్సుకున్నాను – దబ్బపండు రంగులో ఉంటాడు తెలుసా?"

"వయసెంత ఉంటుంది?" బలపడుతోన్న అనుమానంతో అడిగాను.

"ఆ ఏమంత వయసనీ – మహా ఉంటే ముప్పయ్ ఉంటుందేమో. అయినా మగవాడి వయసు ముఖ్యంకాదుగా. అదేమైనా అడ్డంకా – నాకూ మీ చాచీకి పదేళ్ళపైనే వయసు తేడా లేదూ!" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

నేను ఉదాసీనంగా అయిపోయాను. ఈ పెళ్ళికి ఒప్పుకోవద్దని యాస్మిన్‌తో చెప్పాలన్న ఆరాటం . . . యాస్మిన్‌ని ఎత్తుకెళ్ళి ఏ మసీదులోనో పెళ్ళి చేసుకోవాలన్న కోరిక . . . యాస్మిన్ నా మాట వింటుందా? మా అబ్బాజాన్ ఇష్టమే నా ఇష్టం అంటుంది. నాకు తెలుసు– చాలా మంది ముస్లిం ఆడపిల్లల్లానే యాస్మిన్‌లో చొరవ చూపే గుణం లేదు.

ఇంట్లోకెళ్ళాక అమ్మ చెప్పింది. "ఎవరో బ్రోకర్ ఈ సంబంధం కుదిర్చాడట. దుబాయ్ షేక్ హోటల్లో దిగితే ఖాన్‌చాచా వెళ్ళి వివరాలు కనుక్కొన్నాడట. మెహర్ కింద పాతిక వేలు, పెళ్ళి ఖర్చుల నిమిత్తం మరో పాతిక వేలూ ఇస్తానన్నాడట"

పాతిక వేలు . . . ఖాన్‌చాచాలాంటి, మాలాంటి పేదవాళ్ళకు పాతిక వేలు చాలా పెద్ద మొత్తమే.

జల్వా కూడా అయిపోయింది.

నిఖా జరిగాక అందరూ ఖాన్‌చాచాని కౌగిలించుకుని 'దామాద్ ముబారక్ హో' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. నేను ఇంట్లో కెళ్ళిపోవటం వల్ల ముబారక్ చెప్పే అవకాశం దొరకలేదు. ఇప్పుడు ఖాన్‌చాచా వెలిగే మొహంతో నాకు ఎదురుపడ్డాడు. మనసులో రగులుతున్న బాధని దాచుకోటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తూ ఖాన్‌చాచాతో 'జమాయీ ముబారక్‌హో చాచా' అన్నాను.

*****

యాస్మిన్ దుబాయ్ వెళ్ళి అప్పుడే రెండు నెలలైంది.

వెళ్ళే ముందు ప్రతివారం ఓ ఉత్తరం రాస్తానని వాళ్ళమ్మతో చెప్పి వెళ్ళిన యాస్మిన్ ఒక్క ఉత్తరమ్ముక్క కూడా రాయలేదు. ప్రతినెలా కొంత డబ్బు పంపిస్తానని ఖాన్‌చాచాకు వాదా చేసిన దుబాయ్ షేక్ నుంచి డబ్బూలేదు, కబురూ లేదు.

ఖాన్‌చాచా వాళ్ళింట్లో అందరూ దిగులు పెట్టుకున్నారు. ఖాన్‌చాచా అయితే కూతురి మీద బెంగతో సగమైపోయాడు. దుబాయ్ షేక్ ఇచ్చిన అడ్రసుకు ఈ రెండు నెలల్లో నా చేతే నాలుగు ఉత్తరాలు రాయించాడు. ఒక్కదానికీ సమాధానం రాలేదు. నాకైతే యాస్మిన్ క్షేమ సమాచారాలు తెలియక ప్రతిక్షణం నరకంలా అనిపిస్తోంది.

అన్యమనస్కంగానే పనికివెళ్లాను.

అక్కడా దుబాయ్ వెళ్ళే మన ఆడపిల్లల గురించే మిగతా పని వాళ్ళు చర్చించుకుంటున్నారు. లతీఫ్ వాళ్ళింటి పక్కనుండే గౌస్‌మియా డబ్బుకు ఆశపడి తన కూతుర్ని దుబాయ్ షేక్‌కి కట్టబెట్టాడట. ఆ అమ్మాయిని వాడు నానా యాతనలు పెట్టి, నరకం ఎలా ఉంటుందో చూపించాడట. ఆ బాధలు భరించలేక తన పేద తల్లిదండ్రులకు విషయం ఎలా చేరవేయాలో తెలీక ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందట. ఆ విషయం కూడా చనిపోయిన దాదాపు సంవత్సరానికి తెలిసిందట.

“అక్కడికి పెళ్ళి పేరుతో తీసుకెళ్ళినా పని మనుషులుగానే వాడుకుంటారట. వాళ్ళచేత నానా చాకిరి చేయిస్తారట. వాళ్ళను దేహవాంఛలు తీర్చే యంత్రాల్లా వాడుకోవటమే కాకుండా, వాళ్ళ స్నేహితుల కోరికలు కూడా తీర్చమని బలవంతం చేస్తారట” అన్నాడు లతీఫ్.

“ఇలా జరుగుతుందని తెలిసినా మనవాళ్ళు దుబాయ్ షేక్‌లకు మన ఆడపిల్లల్ని ఎందుకు కట్టబెడ్తున్నారూ?” అని అడిగాడు పదిహేనేళ్ళ సుభానీ.

“ఏం చేస్తారు చెప్పు – దారిద్ర్యం . . . ఆకలి . . . శక్తికి మించిన సంతానం . . . డబ్బు ఖర్చుపెట్టి ఆడపిల్లల నిఖా చేయలేని దీనస్థితి . . . షేక్‌లు ఇస్తామనే డబ్బుకి ఆశపడి నిఖాలు చేస్తున్నారు. ఓ రకంగా చెప్పాలంటే వేరే దారిలేక ఆడపిల్లల్ని అమ్ముకొంటున్నారు” అన్నాడు లతీఫ్. ఆ స్త్రీల దయనీయ స్థితిని తల్చుకుని అనుకుంటాను అతని కంఠం రుద్ధమయింది.

“వాళ్ళ దేశంలో మనకు మల్లే మెహబూబ్‌కి మెహందీలు ఉండవు. పని వాళ్ళకూ కొరతే. మన ఆడపిల్లలైతే చాలా చౌకగా దొరుకుతారు. ఇటు పనికీ అటు పడక్కీ వాడుకోవచ్చని ఇక్కడికొచ్చి నిఖాపేరుతో దర్జాగా దోచుకెళ్తున్నారు” అన్నాడు కసిగా అన్వర్.

నాకు యాస్మిన్ గుర్తొచ్చి వళ్ళు జలదరించింది. తలనొప్పిగా ఉందని చెప్పి ఇంటికెళ్ళి పడుకున్నాను. కలల్లో కూడా యాస్మిన్‌ని పలుపుతాడు మెడకుబిగించి లాక్కెళుతున్నట్లు . . . కొరడాలతో బాది గొడ్డుచాకిరీ చేయిస్తున్నట్లు . . . అన్నీ పీడకలలే.

ఆర్నెల్లు గడిచింది.. దుబాయ్‌నించి ఏ కబురూ లేదు. టెలిగ్రాములు పంపించాం. ప్రయోజనం లేదు. రిజిష్టర్ ఉత్తరం రాస్తే, అటువంటి అడ్రస్ లేదని తిరిగొచ్చింది.

ఖాన్‌చాచా మంచం పట్టాడు. దాదాపు పదినెలలు గడిచాయి. ఎవరయినా ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్తున్నారని తెలిస్తే వెళ్ళి వాళ్ళ కాళ్ళూగడ్డాలు పట్టుకుని బతిమాలుకోవటం – తీరా వారి నుంచి ఎంత వెదికినా దుబాయ్‌లో అటువంటి వ్యక్తి దొరకలేదని ఉత్తరం వచ్చాక నిరాశతో కృంగిపోవటం నాకు అలవాటైపోయింది.

ఓ రోజు ఖాన్‌చాచా నాలుగో కొడుకు పరుగెత్తుకుంటూ వెల్డింగ్‌షాపుకొచ్చాడు.

యాస్మిన్ నుంచి ఉత్తరం వచ్చిందట. ఖాన్‌చాచా వాళ్లింట్లో ఉర్దూ చదవటం ఎవ్వరికీ రాదు. మా అమ్మకూ రాదు. అందుకే నన్ను వెంటనే పిల్చుకురమ్మని ఖాన్‌చాచా పంపించాడట.

నాకు గుండెల పైనుంచి కొండంత బరువు దిగిపోయినంత సంతోషం వేసింది. నా భయాలన్నీ ఉత్త దూదిపింజల్లా తేలి ఎగిరిపోయాయి. యాస్మిన్ చాలా ఉత్తమురాలు. ఆమె అమాయక మైన మొహం చూస్తే ఎవ్వరికీ మోసం చేయాలనో – దౌర్జన్యం చేయాలనో అన్పించదు.

ఆలోచనల్లోనే ఇంటికి చేరుకున్నాను.

ఖాన్‌చాచా మొహంలో ఒకప్పటి వెలుగు కనిపించింది. ఆ ఇంట్లో అందరిలో పెల్లుబుకుతున్న ఆనందం . . .

ఖాన్‌చాచా లేచి కూచుని ఉత్తరం నా చేతికిస్తూ "జల్దీ చదువు బేటా నా బేటి ఏం రాసిందో? తను ఖుషీగా ఉందటనా – ఈ బాబా ఇన్నాళ్ళూ గుర్తుకే రాలేదటనా–దామాద్ ఎలా ఉన్నాడట– నేను చెప్పలేదూ – అతను మంచి వాడేనని–వ్యాపారంలో తీరిక దొరికి ఉండదు" అన్నాడు.

వణికే చేతుల్తో ఉత్తరం విప్పదీశాను.

అందులో ఒకే ఒక వాక్యం రాసి ఉంది – దాన్ని పైకి చదివాను.

"అబ్బాజాన్ – మీకు ఆరో అల్లుడు ముబారక్ . . ."

చెట్టంత ఖాన్‌చాచాతో పాటు నేనూ కుప్పకూలిపోయాను.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 10 మార్చి, 2000)*

★★★

# మెహర్

కరీమున్ నవ్వటం నేనెప్పుడూ చూళ్ళేదు. ఆమెకు మొన్నటి మొహరం పండక్కి పద్దెనిమిది నిండి పందొమ్మిదేళ్ళొచ్చాయి. అయినా పీలగా, బలహీనంగా పధ్నాలుగేళ్ళ అమ్మాయిలానే కనిపిస్తోంది. 'పీర్ సాయిబు పిల్లకి పెళ్లి తలపెట్టకపోతే పోయె. కనీసం తిండికూడా పెట్టడం లేదల్లే ఉంది' అంటూ మా పేటలో అందరూ అనుకుంటూ ఉన్నారన్న విషయం నాకు తెలుసు.

కరీమున్ నా పెద్ద కూతురు. దాని తర్వాత వరుసగా ఏడుగురు సంతానం. ఆరుగురు ఆడపిల్లలే. కొడుకులు కావాలన్న నా కోరిక తీర్చటం కోసం నా భార్య ఫాతిమా బేగం ఏడో కాన్పులో మగబిడ్డను కని మురిసిపోయి – ఎనిమిదో కాన్పులో ప్రసవం కష్టమై – మరో మగబిడ్డను నా చేతిలో పెట్టి – మట్టిలో కలిసిపోయింది.

నా చిన్నప్పుడు మా నాన్న గుర్రబ్బండి తోలేవాడు. నాకూ చెర్నాకోలా చేతిలో పట్టుకుని గుర్రాన్ని దౌడు తీయించాలని మా చెడ్డ కోరిగ్గా ఉండేది. పదేళ్ళ వయస్సప్పుడు మా నాన్నతో "బా! మైభీ ఘోడా గాడీ చలాతూ" అన్నాను. దానికి గడ్డిమంటలా భగ్గుమన్నాడాయన. "బేవకూఫ్! రిచ్చాలొచ్చాక మనకు గంజిలో మెతుకు కరువైన ఇసయం నీకు తెల్వదా? నేడో రేపో మన వూరికి బస్సు ఏత్తారంట. అపుడీ గంజి కూడా దొరకదురా బేటా. నా బతుకులా నీది కూడా పిల్లోల్లకి నాలుగు మెతుకులు పెట్టలేని దరిద్దరపు బతుకు కాకూడదు" అన్నాడు.

వారం తిరక్కుండానే నన్ను తీసుకెళ్ళి మస్తాన్ వలీ వెల్డింగ్ షాపులో చేర్పించాడు. మొదట్లో బావుండేది. దీపావళి పండక్కి మతాబాలు కాల్చినప్పుడు వచ్చే నిప్పురవ్వల్లా వెల్డింగ్ చేసినప్పుడు చిటపట శబ్దంతో వెలువడే కాంతి చినుకులు చూడటం ఇష్టంగా ఉండేది. కాని రాను రాను విసుగ్గా అన్పించేది. ఇష్టమున్నా, లేకున్నా అదే వ్యాపకాన్ని అంటి పెట్టుకుని ఉండబట్టే మస్తాన్‌వలీ మరణం తర్వాత నా సంపాదనలో దాచుకున్న కొంత పైకం చెల్లించి షాపుని నా స్వంతం చేసుకున్నాను.

నాకూ, నా పిల్లలకు పస్తుల బాధ లేకుండా – కన్నతల్లిలా కడుపులో పెట్టుకుని కాపాడుకొస్తుంది ఈ షాపే. కరీమున్ పుట్టాక కూడా షాపు మీద వచ్చే కొద్దిపాటి ఆదాయం





Rupaye_Chettu.pm7 88 28/7/19, 12:03 AM

మా అవసరాలకు ఏదోలా సరిపోయేది. కానీ ఇపుడు ఎనిమిది మంది సంతానం . . . వాళ్ళ కడుపు నింపటమే కనాకష్టంగా ఉంటే దానికి తోడు రోగాలని, రొష్టులనీ . . .

అల్లాకు నా మీద ఇంకా కనికరం కలగలేదనుకుని సరిపెట్టుకుంటూ ఉంటాను. ఇలాంటి పరిస్థితుల్లో కరీమున్ బక్కగా లేకుండా, నున్నగా దాని ఈడు ఆడపిల్లల మాదిరి నదురుగా కన్పించమంటే ఎలా కుదుర్తుందీ? అది పుట్టినప్పుడు నేను పీర్‌ని నడుముకు కట్టుకుని కణకణమండే అగ్ని గుండంలో 'యా ఆలీ' అంటూ నడుచుకుంటూ పోతున్నా. పక్కింటి అబ్బాయి నా చెవిలో కూతురు పుట్టిన వార్త వేశాడు. ఆ సంతోషంలో మామూలు కంటే రెండు తూర్లు అదనంగా కర్బలాలో నడిచాను.

ఇంటికెళ్లి చూద్దునుకదా ఎలక పిల్లలా – ఎండిపోయిన వాళ్ళమ్మ డొక్కలో పడుకుని ఉంది. నాలాంటి గరీబోల్ల ఇంట్లో పిల్లలు ముద్దుగా, బొద్దుగా ఎలా పుడతార్లే అని సరిపెట్టుకున్నా. అది పుట్టినప్పటి నుంచీ ఒకటే ఏడుపు. పాలు చాలేవి కావు. తిండుంటే కదా పాలు పడడానికి . . . దానికి తోడు ఎప్పుడూ ఏదో ఓ జబ్బుతో బాధ పడుతూ ఉండేది. అందుకే దాని మొహంలో నవ్వు ఛాయలు కనిపించేవి కావు.

దానికి ఐదేళ్ళ వయసొచ్చేసరికి నలుగురు చెల్లెళ్ళు – పెద్ద చెల్లెళ్ళిద్దర్నీ అదే చూసుకునేది. ఆ వయసు నుంచే దానికి పెద్దరికం అలవాటైంది. అదీ వాళ్లమ్మలానే తలొంచుకుని గబగబా పనులు చేసుకుపోవటానికి – పిల్లల్ని సముదాయించుకోవడానికీ – అందరూ తినగా మిగిల్తే తినడానికీ అలవాటు పడింది. అందుకేనేమో వాళ్ళమ్మ తను లేకున్నా తన పిల్లల్ని పొట్టలో పొదవుకుని కాపాడుకునే కరీమున్ ఉందనే ధైర్యంతోనే కన్నుమూసి ఉంటుంది.

కరీమున్ ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. మనను విప్పి ఎవ్వరితో మాట్లాడదు. తరచి తరచి అడిగినా పెదవి విప్పదు. మౌనంగా, ఉదాసీనంగా తన పని తను చేసుకుపోతుంది.

పెళ్ళీడు వచ్చినా పెళ్ళి గురించి నేను పట్టించుకోవటం లేదన్న దిగులు కావచ్చని నా అనుమానం. పిచ్చిపిల్ల! పట్టించుకోకుండా ఎలా ఉంటాను? ఎటొచ్చీ వాళ్ళమ్మే ఉండి ఉంటే, చూసిన సంబంధాల గురించి దాంతో చెప్పి ఉండేది. నేనా విషయాలు కరీమున్ దగ్గర ఎలా ప్రస్తావించనూ?

ఈ మధ్యనే నా షాపులో పని చేసే రషీద్ ఓ సంబంధం గురించి చెప్పాడు. వాళ్లింటి దగ్గర కిరాణా షాపు నడిపే మస్తాన్ తన కొడుక్కోసం సంబంధాలు వెతుకుతున్నాడట. రషీద్ ద్వారా వాళ్ళ వివరాలన్నీ కనుక్కున్నాను. మస్తాన్ సంప్రదాయానికి విలువిచ్చే మనిషి. ఐదు పూటలా క్రమం తప్పకుండా నమాజు చదువుతాడు. రెండు సార్లు హజ్ యాత్ర చేసి వచ్చాడు. తన



Rupaye_Chettu.pm7 89 28/7/19, 12:03 AM

కొడుకుని కూడా పక్కా నమాజీ చేశాడు. ఇంట్లో ప్రతిదీ ఖురాన్ ప్రవచనాలకు అనుగుణంగానే జరగాలి.కొద్దిగా అటిటైనా మస్తాన్ వూర్కోడు. ముస్లిం కట్టుబాట్లు, నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించే కుటుంబం కాబట్టి నిఖా కూడా అటువంటి కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయినే చేసుకోవాలని వాళ్ళ కోరిక.

నాకెందుకో మస్తాన్ సాహెబ్ గారికి కరీమున్‌ని కోడలుగా చేసుకోవడానికి పెద్దగా అభ్యంతరముండదనిపించింది. కరీమున్‌కి చిన్నప్పటినుండీ దైవభక్తి ఎక్కువ. ఉర్దూ, అరబ్బీ నేర్చుకుంది. నిష్ఠగా ఖురాన్ చదువుతుంది. ఐదు పూటలా నమాజ్ చేస్తుంది. అది ఏ పని చేయాలన్నా మొదట బిస్మిల్లా అనకుండా చేయదు. చినిగిందో, మాసిపోయిందో ఏదో ఒక చద్దర్ లేకుండా బైటికి కదల్దు. రంజాన్ నెలలో తప్పకుండా నెల రోజులూ ఉపవాస దీక్షలో ఉంటుంది. అల్లా మీద భక్తితో పాటు, ఆ నెలైనా తను తినకుండా పిల్లలకింత పెట్టొచ్చన్న ఆలోచన దానికి వాళ్ళమ్మ ద్వారా సంక్రమించింది.

ఎటొచ్చీ ఏదైనా అభ్యంతరముంటే డబ్బు దగ్గర ఉండాలి. రషీద్ చెప్పినదాన్ని బట్టి వాళ్లకా పట్టింపు పెద్దగా లేదుట. ఆడపిల్ల తండ్రిని కదా. సంబంధం కుదుర్తుందన్న ఆశ . . . అలా జరిగితే నా కూతురు సుఖంగా ఉంటుందన్న ఆశ . . . మస్తాన్ గారికి ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన కొడుకు – కిరాణా షాపుకి వాడే వారసుడు. ఆడపిల్లల పెళ్ళిళ్ళయిపోయాయి కాబట్టి బాధ్యతలేవీ మిగిలి లేవు. కిరాణా షాపు కాబట్టి ఏదెట్లా జరిగినా తిండికి మాత్రం లోటుండదన్న ఆశ . . .

శుక్రవారం సాయంత్రం మగరిబ్ నమాజ్ తర్వాత మస్తాన్ సాహెబ్ గారి కిరాణా కొట్టుకెళ్ళాను. పని కుర్రాడు సరుకులేవో పొట్లాలు కడుతున్నాడు. గల్లా పెట్టె దగ్గర పాన్ నములుతూ కూచుని ఉన్న మస్తాన్ గారికి ఆదాబ్ చెప్పాను.

నన్ను నేను పరిచయం చేసుకున్నాక . . . "మీ గురించి రషీద్ చెప్పాడు. మేం వెతుకుతున్నది సరిగ్గా ఇలాంటి సంబంధమే" అన్నారు మస్తాన్.

నేను మనసులోనే రషీద్‌కి షుక్రియా తెలుపుకున్నాను.

అంత్యనిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలనిపించి, "మీకు రషీద్ పూర్తి వివరాలు చెప్పాడో లేదో – మేం ఆర్థికంగా మీకు తూగలేం" అన్నాను చేతులు నలుపుకుంటూ.

ఆ మాటకు మస్తాన్‌గారు జోక్ విన్నట్లు బిగ్గరగా నవ్వారు. "రషీద్ అన్నీ సరిగ్గానే చెప్పాడు. మనం ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. మొదట అమ్మాయిని చూసుకోనివ్వండి. మీరు కూడా నాలానే ఆచారాలకూ, సాంప్రదాయాలకు విలువిస్తారని విన్నాం. అన్నింటికన్నా నాకు ముఖ్యం

అదే. ఒక్కగానొక్క కొడుకు గదా – పిల్ల బావుండాలని మా బేగం కోరిక. తనూ, నా పెద్ద కూతురు అమ్మాయిని చూడటానికొస్తారు. మీకు ఎప్పుడు వీలవుతుందో చెప్పండి" అన్నారు.

"ఆదివారం ఉదయం పదీ పదకొండు మధ్య మీకు వీలవుతుందనుకుంటాను" అని వారే నిర్ణయించారు.

"ఎందుకు వీలుకాదూ? తప్పకుండా వీలవుతుంది" అన్నాను ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ. వచ్చే వాళ్ళు ఆడవాళ్ళాయె. గోషా ఉంటుందాయె. అందుకే ఇంటికి తిరిగి వస్తూ దారిలో మాకు దూరపు చుట్టరికమున్న ఖతీజాబీని కల్సుకుని ఆదివారం వచ్చి ఆ విషయాలేవో చూసుకోమని అభ్యర్థించాను.

విషయం విన్న కరీమున్ మొహంలో నేనాశించిన సంతోషం కనిపించలేదు.

"నిఖా చేసుకుని నేనెళ్ళిపోతే పిల్లల్నెవరు చూసుకుంటారు?" అంది.

"నీ పెద్ద చెల్లి ఉంది కదమ్మా – అది చూసుకుంటుందిలే. ఇలా పిల్లల కోసమని ఎంతకాలం నీ వయసులో జరగాల్సిన ముచ్చటకు దూరంగా ఉంటావు?"

కరీమున్ కొద్దిసేపు మౌనంగా గోడకు జారగిలబడి కూచుంది.

"పెళ్ళంటే ఖర్చుతో కూడుకున్న విషయం. మనం తట్టుకోలేం. మీ ప్రయత్నాల్ని విరమించుకోండి" అంది తల వొంచుకుని.

అలా అంటున్నప్పుడు ఆమె మొహంలో కదలాడే భావాలు నాకు కన్పడకూడదని నీడల్ని ఆసరాగా చేసుకుందనుకున్నా.

"మంచి సంబంధం బేటీ – ఖర్చుకి వెనకాడితే ఎలా? మస్తాన్ సాహెబ్‌గారు డబ్బు మనిషి కాదని రషీద్ చెప్పాడు. ఎక్కువ భారం పడదనే అనుకుంటున్నా".

కరీమున్ మరికొన్ని నిముషాలు అలానే కూచుంది. దీర్ఘంగా ఒక నిశ్వాస వదిలి వంటపనిలో మునిగిపోయింది.

ఆదివారం ఉదయం మస్తాన్‌గారి భార్య, పెద్ద కూతురూ వచ్చారు. కొద్ది అలంకరణకే కరీమున్ బంగారు లతలా మెరిసిపోయింది.

"మా వాడు సన్నమే. అమ్మాయి ఇలా నాజూగ్గా ఉంటేనే మంచిదనుకున్నాం. మాకు పిల్ల నచ్చింది. మిగతా విషయాలు మగవాళ్ళు మాట్లాడుకుంటారు" అందట అబ్బాయి తల్లి.

సోమవారం ఉదయం మస్తాన్‌గారింటికి వెళ్ళాను.

"దంపతులిద్దరికీ అవసరమైన జహేజ్ మీరెలాగూ ఇస్తారని మాకు తెలుసు. మరి కట్నం విషయం కూడ ఒక మాటనుకుంటే బావుంటుంది" అన్నారు మస్తాన్.

నా గొంతులో చేపముల్లు గుచ్చుకున్నట్లయింది. మాట గొంతు పెగిలి రానంటోంది.

ఏం మాట్లాడితే కాబోయే వియ్యంకుడికి కోపం వస్తుందేమోననే భయం ఓ వైపూ– ఈ సమయంలో మాట్లాడకపోతే కోలుకోలేనంత కోల్పోతానేమోనన్న దిగులు మరో వైపూ . . .

“మా ఆర్థిక పరిస్థితిని మీకు ముందే విన్నవించుకున్నాను” నా మాటలు నాకే వినిపించనంత మెల్లగా చెప్పాను.

“నేనేమీ అందరిలా లక్షలు అడగటం లేదే! మీ తాహతుని దృష్టిలో పెట్టుకునే అడుగుతాను. నాకు న్యాయం, ధర్మం తెలుసు. మీరలా బికారిలా మాట్లాడడం నాకు నచ్చలేదు. మీరు మరీ లేనివాళ్ళు కాదుగా. సెంటర్లో స్వంత వెల్డింగ్ షాపుంది. చిన్నదైనా స్వంత ఇల్లుంది”

“అవున్నిజమే. దాంతోపాటు ఎనిమిది మంది పిల్లలున్నారు బాబూ. అందులో ఆరుగురు ఆడపిల్లలు. ఈ పిల్ల పెళ్ళి చేసిన ఏడాదికే రెండో పిల్ల పెళ్ళి చేయాలి. మీరు గొప్ప మనసు కలవారని విన్నాను. మీరే దయతలచాలి” దీనంగా వారి వైపు చూశాను.

“మేము మీతో వియ్యమందాలనుకోవటమే మీ మీద దయతల్చామనడానికి నిదర్శనం. ఇంకా ఏం చేయమంటారూ? పెళ్ళంతా మా ఖర్చుతోనే జరిపించమంటారా ఏమిటి?”

“అయ్యో! అలా ఎందుకంటాను? నా శక్తికి తగ్గట్టు పెళ్ళి జరిపిస్తాను – జహేజ్ ఇస్తాను”

“కట్నం మాత్రం ఇవ్వలేమంటారు. అంతేనా? సరే – మీ ఇష్టం. అబ్బాయి ఆరోతరగతి వరకూ చదువుకున్నాడు. అందగాడు. నా కిరాణా కొట్టుకి వారసుడు. లక్షదాకా కట్నం ఇవ్వడానికి ఇంతమంది తయారుగా ఉన్నారు” తన జుట్టుని కుడి గుప్పెట్లో పట్టుకుని చూపిస్తూ అన్నాడు. “అయినా నేనంత మిమ్మల్ని అడగటం లేదు. పిల్ల మా ఆడాళ్ళకి నచ్చింది కాబట్టి మీ ఆచార వ్యవహారాలు నచ్చాయి కాబట్టి యాభై వేలిస్తే చాలు. కాదంటారా, మేము మరో సంబంధం చూసుకుంటాం”

కట్నం ఇవ్వలేనంటే సంబంధం చెడి పోవటం ఖాయమనిపించి, “అంత పెద్ద మొత్తం నాకు తలకు మించిన భారమవుతుందనే విషయం మీకు తెలియంది కాదు. నాది నూట యాభై గజాల్లో కట్టుకున్న మట్టిగోడల ఇల్లు. అది అమ్మినా మీరడిగిన పైకంలో సగం కూడా రాదేమో. మీరే ఈ పేద వాడి మీద జాలిపడి మరో మాట చెబితే . . .” నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ ఉండగా అన్నాను.

“సరే . . . మీరంతగా ప్రాధేయపడుతున్నారు కాబట్టి ముప్ఫై వేలు అనుకుందాం. దీనికి ఒక్క రూపాయి అటూ ఇటైనా మీరిక మాట్లాడొద్దు. లేచి వెళ్ళిపొండి”

"నా మీద కనికరంతో తగ్గించినందుకు మీకు జీవితాంతం రుణపడి ఉంటాను. అల్లా అపారమైన కృప మీ మీద తప్పకుండా ఉంటుంది. మీ ఇంటికి కోడలు కాబోతున్న నా కూతురు అదృష్టవంతురాలు. కాని మేరే మాలిక్! నేను ముప్పై వేలు కూడా ఇచ్చుకోలేను. మీరు కోపగించుకోకుండా నా పరిస్థితిని అర్థంచేసుకోవాలి" అన్నాను.

ఆ మాట విన్న వెంటనే మస్తాన్‌గారు విసురుగా లేచారు. "మీకూ, మీ సంబంధానికో సలాం-ఇక దయచేయండి" అన్నారు.

నేను అమాంతం ఆయన కాళ్ళు పట్టుకున్నాను. నాకు తెలీకుండానే కన్నీళ్ళు జలజలా రాలిపడుతుండగా, "తల తాకట్టు పెట్టయినా ఇరవై వేలు కట్నంగా ఇచ్చుకుంటాను. కాదనకండి" అన్నాను.

మస్తాన్‌గారి మనసు వెన్నలా కరిగిందనుకుంటాను. గునుస్తూనే, "సరే" అన్నారు. "నిఖాకి ముందే ఇచ్చేయాలి. అరువు కుదర్దు. డబ్బు నా చేతిలో పడ్డాకే పెళ్ళి. మరలా ఈ విషయంలో తకరారు రాకూడదు. అప్పుడిలా కాళ్ళు పట్టుకున్నా, గడ్డం పట్టుకున్నా ఒప్పుకునేది లేదు" తన పొడవాటి గడ్డాన్ని దర్పంగా నిమురుకుంటూ శెలవిచ్చారు.

ఓ వైపు సంబంధం పక్కా అయినందుకు సంతోషం - మరోవైపు డబ్బులెలా సర్దుబాటు చేయాలోననే దిగులూ . . .

ఇంటికి రాగానే నా ముఖంలోకి లోతుగా చూసింది కరీమున్. ఆమె చూపు నుంచి తప్పించుకుంటూ, "పెళ్ళి ఖాయం చేసుకొచ్చా" అన్నాను. కనుకొలకుల నుంచి ఆమె మొహంలో సంతోషం కోసం వెతికిన నాకు నిరాశే మిగిలింది.

"జహేజ్‌లో ఏమేం అడిగారూ?"

"వాళ్ళు ప్రత్యేకంగా ఏమీ అడగలేదు. అయినా జహేజ్ అన్నాక పందిరి మంచం, జంపఖానాలతో పాటు మీ ఇద్దరి సంసారానికి అవసరమైన గిన్నెలూ, తపేలాలు చివరికి గరిటెలు, చంచాల్తో సహా ఇవ్వక తప్పదు కదమ్మా" అన్నాను.

"ఎంత ఖర్చవుతుంది?"

"పదీ పదిహేను వేలు కావచ్చు"

నేను మొహం తిప్పుకున్న వైపుకు వచ్చి అడిగింది."కట్నం కావాలని అడిగారు కదూ"

"లేదమ్మా లేదు. అసలు కట్నం ప్రసక్తే రాలేదు" అన్నాను కంగారుగా.

"బా! నా దగ్గర అబద్ధాలాడకండి. దిగులుగా ఉన్న మీ ముఖం చూస్తేనే తెల్సిపోతుంది. ఎంత అడిగారో చెప్పండి"

ఇక దాచి లాభం లేదనిపించి చెప్పాను "ఇరవై వేలు."

కరీమున్ కొన్ని నిముషాల వరకూ ఏమీ మాట్లాడలేదు. తను దిగులు పడ్తుందేమోనని నేనే చెప్పాను "అంత మంచి సంబంధం ఇరవై వేలకే దొరకటం మనదృష్టం తల్లీ! ఆర్థికంగా మనకంటే ఉన్నతంగా ఉండి కూడా అంత తక్కువ కట్నానికి ఒప్పుకున్న మస్తాన్ సాహెబ్‌గారు గొప్ప ఉదార స్వభావం కలవారు"

"అనవసరంగా మిమ్మల్ని మీరు తక్కువ చేసుకుని కించపర్చుకుంటున్నారు బా! మనకో స్వంత ఇల్లుంది. వాళ్ళకూ ఓ ఇల్లుంది. మనకు వెల్డింగ్ షాపుంది. వాళ్ళకు కిరాణా కొట్టుంది. అంతా సమానమే. తేడా ఎక్కడుందంటే మీకు ఎనిమిది మంది సంతానం ఉన్నారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళ బాధ్యతుంది. వాళ్లకా భారం లేదు. సరే పోనిండీ. ఇంతకూ డబ్బులెలా సర్దుబాటు చేద్దామనుకుంటున్నారు?"

"ఈ ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నానమ్మా" అన్నాను.

"మీరలాంటి పని చేసేట్టయితే నాకీ పెళ్ళే వద్దు"

"సర్లే. ఇల్లు అమ్మను. ఏదో ఒకటి చేసి డబ్బు సర్దుతాన్లే . . . నువ్వీ విషయాలేమీ ఆలోచించకు" అన్నాను.

కరీమున్ కళ్లలో అనంతమైన దిగులు కనిపించింది.

ఇల్లు అమ్మలేదు కానీ తాకట్టు పెట్టక తప్పలేదు. దొరికిన ప్రతిచోటా చేబదుళ్ళు తీసుకున్నాను. నిఖా రోజు రానే వచ్చింది.

కరీమున్ దుల్హన్ బట్టల్లో కూడా అందమైన ఉదాసీనతలా కనిపించింది. దుఃఖం ఆమె పొడవాటి కనురెప్పల మీద బరువుగా వూగుతోంది.

వకీల్ సాక్షులతో వచ్చి, "ఐదు వేల మెహర్‌తో నిఖా కబూలహైక్యా" అని అడిగినపుడు, "కబూల్ హై" అన్న కరీమున్ బలహీనమైన స్వరంలో తరంగాలుగా ఎగసిపడ్తున్న బాధా సముద్రం.

వాళ్ళని పోనిచ్చాక మెల్లగా కరీమున్‌తో చెప్పాను. "చూశావా! మస్తాన్‌గారు ఏం చేశారో? మెహర్‌ని రెండు వేలుగా నిర్ణయించారు. నేను వదుల్తానా? గొడవ పడి మరీ మెహర్‌ని ఐదు వేలుగా ఒప్పించాను"

ఆ మాటకు మొట్టమొదటి సారి కరీమున్ పకాలున నవ్వింది. నేను ఆశ్చర్యంలోంచి తేరుకునే లోపల మరలా తెరలు తెరలుగా నవ్వింది. నవ్వాగక పొట్ట పట్టుకుని – తను దుల్హన్ అన్న విషయం కూడా మర్చిపోయి – దొంతర్లు దొంతర్లుగా నవ్వింది.

నేను గాభరాపడిపోయాను. ఎప్పుడూ నవ్వని కరీమున్ అలా ఆగకుండా నవ్వుతుంటే నాకు భయమేసింది.

“ఏమిటా పిచ్చి నవ్వు–ఆపు ఎవరైనా చూస్తే బావుండదు” అన్నాను నలుదిక్కులా చూస్తూ.

“నాకేం పిచ్చి లేదు. మీరే పిచ్చి నాన్న. మీ అమాయకత్వం చూసి నవ్వాపుకోలేక నవ్వాను”

“అదేదో అర్థమయ్యేట్టు చెప్పు” అన్నాను కొద్దిగా తీవ్రంగా.

“మెహర్ దేనికి చెప్పండి?”

“మన మతంలో ఆడదానికి గొప్ప రక్షణ మెహర్. ఖచ్చితంగా ఆ అర్థంలో కాకున్నా ఓ రకంగా మగవాడు తన భార్యకు ఇచ్చే కట్నం అనుకోవచ్చు. పెళ్ళయిన స్త్రీ విధివశాన ఒంటరిదయితే మెహర్ రూపేణా ఆమెకు అందిన డబ్బు కష్టకాలంలో అక్కరకు వస్తుంది. మెహర్ పైన పూర్తి హక్కులు స్త్రీకే ఉంటాయి. ఇంతటి గొప్ప ఆచారం ఏ మతంలోనూలేదు” అన్నాను.

“నిజమే. నేనూ ఒప్పుకుంటాను. మెహర్ నాకు నా భర్త ఇచ్చే కట్నమయితే మరి మనం కట్నం కింద ఇచ్చిన ఇరవైవేలని ఏమంటారు? మతాచారాల్ని నిక్కచ్చిగా పాటిస్తాననే మా మామగారు ఏ మతాచారం ప్రకారం మన దగ్గర ఇరవై వేలు తీసుకున్నారు? నిఖానామాలో దీని గురించి ఎందుకు ప్రస్తావించలేదు? మీరెళ్లి వీటికి సమాధానాలు కనుక్కుని రండి” అంది.

నాకు తల తిరిగినట్లయింది.

“నేనేమీ అడగలేను. నేను ఆడపిల్ల తండ్రిని. నేను ఆడపిల్ల తండ్రిని” అంటూ ఎవ్వరికీ వినిపించనంత మెల్లగా గొణుక్కున్నాను.

*(రచన ఇంటింటి పత్రిక, ఆగస్టు 2002)*

☆☆☆

# ఉత్తరం

ఆ ఉత్తరాన్ని ఆమె కనీసం డజను సార్లయినా చదివి ఉంటుంది. అయినా ఆమెకు తృప్తిగా లేదు. ఉత్తరం మడతలు విప్పినప్పుడల్లా అక్షరాలు నక్షత్రాల్లా జలజలా రాలి ఆమె ఒడిలో పడ్తున్నాయి. పాత జ్ఞాపకాలు జలపాతపు హోరులా ఆమెని ముంచెత్తుతున్నాయి.

అక్షరాల నిండా ఆత్మీయతని కూరి రాసిన ఉత్తరం అది. అందులోని ప్రతి పదం పరమాన్నంలా తీయగా ఉంది. ఒక్కో వాక్యం అమృతధారలా తన జవజీవాల్ని బలోపేతం చేస్తోంది. ఆ పదాలకు ప్రాణం ఉన్నట్లు – తమ మృదువైన పెదవుల్తో ఆమెని ప్రేమగా పల్కరిస్తున్నాయి.

అమెరికా నుండి ఆమె కొడుకు రవి రాసిన ఉత్తరం అది. దాన్నిండా పర్చుకున్న వాడి ఆలోచనలు . . . అనురాగం . . . వాక్యాలుగా మల్చుకున్న ఆత్మీయత. తన హృదయం చిదిమి అక్షరాలుగా పొదిగినట్లు . . . వాడి అందమైన మనసు పావురాయిలా మారి విహాయసాన ఎగిరి – కాగితం మీద వాలి – పదాలుగా ఒదిగినట్లు . . .

ఆమె పడుకోబోయే ముందు మరోసారి ఉత్తరాన్ని చదువుకుంది.

“అమ్మా! నీకు కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్నా నా ఆలోచనంతా నిన్నల్లుకుని ఉండిపోయిందమ్మా. అంత పెద్ద ఇంట్లో నువ్వొక్కదానివే ఒంటరిగా తిరుగాడుతుంటావన్న ఆలోచనే నాకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది. నేనెంత వద్దన్నా విన్నావు కాదు. నన్ను బలవంతంగా అమెరికాకు పంపించావు. ఏముందమ్మా ఇక్కడ? డాలర్ల మీది మోజుతో దగా పడిన సోదరులే అందరూ. ప్రేమనీ, ఆప్యాయతల్ని పంచే మనుషులకు దూరంగా . . . డాలర్లు సంపాయించే యంత్రాలు వీళ్ళు.

నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చిందని తెల్సి, నువ్వు మురిసిపోవటం గుర్తొస్తుందమ్మా. “మా రవి చాలా అదృష్టవంతుడు. వాడికి అమెరికాలో పెద్ద ఉద్యోగం దొరికింది” అని కన్పించిన ప్రతివాళ్ళకీ చెప్పావు. నిజంగా నేను అదృష్టవంతుణ్ణే . . . ఈ ఉద్యోగం దొరికినందుకు కాదు, నీలాంటి అమ్మ దొరికినందుకు. ఎన్ని జన్మల పుణ్యం చేసుకున్నానో . . . నీలాంటి గొప్ప స్త్రీకి కొడుగ్గా పుట్టాను.

అనురాగం అమ్మగా పుడితే నీలానే ఉంటుంది. నువ్వెంత కష్టపడి నన్ను చదివించావో నేనెప్పటికీ మర్చిపోలేనమ్మా! నాకు వరన్నం పెట్టడం కోసం నువ్వు జొన్న సంకటి తిన్న రోజులు నా మనసు మీద శిలాక్షరాలుగా ముద్రపడ్డాయి. నాన్నలేని లోటు తెలీకుండా నీ రెక్కలు ముక్కలు చేసుకుని నన్నింత వాణ్ణి చేశావు. నాకిక్కడ మనసు నిలవటం లేదమ్మా. మనోవేగంతో ఎగిరొచ్చి నీ ముందు వాలాలని ఉంది. నీ ఒడిలో తలపెట్టుకుని నీవు చెప్పే వూసులు వినాలని ఉంది. నీ చేతి గోరుముద్దలు తినాలని ఉంది.

ఒక్కసారి చెప్పమ్మా . . . వచ్చేయమని. ఈపాటి ఉద్యోగం నాకెక్కడైనా దొరుకుతుంది. ప్లీజ్ అమ్మా! నువ్వు దగ్గర లేకుండా ఎంత పెద్ద ఉద్యోగమైనా నాకొద్దు. వచ్చేయమని రాయమ్మా– నీ అనుమతి కోసం ఎదురుచూస్తూ . . . నీ రవి".

ఆమెకు కన్నీళ్ళు తిరిగాయి.

ఉత్తరాన్ని జాగ్రత్తగా మడిచి–దిండు కింద పెట్టుకుని కళ్ళు మూసుకుంది. తన బాబు అతి సమీపంగా తిరుగాడుతున్న అనుభూతి . . .

ఐదేళ్ళ పసివాడిగా తన పొట్టని కావలించుకుని, అల్లుకుని పడుకున్నట్లు . . .

వాడిప్పుడు తన కళ్ళకి స్పష్టంగా కన్పిస్తున్నాడు. తన అమాయకమైన నవ్వుని గదంతా పరిచి . . . ఆనందంతో కేరింతలు కొడుతున్నాడు. అల్లరితో మురిపిస్తున్నాడు.

దిండు కిందికి చేయి పోనిచ్చి కాగితపు మడతల్ని తడిమిందోసారి. వాడికి ఏడాది వయసున్నప్పుడు – గులాబీరేకుల్లా ఉన్న వాడి బుగ్గల్ని తడిమిన అనుభూతి ఆమెకు.

రవికి పదేళ్ళప్పుడు ఆమె భర్త టైఫాయిడ్ జ్వరంతో ప్రాణాలు విడిచాడు.

కొండంత దుఃఖాన్ని గుండెలపై మోస్తూనే, రవికోసం పిడికెడంత ధైర్యాన్ని కూడగట్టుకుంది. కలో గంజో తాగి కొడుకుని కష్టమనేది తెలీకుండా పెంచింది. వాడి చదువుకోసం నాలుగెకరాల మాగాణీ భూమిని అమ్మేసింది. ఆమె ఆస్తి తన కొడుకే. ఆమె అస్తిత్వం . . . ఆమె ఆశా, శ్వాసా అంతా తన కొడుకే . . .

రవి కూడా బాధ్యతగా చదువుకుని కంప్యూటర్స్‌లో ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. తన రవి అందరు పిల్లల్లా కాదు. వాడికి అనుబంధాల్లో ఉండే ఆర్ద్రత తెలుసు – మమకారాల్లోని మాధుర్యం తెలుసు. వాడిది చాలా సున్నితమైన మనసు.

తమ వూరి నుండి అమెరికా వెళ్ళి, ఉద్యోగాలు తెచ్చుకుని అక్కడే స్థిరపడ్డవారు ఏడెనిమిది మంది వరకూ ఉంటారు. అక్కడికెళ్ళాక, డాలర్ల మాయామోహంలో పడి, కళ్ళు కన్పడక అమ్మానాన్నల్ని, కన్నతల్లిలాంటి వూరిని మర్చిపోయిన వాళ్ళే అందరూ. రవి అలా కాదు.



Rupaye_Chettu.pm7 97 28/7/19, 12:03 AM

వాడికి ఈ పల్లెటూరన్నా, తన కన్నతల్లన్నా అనంతమైన ఇష్టం.

ఏడాది తిరిగేసరికి శెలవుపెట్టి ఇంటికొచ్చిన రవితో, "నేనేమైపోతానోనని దిగులు పెట్టుకున్నావా పిచ్చితండ్రీ! నాకేం, నిక్షేపంలా ఉన్నాను. ఏవేవో వూహించుకుని బంగారంలాంటి ఉద్యోగాన్ని, మంచి భవిష్యత్తుని వదులుకోకు" అని నచ్చ చెప్పింది. వాడు తిరిగి వెళ్ళేలోపల మంచి అమ్మాయిని చూసి పెళ్ళిచేసింది. "నా కొడుకు నన్ను మర్చిపోయేంతగా వాణ్ణి ప్రేమించు. వాడి జ్ఞాపకాల్లో నువ్వు తప్ప నేనుండనంత అపురూపంగా చూసుకో" అంటూ ఆ అమ్మాయికి అప్పగింతలు పెట్టింది.

తీరా వాళ్ళు అమెరికా వెళ్ళిపోయాక ఆమెకు భయం పట్టుకుంది. 'నిజంగానే వీడు నన్ను మర్చిపోతాడా? భార్య మోజులో పడి నాకు దూరమై పోతాడా?' స్త్రీ సహజమైన అభద్రతా భావం ఆమెను అశాంతికి గురి చేసింది. అదంతా అర్థం లేని భయమనీ – తన రవి ఎప్పటికీ మారడని వాడినుంచి యథావిధిగా వారం వారం వచ్చి వాలిన ఉత్తరాలే సాక్షిగా నిలిచాయి.

"అమ్మా! నేను ఒంటరిగా ఉండి కష్టపడుతున్నానని నాకు పెళ్ళి చేశావు. నాకు తను తోడున్నా, నువ్వు లేని ఒంటరితనాన్ని ఎవ్వరూ దూరం చేయలేరమ్మా! పెళ్ళయాక నువ్వు మరీ గుర్తొస్తున్నావు. తను ఏ పనిచేసినా, అమ్మైతే ఇలా చేసేదా? ఇంకా బాగా చేసేది కదూ అన్పిస్తోంది. తను ఏం మాట్లాడినా అమ్మైతే ఇంకా ప్రేమగా మాట్లాడి ఉండేది అన్పిస్తోంది. ఇంత పెద్దయినా వీడు అమ్మకూచి అని నవ్వుకుంటున్నావు కదూ!

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! నాకెప్పుడూ నీ దిగులే. మన వూరికి టెలిఫోన్ కనెక్షన్ వస్తే బావుంటుంది. ప్రతిరోజూ నీకు ఫోన్ చేసి నీ యోగక్షేమాలు కనుక్కోవచ్చు. మన సిటీల్లో దొరికే అన్ని సౌకర్యాలు ఇక్కడి పల్లెటూర్లలో దొరుకుతాయి.

సౌకర్యాలకూ, సౌఖ్యాలకూ ఇక్కడ కొదువలేదమ్మా. కానీ మనుషుల మధ్య ఆప్యాయతలూ అనురాగాలే ఉండవు. అంతా డబ్బుతో ముడిపడి మెకానికల్ జీవితం . . . మరయంత్రాలు మాట్లాడ్తున్నట్లు . . . డాలర్ నవ్వులు . . . ఇదంతా మాయాజలతారు. రోబోలు కదుల్తున్నట్లే ఉంటుంది. అమ్మ అనేది అలౌకికమైన అనుభూతి అని ఇక్కడ చాలామందికి తెలియదు. అయినా అందరికీ నీలాంటి అమ్మ దొరకొద్దూ !

ఎన్ని జన్మలెత్తినా నువ్వే నాకు అమ్మగా కావాలని కోరుకునే – నీ రవి".

ఆ ఉత్తరాన్ని ఆమె కనీసం పాతిక సార్లయినా చదివి ఉంటుంది.

ఇప్పుడు ఆర్థికంగా ఏ లోటూ లేదు. వూళ్ళోనే పదెకరాల మాగాణి కొనుక్కున్నారు. ఇంట్లో కలర్ టీవీ ఉంది. టేప్ రికార్డర్ ఉంది. అయినా ఇవేవీ ఆమెకు ఆనందాన్నివ్వవు. రవి నుంచి

వచ్చిన ఉత్తరాలు చదువుకోవడంలో ఉన్న ఆనందం ఆమెకు ఎందులోనూ దొరకదు. అవి దొంతర్లు దొంతర్లుగా పేర్చిన అనురాగ తరంగాల్లా కన్పిస్తాయామెకు.

రవి నుంచి మరో ఉత్తరం వచ్చేవరకు ఆమె పాత ఉత్తరాల్ని తీసి, పదే పదే చదువుకుని మురిసిపోతూ ఉంటుంది.

వీడికి నేనంటే ఎంత ప్రేమ అనుకోగానే ఆమెకు కొండంత బలం వచ్చినట్లవుతుంది. ఉత్సాహం నరాల్లో ఉరకలు వేస్తుంది. ఆమెకు ఒంటరితనం అన్పించదు. రవి రాసిన ఉత్తరాలు ఆమెని పల్కరిస్తాయి. వాటిలోని అక్షరాలు ఆమెని పరామర్శిస్తాయి. అవి ఆమెని నవ్విస్తాయి. ఆనందం అవధులు దాటితే ఏడ్పిస్తాయి కూడా.

పెళ్ళయిన ఏడాదికి అమ్మను చూడాలని నెలరోజులు శెలవు పెట్టి వచ్చాడు రవి. ఊరికి కొత్తగా టెలిఫోన్ కనెక్షన్లు ఉండటం చూసి, ఇంట్లో టెలిఫోన్ పెట్టిస్తానన్నప్పుడు ఆమె సంతోషపడింది. తన రవి గొంతు వినొచ్చు. వాడితో బోల్డు కబుర్లు చెప్పొచ్చు. కోడలికి అవసరమైన సలహాలివ్వొచ్చు. ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలో అనుకుంది.

టేబిల్ మీద ఫోన్ గువ్వపిట్టలా ఒదిగి ఉండటం చూసి ఆమె ఎంత సంబరపడిందో! అమెరికా నుంచి రవి మొదటిసారి ఫోన్ చేసినప్పుడు ఆమెలో ఆపుకోలేనంత ఉద్వేగం !

“అమ్మా! ఎలా ఉన్నావు?” అన్నాడు రవి.

“బావున్నాను బాబూ! నువ్వూ, అమ్మాయి ఎలా ఉన్నారు?” అందామె.

“ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! ఏ కొద్ది నలతగా అన్పించినా ఫోన్ చేయి. డబ్బులు ఎక్కువవుతాయని ఆలోచించకు. నీకెన్నిసార్లు చేయాలనిపిస్తే అన్నిసార్లు చేయి. ఇదిగో నీ కోడలితో మాట్లాడు” అని ఫోన్ తన భార్యకిచ్చేశాడు.

తీరా ఫోన్ సంభాషణ పూర్తయాక ఆమెకెందుకో అసంతృప్తి అన్పించింది. రవి తనతో మరికొద్దిసేపు మాట్లాడి ఉంటే బావుండేదనిపించింది.

ఆమెకు చాలాసేపు అశాంతిగా అన్పించింది.

మనసుని కుదుటపర్చుకోడానికి పాత ఉత్తరాల్ని ఆశ్రయించింది. ఆ పదాల్లో సాంత్వన వెతుక్కుంది. మొదట్లో రెండ్రోజులకోసారి ఫోన్ వచ్చేది.

“అమ్మా! బావున్నావా? ఆరోగ్యం ఎలా ఉంది?” లాంటి రొటీన్ పదాలు తప్ప అందులో ఆత్మీయతా స్పర్శ కొరవడింది. మొదట్లో వాడి గొంతు వినటం హాయిగా ఉండేది. రాను రాను ఆ గొంతులోని మార్దవతకన్నా గుండెల్లోని తడి మాటలుగా మారి వెలువడటం లేదన్న స్పృహ బాధాకరంగా పరిణమించింది.

ఫోన్ పెట్టించాక ఉత్తరాలు రావడం ఆగిపోయాయి. పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూడటంలో ఉన్న ఒకప్పటి థ్రిల్ ఆమెకు దూరమైంది. అతను “సుందరమ్మా! ఈ రోజు మీ అబ్బాయి నుంచి ఉత్తరం లేదు” అన్న వెంటనే కలిగే కుంగుబాటు . . . రేపు తప్పకుండా వస్తుందన్న ఆశ . . . ఉత్తరం వచ్చిన రోజు ఎగిరి ఆకాశాన్ని అందుకున్నంత ఆనందం . . . మరలా ఎదురుచూపు . . . ఆత్మీయవ్యక్తి రాకకోసం ఎదురుచూస్తున్నంత ఆశగా . . . ఆర్తిగా . . .

గంటలతరబడి ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని చెవులు రిక్కించి వింటూ ఉండటం, తీరా మోగాక – “ఎలా ఉన్నావమ్మా” అనే సాధారణమైన పలకరింపుతో హతాశురాలవటం . . . ఆ తర్వాత అనంతమైన దుఃఖభారాన్ని మోస్తున్నట్లు రోజంతా గడపటం . . .

వాడు ఫోన్‌లో మాట్లాడిన మాటల్ని నెమరువేసుకుని ఆనందిద్దామన్నా . . . ఒక్క మాటా గుర్తుకు రాదు. వీణ తంత్రుల్ని వేలి కొసలు మీటినంత మధురంగా, హృదయ తంత్రులపైన ఏ పదమూ సుతారంగా వాలదు.

ఆమెకీమధ్య జీవితం దుర్భరంగా తోస్తోంది. అంతా శూన్యం. దేనిమీదా ఆసక్తి కలగటం లేదు. అన్నీ మృతప్రాయమైన క్షణాలు. మొదట్లో గువ్వ పిట్టలా కన్పించిన టెలిఫోన్ ఇప్పుడు గుడ్లగూబలా భయపెడుతోంది. కొన్ని కోట్ల క్షణాల అంతరం తర్వాత మోగే ఫోన్ తంత్రుల్లోంచి వెలువడేవి ధ్వని తరంగాలు తప్ప లయాత్మకమైన స్వరఝురీ తరంగాలు కావవి.

ఒకప్పుడు ఫోన్ మోగుతుందన్న ఆశతో ఎదురు చూసేది. ఇప్పుడు ఆమెని ఆవరించిన నిర్లిప్తత . . . మోగితే ఏమిటి? మరింత గాయం చేయటం తప్ప . . . వాడి నుంచి ఏదో ఆశించటం . . . అది దొరక్క నిరాశకు గురి కావటం . . . నిస్పృహ . . . నిస్సత్తువ . . .

ఫోన్ మోగకపోవటమే మంచిదన్న ఆలోచన. మోగకపోతే ‘అయ్యో! వీడు కనీసం అమ్మా, ఎలా ఉన్నావు అనైనా అడగటం లేదే’ అన్న ఆరాటం. తీరా వాడు ఆ నాలుగు మాటలు మాట్లాడి పెట్టేశాక ‘అయ్యో! వాడు నాతో సరిగ్గా మాట్లాడలేదే’ అన్న బాధ. ఇదంతా ఒక వలయంలా మారి ఆమెను అల్లుకుని, చుట్టుకుని, చక్రబంధంలో బిగించినట్లు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఆర్నెల్లు ఆరు యుగాల్లా భారంగా గడిచాయి.

ఆమెకిక దుస్సహమన్పించింది. ఉగాది ఇంకో వారం ఉందనగా ఫోన్ మోగింది. అయిష్టంగా ఆమె ఫోన్ దగ్గరకు నడిచింది.

“అమ్మా! ఎలా ఉన్నావు? ఉగాది నీకిష్టమైన పండగ కదా. నీకేమైనా గిఫ్టుగా పంపాలనుకుంటున్నానమ్మా. నేనే ఏదో ఒకటి పంపటం కంటే నీక్కావల్సింది పంపిస్తే

బావుంటుంది కదా. ఏం కావాలో అడుగమ్మా” అన్నాడు రవి.

“నాకెందుకురా గిఫ్టులు? అయినా నాకేం తక్కువైందని?” అందామె.

“అలా కుదరదమ్మా! నువ్వెప్పుడూ నోరు తెరిచి నాకిది కావాల్రా రవీ అని అడగలేదు. ఈసారి నువ్వడగాలి. నేను పంపించాలి. అంతేనమ్మా” అన్నాడు.

ఆమె అర నిమిషం ఆలోచించి, “సరేరా రవీ! నాకేం కావాలో నేను ఉత్తరంలో రాస్తాలే” అని పెట్టేసింది.

వెంటనే ఆమె తన కొడుక్కి ఉత్తరం రాయడానికి కూచుంది.

“బాబూ! మానవ సంబంధాలు మెరుగుపడాలంటే సమాచార వ్యవస్థ బలంగా ఉండాలన్న విషయం నాకు తెలుసు. ఉత్తరం కన్నా ఫోన్ సౌకర్యం ఆధునికమైందనీ తెలుసు. కానీ ఆధునికత ముసుగులో మనం అనుబంధాల్ని జారవిడ్చుకుంటున్నామేమో అనిపిస్తోంది.

రెండేళ్ళ క్రితం మన పోస్టుమాన్ వెంకయ్య సంచినిండా ఉత్తరాలు పెట్టుకుని సైకిల్‌మీద ఇల్లిల్లూ తిరిగేవాడు. మన వూరికి టెలిఫోన్ వచ్చాక పిడికిట్లో పదో పాతికో ఉత్తరాల్తో కన్పిస్తున్నాడు. జీవితంలో వేగం పెరిగింది. ఉత్తరం రాసేంత తీరిక ఎక్కడుందీ అంటూ ప్రతివాడూ ఫోన్లో మాట్లాడేస్తున్నాడు. ప్రతి దానికీ ఫోన్ వాడేస్తున్నారు. నాకెందుకో ఉత్తరం అవసానదశకు చేరుకుందనిపిస్తోంది. అత్యవసరమైన విషయాన్ని క్షణాల్లో చేరవేసే అద్భుతమైన సాధనం ఫోన్. వ్యాపార లావాదేవీలకు చాలా అనువైన సాధనం టెలిఫోన్. దాని ఉపయోగం అంతవరకే.

మన జీవితాలతో పురాతనకాలం నుండి పెనవేసుకుపోయింది ఉత్తరం. మన హృదయాన్ని అక్షరాలుగా కాగితం మీద పేర్చటం ఉత్తరం ద్వారానే సాధ్యపడుతుంది.

పొడిగా పరామర్శించడానికి పనికి వచ్చే ఫోన్ సంభాషణ నాకు రుచించటం లేదురా అబ్బాయ్. అలాగని ఫోన్ తీసేయమని నేననను. నాకు అనారోగ్యం చేసినా, ప్రాణాలు పోయే పరిస్థితి దాపురించినా నీకు కబురందించడానికి ఫోన్ ఉండాలి. కానీ దానికి తల్లీకొడుకుల మధ్య కబుర్లు మోసుకెళ్ళేంత ఆర్ద్రత లేదురా. గుండెలోని తడి స్పర్శ చేరవేయడం దానికి చాతకాదు.

ఉగాదికి నాకేం కావాలో అడగమన్నావుగా? నాకో ఉత్తరం రాయి బాబు . . .

ఉత్తరాన్ని చంపొద్దు. అది నాలాంటి తల్లుల వాత్సల్యం మోసుకెళ్ళి బిడ్డల్ని లాలించగలదు. అమ్మ ఆశలకు అనుగుణంగా కొడుకుల ఆత్మీయతల్ని చేరవేయగలదు. అందుకేరా రవీ . . . నాకు ఉత్తరం రాయి. ఇకనించీ ఉత్తరాలే రాయి. అమ్మకోసం ఆ మాత్రం సమయం నీకు దొరుకుతుందనే ఆశిస్తాను.

మనలాంటివాళ్లైనా కొనవూపిరితో వున్న ఉత్తరానికి వూపిరి వూదకపోతే అది చచ్చిపోతుందిరా. మనం దాన్ని బతికించుకోవాలి.

ఉత్తరం బతికుండాలి. నాలాంటి వాళ్ళని బతికించాలి.

నీ ఉత్తరం కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తూ – అమ్మ".

ఆమె కళ్ళ నుండి జారిన రెండు కన్నీటిబొట్లు ఆ ఉత్తరం మీద తమ సాక్షి సంతకం చేశాయి.

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక - 12 సెప్టెంబర్, 2002)*

★★★

# నూకలు

రవి ఆఫీసులోకి అడుగుపెట్టే సమయానికి ఒక్క శాల్తీ రాలేదు. సమయం తొమ్మిదింపావు. తొమ్మిదింటికే వచ్చి ఆఫీసర్‌గారి రూంని శుభ్రం చేసి ఉంచాల్సిన ప్యూన్ రాలేదు. ఎనిమిదిన్నరకే వచ్చి ఆఫీస్ మొత్తం వూడ్చి బల్లలూ, కుర్చీలు తుడవాల్సిన స్వీపర్ రమణమ్మ రాలేదు. తొమ్మిదింపావుకి రావాల్సిన ఆఫీసరూ రాలేదు.

తను కూర్చునే కుర్చీని-బల్లని తనే తుడుచుకుని కూర్చున్నాడు రవి. మరు నిమిషం ఫైల్స్ చదివి నోట్ తయారుచేసే పనిలో నిమగ్నమైపోయాడు.

అది కేంద్ర ప్రభుత్వ కార్యాలయం. వారానికి అయిదు రోజులే పని. పనిగంటలు తగ్గకూడదన్న ఉద్దేశంతో ఇంతకు క్రితం ఉదయం పది నుంచి సాయంత్రం అయిదు వరకూ ఉండే ఆఫీస్ టైంని ఉదయం తొమ్మిదింపావునుండి సాయంత్రం అయిదూ ముప్పావు వరకూ పెంచారు. అయినా పదికి ముందుగా ఎవ్వరూ రావు. అయిదు తర్వాత ఎవ్వరూ ఉండరు.

ఆఫీసర్ విశ్వనాథం పదింటికి వచ్చాడు. తన రూంలోకి వెళ్ళగానే బర్రుమని బజ్జర్ మోగించాడు.

రవికి అతని చర్య అర్థరహితమనిపించింది. అతను తన ఛాంబర్‌లోకి వెళ్ళేముందు చూసుకునే ఉంటాడు కదా-ప్యూన్ రాలేదన్న విషయం తెలిసీ బజర్ మోగిస్తే ఎవరు పలుకుతారని అతని ఉద్దేశం?

మరలా బెల్ మోగింది. ఈసారి ఎక్కువ సేపు మోగింది.

'ఆఫీసర్‌గారు కదా-పోనీలే' అనుకుని రవి అతని రూంలోకెళ్ళాడు.

విశ్వనాథం చిరాగ్గా ఉన్నాడు. రవిని చూడగానే-అతను చెప్పిన 'గుడ్ మార్నింగ్ సార్'ని పట్టించుకోకుండా "ఏడండీ ప్యూను? ఇంకా రాలేదా? లేక వచ్చి బైటెక్కడైనా నిలబడి బీడీ కాలుస్తూ బాతాఖానీ కొడ్తున్నాడా?" అని అడిగాడు.

"ప్యూన్ రాలేదు సార్-స్టాఫ్ కూడా ఎవ్వరూ రాలేదు"

"ఎందుకొస్తారండీ? రారు . . . గవర్నమెంటాఫీస్ కదా. నెల తిరగ్గానే పనిచేసినా చేయకున్నా



Rupaye_Chettu.pm7 103 28/7/19, 12:03 AM

తేరగా జీతం వస్తుందిగా. అయినా తొమ్మిందిపావుకి ఆఫీస్‌కి రావాల్సింది పది దాటినా రాలేదంటే ఏమనాలి? అటెండెన్స్ రిజిస్టర్ పట్రండి . . . అందరికీ రెడ్‌మార్క్ పెట్టేస్తాను.”

“అటెండెన్స్ రిజిస్టర్ సూపర్‌వైజర్‌గారి దగ్గర ఉంటుంది. ఆయన కూడా రాలేదు సార్”

“అదేనండీ మన దౌర్భాగ్యం. పంక్చువాలిటీ అనేది మొదట మన నుండే ప్రారంభం కావాలి. ఆఫీస్ సిబ్బందిని అజమాయిషీ చేయాల్సిన సూపర్‌వైజరే పది దాటినా రాకపోతే–మిగతా స్టాఫ్‌ని తొమ్మిదింపావుకే ఆఫీసులో ఉండాలని శాసించే నైతిక బలం అతను కోల్పోయినట్లే కదా” అన్నాడు రవిని కూచోమని సైగ చేస్తూ.

‘మీరు కూడా రోజూ ఆలస్యంగానే వస్తారు కదా. మరి ఆఫీసర్ అయిఉండీ, మిగతా సిబ్బందికి ఆదర్శంగా ఉండాల్సిన మీరే ఆలస్యంగా వస్తే స్టాఫ్ మీ మాటకు విలువ ఇస్తారా సార్’ అని రవి మనసులో అనుకున్నాడు తప్ప పైకి అనలేకపోయాడు.

“మీకు అప్పగించిన పని ఎంతవరకైంది?” నవ్వుతూ అడిగాడు విశ్వనాథం.

“సార్, మన ఆఫీసులో ఐదుగురు గుమస్తాలున్నారు. మీరేమో అందరూ చేయాల్సిన పనిని నా ఒక్కడి మీదే వేసి చేయమంటున్నారు. మిగతా నలుగురూ పిక్నిక్‌కి వచ్చినట్లు ఆఫీస్‌కొచ్చి మూడు టీలు, ఆరు సిగరెట్లుగా జల్సా చేసి, నెల తిరిగేసరికి జీతాలు పుచ్చుకుంటున్నారు. ఇది అన్యాయంగా మీకు అన్పించటం లేదా?”

“మీరే అలా అంటే ఎలా మిస్టర్ రవీ? మీరొక్కరే మన ఆఫీసులో సిన్సియర్‌గా పనిచేసేది. ఇంకో పదిరోజుల్లో ఇన్‌స్పెక్షన్ ఉంది. మిగతా నలుగుర్ని నమ్మి పని అప్పగిస్తే నాకు అక్షింతలు ఖాయం. మీకు బర్డెనే . . . కాదనను. మీరు రేపోమాపో సూపర్‌వైజర్ అవుతారు. ఆ తర్వాత . . . ఆఫీసర్ అవుతారు. మీ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్‌లన్నీ ప్రత్యేక శ్రద్ధతో రాస్తాను. మీకు మంచి భవిష్యత్తు ఉంది. మీరే ఎలాగోలా పనంతా పూర్తి చేయాలి.” అతని పొగడ్తలు రవికి ఇసుమంతైనా రుచించలేదు.

“కష్టం సార్–కనీసం ఇంకొక్క హ్యాండ్‌నైనా ఇవ్వండి”

“ఎవర్నిమ్మంటారో మీరే చెప్పండి”

“సుదర్శన్ ఉన్నాడు కదండీ . . . ఖాళీగా కూచుని ఉంటాడు. మీరతనికి ఏ పనీ అప్పగించరాయె.”

“పని అసైన్ చేయటం సమస్యకాదు రవీ. ఆ పనిని అతను సక్రమంగా చేయగలడా లేడా అనేది ఆలోచించాలి. అతను చేశాడనుకోండి. తప్పులతడకలు . . . ఆడిట్ అబ్జెక్షన్లు. డబుల్



Rupaye_Chettu.pm7 104 28/7/19, 12:03 AM

పని అవుతుంది తప్ప సుఖమేముంది చెప్పండి? దానికి తోడు అతను ఫిజికల్లీ హ్యాండికాప్డ్ కదా.”

“అయితే ఏమిటిసార్? జీతం తీసుకోవడం లేదా? మనమేమీ అతను చేయలేని పనిని చేయమని చెప్పటం లేదుగా. రోజుకు పదిసార్లు మెట్లెక్కి దిగమనో లేకపోతే పరుగెత్తమనో అంటే తప్పు. అతను చక్రాల కుర్చీలో వస్తాడు. నిజమే – కానీ చేతులు రెండూ బాగానే ఉన్నాయిగా – మెదడు సవ్యంగానే పనిచేస్తుందిగా. అతనికి ఫైళ్ళు చూడటం రాదని వదిలేస్తే ఎలా సార్? అతనికి నేర్పాలి. రోజూ ఆఫీస్‌కొచ్చి పేపర్ చదువుకోవటం, పనికిరాని కబుర్లు చెప్పటం తప్ప అతను చేస్తున్నదేమిటి? హ్యాండికాప్ అన్న కన్‌సర్న్ మనకుండటం న్యాయమే– కానీ మరీ ఆఫీసు ధర్మసత్రం కాకూడదు. ఎవరు చేయగల పని వాళ్ళు చేస్తేనే కదా ప్రగతి సాధ్యపడుతుంది. మన వంతు సహకారం అందిస్తేనే కదా దేశం పురోగతి సాధిస్తుందీ.”

“అందమైన వాక్యాల్తో స్పీచ్ ఇవ్వటం నాకూ వస్తుంది. కానీ అతను మాట వినే రకం కాదు. మొండికేస్తాడు. ఏం చేయగలం చెప్పండి? కావాలంటే మీరు చెప్పి చూడండి. అతను ఒప్పుకుంటే నాకేం అభ్యంతరం లేదు.”

“అలా అంటారేమిటి సార్? అతను ఒప్పుకోవడమేమిటి? మనం మన స్వంతపని అంటగట్టటం లేదుగా . . . ఆఫీస్ పని. చేయడం అతని బాధ్యత. అతని చేత జీతానికి సరిపడా పని చేయించుకోవడం మీ బాధ్యత. పోనీండి. నాకెందుకు? కనీసం క్రిష్ణయ్యతో చెప్పండి.”

“అతనా? నేను ఉద్యోగంలో ఉండాలనే ఉందా? అతన్దంతా క్రిమినల్ బ్రెయిన్ కదండీ . . . ఎప్పుడు అవకాశం దొరుకుతుందా, ఎదుటివ్యక్తిని ఇరికిద్దామా అని చూస్తుంటాడు. అతను తెలివికలవాడే–కానీ అతితెలివి. డేంజరస్ తెలివి. మనం ఇచ్చే ప్రతి ఫైలునీ తన లాభానికి ఎలా వాడుకోవాలా అని ఆలోచిస్తుంటాడు. ఏదీ వీలుకాకపోతే ఫైళ్ళని కిలోల లెక్కన అమ్ముకుంటాడు. మీకు తెలియదా చెప్పండి.”

“అతని మీద యాక్షన్ తీసుకోండి. అతను మరలా ఇల్లీగల్‌గా ప్రవర్తించకుండా కట్టడి చేయండి. సస్పెండ్ చేయండి . . .”

“అతని మీద ఇప్పటికే డిసిప్లినరీ ప్రొసీడింగ్స్ నడుస్తున్నాయి. అంతకంటే మనం చేయగలిగింది ఏముంది? అతను చేసే అక్రమాలు మనకు తెలుసు. కానీ సరియైన రుజువులు లేకుండా సస్పెండ్ చేయడం సాధ్యం కాదు. అందుకే అతన్ని వదిలేసి మరో ఛాయిస్ చెప్పండి”

రవి ఓ నిమిషం ఆలోచించాడు. సుదర్శన్, క్రిష్ణయ్యల్ని వదిలేస్తే మిగిలింది ఇద్దరే-పాషా, క్రిస్టాఫర్. పాషా ఆఫీస్‌కి రాడు. అదేమని అడిగితే మెడికల్ లీవు మీద నెలల తరబడి శెలవు పెట్టేస్తాడు. క్రిస్టాఫర్‌కి మతిస్థిమితం లేదు. ఆఫీస్‌లో కూచుని తనలో తనే ఏదో మాట్లాడుకుంటూ ఉంటాడు. దీర్ఘంగా ఆలోచిస్తూ . . . హఠాత్తుగా కనుబొమలు ముడివేసి రౌద్రంగా మొహం పెడ్తాడు. ఎటొచ్చీ అల్లరి చేయడు-బుద్ధిగా కూచుని మొహంలో దిగులు, కోపం, విచారంలాంటి హావభావాలు ప్రదర్శిస్తూ-గాల్లో ఏవో గీతలు గీస్తూ ఉంటాడు. అతని భార్య పక్కింటి శ్యామ్యూల్‌తో లేచిపోయిన దగ్గర్నుంచీ ఇదేవరస. పిల్లలిద్దరూ పసివాళ్ళు. ఇతన్ని ఉద్యోగంలోంచి తీసేస్తే వాళ్ళు రోడ్డున పడ్తారు.

"ఇంకెవరున్నారు సార్? క్రిస్టాఫర్ సంగతి మనకు తెల్సిందే-పాషా ఆఫీసుకి రాడు-ఓ మెమో ఇచ్చి పాషాను పిలిపించండి సార్-మీరలా వూరుకుంటే పనులెలా జరుగుతాయి?"

"నా చేతుల్లో ఏముందండీ? మన రూల్స్ అలా ఏడ్చాయి. మెడికల్ సర్టిఫికెట్స్‌ని బజార్లో పిప్పరమెంట్లు కొనుక్కున్నట్లు కొనుక్కోవచ్చాయె. దాన్ని నా మొహాన పడేసి వెళ్ళిపోతే నేనేం చేయగల్ను?"

"అతనికి నిజంగా ఏ అనారోగ్యమూ లేదు సార్. మనిషి దుక్కలా ఉన్నాడు. శెలవ పెట్టి సైడ్ బిజినెస్ చేసుకుంటున్నాడు. ఇటు నెల కాగానే జీతమూ వస్తుంది. అటు వ్యాపారం కూడా లాభసాటిగా ఉంది. అతని పనే హాయిగా ఉంది."

"నాకూ తెలుసు. నేను మెమో ఇస్తే అతను కోర్టుకెళతాడు. కోర్టు డాక్టరిచ్చిన సర్టిఫికెట్‌ని నమ్ముతుంది తప్ప అతను 'ఫిట్ యాజ్ ఎ ఫిడిల్' అని మీరూ, నేనూ అంటే నమ్మదు. మెడికల్ లీవులో ఉన్న అభాగ్యుణ్ణి జాయిన్ కమ్మని బలవంత పెట్టటానికి నీకెన్ని గుండెలు అని నన్ను నిలదీస్తుంది."

"మరి వీళ్ళందరి పని నేనొక్కణ్ణే ఎంత కాలమని చేయను?"

"మీ ప్రాబ్లం అర్థం చేసుకోగలను. గత్యంతరం లేకే మీపైన భారం మోపాల్సి వస్తోంది. త్వరలో ప్రభుత్వం వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం అనౌన్స్ చేయబోతోంది. వీళ్ళలో ఒక్కరిద్దరైనా వి.ఆర్.యస్‌కి ఆప్ట్ చేస్తారనుకుంటున్నా. ఆ రకంగా మనకు కొంత చెత్తయినా తగ్గు తుందిగా" అదో రకంగా నవ్వాడతను.

"హాయిగా ఆఫీస్‌లో పనీపాటా లేకుండా కూచుని-జీతం తీసుకుంటూ-దాన్ని కాదని కాలదన్నుకుని వి.ఆర్.యస్ తీసుకునే వెర్రివెధవలు ఎవరుంటారు సార్? చివరికి మతి సరిగ్గా లేని మన క్రిస్టాఫర్ కూడా అందుకు ఒప్పుకోడు."

"అలా తీసిపారేయకండి మిస్టర్ రవీ. మన ప్రభుత్వం పదిశాతం ఉద్యోగుల్ని వదిలించుకునే కృతనిశ్చయంతో ఉంది. అందులో ఇలాంటివాళ్లు కొట్టుకునిపోతే మన ఆఫీసు పని సామర్థ్యం, నాణ్యత తప్పకుండా పెరుగుతాయి. అప్పటివరకూ మీరే ఎలాగో సర్దుకుపోవాలి–ప్లీజ్" అన్నాడు అభ్యర్థనగా.

రవి నిట్టూర్చి బైటికి వచ్చాడు.

సమయం పదింపావైంది.

స్వీపర్ రమణమ్మ నీటుగా సింగారించుకుని ఆఫీస్‌లోకి అడుగు పెట్టింది.

'ఈ రెండేళ్లలో ఎంత నున్నగా, బలంగా తయారైందీ' అనుకున్నాడు రవి.

రమణమ్మ రవి వాళ్ళింట్లో పాచి పని చేసేది. మరో రెండు మూడిళ్ళలో పనిచేసుకునే రమణమ్మ పూచిక పుల్లలా ఉండేది. మొగుడు రోజూ తాగొచ్చి చితక బాదేవాడు. ఇంత బలహీనమైన శరీరం అన్నన్ని దెబ్బల్ని ఎలా భరిస్తుందోనని తను బోల్డు జాలిపడిపోయేవాడు. నలుగురు పిల్లలున్నారని–వాళ్ళ కడుపులు నింపటం కనాకష్టంగా ఉందని ఓసారి తన కాళ్ళా వేళ్ళాపడి బతిమాలితే, ఈ ఆఫీస్‌లో రెండేళ్ళక్రితం తనే చేర్పించాడు. అపుడేదో టెంపరరీ వేకెన్సీ ఒకటుందని తెలుసుకుని ఆఫీసర్‌గార్ని ఒప్పించి రమణమ్మని జాయిన్ చేయగలిగాడు. ఇపుడామె పర్మినెంట్ ఉద్యోగస్థురాలైంది. గవర్నమెంట్ సొమ్ము తిని బాగా వళ్ళు చేసింది. బలహీనంగా ఉండే ఒకప్పటి రమణమ్మకూ–పీపాలా వూరిన ఈ రమణమ్మకూ అస్సలు పోలికే లేదు.

చీపురుకట్ట వయ్యారంగా పట్టుకుని–పైపైన పది నిముషాల్లో వూడ్చేసి "వస్తానయ్యా–ఇంట్ల మస్తు పనుండాది" అంది రవితో.

"రమణమ్మా . . . మీ ఇల్లయితే ఇలానే శుభ్రం చేస్తావా?" అన్నాడు రవి.

"గిట్లనే చేస్త–ఏం ఫర్కున్నదో చెప్పుమల్ల" ఎదురు ప్రశ్నించింది.

వాదనతో లాభం లేదని లేచి కుర్చీలు, బల్లలు పక్కకులాగి మూలల్లో పేరుకుపోయిన దుమ్మంతా దగ్గరుండి తుడిపించాడు. రమణమ్మ అయిష్టంగా మూతి బిగించి ఏదోలా అయిందనిపించింది.

స్వీపర్ సాయంత్రం నాలుగు వరకైనా ఆఫీసులో ఉండాలి. కానీ రమణమ్మ అరగంటకు మించి అరక్షణం ఉండదు. ఆఫీస్ పని దొరికింది గదా అని ఇళ్ళలో పనిచేయటం ఆమె మానుకోలేదు. అందుకే ఏదో ఓ సాకు చెప్పి జారుకుంటుంది.

ఆమె వెళ్ళిపోయాక గుమాస్తాలు ఒక్కరొక్కరే రావటం ప్రారంభించారు. ఫ్యానుతో



Rupaye_Chettu.pm7 107 28/7/19, 12:03 AM

కబుర్లాడుతూ సూపర్‌వైజర్ ఆఫీస్ ప్రవేశం చేశాడు.

సూపర్‌వైజర్ దగ్గరున్న అటెండెన్స్ రిజిస్టర్ తీసుకుని సంతకం పెడుతూ, "సార్! ఇప్పుడు టైం పావుతక్కువ పదకొండు. ఈ టైంలో మాచేత సంతకాలు పెట్టించుకునే భాగ్యానికి రిజిస్టర్‌ని మీ అల్మైరాలో లాక్‌చేసి భద్రపరచాల్సిన అవసరం ఏముంది?" అన్నాడు రవి.

"అమ్మమ్మా! అలా అనకండి రేపటి, ఎల్లుండి సంతకాలు కూడా ఈరోజే పెట్టేసే ప్రబుద్ధులున్నారు. కాదంటారా?"

"నిజమే. అలాంటప్పుడు మీరు మా అందరికంటే ముందొస్తే బావుంటుంది కదా"

"చూడండి మిస్టర్ రవీ! మీరు సీనియర్, కాబోయే సూపర్‌వైజర్. అంతే గాని నాపై ఆఫీసర్ కాదు. ఆయనే అడగడు. మీరేంటండీ ప్రాణాలు తినేస్తున్నారు! ఆఫీసు మొత్తం మీ వల్లనే నడుస్తుందన్న అహం ఉంది చూశారూ అదంత మంచిది కాదు."

"నా ఉద్దేశం మిమ్మల్ని తప్పుపట్టడం కాదు. మీరు మా అందరికీ ఆదర్శంగా ఉండొచ్చుకదా అని . . ."

"ఆదర్శమా నా బొందా? నాకున్న సమస్యలు మీకేం తెలుస్తాయి? రాత్రి మా ఇంటావిడతో మళ్ళీ గొడవ. పక్కింటి వనజతో నాకు సంబంధం ఉందని ఒకడే ఏడుపు. వనజ నాతో చనువుగా ఉండటం నిజమేననుకో. ఆమెలో ఆ బింకం, పొంకం నలభైయేళ్ళొచ్చినా సడలలేదంటే నమ్ము. మొగుడు ముండాకొడుకు క్యాంపులంటూ దేశాలు పట్టుకు తిరుగుతాడాయె. ఆమాత్రం ఇరుగూ పొరుగూ పట్టించుకోకపోతే బావుండదని కొద్దిగా ప్రొసీడ్ అయినాను. అంతే. రాత్రంతా రామరావణ యుద్ధం అనుకో . . . నిద్ర పోతే ఒట్టు . . . మీ అందరికీ తెలిసిందేకదా మా ఆవిడ సంగతి! వట్టి అనుమానస్థురాలు."

'ఇతనికిదో జబ్బు–రిటైర్‌మెంట్‌కి ఇంకా రెండేళ్ళుంది. ఎప్పుడూ ఆడవాళ్ళు–వాళ్ళతో అతని సాన్నిహిత్యం – రాసక్రీడలు – వాళ్ళావిడ పోట్లాటలు – ఇవే మాట్లాడ్తుంటాడు. అధవా అవన్నీ నిజమే అనుకున్నా వాటికీ, ఆఫీసుకి లేటుగా రావడానికీ ఉన్న బాదరాయణ సంబంధం ఏమిటో? వ్యక్తిగత సమస్యలు ఇంటి దగ్గరే వదిలి రావాలి. వాటిని ఆఫీసు ప్రాంగణంలోకి మోసుకొస్తానంటే ఎలా?' అనుకున్నాడు రవి.

వెళ్ళి తన సీట్లో కూచుని ఫైళ్ళు ముందరేసుకుని–పనిలో నిమగ్నమైపోయాడు. ఓ గంట గడిచాక ప్యూన్ వచ్చి ఆఫీసర్‌గారు పిలుస్తున్నారని చెప్పాడు.

రవిని చూడగానే విశ్వనాథం నవ్వుతూ "మీరు ఓవర్ బర్డెన్ అవుతున్నారని నాకు తెలుసు. కానీ ఏం చేయను? మీలాంటి ఎఫిషియంట్ ఆల్ రౌండర్ మరొకరు లేరు. ఈ లెటర్ చాలా

అర్జంట్. కొద్దిగా టైప్ చేసి పెట్టండి” అన్నాడు.

“మన స్టెనో సుబ్రహ్మణ్యం సీట్లోనే ఉన్నాడు– పిలిచి డిక్టేషన్ ఇవ్వండి”

“మిస్టర్ రవీ! మీతో సమస్య ఇదే . . . అన్నీ తెలిసి ఉండి కూడా మాట్లాడ్తారు. సుబ్రహ్మణ్యం కాఫీలు, టీలు తాగడు. వాటి బదులు బ్రాందీలు, విస్కీలు తాగుతాడు. పచ్చి తాగుబోతు. ఉదయం లేచి సారాయితో మొహం కడుక్కునే రకం. అందుకే వణుకుడు రోగం వచ్చింది. అతని చేతులు మూర్ఛరోగికి మల్లే ఎలా వణుకుతాయో గమనించారా? ఇక అతనేం టైపుచేస్తాడు? ‘ఏ’ అక్షరం బదులు ‘యస్సో’, ‘డి’ నో టైపు చేస్తాడు. మరలా మనకే శ్రమ. ఇది కొద్దిగా చేసి పెద్దురూ”

“సరే ఇవ్వండి. కానీ ఇలా ఎంతకాలం సార్? పనిరాని వాళ్ళనీ, పనికిరాని వాళ్ళనీ తేరగా కూచో బెట్టి జీతాలివ్వడం న్యాయం కాదు. ఉద్యోగాలు లేక వేలాదిమంది విద్యాధికులైన యువతీ యువకులు నిరాశానిస్పృహల్లోకి జారిపోతుంటే, మనం ఉద్యోగాలిచ్చి సోమరిపోతుల్ని పోషిస్తున్నాం. జీతాన్ని సంపాదించుకోవాలి గానీ దాన్ని దానంగా అందుకోకూడదు సార్! అసలు ప్రభుత్వ సంస్థలన్నిటినీ ప్రైవేటీకరిస్తే మంచిది. పని చేయని వాళ్ళని పీకేసి ఎఫిషియంట్ అండ్ హార్డ్ వర్కింగ్ వ్యక్తుల్ని ఆర్గనైజేషన్‌లోకి ఆహ్వానించవచ్చు.”

“ఎందుకు మిస్టర్ రవీ . . . వి. ఆర్. యస్. ఉందిగా అప్పుడు జల్లెడలోంచి నూక పడిపోయినట్లు ఈ సోమరిపోతులూ, తాగుబోతులూ, పని ఎగ్గొట్టేవాళ్ళూ అందరూ హాయిగా ఇళ్ళకెళ్ళి కూచుంటారు. స్కీం చాలా ఆకర్షణీయంగా ఉంటుందిట. ఆ వచ్చే డబ్బుని బ్యాంక్‌లో వేసుకుంటే జీతంతో దాదాపు సమానంగా డబ్బులొస్తాయి. ఇంటి దగ్గర కూచుని బిజినెస్ ఏమైనా చేసుకోవచ్చు. లెటజ్ వెయిట్” అన్నాడు ఆశాభావంతో.

*****

ప్రభుత్వం వి.ఆర్.యస్. స్కీం ప్రవేశ పెట్టింది. రవి పనిచేస్తున్న ఆఫీసు నుండి రిటైర్‌మెంట్ కోరుకుంటూ ఒకే ఒక్క అప్లికేషన్ దాఖలు చేయబడింది. రవికి పని మీద ఉన్న శ్రద్ధనీ, అంకితభావాన్నీ, నైపుణ్యాన్ని అర్థం చేసుకున్న ఓ ప్రైవేట్ సంస్థ ఆకర్షణీయమైన జీతంతో అతనికి ఉద్యోగం ఆఫర్ చేయటం వల్ల రవి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు.

జల్లెడలోంచి జారిన నూక ప్రభుత్వోద్యోగులుగా మిగిలి పోయి–జల్లెడలో మిగిలిన నాణ్యమైన గింజలు ప్రైవేట్ సంస్థల పరమై–వాటికి వరమైనాయి.

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక - 7, ఫిబ్రవరి, 2002)*

★★★

# మల్లి

పనిపిల్లని చూసి పెట్టమని పదిరోజులుగా మా ప్యూన్ ఓబులేసుని బతిమాలుకుంటున్నా. ఈ రోజు ఏ మూడ్‌లో ఉన్నాడో ఏమో “సాయంత్రం ఏడెనిమిది మద్దెలో పిల్సుకోనొస్తా సారూ” అన్నాడు.

ప్రమోషన్ మీద విజయవాడకు బదిలీ అయిన క్షణం నుంచీ నాకు తిప్పలు తప్పటం లేదు. పిల్లల చదువుల దృష్ట్యా హైద్రాబాద్ నుండి ఫ్యామిలీని మార్చటం వీలుకాదు కాబట్టి నేనొక్కణ్ణే పెట్టే బేడా సర్దుకుని – వాటితో పాటు వంట గిన్నెలూ – పొడులూ – పచ్చళ్ళూ పెట్టుకుని ప్రయాణమైనా. ప్రమోషన్ వచ్చినందుకు సంబరపడాలో – బదిలీ మీద పెళ్ళాం పిల్లలకు దూరంగా పరాయి వూరికి విసిరేయబడినందుకు బాధపడాలో అర్థంకాని పరిస్థితి . . .

“చాల్లెండి బడాయి.. విసిరేయబడటమా పాడా – మన విజయవాడేగా – కూతేస్తే వినబడేంత దూరం” అంటూ హైద్రాబాద్‌లో స్టెనోగా పనిచేస్తున్న విజయవాడ అమ్మాయి రాజేశ్వరి వూరడించినా – సుళ్ళు తిరుగుతూ దిగులు . . .

అటువంటి సమయంలో నాకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా తోడుగా నిల్చింది స్టాలిన్ బాబు. లీలామహల్ థియేటర్ యజమానైనా – నిగర్వి, స్నేహశీలి.

కొన్నేళ్ళక్రితం ఏదో పనిమీద మా ఆఫీసుకొచ్చినపుడు పరిచయం. విజయవాడలో హోటల్లో రూం తీసుకుని రెండ్రోజులు అద్దె గదుల కోసం వెతికీ వెతికీ ఆ సాయంత్రం పల్కరిద్దామని స్టాలిన్ దగ్గర కెళ్ళా. ఆ క్షణం నుంచీ నన్ను వదిల్తే ఒట్టు. అతని కార్లోనే వూరంతా అద్దె ఇళ్ళ కోసం తిరగటం – వాళ్ళింట్లోనే భోజనం . . . నేను మొహమాటంతో సగమైపోయా.

ఎన్ని ఇళ్ళు చూసినా స్టాలిన్‌కి ఒక్కటీ నచ్చలేదు. “మీరు ఆఫీసర్ కదా. ఇవేవీ మీకు తగినట్లు లేవు” అన్నాడు. ఓ వారం తిరిగాక “మరిచేపోయాను. మా థియేటర్ వెనుక గెస్ట్‌హౌజ్ ఖాళీగా ఉంది. మీకు నచ్చుతుందేమో చూడండి” అన్నాడు.

లీలామహల్ సినిమా హాలు వెనుక ఉన్న ఆ యింటిని చూశాను. అద్భుతంగా వుంది.

బెడ్రూంకి అటాచ్డ్ బాత్‌రూం . . . వేడినీళ్ళ కోసం గీజర్ – పెద్ద హాలు... బెడ్రూంలో, హాల్లో ఎయిర్‌కండిషన్ మెషిన్లు, హాలుని ఆనుకుని విశాలమైన బాల్కనీ, దానిమీద ఉదారంగా వాలుతున్న వేపచెట్టు నీడ . . . వెంటనే మకాం అందులోకి మార్చేశాను.

అతని పరపతి మీద గ్యాస్ సిలిండర్ ఇప్పించాడు. కిచెన్ కోసం వేరే గది లేదు కాబట్టి హాల్లోని ఓ మూలని కిచెన్ కింద మార్చేసి – వంట సామానంతా సర్దేశా. నాకు హోటల్ భోజనం పడదు. అందునా విజయవాడ హోటళ్ళలోని కారాల్ని అస్సలు భరించలేను. అయినా నా ఒక్కడి భోజనం వండుకోడం ఏం కష్టమని . . .  ఓ కుక్కర్‌లో అన్నం, మరో కుక్కర్‌లో పప్పు పెట్టేస్తే చాలు – అరగంటలో అన్నీ రెడీ.  వేడి వేడి అన్నం – పోపేసిన టమేటా పప్పు – ఇంటి నుండి తెచ్చుకున్న పచ్చళ్ళూ – నెయ్యీ . . . ఎన్ని వందలు పెట్టినా – ఎంత గొప్ప హోటల్ కెళ్ళినా ఇంత చక్కటి, రుచికరమైన భోజనం దొరుకుతుందా?

అన్నీ బాగానే ఉన్నా అసలు సమస్య పనిమనిషి దగ్గరొచ్చింది. వంట చేసుకోటం వరకైతే బాగానే  ఉంది కానీ అంట్లు తోమటం మాత్రం ఇబ్బందనిపించి, పనిమనిషి వేటలో పడ్డాం. విజయవాడలో పనిమనుషులకు కొదవేం లేదు. కానీ ఎంతిస్తానని బతిమాలుకున్నా నాకు మాత్రం ఒక్క పనిపిల్లా దొరకటం లేదు. ఓబులేశుని కారణమడిగా. “ఇల్లల్లో సేయడానికి ఎవ్వరైనా వత్తారయ్యా–ఇది గెస్తోసు కదా – అందునా సినిమా టాకీసు లోపల ఉందాయె – మగోల్లు శానామంది తిరగతా వుంటారాయె. అందుకని పనికిరాడానికి బయపడ్తున్నారు సారూ” అన్నాడు.

“అంతేనా – ఇంకా ఏమైనా కారణాలున్నాయా?” అనుమానం తీరక అడిగాను.

కొద్దిసేపు నీళ్ళు నమిలి – చేతులు నలుపుకుని నంగి నంగిగా చెప్పాడు – “ఎవ్వరైనా ఆడకూతురు ఇల్లల్లో ఉంటే ఇంత ఆలోసించరయ్యా – తమరొక్కరే కదా ఉండేది అందుకనీ . . .”

నా అనుమానం నిజమేనన్మాట – పని పిల్లకోసమని కాండక్ట్ సర్టిఫికేట్ ఎక్కడి నుంచి పట్రానూ? “నేను చాలా మంచోణ్ణి ఓబులేశూ – నీకు తెల్సుకదా – పర్‌ఫెక్ట్ జెంటిల్మాన్‌ని” అందామనుకుని విరమించుకున్నా. మన కేరెక్టర్ గురించి మనమే చెప్పుకోవాల్సి రావటం – అందునా మన దగ్గర పనిచేసే ప్యూన్ దగ్గర చెప్పుకోవాల్సిన అగత్యం ఏర్పడటం దారుణమనిపించింది. అథవా నేనలా చెప్పినా, “మీరెలాటోళ్ళో నాకు తెల్సు సారూ – పని పిల్లకు తెలీదుగా” అంటాడనిపించింది.

“నాకు కుర్రపిల్లలే కావాలని నీకు చెప్పానా? పని చేయడానికి ఓపికున్న ముసల్దాన్ని



Rupaye_Chettu.pm7 111 28/7/19, 12:03 AM

తెచ్చినా పర్లేదు. నాక్కావాల్సింది కసువూడ్చి, అంట్లు తోమిపెట్టి, కింది నుంచి రెండు బిందెల మంచినీళ్ళు తెచ్చివ్వగల పని మనిషి” అన్నాను ఉక్రోషంగా.

నాక్కొద్దిగా కోపం వచ్చిందని ఓబులేశుకి అర్థమైనట్టుంది. మరోమాట మాట్లాడకుండా “మరో వారం గడువులో పనిమడిసిని కుదిర్సిపెడ్తా సారూ” అని వెళ్ళిపోయాడు.

ఈరోజతనికి దయ కలిగినట్లుంది.

బాల్కనీలో ఈజీ ఛెయిర్ వేసుకుని – వేపచెట్టు గాలిని ఆస్వాదిస్తూ – ఓబులేశుకోసం ఎదురుచూస్తూ కూచున్నా. లీలా మహల్లో తెలుగులోకి డబ్ చేసిన ఇంగ్లీషు సినిమా ‘ఎనకొండ’ ఆడుతోంది. మొదటి ఆట ఇంటర్వెల్ సమయం – సిగరెట్లు కాల్చుకుంటూ బాతాఖానీ కొట్టుకుంటున్న కుర్రోళ్ళని గమనిస్తూ వాళ్ళ మధ్యలోంచి దారి చేసుకుంటూ కదుల్తున్న ఓబులేశుని చూశాను. అతని వెనకే నడుస్తున్న అమ్మాయి . . . సుమారు ఎత్తుగా ఉండి పుష్టిగా కనిపించింది. మెట్లెక్కుతున్నప్పుడు ఆ అమ్మాయి నింపాదిగా ఎక్కడం గమనించి చాలా నెమ్మదైన పిల్లనుకున్నాను.

ఓబులేశు నా ఎదురుగా నిలబడి, “సారూ! దీని పేరు మల్లి. అమ్మ లేదు. అయ్య రిచ్చా తొక్కుతాడు. ఏమేం పన్లు సేయాలో సెప్పి తీసుకొచ్చా. మీరాఫీసుకెల్లే లోపల వచ్చి పనంతా సేస్కొనెల్తది. మల్లా పొద్దుగూకాకొచ్చి మీ బోయనాలయ్యినాక వెల్తది. నెలకు ఐదొందలట” గుక్క తిప్పుకోకుండా ఏకరువు పెట్టాడు.

అప్పుడు గమనించా ఆ అమ్మాయి వైపు. కాటుక దిద్దిన వెడల్పాటి కళ్ళు – తీర్చిదిద్దినట్టు కాకున్నా చక్కటి ముక్కు– నిండైన గుండ్రటి పెదాలు – చామనఛాయతో నిగారింపైన వళ్ళు . . .  వీటన్నిటితోపాటు ఉబ్బెత్తుగా కన్పిస్తున్న పొట్ట.

“నీ పేరేంటీ” – ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాను. తీరా అడిగాక గుర్తొచ్చింది ఇందాక ఓబులేశు చెప్పిన విషయం.

“మల్లీశ్వరి” అందా అమ్మాయి సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ. చాలా ధైర్యం గల పిల్ల అనుకున్నాను. ఇంకా నయం “ఓబులేశు సెప్పాడుగా మల్లని – మల్లా అడుగుతావేం” అని నిలదీయలేదు.

“ఎన్నో నెల?” అన్నాను వేపచెట్టు కొమ్మల్లోకి చూస్తూ.

“ఆరు”

ఓబులేశుకి నా మనసులో ఏముందో అర్థమయి, “ఈ పిల్లని గేటు బైటికి వదిలొస్తా సారూ. రేపుదయం వస్తది. నేను మల్లొచ్చి ఇవరంగా సెప్తా” అంటూ వేగంగా మల్లిని తీసుకుని వెళ్ళిపోయాడు.

నాకు ఓబులేశు మీద పీకల్దాకా కోపం వచ్చింది. మల్లొస్తానన్నాడుగా. రాగానే ఈ వేపచెట్టు కొమ్మకు వేలాడదీయాలన్నంత కోపం . . . పనిమనిషిని చూసిపెట్టమంటే మరో మూణ్ణెల్లలో అమ్మ కాబోతున్న అమ్మాయిని పిల్చుకొచ్చాడు. బుద్ధుందా అసలు? నాదసలే సుతిమెత్తని మనసు. నాకా అమ్మాయి పన్లు చేయటం అటుంచి నేనే అన్ని పన్లూ చేసుకుని ఐదొందల జీతం నెల తిరగ్గానే ఆమె చేతిలో పెడ్తానేమో! అంట్లు తోమడం సరే – ఈ మెట్లపైనుంచి నీళ్ళెలా మోస్తుంది? పురుడొస్తే మరో పనిమనిషిని వెతుక్కోవాల్సిందేగా . . .

ఆలోచనల్లోనే ఓబులేశు వచ్చాడు.

"అసలేమిటీ నీ ఉద్దేశ్యం? ఆర్నెల్ల కడుపుతో ఉన్న పిల్లను తెచ్చి . . ." నేను మాట పూర్తి చేయకముందే, "శానా కోపంగా ఉందా సారూ – నాకు తెలుసు – బానంత కడుపేస్కుని పనెట్లా సేస్తాదని కదా . . . కూటికి లేని పేదోల్లకు పని సేయకుండా పూట గడవదు. మల్లి మంచి పిల్ల. మీరు ఉత్తినే డబ్బులిస్తానన్నా తీస్కోదు. పని సేస్తాది. మీకు పనిమడిసి అవుసరం కన్నా మల్లికి మీ అసోటి అయ్య అవుసరం ఎక్కువుందనిపించి తెచ్చినా. దానికి ఎక్కువ శముండదు. పూటకింత తిండి దొరుకుద్ది. నా మాటినుకోండి. దానికి పురుడొచ్చేలోపల మరో మడిసిని సూసిపెడ్తా. అందాకా కాదనకండి. మీకు పున్నెమొస్తది. తల్లిలేని పిల్ల" అన్నాడు చేతులు జోడిస్తూ.

'తల్లిలేని పిల్లనా – నా బొంద – తల్లి కాబోతున్న పిల్ల' అందామనుకుని ఓబులేశు దీనంగా పెట్టిన మొహం చూసి మానుకున్నా. ఉబికిన పొట్ట చూసిన కంగారులో గమనించలేదు కానీ మల్లికి పదిహేను పదహారేళ్ళకు మించి వయసుండదు.

"మరి మంచినీళ్ళో . . . మోయగలదా?" అన్నాను. ఈ కారణం చూపైనా వద్దని చెప్దామని . . .

"మంచినీళ్ళే కదా సారూ. రెండ్రోజులకోపాలి వచ్చేది. నేను సేస్తాలెండి. మీకు నీల్లు మోసాకే ఆఫీసుకెల్తా" అన్నాడు. ఆ మాటతో మల్లి నా దగ్గర పనిమనిషిగా స్థిరపడింది.

అన్నం వండినా – పప్పు చేసినా –కూర చేసినా ఇద్దరికి సరిపడా చేయడం –నేను తినగా మిగిలింది మల్లికి పెట్టడం అలవాటు చేసుకున్నాను. కడుపుతో ఉన్న పిల్ల కదా . . . ఇక్కడే కూచుని తినమంటే వినేది కాదు. ఇంటికి పట్టుకు పోయేది. మొగుడంటే ప్రాణమనుకుంటా. తనకొక్కదానికే సరిపడా ఉన్నా సగం భర్తకు పెట్టి సగమే తింటుందేమో . . . మొగుడి గురించి వివరాలడుగుదామంటే ముభావంగా తన పని తను చేసుకుపోవటం తప్ప మల్లి ఎక్కువ మాట్లాడేది కాదు.

ఓరోజు ఓబులేశునడిగా. “మల్లి ఎక్కువగా మాట్లాడదా? నిశ్శబ్దంగా పనిచేసుకుపోతుంది– పలకరించినా పొడిగా సమాధానం చెప్పి తప్పుకుంటుంది తప్ప మరో మాట మాట్లాడదు.”

“మల్లి మాటల పుట్ట సారూ! గలగలా మాటాడందే ఛనం ఉండ్లేదు.”

“మరి నా దగ్గర పలుకే బంగారంలా చేస్తుందే”

“మీరు పెద్దాపీసరు కదా సారూ. నేనే సెప్పినా – మాట పొల్లు పోతుందని నోటికి తాలం కప్ప బిగించమని”

“అడగటం మర్చిపోయాను – మల్లి పెనిమిటి ఏం పని చేస్తాడూ?”

ఓబులేశు ఉదాసీనంగా మారిపోయాడు. “మల్లి మొగుడు దాన్నొగ్గేసి ఎటో ఎల్లిపోయాడు సారూ. అయినా దాని పిచ్చిగాని పోలీసులకు సెప్తే కాపురాలు సక్కబడ్తాయా? నేనెంత నెత్తీనోరు బాదుకుని సెప్పినా దాని తల కెక్కలా. సినిమాలు సూసి అందులో ఈరోయిన్ సేసినట్టు సేయడానికి పేదోల్లకు కుదుర్తుందా సారూ”

నాలో ఉత్సుకత. “అసలేం జరిగిందో వివరంగా చెప్పు” అన్నాను.

“మల్లి పద్నాలుగేల్లకే పేమలో పడింది. ఇజీవాడలో ఓ పూట కూడైనా మానుకుంతారు కానీ సినీమాల కెల్లటం మాత్తరం మానుకోరు. సినిమావోల్లకు రాజపోసకులు మావోల్లే సారూ. వాటి పెబావం కాకపోతే పద్నాలుగేల్ల పచ్చి పిందెకి పేమేంటి? మల్లి వోల్లు ఏలూరుకాల్వ లాకుల దగ్గర గుడిశెల్లో ఉంటారు. ఆ కుర్రాడు మా ఇంటి దగ్గరోడే – బేవార్సు నాకొడుకు – బీడీలు కాల్సటం, జోబీలో నాల్రూపాలుంటే సినీమా సూట్టం . . . అదే వాడు సేసే పని. ఇద్దరికీ ఎలా కలిసిందో ఏమో పేమలో పడ్డారు. ఇలా అనేకంటే మల్లి పేమలో పడిందంటే శానా రైటుగా ఉంటది.

దానికి ఆడంటే పిచ్చి పేమ. తీరా కడుపొచ్చాక పెల్లి సేస్కోమంటే ఈలు కాదన్నాడు. మేమందరం సెప్పి సూసాం. ఇన్లే. ‘అదే సరదాపడి నా యంట పడిన్ది. దానికి కడుపొత్తే నేనేం సేయను? నేను మగాన్ని. లచ్చమందితో తిరగతా. నాకు నస్తేనే మనువాడతా’ అన్నాడు. ఆడి బుద్ధి నాకు తెల్సు. ఆ ఎదవ నాకొడుక్కి కట్నం పైసలు కావాల.

మల్లి గుడిసెలో ఏడుత్తా కూసుంటుందనుకున్నా. లేదు సారూ. అది సివంగి పిల్ల. ఓరోజు పొద్దుగూకేటేల ఆడివద్ద కొచ్చింది. ఆడి సొక్కా పట్టుకుని గుంజుకుంటా, ఈడ్సుకుంటా పోలీసుల్కాడికి లాక్కెల్లింది. నాకు బయమేసి నేనూ తోడెల్లా. ఆడ్ని వదలవే అంటే ఇనదు. ఈడు నన్ను మనువెలా ఆడడో సూస్తా అంది. అక్కడంతా రచ్చ . . . ఆడు కడుపు సేసి పెల్లికి పైసలడ్గుతున్నాడని సెప్పింది. యస్సై ఆడ్ని నాలుగు పీకి ‘పెల్లి సేస్కుంటావా బొక్కలో

తోయమంటావా' అని బెదరగొట్టి – టేషన్‌కి ఆల్ల పెద్దాల్లని పిలిపించి పెల్లి సేశాడు. మా పేటలో అందరం దాని గుండె దయిర్యానికి నోటి మీద వేలేస్కున్నాం.

పెల్లయితే సేసారుగాని సారూ కాపురం సేయించలేరుగా. ఆడు నాలుగు నెల్లు అలా అలా ఉండి సెప్పా పెట్టకుండా ఎటో ఎల్లిపోయాడు. ఇపుడది దాంతోపాటు దాని బిడ్డని కూడా పోసించుకోవాల" అన్నాడు.

మల్లి వాణ్ణి చొక్కా పట్టుకుని పోలీసుల దగ్గరకు లాక్కుపోయి నిల్చోబెట్టిందని ఓబులేశు చెప్పినపుడు నాకు భలే ముచ్చటేసింది. కానీ వాడు వదిలి పారిపోయాడని విన్నాక బాధనిపించింది.

మల్లి పెళ్ళి విషయం విన్నాక నాకా అమ్మాయంటే కుతూహలం పెరిగింది. అప్పటి నుండీ మెల్లగా మాటలు కలపటం ప్రారంభించాను. మొదట్లో కొద్దిగా పొడిగా మాట్లాడినా తర్వాత్తర్వాత చనువుగా మాట్లాడటం అలవాటైంది.

"అతడెక్కడున్నాడో తెలీదు. వస్తాడో రాడో తెలీదు. మరి బాబునో పాపనో కన్నాక ఏం చేద్దామనుకుంటున్నావు?" అని అడిగానోసారి.

"ఆడెక్కడికి పోతాడయ్యా – నన్నొగ్గేసి ఆడుండలేడు. ఆడికి నేనంటే పేనం. ఇసేకపట్నం దగ్గరున్నాడని మావోల్లు కబురు మోసుకొచ్చారు. మా సుట్టాలందరికీ సెప్పుంచా. ఆడు కన్పీయటం ఆలీసెం . . . తెచ్చి నా కాల్ల కాడ పడేస్తరు" అంది.

ఆ అమ్మాయిది అమాయకత్వమో – ప్రేమించిన వ్యక్తి మీదున్న అనంతమైన విశ్వాసమో లేక మూర్ఖత్వమో నా కర్థం కాలేదు.

"నువ్వు బిడ్డను కనబోతున్నావని తెలిసికూడా నిన్నొదిలేసి పోయినోడు మళ్ళా వస్తాడనుకోను. అతని కోసం ఎదురుచూడ్డం కంటే ఇక రాడనుకుని నీ జీవితాన్ని దానికనుగుణంగా మల్చుకోటం మేలు" అన్నాను.

"లేదయ్యా! నా నమ్మకం నిజమౌతది. ఆడు ఎఱ్రోడయ్యా. బెదురుగొడ్డు. నేను పోలీసుల్కాడికి లాక్కెల్లానని అలిగి ఎటో పోయాడు కానీ నా మీద పేమ లేక కాదు. ఆడొస్తాడు. మీరు సూస్తుండండి. మీకాడికి లాక్కొచ్చి పరిసయం సేస్తా" అంది నవ్వుతూ.

నవ్వినప్పుడు మల్లిమొహం మల్లెపువ్వులా విచ్చుకుంది.

వాడు తిరిగిరావాలని –మల్లి నమ్మకం వమ్ము కాకూడదని మనసారా కోరుకున్నా.

పురుడింక వారం రోజుల్లో వస్తుందనగా తనే వాళ్ళింటి దగ్గరుండే మరో అమ్మాయిని మాట్లాడి పెట్టింది.



Rupaye_Chettu.pm7 115 28/7/19, 12:03 AM

"అయ్య శానా మంచోరు. నేను తిరిగి పన్లోకొచ్చేవరకూ బాగా సూసుకోయే" అని మరీ మరీ ఆ పిల్లకు చెప్పి, "పెసవం ఐనాక ఈలైనంత తొరగా వచ్చేత్తానయ్యా" అంటూ వీడ్కోలు తీసుకుంది. మల్లి చేతిలో కొంత డబ్బు పెట్టి "ఆరోగ్యం జాగ్రత్త – నీకెప్పుడు ఏ అవసరం వచ్చినా ఈ అమ్మాయి ద్వారా కబురు పెట్టు. నాకు చాతనైనంత సాయం చేస్తాను" అన్నాను.

మల్లి కళ్ళలో నీళ్ళు . . . "మా అయ్య తర్వాత అంత పేమగా సూస్కుంది మీరేనయ్యా" అంది.

వారం దాటాక మల్లికి పురుడొచ్చిందనీ, ఆడపిల్ల పుట్టిందనీ పనిపిల్ల కబురు మోసుకొచ్చింది.

మల్లిని చూసొద్దామని ఓబులేశుతో చెప్పినపుడు, "సారూ!మా గుడిశెల్లోకి మీ అసొంటి గొప్పోల్లు రాలేరు. నేను మీ తరపున మల్లికి సెప్తాలెండి" అన్నాడు. నేనే పట్టుబట్టి ఓబులేశుని తోడుతీస్కొని మల్లిని చూడ్డానికెళ్ళా. తనొక్కతే ఉందా సమయంలో. వాళ్ళ నాన్న రిక్షా వేసుకుని వెళ్ళాడట. నన్ను చూసి చాలా హడావిడి చేసింది. "కురిసీ తెస్తానయ్యా" అంటూ చెప్తున్నా వినకుండా బైటికెళ్ళింది. తిరిగొచ్చాక, "నువ్వు బాలింతరాలివి. ఇలా బైటికెళ్ళిపోతే ఎలా" అంటే, "పేదోల్లం. ఇయన్నీ ఆలోసిస్తూ కూసుంటే కూడెట్టా వత్తదయ్యా" అంది.

నెల తిరుక్కుండానే పన్లోకొచ్చింది. ఓబులేశుతో "మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకో వచ్చుగా" అన్నాను.

"మీ కర్దం కాలేదా సారూ! పన్లోకొస్తే దానికి కడుపు నిండా కూడు దొరుకుద్ది. పిల్లదానికి పాలకు కరువుండదు. దాని కరుసుకు పదో పరకో అయ్యగారిత్తారాయె. అందుకని లగెత్తుకొచ్చింది." అన్నాడతను.

పిల్లను ఇంటి దగ్గరే వదిలి వచ్చేది. పక్కింటి అమ్మాయి చూస్కుంటుందని చెప్పింది. పిల్లకు ఆరో నెల వచ్చాక పన్లోకొస్తూ దాన్నీ ఎత్తుకొచ్చేది. హాల్లో వదిలేస్తే దానిపాటికది కాళ్ళూ, చేతులూ యథేచ్ఛగా ఆడిస్తూ హాయిగా ఆడుకునేది.

ఓరోజు ఉదయాన్నే మామూలుకంటే గంట ముందే వచ్చింది మల్లి. ఉదయిస్తున్న సూర్యబింబంలా వెలుగుతోందామె మొహం.

"అయ్యా! నేను సెప్పలేదా ఆడుతప్పకుండా వొత్తాడని. నా నమ్మకం నిజమౌద్దని. ఇజీనగరంలో ఉండంట. మావోల్లు పిల్సుకు రాడానికెళ్ళారు. మా అయ్యతోపాటు ఓబులేశు బాబాయి కూడా ఎల్లాడు" అంది. మల్లిని అంత సంతోషంగా చూడలేదెప్పుడూ . . . మనస్ఫూర్తిగా సంతోషపడ్డా.

మరునాటి నుంచీ మొగుడి గురించి వసపిట్టలా వాగడమే . . . ఫుల్‌స్టాప్‌లూ, కామాలు

లేకుండా గంటల తరబడి అతని గురించే కబుర్లు . . . "ఆడా ఇజీనగరం నీల్లు పడక బక్కగా, జండా కొయ్యలాగైనాడు. తిండీ తిప్పల్లేక ఎలాగైపోనాడో? ఆడ్ని సూస్తే కడుపు తరుక్కుపోతుందయ్యా. సినేమా ఈరోలా గుండేవోడు. మల్లీశ్వరి సినేమాలో ఎన్టీవోడిలా పొడవాటి గిరజాల జుట్టూ, వెడల్పాటి మొకం, కోరమీసం – సూట్టానికి ఏయి కల్లు సాలేవి కావు. అయ్య ఆడిక్కూడా రిచ్చా ఇప్పిత్తానంటే నేనే వద్దన్నా. రెండు మూన్నెల్లయినా ఆడికి మంచి తిండి పెట్టి, సుకంగా ఉంచితేగానీ మల్లా మడిసి కాలేడు" అంది.

"మీ వద్దకు తెద్దామనే ఉందయ్యా. కానీ ఆడు సిగ్గుపడ్తున్నాడు. మీరు తిడతారని ఆడి బయం. రేపెలాగూ ఆదోరమే కదా. పొద్దుటేల పిల్సుకొత్తా. ఆడ్నేమీ అనమాకండయ్యా. బాదపడతాడు. నేనది సూళ్ళేను. ఆడు మంచోడేనయ్యా. ఏది మంచో ఏదిసెడో తెలీని అమాయకుడు. ఆడ్ని నేనెపుడో సెమించేశా. మీరూ ఆడి మనసుకు దెబ్బ తగిలేలా ఏమీ అనకండయ్యా. మల్లిని బాగా సూస్కోరా అనండి. సాలు. ఆడ్ని గ్యానంతో బతకమని ఆసీరెదించండి. సాలు" అందో రోజు.

మల్లికి అతని మీదున్న ప్రేమకు చాలా ముచ్చటేసింది. అంత గొప్ప ప్రేమను పొందిన ఆమె భర్త అదృష్టవంతుడు. అతన్ని తప్పుకుండా చూడాలన్న కుతూహలం నాలో....

మరునాడు మల్లి అతన్ని పిల్చుకొచ్చింది. "అయ్య శానా మంచోరు. నువ్వు లేకుండా పోయినా ఇన్ని నెల్లూ నాకూ, నీ బిడ్డకూ కడుపు కింత కూడు దొరికిందంటే ఈ అయ్య సలవే" అంటూ అతనితో కల్సి నా కాళ్ళకు మొక్కింది.

నేనెక్కడ తొందరపడి అతన్ని తిడ్తానోనని అతని కూడా కూడా తిరిగింది. అవకాశం దొరికినపుడల్లా, 'ఏమీ అనకండి' అంటూ సైగలు చేసింది. నేనింత చదువు చదివినా, అంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా అతనితో ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో నాకు తెలీదన్నట్లు మల్లి నాకు పాఠం చెప్పటం గుర్చొచ్చి, "మల్లి మంచి అమ్మాయి. నువ్వంటే ప్రాణం. అంతగా ప్రేమించే భార్య దొరకటం నీ అదృష్టం. మల్లిని బాగా చూస్కో" అన్నాను.

మల్లి చెప్పమన్న మాట కాకుండా మరో మూడు వాక్యాలు ఎక్కువగా మాట్లాడినందుకు మల్లి ఏమంటుందోనని ఆ అమ్మాయి వైపు చూశాను. సంతృప్తిగా, హాయిగా నవ్వుతూ కన్పించింది. సంతోషమేనా అన్నట్లు కళ్ళెగరేశాను. చాలా సంతోషం అన్నట్లు తనూ కళ్ళు తిప్పింది.

నేను ట్రాన్స్ఫర్ మీద విజయవాడ వచ్చి ఓ సంవత్సరం పూర్తవబోతున్న దృష్ట్యా మరలా హైద్రాబాద్కు మార్పించుకునే ప్రయత్నాల్లో పడ్డాను.

మల్లి మరలా కడుపుతో ఉంది. మూడో నెల . . . "ఈసారి మగపిల్లాన్ని కనిస్తానయ్యా.

ఆడికి మగపిల్లలమీద శానా ఏెమ. ఆడి కొడుకే ఆడెక్కడెకీ పోకుండా కట్టడి సేన్కుంటాడు" అంది ఉదారంగా పర్చుకునే వెన్నెల్లా నవ్వుతూ.

మల్లి నాతో అలా అన్న వారానికే ఆమె భర్త ఇల్లొదిలేసి మరలా పరారైనాడు. మల్లి ఓబులేశుని తోడు తీస్కెళ్ళి పోలీసులకి కంప్లెయింట్ ఇచ్చొచ్చింది.

గలగలా మాట్లాడే మల్లి కొన్ని రోజులు మూగపోయింది. నేను సముదాయించాను.

"ఇప్పటికైనా వాడెలాంటివాడో అర్థం చేసుకో. నీకు తగిన భర్తకాదు. మీలో మారు మనువులుంటాయని నువ్వోసారి చెప్పావుగా. మంచి కుర్రాణ్ణి చూసి పెళ్ళి చేస్కో. నీ జీవితం, నీ పిల్లల జీవితం బాగుపడ్తుంది" అంటూ నచ్చజెప్పటానికి ప్రయత్నించాను.

"మా కులపోల్లలో నా అంత సొగసైన పిల్ల మరొకతి లేదయ్యా . . . నిజం . . . మావోల్లందరూ ఇదేమాట అనుకుంటారు. నేనిపుడు 'వూ' అనాలే కానీ నన్ను మనువాట్టానికి శానామంది కుర్రోల్లు తయారుగా ఉన్నారు. నాకెవరూ వొద్దయ్యా నాకు ఆడంటేనే ఇష్టం. ఆడు వొత్తాడు. తప్పకుండా వొత్తాడు. నన్ను, పిల్లల్ని వొదిలి ఆడుండలేడు. నేనాడి కోసం ఎదురు సూస్తానయ్యా" అంది.

నాకు హైద్రాబాద్‌కి బదిలీ అయ్యింది. కన్నీళ్ళు పెట్టుకుంటున్న మల్లిని బుజ్జగించి – నా స్థానంలో  వచ్చి చేరినతనికి మల్లిని పరిచయం చేసి – విజయవాడ పనిమీద వచ్చినపుడల్లా తనను వచ్చి చూస్తానని మాటిచ్చి బయల్దేరాను.

ఓరోజు ఓబులేశు నుంచి ఉత్తరం వచ్చింది. మల్లికి మగపిల్లాడట. తల్లీ పిల్లాడు క్షేమంగా ఉన్నారని, మల్లి నన్ను తల్చుకోని క్షణం లేదని రాశాడు. మల్లి కోరుకున్నట్లే ఆమెకు మగపిల్లాడు పుట్టినందుకు సంతోషించినా, మల్లి ఎవరికోసమైతే మగపిల్లాడు కావాలనుకుందో అతనే దూరమైనందుకు బాధపడ్డాను.

ఉత్తరం అందుకున్న మూడు వారాలకు విజయవాడ వెళ్ళే పని పడింది. ఓబులేశుకి నేనొస్తున్నట్లు కబురు పంపాను. విజయవాడలో నా ఆఫీసు పనులన్నీ ముగించుకున్నాక ఓబులేశుతో పాటు మల్లిని చూడ్డానికెళ్ళాను.

మనిషి బాగా చిక్కింది. నన్ను చూడగానే వెల్లువెత్తిన ఉత్సాహంతో దగ్గర కొచ్చింది. ఆమె మొహంలో అద్భుతమైన వెలుగు . . .  నన్ను చూసినందుకనుకున్నాను. కాదు. ఆమె భర్త ఆచూకీ తెల్సిందట – అందుకు.

"ఆడెక్కడున్నాడో తెల్సా అయ్యా. మీ వూల్లోనే . . . ఐదరాబాదులో . . .  మా వోల్లంతా పిచ్చోల్లలా ఇశాకపట్నం, ఇజీనగరం, సికాకులం ఎతుకుతా ఉంటే ఆడు కుసాల్‌గా ఐదరాబాదులో



Rupaye_Chettu.pm7 118 28/7/19, 12:03 AM

ఉన్నాడట. మీది శానా పెద్దూరట కదా. ఆడ్ని ఎతికి పట్రాడానికి మా అయ్య పోయాడు. నేను సెప్పాకదా. ఆడొత్తాడనీ" అంది. గుడిశెలో మల్లితోపాటు ఇపుడు ఇద్దరు పిల్లలున్నారు. మల్లి చేతిలో కొద్దిగా డబ్బులుంచి తిరుగు ప్రయాణమైనా. వచ్చేముందు మల్లి, "ఆడు రాంగానే ఓబులేశు బాబాయికి సెప్పి మీకు కారుడు రాయిత్తా" అంది.

హైద్రాబాద్ తిరిగొచ్చిన నెల రోజులకు ఓబులేశు నించి ఉత్తరం వచ్చింది. ఎన్ని రోజులు వెతికినా మల్లి మొగుడు దొరకలేదనీ – కానీ అక్కడే ఉన్నాడని మాత్రం రూఢిగా తెల్సిందనీ – మల్లి చాలా దిగులు పెట్టుకుందనీ – ఆరోగ్యం కూడా బావుండటం లేదనీ దాని సారాంశం.

మల్లిని తల్చుకుంటే బాధనిపించింది. పిచ్చి పిల్ల . . . అతను దొరికితే బావుండు . . . మల్లి కళ్ళలో మరలా వెలుగొస్తుంది . . . అతనెక్కడున్నా తనకు దూరంగా, తననొదిలి ఉండలేడన్న మల్లి నమ్మకం బతకాలన్న కోరిక నాలో . . .

ఓరోజు పనుండి హయత్‌నగర్ వెళ్ళాను. తిరిగొచ్చేప్పుడు ఇడ్లీ, దోశెలు అమ్ముతున్న బండి దగ్గర ప్లేట్లు కడుగుతూ కన్పించాడు. అతనా కాదా అని అనుమానమొచ్చి మరలా పరిశీలనగా చూశాను. అతనే . . . మల్లి భర్త . . . గడ్డం మాసిపోయి – కళ్ళు లోతుకు పోయి దీనంగా ఉన్నాడు. నన్ను చూస్తే మరలా గుడారం మార్చేస్తాడనుకుని, అతనికి కన్పించకుండా జాగ్రత్తపడి వచ్చేశాను.

ఓబులేశుకు ఉత్తరం రాయడానికి కూచున్నాను. దివ్యంగా వెలుగుతున్న మల్లి మొహం కన్పించింది. మల్లి చాలా సంతోష పడ్తుంది. మొగుణ్ణి పట్టివ్వటంలో నా వంతు సహకారం ఉన్నందుకు మరీ ఆనందపడ్తుందనిపించింది. ఆ వెంటనే నా కళ్ళ ముందు మరో చిత్రం మెదిలింది. గుడిశెలో దీనంగా మల్లి– ఆమె చుట్టూ చేరి ఆకలంటూ ఏడుస్తున్న ముగ్గురు పిల్లలు – ఏ మద్రాసుకో పారిపోయిన ఆమె భర్త... మరలా అతనికోసం వెతుకులాట . . . అంతా వలయంలా కన్పించి భయమేసింది. ఉత్తరాన్ని చింపేశాను.

ఆమె భర్త కన్పించినా తెలియబర్చనందుకు మల్లి నన్ను క్షమిస్తుందో లేదో నాకు తెలియదు గాని అతని ఆచూకి తెల్పితే నన్ను నేను క్షమించుకోలేననిపించింది.

*(రచన ఇంటింటి పత్రిక - ఫిబ్రవరి, 2003)*

★★★

# భవదీయుడు

“వెళ్ళొస్తానమ్మా” అని అమ్మతో అన్నప్పుడు ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర.

‘నీ లేత భుజాల మీద కొండంత బరువు బాధ్యతల్ని మోయాల్సిన అగత్యం రావటం నేను చూడలేకున్నానురా’ అంటున్నట్లు ఆమె కళ్ళలో పెల్లుబుకుతున్న నీళ్ళను నాకు కన్పించకుండా ముఖం పక్కకు తిప్పుకుంది.

నా వైపు మెరిసే కళ్ళతో చూస్తూ నిలబడి ఉన్నారు – చెల్లెలూ – ఇద్దరు తమ్ముళ్ళూ . . . ఆకలితో, అనారోగ్యాలతో నీరసించిన వాళ్ళ శరీరాల్లో జ్వలిస్తున్న ఆశను వ్యక్త పరుస్తూ వింత వెలుగు . . .

కలచి వేస్తున్న మనసుతో రైల్వే స్టేషన్ వైపు నడకసాగించాను. ఇక్కడ నుండి నాలుగు గంటల ప్రయాణం హైదరాబాద్ చేరటానికి.

ఓసారి జేబును తడుముకున్నాను. చేతికి కవరు తగిలింది – బరువుగా –

దాన్ని అలా తడుముకుంటుంటే ఉద్యోగం నా అరచేతిలో ఉన్నంత అనందంగా ఉంది.

నాన్నగారి మరణం తర్వాత మిగిలింది రెండుగదుల ఆ పాత పెంకుటిల్లు – వూరి నిండా అక్క పెళ్ళి కోసం చేసిన అప్పులు – తన సత్ప్రవర్తనతో సంపాదించుకున్న మంచిపేరు.

ఆ మంచి పేరు ఈ రోజు నాకు అక్కరకు వచ్చింది.

మా వూరి ఎమ్మెల్యే కృపానిధి మా నాన్నగారి దగ్గర చదువుకున్న వారే – ఎటొచ్చీ ఏడో తరగతిలో చదువు మానేసి – తర్వాత సారా కాంట్రాక్టుల్లో లక్షలు గడించి ఈ రోజు ఎమ్మెల్యే అయ్యాడు. హైదరాబాద్‌లో ఒకరిద్దరు మినిష్టర్లు వీరికి సన్నిహితులట. మా వూళ్ళో కొంతమందికి ఉద్యోగాలిప్పించిన మహానుభావుడాయన.

అందుకే ఓరోజు ముకుళిత హస్తాల్తో కృపానిధిగారి ముందు నిలబడి నా పరిచయం చేసుకున్నాను.

“నువ్వటోయ్ – శాస్త్రి గారి అబ్బాయివి! ఆ రోజుల్లో శాస్త్రి మాష్టారంటే మేము హడలి

చచ్చే వాళ్ళం. రా . . . రా . . . ఇక్కడ కూచో" అని ఆప్యాయంగా తన పక్కన సోఫాలో కూచో బెట్టుకున్నారు.

నేను బిడియంగా కూచున్నాను.

"అదేమిటి అలా సిగ్గు పడ్తావు! నీవు మా గురుపుత్రుడివి. అంటే నా సోదరుడితో సమానం" అంటూ నా భుజం చుట్టూ చేయి వేశారు.

మా నాన్నగారి వల్ల నాకింత ఆదరణ లభించటం నా అదృష్టం – మా నాన్నగారి గొప్పతనం. ఆయనకు మనసులోనే పాదాభివందనం చేసుకున్నాను.

నేను వచ్చిన పనీ – మా ఆర్థిక పరిస్థితి వారికి వివరించినపుడు కృపానిధిగారు నొచ్చుకున్నారు.

"అదేంటోయ్ – డిగ్రీ ఫస్ట్ క్లాసులో పాస్ అయినా నీకింకా ఉద్యోగం దొరకలేదా? అయినా ఇన్నాళ్ళూ నా దగ్గరకు రాకుండా చాలా పొరపాటు చేశావబ్బాయ్! నా నియోజక వర్గంలో ప్రజలు బాధలు పడితేనే సహించలేని నేను – నాకు చదువు చెప్పిన మాష్టారి కుటుంబం కష్టాల్లో ఉంటే చూస్తూ ఎలా భరించగలననుకున్నావు?" అన్నారు.

నాకు ఆనందంతో మాటలు రాలేదు. ఇన్నాళ్ళూ కృపానిధిగారు గుర్తుకు రాకపోవటం చాలా పెద్ద పొరపాటేనని ఇప్పుడనిపిస్తోంది. కనీసం ఇప్పటికైనా నేను సవ్యమైన వ్యక్తిని ఎన్నుకోవటం చాలా సంతోషం అన్పించింది.

కృపానిధిగారి మాటలు విని చుట్టూ ఉన్న వాళ్ళందరూ వారి ఔదార్యాన్నీ, మంచితనాన్ని ఉదారంగా పొగిడారు.

"హైదరాబాద్‌లో మినిస్టర్ దయాసాగరం నాకు చాలా సన్నిహితుడూ – మిత్రుడూ. అతనికి ఉత్తరం రాసిస్తాను, నీకు తప్పకుండా ఉద్యోగం ఇప్పిస్తాడు" అని అభయహస్తం ఇచ్చారు.

దాని పర్యవసానమే ఈనాటి ప్రయాణం.

రైల్లో కూచుని ఆ ఉత్తరాన్ని మరోసారి తీశాను. నామీద నమ్మకంతోననుకుంటాను కృపానిధిగారు ఉత్తరాన్ని కవర్లోపెట్టి కవర్ అంటించకుండా ఇచ్చారు.

ఇప్పటికి నాలుగుసార్లు చదివాను. ఉత్తరాన్నిచదివిన ప్రతిసారీ నాకు ఉద్యోగం ఖాయమనే నమ్మకం బలపడుతోంది.

ఉత్తరం చదవటం ప్రారంభించాను.

"దయాసాగరం గారికి –

నమస్కారం.

చి॥ రామశాస్త్రి మావూరి మాష్టారు పతంజలి శాస్త్రిగారి పెద్దబ్బాయి. నాచేత పలకా బలపం పట్టించి ఓనమాలు దిద్దించిన గురువుగారు శాస్త్రిగారు. ఆ విధంగా రామశాస్త్రి నాకు సోదరుడు – శాస్త్రిగారి మరణం తర్వాత వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది.

రామశాస్త్రి డిగ్రీ ఫస్ట్ క్లాసులో పాసయినాడు. చాలా బుద్ధిమంతుడు. తెలివీ, చురుకుదనం, నిజాయితీ కల కుర్రాడు.

మీరున్నారనే ధైర్యంతో ఉద్యోగం విషయంలో నేను మాట కూడా ఇచ్చేశాను. కాబట్టి మీరు ఈ విషయాన్ని నా స్వవిషయంగా తలచి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించమని ప్రార్థిస్తున్నాను.

నేను వచ్చే నెల్లో హైదరాబాద్ వచ్చినపుడు తమరికి మిగతా విషయాలు విన్నవించుకుంటాను.

ఇట్లు,

భవదీయుడు,

కృపానిధి.

తన స్వంత తమ్ముడి విషయంలో అయితే ఎలా రాసి ఉండేవారో అలానే రాశారు.

ఆ ఉత్తరాన్నీ, అందులో పొదగబడిన అక్షరాల్నిచూస్తూ ఉంటే అక్షయ పాత్రని అరచేతిలో ఇముడ్చుకున్నంత ఆనందంగా ఉంది.

"భవదీయుడు" – ఎంత చక్కటి పదమో. నాకీ పదమంటే ఎంతిష్టమో – ఉత్తరం ప్రారంభంలో ఉభయకుశలోపరి రాయటం నాకెంతటి వ్యసనమో అలానే చివర్లో భవదీయుడు అని ముగించటంలో కూడా అంతటి మక్కువ.

సోదర సమానులన్నారు కదా – బహుశా కృపానిధి గారికి కూడా ఆ పదం అంటే నాకు మల్లేనే ఇష్టమేమో.

హైదరాబాద్ చేరుకున్నాక బర్కత్‌పురాలో ఉన్న మినిస్టర్ గారింటిని వెతుక్కుంటూ వెళ్లాను.

ఎక్కువ శ్రమ పడకుండానే ఇల్లయితే చేరుకున్నాను కానీ నాకంటే ముందే నా దురదృష్టం వాలినట్లుంది. మినిష్టరుగారు లేరు – రావడానికి రెండ్రోజులు పడ్తుందట. గేట్ కీపర్ చెప్పాడు.

అతను తెలుగువాడే. మొదట నా మాసిన బట్టల్నీ, దైన్యం నిండిన ముఖాన్నీ చూసేమో 'జావ్ . . . జావ్ . . .' అని హిందీలో కసురుకుంటే అతనికి తెలుగు రాదేమోననుకున్నా.

అతను విసుక్కుంటున్నా నేను నమస్కారం పెట్టాను. ఉద్యోగం లేకపోవటం వల్లననుకుంటా ఏ చిన్న ఉద్యోగస్థుడిని చూసినా గౌరవం కలుగుతోంది.

ఆ తర్వాత అతను స్నేహపూర్వకంగా నవ్వి, నా వివరాలన్ని అడిగి తెలుసుకున్నాడు. రెండ్రోజుల తర్వాత వస్తే మినిష్టర్ గారిని కలవొచ్చని చెప్పాడు.

తిరిగి వూరెళ్ళి మరలా వచ్చేంత డబ్బులేదు. ఈ ప్రయాణం కోసమే తెల్సిన వాళ్ళందరి దగ్గరా అమ్మ చేయిచాచిందని తెల్సు. అందుకే రెండ్రోజులు హైదరాబాద్ లోనే ఉండి మినిష్టర్‌గార్ని కల్సి వెళ్ళటానికి నిర్ణయించుకున్నాను.

యుద్ధానికీ, ఉద్యోగానికీ చాలా సామీప్యం ఉంది. పూర్వకాలంలో అయితే రణభూమిలో ముఖాముఖి పోరాడేవారు. కత్తులో, విల్లంబులో ధరించి . . . నిజమైన శక్తి సామర్థ్యాలు – తెలివి – చాకచక్యం కలిగిన వ్యక్తినే విజయలక్ష్మి వరించేది.

ఉద్యోగాలు కూడా అంతే. ప్రతిభ కలవారికి లభించేవి. నేడు పరిస్థితి మారింది. యుద్ధానికి ప్రత్యక్షంగా తలపడనవసరంలేదు. సురక్షితమైన ప్రదేశంలో కూచుని మీట నొక్కితే చాలు, మిస్సైల్స్ దూసుకుంటూ వెళ్ళి లక్ష్యాన్ని ధ్వంసం చేసేస్తాయి.

అలానే ఉద్యోగం రావాలన్నా సరియైన వ్యక్తిని పట్టుకుని, సరియైన మీట నొక్కిస్తే చాలు. ఉద్యోగం మన ఒడిలో పడ్తుంది. నా విషయంలో ఆ వ్యక్తి కృపానిధిగారు, ఆ మీట దయాసాగరంగారు.

రోజంతా హైదరాబాద్ రోడ్లు పట్టుకు తిరగటం – రాత్రి కాగానే కాచిగూడ రైల్వే స్టేషన్లో నిద్ర – ఆకలేసినపుడు ఓ రొట్టెతిని మంచినీళ్లు తాగటం . . . అంతే.

ఎలా అయితేనేం రెండ్రోజుల తర్వాత మంత్రిగార్ని కల్సుకునే మహద్భాగ్యం కలిగింది.

వారికి కృపానిధిగారిచ్చిన ఉత్తరం అందించాను. దాన్ని చదువుకున్నాక ఇంతకు ముందు కన్పించని ఆప్యాయత వారి మాటల్లో . . . మొహంలో ప్రసన్నత – ఆ ఉత్తరం ఏదో మేజిక్ చేసినట్లు . . .

“కృపానిధి నాకు చాల కావల్సిన వ్యక్తి – నీకు ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తాను. ఎటొచ్చీ ప్రస్తుతానికి ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెల్సుకోవాలి. అవి తెలిశాక నేను నీకు కబురంపిస్తాను. మరీ అర్జెంట్ అయితే కృపానిధికి ఫోన్ చేస్తాను” తన సెక్రటరీని పిలిచి నా చిరునామా నోట్ చేయించారు.

“డైరీలో ఇతని ఉద్యోగం విషయం రాసి పెట్టండి. ఈ విషయానికి మనం ప్రయారిటీ ఇవ్వాలి. ఇతను మనకు చాలా సన్నిహితుడు” అని చెప్పారు.

వారికి నమస్కారం చేసి శెలవు తీసుకున్నాను. ఇంటికి చేరిన క్షణం నుంచీ ఎదురు చూపులే . . . రాత్రుళ్లు కలలు . . . ఉద్యోగంలో చేరమని తెలియబరుస్తూ రాసిన ఉత్తరం

అందుకున్నట్లూ . . . నేను చీకటి గదిలో కూచుని ఉంటాను. ఎంత ప్రయత్నించినా లైట్ వెలగదు. ఇంతలోనే ఏదో అద్భుతం జరిగినట్లు గదంతా బ్రహ్మాండమైన వెల్తురు . . . కళ్లు నులుముకుని చూస్తే స్విచ్ మీద వేలుంచి మందహాసం చేస్తోన్న కృపానిధిగారు . . . మరో కలలో దాహంతో నాలిక పిడచ కట్టుకుని పోతూ ఆ ఎడారిలో నీళ్ళ పంపును ఆశగా చేరుకుని ఎంత ప్రయత్నించినా బొట్టు రాలదు. ఇక దాహంతో చనిపోతానేమో ననుకుంటున్న క్షణం నన్ను ముంచెత్తుతూ నీటిధార . . . పంపు తిప్పుతూ కృపానిధిగారు . . .

ప్రతివారం వెళ్ళి కృపానిధిగారిని కలుస్తూనే ఉన్నాను. రోజులు గడిచేకొద్దీ నాలో ఆతృత . . . వారాలు నెలలుగా మారాయి. నాలో కొద్ది కొద్దిగా మరలా నిరాశ . . .

"నాకూ విషయం అర్థం కావటం లేదోయ్ – దయాసాగరం మాటయిస్తే వెనక్కి తీసుకునే వ్యక్తికాదు. నీకు తెల్సుకదా మన వూర్లోనే ఎంత మందికి ఉద్యోగాలిప్పించారో! అయినా నీ విషయంలో ఈ జాప్యం ఏమిటో తెలియటం లేదు. ఎంత పని వత్తిడి ఉన్నా ఇలాంటి విషయాలు మర్చిపోరే ! మొన్న నేను హైదరాబాద్ వెళ్ళినపుడు కూడా నీ విషయం గుర్తుచేసి మరీ మరీ ప్రాధేయపడ్డాను" నొచ్చుకుంటూ అన్నారు కృపానిధిగారు.

ఏం మాట్లాడాలో తెలీక దీనంగా కూచున్నాను. అంతా నా ఖర్మ అనుకోవాలేమో . . . నాతో పాటు చదువుకున్న కృష్ణారావుకి కృపానిధిగారి రికమండేషన్ వల్లనే వారం క్రితం ఉద్యోగం వచ్చింది. మరి నా విషయంలో . . .

"మరోసారి వెళ్ళొస్తావేమిటి? ప్రత్యక్షంగా వెళ్లటం వల్ల కలిగే ప్రభావం వేరుగా ఉంటుంది" అన్నారు.

అవసరం నాదికదా, అంగీకార సూచనగా తలూపాను. అప్పటికప్పుడు తన లెటర్‌హెడ్ మీద మరలా ఉత్తరం రాసిచ్చారు.

చెల్లి చెవికున్న లోలాకుల్ని అమ్మేసి – ఆ వచ్చిన డబ్బుతో హైదరాబాద్ ప్రయాణం అయ్యాను.

ఈసారి ఉత్తరం కొద్దిగా ఘాటుగానే రాశారు. ఈ ఉత్తరం చదివితే వెంటనే ఏదో ఒక విధంగా ఉద్యోగం ఇప్పించటం ఖాయం.

హైదరాబాద్ చేరాక నేరుగా మినిష్టరుగారింటికి వెళ్ళాను. నా అదృష్టం ఈ సారి బావున్నట్లుంది. వారు వూళ్ళోనే ఉన్నారు. మరో గంటలో వచ్చేస్తారట.

కూచుని ఏం తోచక – ఆ ఉత్తరం తీసి చదువుకున్నాను.

"గౌరవనీయులైన మినిష్టరు దయాసాగరం గారికి . . .

క్రితంసారి నేను హైదరాబాద్ వచ్చినపుడు మీ దర్శనం చేసుకున్నాను. అపుడు

చి॥ రామశాస్త్రి గురించి, అతనున్న పరిస్థితుల గురించి వివరంగా చెప్పటం జరిగింది.

మీకు మా మీద దయ కలిగినట్లు లేదు. వారి కష్టాల్ని నేను చూడలేకుండా ఉన్నాను. ఈ విషయం గురించే నాకు దిగులుగా కూడా ఉంటోంది.

ఆ అబ్బాయికి ఉద్యోగం దొరికే వరకూ నా ముఖం చూపించాలంటే సిగ్గుగా ఉంది. మీరీవిషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని విన్నవించుకుంటూ . . .

మీ,
భవదీయుడు,
కృపానిధి.

దయాసాగరంగారు నన్ను చూడగానే గుర్తు పట్టారు.

"మొన్న కృపానిధిగారు కల్సినపుడు నీ గురించి చాలా గట్టిగా చెప్పారు. అయినా నేను ఆలోచించేది వేరే ఉంది. నీవు గ్రాడ్యుయేట్‌వి. ఏదో చిన్నా చితకా ఉద్యోగంలో చేర్పించడం కంటే కొద్దిగా ఆలస్యమైనా మంచి ఉద్యోగం ఇప్పిస్తే మంచిదని."

"మా ఇంటి పరిస్థితులు బావోలేవు సార్. ఎంత చిన్న ఉద్యోగమైనా చేస్తాను" అన్నాను.

"అవుననుకో – అయినా ఓ విషయం ఆలోచించావా. ఒక ఉద్యోగానికి వందమంది కాచుకుని ఉంటారు. అందులో నాకు మల్లేనే మరి కొంత మంది మినిష్టర్ల రికమండెడ్ వ్యక్తులు ఉంటారు కదా . . . కొన్నిసార్లు రాజీ కుదిరిపోతుంది. అటువంటప్పుడు కొన్నాళ్ళు ఆగటం అనేది అనివార్యం కదా! నీకు తెలుసు – ఈనాటి పరిస్థితుల్లో ఉద్యోగాలు ఎలా గగన కుసుమాలైనాయో . . ."

ఇలా చాలా కారణాలు చెప్పారు – ఆలస్యం ఎందుకవుతుందో వివరించటానికి . . . చివరికి "నీ ఉద్యోగం విషయం నా బాధ్యత – అదంతా నాకు వదిలేసి నిశ్చింతగా వెళ్ళిరా – నీకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది. కొద్దిగా ఓపిక పట్టాలి అంతే" అన్నారు.

చేసేదేముంది కనుక . . . తిరిగి ఇంటి ముఖం పట్టాను.

కృపానిధిగారిని కలిస్తే 'వాళ్ళకుండే వత్తిళ్ళు ఎన్నో! కొన్నాళ్ళు ఆగిచూద్దాం' అన్నారు.

ఇంటి పరిస్థితులు రోజు రోజుకీ దయనీయంగా మారుతున్నాయి. కొంతమంది పిల్లలకు ట్యూషన్లు చెప్పటం ప్రారంభించాను.

చెల్లీ, తమ్ముళ్ళ కళ్ళలో ఆనాడు కన్పించిన వెలుగు పూర్తిగా మాయమైంది. ఇంట్లో అందరూ నా ఉద్యోగం గురించి మాట్లాడటం మానేశారు.

నేను కృపానిధిగారిని కల్సుకోవటం మాత్రం మానలేదు. మినుకుమినుకుమంటూ

ఆశ . . . నాలో మాత్రం చావలేదు. ఎప్పుడు వెళ్ళినా ఆప్యాయంగా మాట్లాడే కృపానిధి గారు – అవసరం లేకున్నా జాప్యానికి కారణాలు వివరించి తన ఔన్నత్యాన్ని చాటుకునే దయాసాగరంగారు . . .

వత్తిడికి తట్టుకోలేకనో లేక రోజూ కాళ్ళరిగేలా తిరుగుతోన్న నా మీద జాలి పడో ఓరోజు కృపానిధిగారే "మరోసారి వెళ్ళిరా" అన్నారు.

ఈసారి ఏకంగా మూడు పేజీల ఉత్తరం రాసిచ్చారు. దాంతో పాటు "ఎలాగూ వెళ్తున్నావు కదా. ఈ పార్సెల్ కూడా వారికి అందచేయి" అని ఇచ్చారు.

నల్గురి దగ్గర చేబదుళ్ళు తీసుకుని హైదరాబాద్ బయలుదేరాను.

చాలా ఉద్యోగాలు ఖాళీలు కూడా ఉన్నాయని రూఢీగా తెల్సింది.

నాకు ఏదో ఒక ఉద్యోగం ఖాయం అన్పిస్తోంది.

మొదటి జీతంతో ఉన్న అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకున్నాను. తర్వాత చెల్లెలికి చెవిపోగులు కొనాలి. తమ్ముళ్ళకు మంచి బట్టలు కొనాలి. ఎన్నిపనులున్నాయో . . .

ఆలోచనల్లో మునిగి హైదరాబాద్ చేరుకోవటం కూడా గమనించలేదు.

ఉత్సాహంగా దయాసాగరం గారింటికి వెళ్ళాను. రాత్రికి కానీ రారట. మొదట ఆ పార్సెల్‌ని ఇంట్లో వాళ్ళకు అందచేశాను.

గేట్ కీపర్‌ని విష్ చేశాను. పలకరింపుగా నవ్వాడు.

"ఇంకా పని కాలేదా" అన్నాడు ఎప్పటిలానే.

"కాలేదండీ మొన్న వచ్చినపుడు ఖాళీలు లేవన్నారు. ఇప్పుడు ఉన్నాయట కదా – కృపానిధిగారు ఉత్తరం రాసిచ్చారు" అన్నాను.

"ఏదీ ఆ ఉత్తరం" అని అడిగాడు. తీసిచ్చాను.

మూడు పేజీల ఉత్తరాన్ని చదువుతాడనుకున్నా – చదవలేదు. ఉత్తరం చివర చూస్తున్నాడు.

"ఫోర్జరీ అని అనుమానమా – కాదు – సంతకం కృపానిధిగారిదే" అన్నాను నవ్వుతూ.

"నేను చూస్తున్నది అది కాదు. ఇక్కడ చూశావా . . . 'భవదీయుడు' అని రాశారు. అదే . . . ఇంతకు ముందు ఇచ్చిన ఉత్తరాలు కూడా ఇలానే రాసి ఉంటారు అవునా . . ."

అవునన్నట్లు తలూపాను.

"చూడు తమ్ముడూ . . . నీవెన్ని కష్టాల్లో ఉన్నావో తెల్సిన వాడిని . . . కాబట్టి నీకో రహస్యం చెప్తున్నా విను. నీకెటువంటి సహాయం లభించదు. ఇది వాళ్ళ కోడ్‌వర్డ్. 'భవదీయుడు'

అని రాస్తే ఎందుకూ పనికిరాని కేసు – చెత్త బుట్టలో పడేయి అని అర్థం".

నా భుజం మీద 'అధైర్యపడొద్దు' అన్నట్లు ఓసారి తట్టి మరలా చెప్పడం ప్రారంభించాడు.

"ఉత్తరం చివర 'నమస్కారాలతో' అని రాసి సంతకం చేస్తే – 'మీకందాల్సిన డబ్బుకి నేను జవాబుదారు' అని అర్థం. అంటే కృపానిధి గారు దొరగారి తరఫున వసూలు చేసుకుంటారన్మాట! ఆ ముడుపులన్నీ కలిపి ఒకేసారి చెల్లించుకుంటారు.

మరో కోడ్ ఉంది. ఉత్తరం చివర ఇట్లు తర్వాత కేవలం 'సంతకం మాత్రమే చేస్తే' అన్నీ నచ్చ చెప్పి పంపిస్తున్నాను. మీకు రావల్సింది స్వయానా ముట్ట చెబుతాడు అని అర్థం.

అందుకే ఏ ఆశలు పెట్టుకోకుండా తిరిగి వెళ్ళు. వీళ్ళు మేక వన్నె పులులు. నీకింకా వీళ్ళ నిజ స్వరూపాలు తెల్సినట్టులేదు. రేపు మరలా ఓట్లు కావాలి కదా. అందుకు మనకోసం తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు నటిస్తారు.

పేదవాళ్ళ దగ్గర ఏముంటాయి? రక్తమాంసాలు, ప్రేమానురాగాలు తప్ప. వీళ్ళకివి అవసరం లేదు. డబ్బు కావాలి. అదెలాగూ మనం ఇవ్వలేం" అన్నాడు.

నా మనసంతా దిగులుతో – అసహ్యంతో నిండిపోయింది.

ఉత్తరాన్ని చింపే ముందు మరోసారి ఆ అక్షరాల వైపు చూశాను. "భవదీయుడు" అని . . . అవిపుడు భయంకరంగా . . . వికృతంగా కన్పిస్తున్నాయి.

*(ఆంధ్రజ్యోతి వార పత్రిక 1.12.2000)*

☆☆☆

# పాతిల్లు

ఆ ఇల్లు పాడుపడిన భవంతిలా ఉంది. ప్రహరీ గోడలు సగానికి పైగా విరిగిపోయి, విచారంలో మునిగినట్టున్నాయి. ఇనుపగేటు తుప్పుపట్టి–తుదిశ్వాస తీసుకుంటున్న ముసలి రోగిష్ఠిలా ఉంది. ఇంటికీ, ప్రహరీ గోడకు మధ్య ఉన్న విశాలమైన ఖాళీ స్థలంలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు– గంట క్రితం కురిసిన వర్షానికి వాటి ఆకులు తడిసి, ఆ బంగ్లా గతవైభవాన్ని తల్చుకుని, నేటి దుస్థితికి కన్నీరు కారుస్తూ దుఃఖిస్తున్నట్లున్నాయి. రామ్‌సే సినిమాల్లో కన్పించే భూత్ బంగ్లాలా ఉందా ఇల్లు.

నాక్కావల్సింది ఈ ఇల్లేనా అన్న అనుమానం వచ్చి నా దగ్గరున్న నోటీసులో అడ్రస్ మరోసారి చూసుకున్నాను. నంబరు సరిగ్గానే ఉంది. రాజా రమణయ్య వీధిలో సదరు నంబరుగల ఇంట్లో ఉండే రంగారావనే వ్యక్తి పది లక్షల సంపద పన్ను బాకీ ఉన్నందున జారీ చేసిన నోటీసది. పది లక్షల సంపద పన్నంటే–కోటీశ్వరులై ఉంటారనీ, పెద్ద భవంతిలో ఉంటారనీ పొరపడ్డాను.

అసలీ ఇంట్లో మనుషులెవరైనా ఉన్నారా? అంతా నిశ్శబ్దంగా ఉంది. స్మశాన నిశ్శబ్దం. కాలింగ్ బెల్ కోసం వెదికాను. దొరకలేదు.

గేట్ మెల్లగా తీశాను. కిర్రుమంటూ చప్పుడు–నేను చదివిన హారర్ కథలన్నీ గుర్తొచ్చాయి.

తలుపు తట్టగానే 'నేనే రంగారావుని' అంటూ ఓ పొడవాటి వ్యక్తి వచ్చి నోటీస్ తీసుకుంటాడు. ఓ వారం తర్వాత చిక్కడపల్లి లైబ్రరీలో కూచుని పాత పేపర్లు తిరగేస్తుంటే ఆబిట్యురీ కాలంలో రెణ్ణెల్ల క్రితం చనిపోయిన రంగారావు ఫోటో–

ఆ ఆలోచనకు మొదట గుండె ఝల్లుమన్నా తర్వాత నవ్వుకున్నాను.

మట్టి తడిసిన వాసన–పిచ్చిమొక్కల వాసనతో కలిసి వెగటుగా వుంది. మనసుని ఎంత బుజ్జగించుకున్నా భయంగానే ఉంది. అర్థంకాని అనీజీనెస్–సమయం మధ్యాహ్నం మూడు గంటలు. వింతగా ఆ వీధి కూడా నిర్మానుష్యంగా ఉంది.

బెరుగ్గా తలుపు తట్టాను. రెణ్ణిముషాలు వేచి చూసినా సమాధానం లేదు. ఈసారి గట్టిగా



Rupaye_Chettu.pm7 128 28/7/19, 12:03 AM

తట్టాను. ఏదో కదలిన శబ్దం. చెవులు రిక్కించి విన్నాను. గబ్బిలాలేమో? కాదు. పాదాలు చేరువవుతున్న శబ్దమది. 'ఎవరూ' అన్నగొంతు–నేనేమీ సమాధానం ఇవ్వలేదు. నోరు తడారిపోయి మాట పెగిలి రాలేదనుకుంటా.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా భారీ మనిషి నిలబడి ఉన్నాడు–ఆజానుబాహువు–మీసాలు వెనక్కి మెలితిప్పి ఉన్నాయి. వయసు చెప్పడం కష్టం. లుంగీ, బనీను మీదున్నాడు. బనీను మాసిపోయి చిరుగులు పట్టి ఉంది. మొహం గంభీరంగా ఉన్నా, కళ్ళల్లో దైన్యం తాండవిస్తోంది.

"ఎవరు కావాలి?" అడిగాడతను. అతని గొంతు కంచులా ఖంగుమంది.

"రంగారావుగారుండేది ఇక్కడేనా?"

"నేనే రంగారావుని. మీరెవరు?"

"నేను ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్నండీ" అంటూ పర్సులో ఉన్న నా ఐడీ కార్డు తీసి చూపించాను.

"రండి" అన్నాడతను నిర్వికారంగా.

ఆ గది చాలా విశాలంగా ఉంది. పురాతన కాలంలో సున్నం, మట్టితో కట్టిన గోడలు–సున్నం పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయి గోడలు మశూచికం సోకిన మొహంలా వికృతంగా ఉన్నాయి. అక్కడ విలువైన సామాగ్రి ఏదీ కన్పించలేదు–ఓ బల్లా, విరిగిపోయిన రెండు కుర్చీలు . . . అంతే.

"మీరు కట్టాల్సిన సంపద పన్ను వడ్డీతో సహా కలిపి పది లక్షలైంది. పది పన్నెండేళ్ళ క్రితం నాటి బకాయి కదా! మీకు నోటీసు పంపించినా పన్ను కట్టలేదు కాబట్టి మీ ఇంటిని అటాచ్ చేస్తున్నాం. ఈ నోటీసు ముట్టినట్టు సంతకం పెట్టండి" అన్నాను అతని చేతికి నోటీసు ఇస్తూ.

"నా దగ్గర కట్టడానికి డబ్బు లేదు. మిగిలింది ఈ ఒక్క ఇల్లు . . . లంకంత కొంప. అమ్మితే కనీసం పాతిక లక్షలైనా వస్తుంది. అమ్మిపడేసి – అప్పులు తీర్చేసి–మిగిలిన డబ్బుతో హాయిగా ఉందామంటే పడనీయదు. మీరైనా వేలం వేసి, మీ పన్ను మినహాయించుకుని మిగిలిన డబ్బు నాకివ్వండి. అలా అయితే నోరెత్తదు."

ఎవరు పడనీయటం లేదో– ఎవరి నోరు మూయించాలనుకుంటున్నాడో నాకర్థం కాలేదు.

పక్కగదిలోంచి పెద్దగా దగ్గు తెర వచ్చినట్టు . . . ఖళ్ళుఖళ్ళున శబ్దం. నేను గమనించనే లేదు. ఆ గదికి తలుపుల్లేవు. విరిగిపోయి ఉంటాయి. ఆ గదిలో నులకమంచం మీద ఓ స్త్రీ పడుకుని ఉంది. నేనటు చూడగానే బలవంతంగా లేచి కూచోడానికి ప్రయత్నిస్తూ నన్ను లోపలికి రమ్మని సైగ చేసింది.

"ఎవరామె?" అన్నట్టు చూశాను రంగారావు వైపు.



Rupaye_Chettu.pm7 129 28/7/19, 12:03 AM

"నా భార్య వసుంధరా దేవి" అన్నాడు నిర్లిప్తంగా.

ఆమె మరలా లోపలికి రమ్మంటూ సైగ చేసింది. ఆ గదిలో ఆమె మంచం తప్ప కూచోటానికి ఏమీ లేదు. నేనే కుర్చీ పట్టుకుని లోపలికెళ్ళి ఆమె మంచం పక్కన వేసుకుని కూచున్నాను.

ఆమె శపించబడ్డ దేవతలా ఉంది. మొహంలో మరుగుపడిన రాచకళ చిహ్నాలు అక్కడక్కడా అంటి పెట్టుకుని . . . కళ్ళలో అలలు అలలుగా కదలాడుతూ నీలినీడలు . . . పాల నురగలాంటి శరీరఛాయ . . . చక్కటి ముఖ కవళికలు . . . ఆమె వాడిపోయి, ఒడలిపోయి, రాలడానికి సిద్ధంగా ఉన్న గులాబీలా ఉంది. ఏదో రోగం ఆమె అందాన్ని కొద్ది కొద్దిగా తినేస్తున్నట్టుంది.

"నేను ఇన్‌కంటాక్స్ ఉద్యోగిని. మీ ఇల్లు . . ." నన్ను మధ్యలోనే ఆపేసి "నేను విన్నాను" అందామె. ఆమె గొంతు బలహీనంగా ఉంది.

"నాకో సాయం చేస్తారా?" సజలాలయిన ఆమె కళ్ళల్లో అభ్యర్ధన . . . ఆ మాట అడగటానికి ఆమె చాలా క్షోభపడి ఉంటుందనుకుంటా.

"చెప్పండి" అన్నాను. వరాలిచ్చే దేవత విధివశాన ఓ సామాన్యుణ్ణి వరం అడుగుతున్నట్టని పించింది.

"ఈ ఇల్లు నా ప్రాణంతో సమానం. నేను కాపురానికి వచ్చినప్పుడు ఇంద్రభవనంలా ఉండేదీ ఇల్లు. ఇప్పుడు శిథిలాలయంలా మారింది. దీనికి కూడా ఆత్మ ఉందనిపిస్తుంది. ఇన్నేళ్ళుగా నేను దీంతో విడదీయలేని అనుబంధాన్ని పెంచుకున్నాను. దీన్ని నా నుంచి దూరం చేయకండి. మీకు చేతులెత్తి నమస్కరిస్తాను. నేను పదేళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతున్నాను. ఎప్పుడు పోతానో తెలియదు. నా ప్రాణం నా ఇంట్లోనే పోవాలి. నాకు మిగిలిన ఒకే ఒక్క కోరిక ఇదే. నా ఇల్లు నాక్కాకుండా చేయకండి" అంది. కన్నీళ్ళు ఆమె చెక్కిళ్ళ మీద జాలిగా జారాయి.

"నా చేతిలో ఏమీ లేదమ్మా. మీరు సంపద పన్ను కట్టాల్సిన మాట వాస్తవమే కదా. అప్పీళ్ళు కూడా ఏమీ పెండింగ్‌లో లేవు. మీ పరిస్థితి చూస్తే దయనీయంగా ఉంది. మీకింత సంపద పన్ను ఎలా వచ్చిందో నాకర్థం కావటం లేదు" అన్నాను.

మా సంభాషణ రుచించకనో ఏమో రంగారావు పక్క గదిలోంచి బైటికెళ్ళిపోయాడు. అతనికి భార్యమీద ప్రేమ ఉన్న దాఖలాలేవీ కన్పించలేదు- జబ్బు మనిషన్న కనికరం కూడా లేదనుకుంటాను.

ఆమె కళ్ళల్లో గతకాలపు జ్ఞాపకాల ఇసుక తుఫాన్లు . . .

"మీరు అన్యధా భావించకపోతే-దయచేసి ఆ కన్పిస్తున్న మూటను అందుకుంటారా?" అందామె. ఆమె వేలితో చూపిస్తున్నవైపు చూశాను. నీరుకాయపట్టిన పాత వస్త్రం మూటలా కట్టి మంచానికో పక్కన కిందపెట్టి ఉంది.

దాన్ని తెచ్చి చేతికిచ్చాను. ఆమె దానిమీద పేరుకుపోయిన దుమ్ము దులిపి-నిధి దాచిన మూట ముడి విప్పుతున్నంత జాగ్రత్తగా మూటను విప్పింది. అందులో ఫ్రేములు కట్టిన ఆరేడు ఫోటోలున్నాయి.

ఆమె మొదటి ఫోటో తీసి-అద్దాన్ని శ్రద్ధగా తన చెంగుతో తుడిచి నాకిచ్చింది. అది దీనదయాళ్ ఫొటో స్టూడియోలో తీసిన ఫొటో. అందులో – అద్భుతమైన సౌందర్యాన్ని స్వంతం చేసుకున్న ఇరవైయేళ్ళ అమ్మాయి-పెదవుల మీద అలౌకికమైన చిర్నవ్వు చిందిస్తూ . . .  జాజి తీగెలా ఉన్న ఆమె నాజూకు శరీరం నిండా రకరకాల బంగారు ఆభరణాలు అలంకరించబడి ఉన్నాయి. ఏ మహారాజుకో పుట్టిన ఏకైక రాకుమారిలా ఉందామె.

"ఎవరీమె?" అన్నాను అర్థంకాక.

ఆమె బలహీనంగా నవ్వింది. "ఆ ఫోటోలో ఉన్నది నేనే. నా పెళ్ళయిన కొత్తలో తీయించుకున్నాను."

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. స్నిగ్ధ సౌందర్యంతో విరబూసిన విరజాజిలా ఉన్న ఆమెకూ-శిథిలమైన శరీరంతో జీవచ్ఛవంలా ఉన్న ఈమెకూ పోలికే లేదు. ఫోటోలో ఉన్న తేదీ చూశాను. ఇరవై ఏళ్ళ క్రితంది. ఆ లెక్కన ఆమెకిప్పుడు నలభయ్యో నలభై అయిదో ఉండి ఉండాలి. కానీ జుట్టు సగానికి పైగా తెల్లబడి-మొహంలో ముడతలొచ్చి అరవైయేళ్ళ ముసలిదానిలా కన్పిస్తోంది.

రెండో ఫొటో తుడిచి ఇచ్చింది-అందులో మూడు ధవళాశ్వాలు బిగించిన బగ్గీలో తలకు పాగా చుట్టుకుని గంభీరమైన వ్యక్తి కూచుని ఉన్నాడు. అతని ఒడిలో దర్జాగా కూచుని ఉన్న పదేళ్ళ బాబు.

"వారు మా మామ గారు- రాజబహద్దూర్ రమణయ్యగారు. ఆ రోజుల్లో ఈ వీధంతా మాదే. ఈ వీధి పేరు మీకు తెలిసే ఉంటుంది. రమణయ్యగారి వీధి. కొన్ని లక్షల ఆస్తికి ఒకే ఒక్క వారసుడు నా భర్త రంగారావు గారు. కానీ నా పెళ్ళయ్యాక కేవలం పదీ పదిహేనేళ్లలో ఆస్తులన్నీ హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. మాకీ దారిద్ర్యం-అప్పులూ మిగిలాయి" ఆమె సన్నగా ఏడుస్తోంది. "నా జబ్బు మానసికమైందని నాకు తెలుసు. దీన్ని ఏ డాక్టరూ బాగు చేయలేదు" అంది వెక్కిళ్ళ మధ్య.

"అన్ని లక్షల ఆస్తి ఎలా పోయిందీ" అని అడిగాను. నిజం తెల్సుకోవాలన్న కుతూహలం నాలో . . .

"మా మామగారి బగ్గీ నడిపే వాడు కనకదాసు. అతనికో కొడుకూ, కూతురూ. కూతురి పేరు పుష్పవల్లి. కనకదాసు చనిపోయాక అతని కొడుకు మా కారు డ్రైవరుగా పనిచేసేవాడు. అతనికి అన్ని వ్యసనాలూ ఉండేవి. అతనే ఓ పథకం ప్రకారం మా వారికి పుష్పవల్లిని అలవాటు చేశాడు. తాగుడు నేర్పాడు. గుర్రప్పందాలు ఆడటం నేర్పాడు. మా వారు ఆస్తి వ్యవహారాలేవీ పట్టించుకునే వారు కాదు. ఎప్పుడూ పుష్పవల్లి దగ్గరే పడి ఉండేవారు. పుష్పవల్లీ, కనకదాసూ కలిసి మా వారు మత్తులో ఉన్నప్పుడల్లా ఆస్తిని మెల్ల మెల్లగా తమ పేర్లమీద రాయించుకున్నారు. మా వారికి వాళ్ళ కుటిలత్వం తెలిసొచ్చేటప్పటికి ఈ ఇల్లు, పది లక్షల అప్పు మిగిలింది. ఆ అప్పు తీర్చటంకోసం ఇంట్లోని నగా, నట్రా అమ్ముకోవాల్సి వచ్చింది."

"ఇంతటి దరిద్రాన్ని అనుభవించే బదులు, ఇల్లు అమ్మటానికి ఒప్పుకోవచ్చు కదా. మరీ అంత సెంటిమెంట్ కూడా మంచిది కాదేమో" అన్నాను సంశయిస్తూనే.

"ఈ ఇల్లు నా ఆత్మ– ఇది సెంటిమెంట్ కాదు. వాస్తవం. దీన్ని అమ్మటం జరిగితే అది నా ప్రాణం పోయాకే. నేనెవర్నీ నా జీవితంలో ఇబ్బంది పెట్టలేదు–కానీ మీకు ఇబ్బంది కలిగినా, దయచేసి ఇల్లు వేలానికి రాకుండా కాపాడండి" అందామె చేతులు జోడిస్తూ.

నాకెందుకో బాధనిపించింది. జమీందారీ ఉన్న రోజుల్లో ఆమె ఎంత మంది చేత నమస్కారాలు అందుకుందో? "నా శాయశక్తులా ప్రయత్నించి చూస్తానమ్మా" అన్నాను బయల్దేరబోతూ.

ఆఫీసుకు తిరిగొచ్చాక మా టాక్స్ రికవరీ ఆఫీసరు గారికి విషయం విన్నవించుకున్నాను.

"ఇంత మెతక మనసైతే టాక్స్ రికవరీ ఏం చేస్తారండీ? మన పర్సనల్ ఫీలింగ్స్‌తో ఉద్యోగ బాధ్యతలకు ముడిపెట్టకూడదు" అంటూ క్లాస్ తీసుకున్నాడు.

టాక్స్ వసూలు చేసే సంస్థలో ఉన్నంత మాత్రాన హృదయం లేకుండా ప్రవర్తించాలా? దయాగుణం వదులుకోవాలా? అని అడుగుదామనుకున్నా – అతనితో వాదన అనవసర మనిపించింది.

ఈ విధంగా లాభంలేదని మరలా రంగారావు గారింటి కెళ్ళాను. "మా చీఫ్ కమీషనర్ గారు చాలా దయాళువు. కరుణా, మానవత నిండిన మనిషి. వడ్డీని మాఫీ చేయమని మీరాయనకో అర్జీ పెట్టండి. మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అన్నాను.

అతనిచేత అర్జీ రాయించి ఆఫీసులో దాఖలు చేయించాను. టాక్స్ రికవరీ ఆఫీసరుగారికి, సదరు అర్జీ మీద చీఫ్ కమీషనర్‌గారు నిర్ణయం తీసుకునే వరకూ వేలం నిర్ణయాన్ని వాయిదా



Rupaye_Chettu.pm7 132 28/7/19, 12:03 AM

వేయాల్సిందిగా కోరుతూ మరో ఉత్తరం రాయించాను.

నేను చేస్తున్న ప్రయత్నాలు చూసి వసుంధరా దేవి "ఇబ్బంది పెడ్తున్నాను కదూ!" అనేది.

రంగారావు మాత్రం అసంతృప్తిగా ఉండేవాడు. "మీరు వేలం వేస్తే నాకు మిగుల్తుందో మిగలదో? ఈమె అడ్డుపడకపోతే ఈపాటికి దీన్ని అమ్మేసి దర్జాగా ఉండేవాణ్ణి. ఏం చేస్తాను-నా ఖర్మ" అంటూ గొణుక్కునేవాడు.

"మీరు తాగినా-తిరిగినా-ఆస్తి మొత్తాన్ని దుబారా చేసినా నేను అడ్డు తగిలి ఇబ్బంది కలిగించలేదు. నా కోరిక ఒకటే. ఈ ఇంట్లో చివరి శ్వాస తీసుకోవాలని. దయచేసి ఈ విషయంలో నా కోరిక మన్నించండి" అనేది.

డిసెంబర్ నెలలో దాదాపు నాలుగు లక్షల వడ్డీని మాఫుచేస్తూ చీఫ్ కమిషనర్‌గారి ఆర్డర్ వచ్చింది.

నేను చాలా సంబరపడుతూ ఆ ఇంటికెళ్ళాను. అతను లేడు. వసుంధరా దేవి ఎప్పటిలా మంచంలో పడుకుని ఉంది.

"ఇప్పుడు ఆరు లక్షలు కడితే చాలండీ" అన్నానామెతో.

"మా పరిస్థితి మీకు తెలియదా? ఆరు లక్షలు కాదు కదా ఆరు వేలైనా మాకు కష్టమే. ఏదో ఒకటి చేసి అది కూడా మాఫీ చేయించకూడదూ."

"అటువంటి అవకాశం లేదమ్మా. కనీసం ఈ ఇంట్లో సగం అమ్మినా సరిపోతుంది. మిగతా సగంలో మీ కోరిక మేరకే ఉండొచ్చు" అన్నాను.

"వద్దు. దయచేసి అలా మాట్లాడొద్దు. నేను భరించలేను. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ఈ ఇంటిలో గజం స్థలం అమ్మటానికి కూడా వీల్లేదు. మీరెలాగైనా ఆదుకోండి. నేనింక ఎంతకాలం బతుకుతాను చెప్పండి? మీ చీఫ్ కమీషనర్ గారు చాలా మంచి వారన్నారుగా. వారికి చెప్పి వేలం ఆపించరూ" అంది చేతులు జోడిస్తూ.

నా గుండె కరిగిపోయింది.

టాక్స్ రికవరీ ఆఫీసరు గారితో వాదనకు దిగాను.

"సరే. మీరు చెప్పినట్టే వేలం ఆపేశామనుకోండి. మన జాయింట్ కమీషనర్ గారి గురించి మీకు తెలుసు కదా. చండశాసనుడు. నేను ఆయనకేం సమాధానం చెప్పను? మా ఇన్‌స్పెక్టర్ది జాలిగుండె - అందుకోసం సార్ అని చెప్పనా?" అన్నాడు.

అదీ నిజమేననిపించింది.

పాపం టాక్స్ రికవరీ ఆఫీసర్ గారు ఏమనుకున్నారో ఏమో ఫిబ్రవరి రెండో వారం వరకూ

వాయిదా వేశారు. మార్చి 31 లోపల వేలం వేయాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 16న నా చేతికి మరో నోటీసు ఇచ్చి పంపించారు. నాకు మొహం చెల్లలేదు. వసుంధరాదేవి గారికి విషయం ఎలా చెప్పాలో తెలియలేదు. ఈ నోటీసు ఇచ్చిన నెల తర్వాత ఇల్లు వేలం వేస్తారు. ఆమె చేతులెత్తి నమస్కరించిన విషయం గుర్తొచ్చి మనసు వికలమైంది. నోటీసు మరొకరి ద్వారా పంపమని ఆఫీసర్ గారికి చెప్పాలనుకున్నా. అది సబబు కాదనిపించింది. నా అశక్తతను చెప్పుకుని నన్ను క్షమించమని ఆమెనడగాలి.

నేనా ఇంటికెళ్ళేప్పటికి సమయం మధ్యాహ్నం రెండున్నర గంటలు . . . ఎండ విపరీతంగా ఉంది. ఇంటి ముందున్న పిచ్చి మొక్కలన్నీ ఎండిపోయి ఉన్నాయి. తలుపు తట్టాను. ఎప్పటిలానే రంగారావు తలుపు తీశాడు. నేనతనితో ఏమీ మాట్లాడకుండా అలవాటుకొద్దీ వసుంధరాదేవి గారి గదిలోకి వెళ్ళాను.

ఖాళీ మంచం ఉందక్కడ . . .

నాతో పాటే గదిలోకి వచ్చిన రంగారావు వైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"చనిపోయి పదిహేను రోజులైంది" అన్నాడు భావరహితంగా. "ఇప్పుడు మీరు వేలం వేయాల్సిన అవసరం లేదు. నేను అమ్మకానికి పెట్టాను. ఉన్న ఆ ఒక్క అడ్డూ తొలగిపోయిందిగా. రెండు మూడు వారాల్లో అమ్మేసి మీ డబ్బు కట్టేస్తాను."

అతని మాటలు పట్టించుకోకుండా మరోసారి ఆ ఖాళీ మంచం వైపు చూశాను.

వసుంధరాదేవి బలహీనమైన స్వరంతో ''మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు కదూ'' అన్నట్టనిపించింది.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 11, ఆగష్టు 2000)*

★★★

# పిడికెడు గుండె

ప్రాక్టీస్ పెట్టి నెలరోజులైనా ఒక్క పేషంటూ రాలేదు. ఏమీ తోచక మెడికల్ జర్నల్స్ చదువుకుంటూ కూచున్నాను.

ఒకప్పుడు వూరికో డాక్టరుండటం గగనంలా ఉండేది. ఇపుడు వీధికిద్దరున్నారు. అయినా ఎంసెట్‌ల కోసం మనుషులు ఎగబడ్తూనే ఉంటారు. డాక్టర్ కోర్సు కోసం లక్షలు ఖర్చు చేస్తూనే ఉంటారు.

నేను ఉత్సుకత కొద్దీ డాక్టర్ కాలేదు. చాలా మందికిమల్లే మా తల్లిదండ్రుల అహం కోసం, సొసైటీలో దొరికే హోదా కోసం – తద్వారా వచ్చే కట్నం డబ్బులకోసం . . . అంతే!

ప్రాక్టీస్ పెట్టడం కోసం ఈ రెండుగదుల రూమ్‌ని అద్దెకు తీసుకున్నాను. ఓ గదిలో పేషంట్స్ కూచోడానికి కుర్చీలు ఏర్పాటు చేశాను. ఓ చిన్న టేబుల్‌మీద రకరకాల పత్రికలు పెట్టించాను. రూంని శుభ్రపర్చడానికీ, పేషంట్స్‌ని లోపలికి పంపటానికి నెలజీతం మీద ఓ కుర్రాడిని కుదుర్చుకున్నాను. ఇక స్టెతస్కోపూ . . . పరీక్ష చేయటానికి ఓ బల్లా . . . వెయింగ్ మిషనూ . . . బీపీ ఆపరేటస్ . . . నాకో కోటూ . . . దానికో టై . . . అంతా హంగామా. నెలకు రెండుమూడు వేల ఖర్చు తప్ప పైసా ఆదాయం కన్పించటం లేదు.

"డాక్టరు బాబున్నారా?" బైట ఎవరిదో గొంతు విన్పించింది.

"ఉన్నారు, లోపలికెళ్ళండి" అంటున్నాడు పని కుర్రాడు.

వాడి స్వరంలోని కుతూహలం నేను గమనించకపోలేదు.

నా మొదటి పేషంట్‌ని దండవేసి సత్కరించటం సాధ్యంకాదు కాబట్టి దరహాసంతో పల్కరించి కూచోమన్నాను.

అతనికి వయసు అరవై పైనే ఉంటుంది. జుట్టు తెల్లగా నెరిసి, అక్కడక్కడా నల్లటి వెంట్రుకలు బెరుగ్గా కన్పిస్తున్నాయి.

మొహంలో ఉదాసీనత . . . దేన్నో ఎక్కడో పోగొట్టుకుని దానికోసం అనవరతం, అడుగడుక్కీ వెతుక్కుంటున్నట్లు . . . అతనిలో ఆందోళన.

మనిషి బాగా చదువుకున్నవాడిలానే ఉన్నాడు. ఖరీదయిన బట్టలు వేసుకుని ఉన్నాడు. డాక్టరుగా అతని ఆర్థికస్థాయిని అంచనా వేసుకున్నాక "చెప్పండి" అన్నాను.

"కొన్ని రోజుల నుండీ గుండెల్లో నొప్పిగా ఉంటోంది బాబూ. అస్థిమితంగా . . . వూపిరాడనట్లు . . . ఉక్కిరిబిక్కిరిగా అయిపోతున్నట్లు . . . "

ప్రిస్క్రిప్షన్ ప్యాడ్ తీసుకుని దానిమీద తారీఖు వేశాక –

"మీ పేరు?" అడిగాను.

"ప్రసాదరావు"

"వయసు?"

"అరవై రెండు"

అతను చెప్పిన కంప్లైంట్ రాశాక "ఇంకా . . ." అని అడిగాను.

"నీరసంగా ఉంటోంది బాబూ . . . ఏ పనీ చేయాలనిపించదు. ఉత్సాహమే ఉండదు. నేను ఉద్యోగం చేసే రోజుల్లో నన్నందరూ బుల్ వర్కర్ అనేవారు. పనంటే అంత ఆసక్తి. కానీ ఈ మధ్య . . . "

"ఏం ఉద్యోగం చేసేవారూ?"

"సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా చేసి రిటైరయ్యాను"

బీ.పి. చెక్ చేద్దామని ఆపరేటస్ తీశాను.

"నాకు బీ.పి. లేదు. షుగరూ లేదు. దృఢమైన శరీరం . . . ఈ మధ్యనే గుండె . . . బలహీనపడినట్లనిపిస్తోంది"

అతను చెప్పేది వింటూనే బీపి చూశాను. ఆ వయసుకు తగ్గట్లు నార్మల్‌గానే ఉంది.

స్టెత్ పెట్టి గుండె, వూపిరితిత్తులు పరీక్షించాను. అంతా సవ్యంగా ఉంది.

"మీ గుండె నిక్షేపంగా ఉంది. బహుశా గ్యాస్ట్రిక్ ప్రాబ్లం వల్ల గుండెల్లో అసౌకర్యంగా ఉందేమో. మందులు రాసిస్తాను. ఓ వారం వాడండి. అప్పటికీ తగ్గకపోతే ఇ.సి.జి. చేయిద్దాం. అనవసరంగా మొదలే టెస్టులెందుకు" అన్నాను.

"అచ్చం మా బాబులా అంటున్నావు. మా అబ్బాయి కూడా డాక్టరే. యం.డి. చదివాడు. వాడికీ అనవసరంగా టెస్టులు రాయడం ఇష్టం ఉండదు".

వాళ్ళబ్బాయి మా జాతివాడేనని తెలిసి కుతూహలం పెరిగింది.

"ఇప్పుడు ఎక్కడ ప్రాక్టీస్‌చేస్తున్నాడు?" అని అడిగాను. ఇతను నా దగ్గరకొచ్చాడంటే వాళ్ళబ్బాయి మరే వూళ్లోనో ఉండి ఉండాలన్న అభిప్రాయానికొచ్చి.

"వాడు అమెరికాలో ఉన్నాడు బాబూ. అక్కడ డాక్టర్‌గా వాడికి మంచి పేరుంది" గర్వంగా చెప్పాడతను. అలా అంటున్నప్పుడు అతని ఛాతీ అరంగుళం పెరగటం గమనించాను.

మందులు రాసిచ్చి ఓ వారం ఆగాక రమ్మని చెప్పాను.

రెండోరోజే మరలా కన్పిస్తే ఎలాగూ ఖాళీగానే ఉన్నాను కాబట్టి విసుగుపడకుండా "ఎలా ఉన్నారు? రండి. కూచోండి" అన్నాను మనస్ఫూర్తిగా.

అతను విశాలంగా నవ్వాడు.

మొహం తేటగా ఉంది. ఆరోగ్యంగా కన్పిస్తున్నాడు.

నా మందులు బాగా పనిచేసినట్లున్నాయి.

"ఇప్పుడు నెమ్మదించినట్లే ఉంది బాబూ . . . నొప్పి అలానే ఉన్నా గాభరా, గుండె దడా తగ్గాయి. నీ హస్తవాసి మంచిదిలా ఉంది. ప్రాణానికి హాయిగా ఉంది".

ఆ మాటలు వినగానే నా ఛాతి రెండంగుళాలు పెరగటం నాకు తెలుస్తూనే ఉంది.

"కూరగాయల్లో క్యాబేజీ, కాలీఫ్లవర్, చిక్కుడు వాడకండి. ఉల్లిపాయ వాడకం కూడా వీలైనంత తగ్గించండి. ఇవి గ్యాస్‌ని ప్రొడ్యూస్ చేస్తాయి. రాత్రుళ్ళు పెరుగు బదులు పల్చని మజ్జిగ వాడండి. ఈ వయసులో సులభంగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవడం మంచిది. నెక్స్ట్ టైం వచ్చినపుడు మీ ఆవిణ్ణి పిల్చుకు రండి వివరంగా చెప్తాను" అన్నాను.

ఆ మాటలకు అతను అదోలా మొహం పెట్టాడు. నేనేదో తప్పు మాట్లాడానని నాకర్థమైంది.

"నా భార్య రెండేళ్ళ క్రితం చనిపోయింది బాబూ" అతని గొంతులో అంతులేనంత విషాదం . . .

"ఐయాం సారీ" నొచ్చుకుంటూ అన్నాను.

"ఆ రోజు ఉదయం మామూలుగానే లేచింది. నాకు టిఫిన్, కాఫీలు ఇచ్చాక పొయ్యిమీద చారు పడేసింది. చారు మరుగుతుండగా నా దగ్గరకొచ్చి 'ఒంట్లో ఎలాగో ఉంది. కొద్దిసేపు నడుం వాలుస్తాను. ఓ అయిదు నిమిషాలు మరిగాక చారు దించేయండి. నేనొచ్చి కూర వండుతాను' అంది. తనకు బీ.పి., షుగరూ రెండూ ఉన్నాయి. చారు దించాక అరగంట చూసినా తను రాకపోతే నిద్రపోయిందేమో లేపుదామని బెడ్రూంలోకెళ్ళా. మంచంమీద ప్రశాంతంగా నిద్రపోతున్నట్లే ఉంది బాబూ . . . గట్టిగా పిల్చినా లేవకపోతే తట్టి లేపబోయిన నాకు అర్థమైంది – నా జీవితంతో ముప్ఫయ్ ఆరేళ్ళుగా ముడిపడిన మరో జీవితం ముగిసిందని . . ."

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

అతని మాటల్ని బట్టి భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగా ఉండేవారనిపించింది. ఆమె మరణం అతన్ని బాగా క్రుంగదీసి ఉంటుంది. ఆ షాక్ నుండి బయట పడటానికి అతనికి చాలా సమయం పట్టి ఉంటుంది. అసలిప్పటికీ బైటపడలేదేమో . . .

“మరి మీరెవరితో ఉంటారిక్కడ?”

“మాకు ఒక్కడే కొడుకు బాబూ – కిశోర్. వాడే అమెరికాలో ఉంది. నా భార్య పోయినప్పటినుండీ నేను ఒంటరిగానే ఉంటున్నాను. వంట చేయటంకోసం ఓ పనిపిల్లను పెట్టుకున్నాను”.

“అవే మందులు కంటిన్యూ చేయండి” అన్నానతను వెళ్ళే ముందు.

మరో వారం తర్వాత వచ్చాడతను.

“గుండె నొప్పి తగ్గటంలేదు బాబూ” అంటూ మొదలెట్టాడు.

వయసు అరవై దాటిందాయె. ఎందుకయినా మంచిదని ఆలోచించి ఇ.సి.జి. చేయించు కోమని రాసిచ్చాను.

“రాత్రిళ్లు నిద్ర రావటం లేదు బాబూ . . . తెల్లగా తెల్లారే వరకూ నిద్రకోసం పోరాటం తప్ప విజయం వరించటం లేదు. అధవా కొద్దిగా కునుకుపట్టినా కలత నిద్రవుతుంది తప్ప కంటినిండా నిద్ర కరువే. నిద్ర పట్టడానికి ఏదైనా మందు రాసివ్వు” అన్నాడతను.

“ఈ వయసులో నిద్రకోసం మందులు వాడటం మంచిదికాదు. మనసు ప్రశాంతంగా ఉంచుకోండి. ధ్యానం చేయండి. నిద్ర అదే వస్తుంది” అన్నాను.

“ప్రశాంతత . . . ధ్యానం . . . హుఁ” తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అని వెళ్ళిపోయాడు.

మరునాడు ఇ.సి.జి. రిపోర్ట్ పట్టుకుని వచ్చాడు. అంతా నార్మల్‌గా ఉంది.

“గుండెకు సంబంధించి మీకే రకమైన జబ్బులేదు – మీ గుండె రాయిలా ఉంది” అన్నాను నవ్వుతూ.

ఆ మాటకు అదోలా చూశాడతను. నేను వాడిన ఉపమానం చేదుగా అన్పించినట్లుంది.

“రాయే అయితే నొప్పెందుకు వస్తుంది బాబూ . . . నువ్వు ఏమీ లేదంటున్నా, అనుభవిస్తున్న నాకు తెలుసు కదా. రెండు చివర్లూ పట్టుకుని గుడ్డను పిండినట్లు నా గుండెను పిండుతున్నంత బాధ . . . ప్రాణంపోయేంత బాధ నేననుభవిస్తుంటే ఏం లేదంటావేమిటి?”

నేను కొద్దిసేపు ఆలోచించాను. శరీరంలో రుగ్మత ఉన్నట్లు ఆధారాలు దొరకటం లేదు కాబట్టి జబ్బు మానసికం అయ్యే అవకాశాలే ఎక్కువ.

మెదణ్ణి శాంతపరిచే మందులు కొన్నాళ్ళు వాడితే నయమవుతుందేమోననే ఆశతో ఆ మందులు రాసిచ్చి, "ఓ పదిరోజులు వాడి చూడండి. నొప్పి అప్పటికీ తగ్గకపోతే స్పెషలిస్ట్‌కి చూపిద్దాం" అన్నాను.

మెల్లమెల్లగా పేషంట్స్ రావడం ప్రారంభమైంది. రోజుకు కనీసం నలుగురైదుగురు వస్తున్నారు. ప్రాక్టీస్ పుంజుకుంటోంది.

అతను మరో నాలుగు రోజుల తర్వాత వచ్చాడు.

"నిద్రెలా పడ్తోంది" అని అడిగాను.

"పర్లేదు" అని కొన్ని క్షణాలు ఆగి చెప్పాడతను. "ఉదయం నుండీ విపరీతమైన కడుపునొప్పి- అందుకొచ్చాను"

"గుండె నొప్పి ఎలా ఉంది?"

"స్థిరంగా ఉంది. ఏ రకమైన హెచ్చుతగ్గులూ లేవు".

భోజనంలో ఏయే పదార్థాలు తిన్నాడో కనుక్కుని కడుపునొప్పికి మందులు రాసిచ్చాను.

రెండ్రోజులు కావటం ఆలస్యం – మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

ఈసారి కాళ్ళు నొప్పులట – విపరీతంగా గుంజేస్తున్నాయట.

మందులు రాసిచ్చాను.

మరోసారి తలనొప్పి – ఇంకోసారి నడుం నొప్పి . . .

నాకతని అవస్థ అంతుబట్టటం లేదు.

నాకివ్వాల్సిన ఫీజు మాత్రం వద్దన్నా వినకుండా ఖచ్చితంగా ఇవ్వటం వల్లా . . . అతను నా మొదటి పేషంట్ అన్న సెంటిమెంట్ వల్లా . . . అతని వయసు దృష్ట్యా అతనెన్ని సార్లు వచ్చినా విసుక్కోకుండా – ఓపిగ్గా అతను చెప్పేదంతా విని – నాకు తోచిన మందులు రాస్తూనే ఉన్నాను. అయినా రెండుమూడు రోజులు కాకుండానే మళ్ళీ వచ్చేస్తున్నాడు.

ఈ నాలుగు నెలల కాలంలో దాదాపు నలభైసార్లు వచ్చి ఉంటాడు. వచ్చిన ప్రతీసారీ కనీసం పావుగంటైనా కూచుని, మొదట అనారోగ్యం గురించి చెప్తాడు. తర్వాత చనిపోయిన తన భార్య మంచితనం గురించీ, అమెరికాలోని తన కొడుకు గురించీ చెప్తాడు.

ఎన్ని రకాల రుగ్మతలు చెప్పినా వాటితో పాటు గుండెనొప్పి గురించి చెప్పటం మాత్రం మర్చిపోడు.

హైపోకాండ్రియాక్ ఏమోననే నిర్ధారణకు వస్తున్న తరుణంలో మా ఆఫీస్‌బాయ్ ఆసక్తికరమైన వార్తను మోసుకొచ్చాడు.



Rupaye_Chettu.pm7 139 28/7/19, 12:03 AM

మొన్న ప్రసాదరావుగారికి మందులు రాసిచ్చాక, ఆఫీస్‌బాయ్‌ని పిలిచి ధర్మామీటర్ కొనుక్కురమ్మని పంపించాను. అతను వెళ్తుంటే – ముందు ప్రసాదరావుగారు వెళ్తూ కన్పించారట. మెడికల్‌షాపు వచ్చినా మందులు కొనకుండా దాటిపోతుంటే మరో చోట కొనుక్కుంటారే మోననుకుని తను షాపులోకి వెళ్ళబోతూ ఆగి చూశాడట. ప్రసాదరావుగారు జేబులోంచి మందుల చీటీని తీసి నాలుగు ముక్కలుగా చింపి, రోడ్డు పక్కగా పడేసి ముందుకెళ్ళి పోయారట.

అది విన్నవెంటనే మొదట కోపం వచ్చింది. డాక్టర్ దగ్గరకు రావడం తమాషా అనుకుంటున్నాడా? నేను రాసిచ్చిన మందులమీద నమ్మకంలేక చించేస్తున్నాడా? ఈసారి వచ్చినపుడు నాలుగూ దులిపేద్దాం అనుకున్నాను.

తర్వాత ప్రశాంతంగా ఆలోచిస్తే డాక్టరుగా నేను చేయాల్సింది అది కాదనిపించింది. అతనలా ప్రవర్తించడం వెనుక కారణాలేమై ఉంటాయా అని ఆలోచించాను. అతను సరదాకో, తమాషాకో అలా చేస్తుంటే అంత ఖచ్చితంగా నా ఫీజు చెల్లించడు. అసలా మనిషి అలాంటి వాడు కాదు. మరేదో కారణం ఉండి ఉండాలి.

నాకీ విషయం తెల్సిన మూడోరోజు అతనొచ్చాడు. మొహం అంతా వేలాడేసుకుని– ఉదాసీనంగా – విచారంగా . . .

"ఎలా ఉన్నారు?" నవ్వుతూ అడిగాను.

"ఏం చెప్పమంటావు బాబూ . . . గుండెను ఎవరో ఇనుప పిడికిళ్ళతో పిసికేస్తున్నట్లు బాధ. నీ దగ్గరకు నాలుగైదు నెలలనుంచీ వస్తున్నా, కొద్దిగా కూడా తగ్గలేదు. దీనికి తోడు నిన్నటినుండీ వాంతులు . . . మొత్తం పేగుల్తో సహా బైటికొచ్చేస్తున్నట్లనిపిస్తోంది" అన్నాడతను.

"ఆకలి ఎలా ఉంది?"

"అస్సలు అన్నహితవు లేదు బాబూ . . . కొంచెం తిన్నా అరగటంలేదు."

అతన్ని పరీక్షించి, మందులు రాసిచ్చి "ఇవి వాడండి. తగ్గిపోతుంది" అంటూ "అమెరికా వెళ్ళి మీ అబ్బాయి దగ్గర నాల్రోజులు ఉండి రాకూడదూ. గాలి మార్పుగా ఉంటుంది" అన్నాను.

అతని మొహంలో రంగులు మారాయి. విషాదం అలుముకుంది.

"పిలవని పేరంటానికి పోయి అవమానింపబడటం కంటే ఉన్న వూర్లోనే ఉండటం నయం కదా బాబూ" అన్నాడు.

అతని కోడలు అతన్ని సరిగ్గా చూడదేమోననిపించింది. అందుకే ముసలాయన వెళ్ళడానికి ఇష్టపడటంలేదనుకున్నా.

"పోనీ మీ అబ్బాయినే వచ్చి మీతో కొన్ని రోజులు గడిపి వెళ్ళమనరాదూ"

అతను వేదాంతిలా విరక్తిగా నవ్వాడు.

"మనుషులు డాలర్ల సంపాదనలో పడ్డాక అనుబంధాలు గుర్తుంటాయా బాబూ . . . మన పిచ్చిగానీ . . . వాణ్ణి ప్రాణంలో ప్రాణంలా చూసుకుంది వాళ్ళమ్మ. వాడు చిన్నప్పుడు నడుస్తుంటే వాడి పాదాలు కందిపోతాయేమోనని తల్లడిల్లిన వాళ్ళమ్మ చనిపోయినపుడే తీరిక లేదని రాలేదు. తల్లీ దండ్రీ పిల్లలూ . . . అంతా వట్టి భ్రమ".

అతను బయటకు వెళ్ళిన వెంటనే బాయ్‌ని పిలిచి అతను గమనించకుండా అతన్ని ఫాలో కమ్మని చెప్పాను.

పది నిముషాల్లో వాడు వగర్చుకుంటూ పరుగెత్తుకొచ్చి చెప్పాడు – మొన్నట్లానే మందుల చీటీని చింపేసి ముక్కలు చెత్తకుప్పలో పడేసి వెళ్ళిపోయాడని.

నాకు అతని జబ్బేమిటో పూర్తిగా అర్థమైపోయింది.

అతని రాకకోసం ఎదురుచూస్తూ రెండ్రోజులు గడిపాను. మూడో రోజు వచ్చాడు – మొహం దిగాలుగా పెట్టుకుని.

"ఇప్పుడెలా ఉంది ప్రాణం?" అతను కూచున్నాక అడిగాను.

"వాంతులాగిపోయాయి బాబూ. నేను ఏ కంప్లైంట్‌తో వచ్చినా నువ్విచ్చే మందుకి మరునాటికల్లా అది మాయం అనుకో. ఎటొచ్చీ నా గుండె నొప్పి మాత్రం తగ్గించలేకపోతున్నావు. ఈ నొప్పి భరించేకంటే చచ్చిపోతేనే బావుండుననిపిస్తోంది" అన్నాడు నిష్ఠూరంగా.

"మీ గుండెనొప్పికి అసలు కారణమేమిటో నాకర్థమైపోయింది" అన్నాను.

అతను కుతూహలంగా ముందుకు వంగి 'ఏవిటదీ' అన్నట్లు చూశాడు.

"ఆ జబ్బు పేరు ఇదీ" అంటూ ప్రిస్క్రిప్షన్ కాగితం మీద 'ఒంటరితనం' అని రాసిచ్చాను.

అది చదువుకుని అతను మరింత ఉదాసీనంగా అయిపోయాడు. మరో పదేళ్ళవయసు పైబడినట్లు కన్పించాడు.

"ఈ వీధికి చివర్లో ఓ క్రష్ ఉంది. అది నడుపుతున్నావిడ నాకు బాగా తెలుసు. నేనామెతో మాట్లాడతాను. మీరు ప్రతిరోజూ రెండు మూడు గంటలు అక్కడి పిల్లల్తో గడపండి. సాయంత్రాలు ఏదైనా ఓల్డ్‌ఏజ్ హోంకెళ్ళి కూచోండి. అక్కడి వ్యక్తుల్తో మాట్లాడండి. హైద్రాబాద్‌లో ఎన్ని సుందరప్రదేశాలు లేవూ? ఆహ్లాదకరంగా ఉండే స్థలంలో ఓ గంట కూచోండి. మీ గుండె నొప్పి దెబ్బకు మాయం" అన్నాను.

అతను సమాధానంగా ఏమీ చెప్పలేదు. శూన్యంలోకి చూస్తున్నట్లు చూపును అనంతంలో

పాతేసి – నిశ్శబ్దంగా ఓ నిముషం కూచున్నాడు. ఏదో గుర్తొచ్చిన వాడిలా లేచి 'ఒంటరితనం' అని నేను రాసిచ్చిన కాగితం పట్టుకుని వెళ్ళిపోయాడు.

వారం వరకూ రాలేదు.

ఇక రాడనుకున్నా.

కానీ రెండోవారం సగంలో వచ్చాడు.

మనిషి బాగా డీలాపడిపోయి ఉన్నాడు. నిజంగా జబ్బుచేసిన మనిషిలానే ఉన్నాడు. మొహం పీక్కుపోయి . . . కళ్లు లోతుకు పోయి . . .

"ఏం అలా ఉన్నారు? ఆరోగ్యం బాగోలేదా?" అని అడిగాను అతన్ని చూడగానే.

అతను రెండు మూడు రోజులకోసారి రావటం నాకు బాగా అలవాటై, అతనంటే ఓ రకమైన ఆత్మీయత ఏర్పడిందన్న నిజం నాకాక్షణమే అర్థమైంది.

"అంతా బాగానే ఉంది బాబూ . . . కానీ నా గుండె . . . మెలి పెట్టినట్లు . . . సూదుల్తో గుచ్చుతున్నట్లు . . . నువ్వు నమ్మటం లేదు . . . కానీ నిజం . . . భరించలేనంత బాధ . . . నాకు ఈ నరకం నుంచి విముక్తి ప్రసాదించు" అన్నాడు.

"నేను చెప్పిన చిట్కా పనిచేయలేదా?" అనుమానంగా అడిగాను. నా ప్రిస్క్రిప్షన్ కాగితాన్ని ముక్కలు చేసినట్లుగానే నా సలహాను కూడా చెత్తకుండీలోకి గిరాటేశాడేమోనని . . .

అతను కొన్ని క్షణాలు దీర్ఘంగా నావైపు చూసి చెప్పాడు.

"ఎంతమందితో మాట్లాడినా నా కొడుకుతో మాట్లాడిన తృప్తి దొరుకుతుందా బాబూ . . . వాడిమీద ఎంతటి ప్రేమ పెంచుకున్నాను ! ఎంతటి ఆపేక్ష గుండెనిండా నింపుకున్నాను! నా గుండెలో విపరీతమైన వత్తిడి వాడిమీద నాకున్న మమకారం బాబూ . . . సూదుల్తో గుచ్చినట్లు, స్క్రూడ్రైవర్లతో పొడిచినట్లు అన్పించే బాధ వాడి కఠినమైన ప్రవర్తనవల్ల బాబూ . . . ఇనుప పిడికిళ్ళతో నా గుండెను పిండేది నిర్దయుడైన నా కొడుకే . . .

నువ్వూ డాక్టరే – మావాడూ డాక్టరే. మీ ఇద్దరి వయసూ ఇంచుమించు ఒక్కటే. నీ నవ్వూ, మాటా మా వాడిని గుర్తుకు తెస్తాయి బాబూ . . .

అందుకే రెండుమూడు రోజులకోసారి నీతో మాట్లాడే ఈ కొన్ని నిమిషాలే నా గుండె నొప్పినుంచి కొద్దిగా ఉపశమనాన్ని కలిగిస్తాయి. అంతే . . .

ఈ నొప్పి శాశ్వతం బాబూ . . . ఇది తగ్గదు. నన్నిలా హింసిస్తూనే ఉంటుంది. దీనికి ఏ చిట్కాలూ, ఏ మందులూ పనిచేయవు" అంటూ అతను గొల్లుమని ఏడ్చేశాడు.

నాకాక్షణం అతన్ని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు.
నా గుండెనెవరో పిండుతున్నట్లు . . . బాధ.

*(విపుల, జులై 2001)*

★★★

# చావు

నేను వూర్నించి తిరిగొచ్చేటప్పటికి చచ్చిపోయాను. నాకు తెలియకుండానే ఎలా చచ్చిపోయానో ఎంతాలోచించినా అర్థం కావట్లేదు. ఓ రోగమూ లేదు-రొష్టూ లేదు. అకస్మాత్తుగా గుండెపోటుతో చచ్చిపోయేంత బలహీనమైన గుండె కాదు. యాభై నాలుగేళ్ళ వయసున్నా చిన్నప్పటినుండీ బుర్రున చీదెరుగను. కాయకష్టం చేసిన వొళ్ళు- పదహారు మైళ్ళున్న అత్తారింటికి కాలి నడకన ఏకబిగిన వెళ్ళొచ్చిన దారుఢ్యం-నాగలి కర్రుపట్టి పొలం దున్నిన చేతులు- పదెకరాల మెట్టకూ పాతిక గదుల పెంకుటింటికీ ఆసామిని చేసిన పట్టుదల-నేను నమ్ముకున్న శారీరక శ్రమ . . . అయినా నేను చచ్చిపోయాను.

వూపిరి ఆడుతున్నట్టు నాకు తెలుస్తూనే ఉంది. భేషుగ్గా శ్వాస తీసుకోగలుగుతున్నాను. గుండె అవిశ్రాంతంగా కొట్టుకుంటూ వుంది. ఎడం ఛాతీ పైన చేయుంచుకుని నేనా శబ్దం స్పష్టంగా వినగలుగుతున్నాను. నా కళ్ళు చూడగలుగుతున్నాయి. అదిగో ఎదురుగ్గా నా పెద్ద కొడుకు, వాడి పక్కనే నిలబడి నన్నురిమి చూస్తున్న కోడలు . . . ఇదుగో వీడు నా చిన్న కొడుకు - వాడి చూపే అదో మాదిరిగుంది. ఓ అపరిచితుణ్ణి చూస్తున్నట్లు . . . చిన్న కోడలి కళ్ళలో ఏహ్యాభావం నన్ను చితిలా కాలుస్తోంది.

నిజంగానే నేను చచ్చిపోయానేమో . . . లేకపోతే ఇంత మంది-నా వాళ్ళనుకున్న కొడుకులూ, కోడళ్ళు . . . చనిపోయానని అబద్ధం ఎందుకు చెప్తారు? అయినా నమ్మబుద్ధి కావటం లేదు. చనిపోయింది మా అన్న కదా . . . తను స్థిరపడిన తెనాలిలో పక్షం రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. నేనే కదా దగ్గరుండి కర్మకాండలు జరిపించిందీ . . . ముగ్గురు కొడుకుల మధ్యన ఆస్తి పంపకాల వ్యవహారాన్ని సజావుగా జరిపించి, వదిన బాగోగులు ఎవరు ఎలా చూసుకోవాలో పెద్దల సమక్షంలో నిర్ణయించాక కదా ఒంగోలుకు తిరుగు ప్రయాణమైనాను !

ఉదయం తెనాలి స్టేషన్లో బస్సెక్కి - గంట ప్రయాణం చేసి - ఒంగోలు బస్టాండులో దిగి- రిక్షా మాట్లాడుకుని- సంతపేటలో నా ఇంటి ముందు దిగి . . . ఇన్ని చేయగలిగిన నేను



Rupaye_Chettu.pm7 144 28/7/19, 12:03 AM

ఎలా చనిపోయినట్లు? గుండె కొట్టుకుంటున్నా, కాళ్ళు కదుల్తున్నా, మనసు ఆలోచిస్తున్నా చనిపోవటం సాధ్యమా . . . లేక చనిపోయినా భౌతిక శరీరంతో మామూలుగానే పనులు చేసుకునే వీలుందా?

నా వైపు అనుమానంగా– మోసగాణ్ణి చూస్తున్నట్టు చూస్తున్న పెద్ద కొడుకు వైపు తిరిగి ముచ్చటగా మూడోసారి చెప్పాను "ఒరేయ్ రావుడూ . . . నేనురా . . . మీ నాన్నని . . . మీకేమైనా పిచ్చి పట్టిందిరా? నేను బతికే ఉంటే చచ్చిపోయానంటారేమిటి" ఈ సారి నా గొంతులో కొద్దిగా కోపం ధ్వనించింది.

"మా నాన్న చచ్చిపోయి పదిహేను రోజులైంది. చితికి నిప్పు పెట్టింది నేనే"

"మరి నేనెవర్ని?"

"ఏమో మాకెలా తెలుస్తుంది? వెళ్ళు – వెళ్ళి మీ వాళ్ళనెవర్నయినా పట్టుకుని ఆ ప్రశ్న అడుగు"

"నాకు మీరు తప్ప నా వాళ్ళంటూ ఇంకెవరున్నారు?" అంటూ చిన్న కొడుకు వైపు తిరిగి "ఒరేయ్ కిష్టుడూ–నువ్వయినా చెప్పరా . . . నేను . . . నన్ను గుర్తుపట్టలేదా? మీ నాన్నని. ఈ గుండెల మీద కదరా నిన్నూ, నీ అన్ననీ ఆడించిందీ . . . ఇదిగో చెవి ఆనించి విను. గుండె ఆడుతోంది. నేను బతికే ఉన్నా" అన్నాను.

"నువ్వు బతికి లేవని మేమనటం లేదు. మా నాన్న పదిహేను రోజుల కింద చచ్చిపోయాడని అంటున్నాం. నేనూ రావుడన్నయ్యా ఆస్తి పంపకాలు కూడా చేసుకున్నాం. నువ్వెవరో మాకు తెలీదు. చనిపోయిన మా నాన్న బతికెలా వస్తాడు? నీకు మతి చలించిందేమో పరీక్ష చేయించుకో" అన్నాడు వాడు.

నాకు గుండె పట్టేసినట్లయింది. పదిహేను రోజుల క్రితం చనిపోయానో లేదో తెలీటం లేదు కానీ ఇపుడు నిజంగానే గుండెపోటొచ్చి చచ్చిపోతాననిపించింది. ఓ వేళ వాడన్నట్టు నా మతేమైనా చెడిందా? నాకేమైనా పిచ్చిపట్టి నేనెవర్నో మర్చిపోయానా? తెనాలిలో చనిపోయింది నా అన్న కాదా . . . నేనా?అదెలా సంభవం?

"ఒరేయ్ కళ్ళు పోయాయేమిట్రా . . . బతికున్న తండ్రిని పట్టుకుని చచ్చిపోయాడనటానికి మీకు నోరెలా వస్తుందిరా . . . వూరేమైనా గొడ్డుపోయిందా . . . పదిమందినీ పిలువు . . . నిజమేమిటో తేలిపోతుంది" నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరగటం వల్లనుకుంటాను వాళ్ళు నాకు బూజరగా కన్పించారు.

"పదిమందినీ పిలవాల్సిన అవసరం లేదు. మా నాన్న కట్టె పూర్తిగా కాలేవరకూ ఉండి,

మరునాడెళ్ళి బూడిద తెచ్చింది నేనే. ఇదుగో రాగి చెంబులో మా నాన్న అస్థికలు. మా నాన్న చచ్చిపోయాడు. అయ్యో నాన్నా . . . నన్నూ, తమ్ముణ్ణి అనాథల్ని చేసి వెళ్ళిపోయావా?" రావుడు నెత్తి బాదుకుంటూ ఏడుస్తున్నాడు.

వాడి ఏడుపు చూశాక నాకెందుకో వాళ్ళు చెప్తున్నదే నిజమేమోననిపించింది. బిక్క మొగం వేసుకుని నిలబడి ఉన్న ఇద్దరు మనవళ్ళనీ, మనవరాలినీ ఆరిపోని ఆశతో అడిగాను "నేనెవరో మీరైనా గుర్తుపట్టారా?"

వాళ్ళలో అందరికంటే చిన్నది రెండేళ్ళ భాను నోరు విప్పే లోపల చిన్న కోడలు దాని వీపు మీద ఫెడీఫెడీమని నాలుగు అంటించి "నోరెత్తావా చంపేస్తానే ముదనష్టపుదానా-తాతయ్య చనిపోయాడే-ఎవరో ముక్కూమొహం తెలీని పరాయి వ్యక్తి వచ్చి పిచ్చి వాగుడు వాగుతున్నాడు. మీరందరూ లోపలికి తగలడండి" అంటూ దాన్ని బరబరా ఇంట్లోకి లాక్కెళ్ళింది.

మినుకు మినుకు మంటున్న నా ఆశ చప్పగా చల్లారిపోయింది.

"నీకసలు బుద్ధుందా? ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదా? నువ్వు బతికే ఉన్నావు మహా ప్రభో . . . సలక్షణంగా బతికే ఉన్నావు. చనిపోయింది మా నాన్న . . . వెంకటేశు. మున్సిపల్ అధికారులు మా నాన్న చనిపోయినట్లిచ్చిన మరణ ధృవీకరణ పత్రం చూపించనా? ఉండిక్కడే" రావుడు ఇంట్లోపలకెళ్ళాడు.

నేను చనిపోయినట్లు ప్రభుత్వం ధృవీకరించిందా . . . నేను బతికే ఉన్నా కదా . . . నేను చనిపోయానో లేదో చూడకుండానే చనిపోయానని మున్సిపల్ అధికారులు ఎలా సర్టిఫై చేశారూ . . . కళ్ళున్న నా కొడుకులూ కోడళ్ళే నేను చనిపోయానని నమ్మకంగా చెప్తున్నప్పుడు, కళ్ళు లేని ప్రభుత్వాధికారులేం చేస్తారు? అయినా ఓ మనిషిని నిలువునా రికార్డుల్లో చంపేస్తున్నప్పుడు ఆ మాత్రమైనా జాగర్తపడరా? చంపటం మాటలనుకున్నారా? అంటే ఎవర్నంటే వారిని ఎప్పుడంటే అప్పుడు చంపేస్తారా? ఇదీ హత్యే . . . మరి శిక్ష ఎవరికి? చంపబడిన వాడికా? నా ఆలోచనలు నాకే అస్తవ్యస్తంగా అన్పించాయి.

"ఇదిగో ఈ డెత్ సర్టిఫికెట్ చూసుకో. మా నాన్న వెంకటేశు పదిహేను రోజుల క్రితం గుండెనొప్పితో చనిపోయినట్లు రాసి సంతకం పెట్టి ఉంది" ఓ కాగితాన్ని నా మొహం మీదకు విసిరేస్తూ అన్నాడు రావుడు. "నీ లాంటి మోసగాళ్ళుంటారని తెలిసే జిరాక్సు తీయించి పెట్టాను. ఇకనైనా గొడవ చేయకుండా పో. లేకపోతే పోలీసుల్ని పిలవాల్సొస్తుంది"

నాకు చాలా దుఃఖం వచ్చింది. నేను చచ్చిపోయానని ఒక ప్రభుత్వాధికారి సంతకం పెడితే, బతికే ఉన్న నన్ను చావగొట్టటానికి మరో అధికారి వస్తాడట. నేను చచ్చిపోయాను కదా . . .

రానీ వెధవని . . . చచ్చిపోయిన నన్నెలా కొడ్తాడో చూస్తాను.

నాతో చిన్నప్పటి నుండి కలిసి పెరిగిన నేస్తాలు పక్కింటి రాఘవులూ ఎదురింటి మస్తానయ్య గుర్తొచ్చారు. వాళ్ళదీ అటూ ఇటుగా నా ఈడే. ఇక్కడ ఇంత రభస జరుగుతున్నా నాకు సపోర్టుగా వాళ్ళిద్దరూ ఎందుకు రాలేదూ? ఇంట్లో లేరా? అసలు వూళ్ళోనే లేరా? ఆ యిళ్ళలోంచి ఆడంగులు రెండు మూడు సార్లు బైటికొచ్చి తొంగి చూసి వెళ్ళడం నేను గమనించాను. మరి నా సావాసగాళ్ళేరీ . . . నా ఆప్తమిత్రులేరీ . . . నా ఆపద్బాంధవులేరీ . . .

నేను ఆశగా రాఘవులు ఇంటివైపుకు నడిచి బైటి నుంచి పెద్దగా కేక పెట్టాను. రెండు మూడు సార్లు పేరు పెట్టి పిలిచాక "ఎవరూ" అంటూ బెరుగ్గా బైటికొచ్చాడు రాఘవులు. కళ్ళద్దాలు సవరించుకుంటూ నా వైపు ఎగాదిగా చూసి "ఎవరు కావాలి?" అన్నాడు.

నాకు కోపం నసాళానికెక్కింది. "నీ దుంప తెగ– నేనురా– వెంకటేశుని–నీ బాల్య స్నేహితుణ్ణి" అతనికి దగ్గరగా వెళ్ళబోతూ అన్నాను. అతను భయంగా రెండడుగులు వెనక్కి వేశాడు.

"అలా భయపడ్తావేమిట్రా . . . నేనేమి దయ్యాన్ని కాదు. నేను బతికే ఉన్నాను."

"నా చిననాటి స్నేహితుడు చనిపోయిన దుఃఖంలో ఉంటే ఇపుడా పరాచికాలు? నువ్వేం పెద్దమనిషివి? పోపో" అన్నాడు రాఘవులు. అతని కళ్ళలో భయం నగ్నంగా కన్పిస్తోంది.

నాకు పిచ్చెక్కినట్లనిపించింది. మస్తానయ్య ఇంటి వైపుకు పరుగెత్తాను.

"ఒరేయ్ మస్తాన్–నువ్వయినా నిజంచెప్పరా . . . ఇదంతా గందరగోళంగాఉందిరా . . . నా తల ఆలోచనల్తో పగిలిపోయేట్టుంది. నేను బతికుండగానే చచ్చిపోయానని నా కొడుకు అస్థికలు రుజువులుగా చూపిస్తున్నాడురా. చివరికి మన రాఘవులు కూడా వాడికి వంత పాడ్తున్నాడు. నీకు దండం పెడ్తాన్రా. నేను బతికున్నానని నువ్వయినా చెప్పరా" అన్నాను వాడి చేతులు పట్టుకుంటూ.

వాడు నా చేతుల్ని బలంగా విదిలించి కొట్టాడు. "ఎవడ్రా నువ్వు? మా వెంకటేశు చచ్చిపోయి పదిహేను రోజులైంది. తండ్రి పోయిన దిగుల్తో పిల్లలు సతమతమౌతుంటే ఎవర్ని మోసం చేద్దామని ప్లానేసుకుని వచ్చావురా? ఇక్కడినుంచి తక్షణం వెళ్ళిపో. లేకపోతే నా కొడుకులూ, రాఘవులి కొడుకులూ కలిసి నిన్ను చావగొడ్తారు."

కన్నీళ్ళూ – కోపం కలగాపులగంగా తన్నుకొచ్చాయి.

"నన్ను చావగొడ్తార్రా– ఒరేయ్ . . . మీరందరూ కల్సి నన్ను పదిహేనురోజుల క్రితమే చంపేశారు కదరా . . . మళ్ళా కొత్తగా చావగొట్టటానికి నేను మిగల్లేదు కదరా . . . నా

కొడుకు నన్ను బూడిద చేశాడుగా. మీరందరూ మనిషిని బతికుండగానే పీక్కుతినే రాక్షసుల్రా . . . థూ మీ బతుకులు చెడ . . .” కోపంలో నోటికొచ్చినట్టు తిట్టాను.

నాకు వాళ్ళ కుట్ర అర్థమైంది. ఇదంతా కావాలని ఆడుతున్న స్వార్థ నాటకం. నా స్వార్జితం నేను బతికుండగా అనుభవించే అవకాశం లేదని, నా కొడుకులిద్దరూ నన్ను బతికుండగానే చంపేశారు.

మరి నా మిత్రులో . . . . వాళ్ళకేం మాయరోగం వచ్చింది? నా కొడుకులు విసిరేసిన డబ్బుకి కక్కుర్తిపడి అబద్ధం చెప్తున్నారా? ఈ సంకట స్థితిలో ఆదుకుంటారనుకుంటే వాళ్ళూ నా గుండెల్లో చెరో కత్తిపోటు పొడిచారు.

మెదడు మరిగేలా ఆలోచిస్తున్న నాకు ఓ విషయం స్ఫురణ కొచ్చింది.

రెణ్ణెల్ల క్రితం రాఘవులు తన కూతురి పెళ్ళికని నా దగ్గర చేబదులుగా ఇరవైవేలు తీసుకున్నాడు.“ఇదే చివరాఖరిది. దీనికి పెళ్ళి చేసి అత్తారింటికి పంపిస్తే గుండెల మీద బరువు దిగిపోతుందిరా. మంచి సంబంధం . . . ఎటొచ్చీ ఓ ఇరవై వేలు అప్పు చేయాల్సి వచ్చేట్టుంది. నాకు నువ్వు తప్ప ఇలాంటి కష్టమొచ్చినపుడు ఆదుకునేవాళ్ళెవరున్నారు చెప్పు? నీకాడపిల్లలు లేరని నువ్వు కూడా అదింతున్నప్పటినుంచీ నీ కూతురిలా చూస్కున్నావు కదరా. నువ్వే ఎలాగోలా చేసి ఈ శుభకార్యం సజావుగా జరిగేట్టు చూడరా” అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమైతే– పంట అమ్మితే వచ్చిన రొక్కంలోంచి అడిగిన ఎమ్మట్నే ఇరవై వేలు తీసిచ్చాను. నోటి మాట తప్ప నోటు రాయించుకోవాలన్న ఆలోచనే రాలేదు. చివరికి నా కొడుకులక్కూడా చెప్పకుండా పైకం సర్దాను. ఆ యిరవై వేల బాకీ తీర్చాల్సి వస్తుందని కుట్ర పన్ని దుష్టులైన నా కొడుకుల్తో చేతులు కలిపి ఉంటాడు.

మస్తానయ్య కూడా నాకు బాకీ ఉన్నాడు. పది వేలు . . . నాలుగు నెలల క్రితం జబ్బు పడితే కొడుకులిద్దరూ ఆస్పత్రిలో చేర్చారు. కడుపులో గడ్డ పెరిగిందనీ, ఆపరేషన్‌కి పది వేలౌతుందనీ డాక్టర్లు చెప్పగానే “ఎయ్యో రెండేలో ఐతే ఎలాగోలా కిందామీదా పడి కట్టేవాళ్ళం. పదేలంటే మాకాడ ఏణ్ణుంచొస్తాయి? మా వల్ల కాదు” అంటూ ఒకరొకరు మెల్లగా జారుకున్నారు. చూసొద్దామని ఆస్పత్రికెళ్ళిన నా రెండు చేతులూ పట్టుకుని మస్తానయ్య వలవలా ఏడ్చాడు. “చూశావురా ఎంకటేశు. ఈ రెక్కలు ముక్కలు చేసుకుని కదరా వీళ్ళని పెంచాను . . . ఆపరేషన్ చేయకపోతే చచ్చిపోతాన్రా. చచ్చిపోతే పాడె మోయడానికి నా కొడుకులిద్దరూ తయారుగా ఉన్నారు. నువ్వు నా ప్రాణ స్నేహితుడివి. నన్ను బతికించు కోరా . . . నీ రుణం ఉంచుకోన్రా . . . నెలకు ఐదొందల చొప్పున వాయిదాలుగా తీర్చుకుంటాన్రా” అంటూ

ప్రాధేయపడితే మొత్తం పన్నెండు వేలు సర్దాను. ఈ నాలుగు నెలల్లో రెండు వేలు వసూలైంది. మిగిలిన పదివేలు ఎగ్గొట్టొచ్చని వాడి వెధవైడియా.

వాళ్ళు నన్నెందుకు చంపేశారో అర్థం కాగానే నా కోపాన్ని, అసహ్యాన్ని దాచుకోలేకపోయాను. "ఛీ – మీరు మనుషులు కాదురా. మీకన్నా పందులు నయం. నా బాకీ తీర్చాల్సి వస్తుందని కదరా మీరిలా నాటకమాడ్తున్నారు? మీరేం స్నేహితుల్రా . . . మీకసలు స్నేహమంటే తెలుసట్రా . . . నాతో ఒక్క మాట...ఒరేయ్ ఎంకటేశూ, నీ బాకీ తీర్చలేంరా అనుంటే మన స్నేహం కోసం ఆ డబ్బుని వదులుకోనుండేవాణ్ణి. మీరూ వదులుకున్నారు – డబ్బుకోసం చిననాటి స్నేహితుణ్ణి. థూ . . . మిమ్మల్ని చూస్తుంటేనే ఒళ్ళు కంపరంగా ఉంది. ఒరేయ్ మస్తాన్! నువ్వు ఏ చేతుల్తైతే పది నిముషాల క్రితం విదిలించి కొట్టావో ఆ చేతుల్ని పట్టుకుని బతిమాలితే కదరా నీకు ప్రాణం పోశాను! ఇపుడు బతికున్న నా ప్రాణాలు తీయటానికి నీకు మనసెలా ఒప్పిందిరా? ఒరేయ్ రాఘవులూ–మీరు చేసిన పాపం వూరికే పోదురా. మీరింతకింతా అనుభవిస్తార్రా. లోకంలో కొడుకులు దుర్మార్గాలు చేసినా ఇంకా స్నేహధర్మం బతికే ఉందని ఇన్నాళ్ళూ నమ్మాన్రా. మిమ్మల్ని ఇలా వదిలిపెట్టను. మీ అంతు చూస్తాను. ఒరేయ్, మీరందరూ నీచులురా. గోతికాడి నక్కలు మీకన్నా నయంరా . . . పుల్లిస్తరాకులు నాకే కుక్కలు కూడా మీ కన్నా నయంరా" ఆవేశంలో ఏమేం తిట్టానో నాకే గుర్తు లేదు.

ఎన్ని తిట్టినా కడుపు మంట చల్లారటంలేదు. అప్పుడు గుర్తొచ్చింది. ఆకలి . . . కరకరలాడుతూ ఆకలి . . . ఉదయం ఆరింటికి బయల్దేరేముందు తిన్న రెండిడ్లీలు . . . ఇపుడు సమయం మధ్యాహం రెండు కావస్తోంది. నా కొడుకుల్లా వికృతంగా హింసిస్తూ ఆకలి . . . నా స్నేహితుల్లా కండల్నీ గుండెల్నీ నమిలి తినేస్తూ ఆకలి . . . ఇపుడు అన్నం ఎవరు పెడ్తారు?

నాకిప్పుడు ఇల్లు లేదు. నా అనేవాళ్ళే లేరు. పదిహేను రోజుల క్రితం వరకూ నాకిద్దరు ఎదిగిన కొడుకులుండేవారు. విసుక్కున్నా పూటకింత వండిపెట్టే ఇద్దరు కోడళ్ళుండేవారు. మనవళ్ళూ మనవరాళ్ళూ ఉండేవారు.

ఇపుడు ఎవ్వరూ లేరు. నేను చనిపోయానట. అంతేనా లేక వాళ్ళు నాకు చనిపోయారా? ఎవరు చనిపోయి ఎవరు బతికున్నారు? ఎలా చూసినా ప్రస్తుతం నేను ఒంటరిని. అనాథని. కాలుతున్న కడుపుకింత గంజి పోసేవాళ్ళు కూడా లేని అభాగ్యుడిని.

బాధతో జమిలిగా కలిసిపోయి కసీ కోపమూను. నేను కని భూమ్మీదకు తెచ్చిన నా కొడుకులకు బుద్ధి చెప్పాలి. నా స్వార్జితమైన పదెకరాల భూమిని స్వాధీన పర్చుకుని–నాకు నిలువ నీడలేకుండా

చేసిన వీళ్ళని మాత్రం వదలకూడదు. బతికున్నా బతుకు లేకుండా చేసిన దుర్మార్గులు వాళ్ళు.

గమ్యం లేకుండా నడుస్తున్నాను. ఎండ నిర్దయగా మండుతోంది. కడుపులో ఆకలి అగ్ని గుండంలా మండుతోంది. వీటికన్నా నా గుండెమంట వంద రెట్లు అధికంగా ఉంది.

కన్నీళ్ళతో పాటు జ్ఞాపకాలూ జలజలా రాల్తున్నాయి.

రావుడు పుట్టే సమయానికి ఒంగోలుకు మకాం మార్చలేదు. కరవదిలో ఉండేవాళ్ళం. మట్టిరోడ్డు కూడా సరిగ్గాలేని పల్లెటూరది.

నొప్పులు తెరలుతెరలుగా వస్తున్నాయంటే మంత్రసాని యింటికెళ్ళి వెంటుండి పిల్చుకొచ్చాను. మెలికలు తిరిగి పోతున్న నా భార్య బాధ చూడలేక కండువాతో కళ్ళొత్తుకుంటున్న నన్ను చూసి మంత్రసాని నవ్వింది. “తొలి చూలు కదా. పెసవం కావాలంటే ఆ మాత్తరం నొప్పులు పడకుండా కుదర్దు” అంది.

లోపలికెళ్ళాక “పెద్దగా కేకలేయకు. నీ పెనిమిటి బయంతో సెమటలు కక్కుతున్నాడు” అన్న మంత్రసాని అర్ధగంట గడవక ముందే చెమటలు కక్కుకుంటూ బైటికొచ్చి “బిడ్డ అడ్డం తిరిగాడు. కాన్పు కట్టమయ్యేట్టుంది. ఆసుపత్రికి పిల్చుకెళ్ళు. నా చాతకాదు” అంటూ జారుకుంది.

ఎడ్లబండికట్టుకుని ఒంగోలుకు బయల్దేరాం. రాత్రి తొమ్మిదిదాటి ఉంటుంది. చీకటి . . . అమావాస్య చీకటి . . . మెల్లగా ప్రారంభమైన వర్షం కుండపోతగా మారింది . . . దానికి తోడు వేగంగా వీస్తూ ఈదురుగాలి . . . నేను మొక్కుకోని దేవుడు లేడు.

నా భార్య బాధతో లుంగలు చుట్టుకుని పోతోంది.

“నేను చచ్చిపోతున్నా. నా పేనం పోయినాపర్లేదు. బిడ్డ బతికితే చాలు” అంటూ ఒకటే ఏడుపు.

ఆసుపత్రి గేటు దగ్గరకు చేరేప్పటికి అది మాటామంతీ లేకుండా పడిపోయింది. చచ్చి పోయిందనే అనుకున్నా. కొనప్రాణంతో ఉండిందని తర్వాత డాక్టర్ చెప్పాడు. వారం రోజులు ఆసుపత్రిలో ఉంటే కానీ అది కోలుకోలేక పోయింది

దుష్టశక్తులు జన్మించే ముందు కొన్ని చెడుశకునాలు కన్పిస్తాయంటారు. అమావాస్య . . . అర్ధరాత్రి . . . చీకటి . . . గాలివాన . . . తీతువు పిట్ట అరుపు. మాకు రాక్షస అంశతో కొడుకు పుట్టాడని తెలీక వెర్రివాళ్ళలా ఎంత సంబర పడ్డామో . . . వాడు భూమ్మీదకు రావటం కోసం దానికి నరకం చూపించి, చంపేసినంత పని చేశాడు. అది వారానికైనా కోలుకుంది. ఇపుడు వాడు కొట్టిన చావు దెబ్బ నుంచి-గుండె కోత నుంచి నేనెప్పటికైనా కోలుకోగలనా?

రెండోవాడు మరో ఆకు ఎక్కువే చదివాడు. పుట్టగానే వాళ్ళమ్మ ప్రాణాల్ని పిడికిళ్ళతో పిండుకుని మరీ కళ్ళు తెరిచాడు. తల్లిలేని పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకొచ్చాను. నాలా పొలం పన్లు చేయలేరని చదివినంత మేరా చదివించాను. అదే తప్పు చేశాననిపిస్తోంది. వాళ్ళ చదువులు సంస్కారాన్ని నేర్పాల్సింది పోయి జల్సాల్ని నేర్పాయి. సున్నితత్వానికి బదులు స్వార్థం వంట బట్టింది.

పొలం పనికి పంపినా బావుండేదేమో . . . కష్టమంటే ఏవిటో తెలిసేది. నేలతో అనుబంధం తెలిసొచ్చేది. పంటను చూసినప్పుడు పొంగుకొచ్చే వాత్సల్యం తెలిసేది. మానవత, మమకారాలు అర్థమయ్యేవి.

గత రెండు సంవత్సరాలుగా పోరుతున్నారిద్దరూ – పదెకరాల భూమిని అమ్మి రొక్కం వాళ్ళ చేతుల్లో పోయాలంట. “ఈ మట్టి పిసుక్కునే పని మాచాత కాదు. నామోషీ కూడా. విత్తనాలు నాటాక వర్షం వస్తుందో రాదోననే దిగులుతో ఆకాశంకేసి పిచ్చోళ్ళకు మల్లే చూస్తూ కూచోవడం మాకు రాదు. నీ తదనంతరం మాలో ఎవ్వరం వ్యవసాయం చేయం. అందుకే అమ్మేయి” అన్నారు.

“నేను భూమిని నమ్ముకున్నోణ్ణి. మీ సరదాల కోసమో, మీ భార్యల గొంతెమ్మ కోరికలు తీర్చటం కోసమో నేలతల్లిని దూరం చేసుకోను” అన్నాను.

“అంటే నీ ఉద్దేశం ఏమిటి? నీ రక్తం పంచుకు పుట్టిన మాకన్నా నీకు పొలమే ఎక్కువన్నమాట. మా మీద నీకు నమ్మకం లేదనేగా అర్థం. మేమైనా ఏమంటున్నామని? ఈ వయసులో పొలంపని, కాయకష్టం వద్దంటున్నాం. నేను కానీ, తమ్ముడు కానీ నీకు తిండి పెట్టమని అన్నామా” రావుడు తగాదాకు దిగాడు.

“నేనలా అనలేదు. నా వొంట్లో ఇంకా సత్తువుంది. పంట పండించడంలో శ్రద్ధా ఉంది. నా కొడుకుల సంపాదన మీద ఆధారపడాల్సిన అగత్యం ఇంకా రాలేదు” అన్నాను.

రెండోవాడు కలుగచేసుకుని “ఇప్పుడు సత్తువుందని మురిసిపోవటం కాదు. ముసలితనంలో నీ కింత ముద్ద పడేయాల్సింది మేమేనన్న విషయం మర్చిపోకు. మా మాట విని పొలం అమ్మేయి. ప్రస్తుతం డబ్బు అవసరం చాలా ఉంది” అన్నాడు.

వాడి బెదిరింపు నాకర్థమైంది.

నా బొందిలో ప్రాణముండగా పొలాన్ని అమ్మనని తెగేసి చెప్పాను.

ఇపుడు బొందిలో ప్రాణమైతే ఉంది. కాని నేను వాళ్ళకి చచ్చిపోయాను. ప్రభుత్వం దృష్టిలో కూడా చచ్చిపోయాను.

నేనిపుడు నేను కాదు. వెంకటేశు చచ్చిపోయాడు.

వూరికి దక్షిణాన ఉన్న శ్మశానం నోరు తెర్చుకుని నా వైపు చూస్తోంది. నా కోసం సమాధి కూడా కట్టి ఉంటారు . . . ఏదీ నా సమాధి? నా కొడుకులు ప్రేమతోకట్టిన సమాధి . . . ఇటుకల్తో కట్టారా? లేక చలువ రాతితోనా?

ఓ సమాధి మీద కూచున్నాను. దీనికింద ఏ తండ్రి హృదయం ప్రశాంతంగా సేద తీరుతోందో . . . బతికుండి కొడుకుల చేతుల్లో నానా చావు చావడం కన్నా చనిపోవడం నయమనుకున్న ఏ తండ్రో తల్లో అయి ఉంటారనిపించింది. నాలో చనిపోవాలనే బలమైన కోరిక... చనిపోయిన వీళ్ళందర్నీ చూసి అసూయ . . . కొడుకులు వీళ్ళ గుండెలకిక తూట్లు పొడవలేరు. పదునైన మాటల్తో పరపరా కోయలేరు. తమ కర్కశ చేష్టల్తో బొందితో చితిపైకి చేర్చలేరు.

నేనెలాగూ చనిపోయినట్టే లెక్క. బతికున్నా చనిపోయిన నేను నిజంగా చనిపోయి చనిపోతాను.

ఇంతకూ నేను నేనేనా? నిజంగానే బతికున్నానా లేక నిజంగానే చనిపోయానా?

నాకు మరలా కోపం వచ్చింది. విపరీతమైన కోపం . . . కొడుకుల మీద . . . కోడళ్ళ మీద . . . వ్యవస్థ మీద . . . కుట్రల మీద . . . కుళ్ళు కంపు కొడ్తున్న మానవ సంబంధాల మీద . . .

ఆవేశంగా మున్సిపల్ ఆఫీసు మెట్లెక్కాను. జనన మరణాల్ని నమోదు చేసుకుని ధృవీకరణ పత్రాలిచ్చేది ఎక్కడో కనుక్కుని అక్కడికెళ్ళి గుమాస్తా ఎదురుగా నిలబడ్డాను.

అతను అసహనంగా తల యెత్తి చూసి, చిరాగ్గా "ఏం కావాలి?" అని అడిగాడు.

"నేను నీ కళ్ళకు కన్పిస్తున్నానా?" అని అడిగాను.

అతను దెయ్యంలా నవ్వి "నువ్వు కన్పించటం లేదని ఎవరైనా వేళాకోళమాడారా? లేక నీకే నువ్వు ప్రేతాత్మవేమోననే అనుమానం వచ్చిందా? పాదాలు వెనక్కి తిరిగి లేవు. నువ్వు గాల్లో తేలుతూ రాలేదుగా. మనిషివే. అనుమానంలేదు. నా కళ్ళకు చక్కగా కనిపిస్తున్నావు" అన్నాడు.

"నేను బతికున్నానా? చచ్చిపోయానా?"

అతనీసారి విసుగ్గా మొహం పెట్టి "తాగొచ్చావా? నాకు చాలా పని ఉంది. వెళ్ళెళ్ళు" అన్నాడు.

"మొదట నా ప్రశ్నకు సమాధానం చెప్పు–నేను బతికున్నానా లేదా?"

"నువ్వెక్కడ దొరికావయ్యా రంకు మగడా? నువ్వు బతికే ఉన్నావు. చాలా . . . ఇక

వెళ్ళు"

"మరి ఇదేమిటి?" నా పెద్ద కొడుకు నా మీదకు విసిరేసిన డెత్ సర్టిఫికేట్‌ని అతని ముందుంచాను.

అతను నా వైపూ ఆ కాగితం వైపూ మార్చి మార్చి చూశాడు. ఏమనుకున్నాడో ఏమో చివరికా కాగితాన్ని చేతిలోకి తీసుకుని చదివాడు. నా కళ్ళలోకి చూస్తూ "ఓ . . . నీకు చదువు రాదా . . . అలా చెప్పొచ్చుగా నా ప్రాణాలు తీయకపోతే . . . పదిహేను రోజుల క్రితం వెంకటేశు అనే యాభై నాలుగేళ్ళ వ్యక్తి గుండెపోటుతో మరణించినట్లు ధృవీకరిస్తూ మేము జారీ చేసిన పత్రమిది" అన్నాడు.

"మరి నేనెవర్ని?"

"నువ్వెవరో నాకెలా తెలుస్తుందయ్యా?"

"నేనే ఆ వెంకటేశుని"

"ఏ వెంకటేశు?"

"పదిహేను రోజులక్రితం చనిపోయిన వెంకటేశు"

అతను మొదట ఆశ్చర్యంతోనో, భయంతోనో "ఆ" అంటూ నోరెళ్ళబెట్టాడు.

"నన్ను చూశావుగా. నేను బతికే ఉన్నాను. ఇది మార్చి బతికే ఉన్నట్టు నాకు మరో సర్టిఫికేట్ ఇవ్వు"

అతను నా వైపు ఎగాదిగా చూశాడు. "ఇది ఆఫీసు వ్యవహారం. ఆషామాషీకాదు. నువ్వు నువ్వేనని మాకు రుజువులు కావాలి. చనిపోయిన సదరు వెంకటేశు నువ్వూ ఒకటేనని సాక్ష్యం కావాలి. నీ వాళ్ళెవరైనా వచ్చి నువ్వు చావలేదనీ, బతికేఉన్నావనీ చెప్పాలి" అతను కొద్ది సేపు పెచ్చులూడిపోయిన గోడల వైపూ, దుమ్ము పేరుకుపోయిన ఫైళ్ళవైపూ చూస్తూ దీర్ఘంగా ఆలోచించి చెప్పాడు. "అయినా మా రికార్డుల ప్రకారం సదరు వెంకటేశు చచ్చిపోయాడు. అతన్ని బతికించటం సాధ్యం కాదు. రూల్సు ఒప్పుకోవు"

నేనతని పై అధికారిని కల్సుకున్నాను. అతను ఫైలు తెప్పించి చూశాడు. నాకు నచ్చ చెప్తున్న ధోరణిలో "ఇదిగో ఈ కాగితం ఉంది చూశావూ తన తండ్రిగారైన వెంకటేశు చనిపోయినట్లు రాముడనేవాడు రాసిచ్చిన అర్జీ. మా ఇన్‌స్పెక్టర్ చేసిన ఎంక్వయిరీ రిపోర్టిది. వెంకటేశు ఇంట్లోని వ్యక్తులే కాకుండా చుట్టుపక్కల ఇళ్ళలోని రాఘవులూ, మస్తానయ్య చేసిన సాక్షి సంతకాలివిగో. దహన వాటికలో సదరు వెంకటేశుని కాల్చినట్టు ఇదిగో రసీదు కాపీ" అన్నాడు.

"అవన్నీ సరే. నేను మాత్రం చావలేదు, బతికే ఉన్నాను"

"నేనేమీ చేయలేను. సదరు వెంకటేశు చనిపోయాడు. గవర్నమెంటు రికార్డుల్నించీ, ఓటర్ల జాబితా నుంచీ అతని పేరు తొలగించబడింది"

"చనిపోయిన వాళ్ళు చనిపోయారని ధృవీకరించే మీరు, నేను చనిపోకున్నా చనిపోయానని సర్టిఫికెట్ జారీ చేయగల మీరు, బతికున్న నేను బతికే ఉన్నానని ఎందుకు రాసివ్వరు? మీరలా రాసిచ్చే వరకూ నేనిక్కణ్ణుంచి కదలను" మొండికేసి అతనెదురుగ్గా బైఠాయించాను.

"ఏమిటీ వెధవ న్యూసెన్స్" అంటూ బెల్లు మోగించాడు. ఇద్దరు జవాన్లొచ్చి నా చెరో రెక్కా పట్టుకుని బరబరా బైటికీడ్చేశారు.

"నేను బతికే ఉన్నాను. ఒరేయ్! నేను చచ్చిపోలేదురా. బతికే ఉన్నాన్రా. ఒరేయ్ ఆఫీసరూ... లంచానికాశపడి నన్ను చంపేశావు కదూ. నిన్నిలా వదిలి పెట్టన్రా. కోర్టుకీడుస్తాను. నీ బండారం బైట పెడ్తాను" కసితీరా తిట్టాను. పోలీసుల్ని పిలిచి జైల్లో పెట్టిస్తామని బెదిరించారు.

నాకేం చేయాలో పాలు పోలేదు.

మొదట కడుపుకింత తిండి సంపాయించుకోవాలి. పదెకరాల భూమికి ఆసామినైన నేను అదే వూరిలో కూలికెళ్ళటం నామోషీ అన్పించి కరవది వెళ్ళి వ్యవసాయ కూలిగా చేరాను. కాయకష్టం చేసిన వొళ్ళు. శారీరక శ్రమ కన్నా గుండెకైన గాయం వ్రణంలా సలుపుతూ . . . నా కొడుకులు చేసిన అన్యాయం మనసుని దహిస్తూ . . .

ఓటమిని ఒప్పుకోదల్చుకోలేదు. కాగితాలమీద చచ్చిపోయానేమోకానీ నా జవసత్వాలు, ఆత్మాభిమానం సజీవంగానే ఉన్నాయి. నేను పోరాడటానికే నిర్ణయించుకున్నాను.

తినీ తినక డబ్బుని కూడబెట్టటం ప్రారంభించాను. ఒకటే ధ్యేయం–నాకన్యాయం చేసిన నా కొడుకులకీ, స్నేహితులకీ బుద్ధి చెప్పాలి. ఒకటే లక్ష్యం–నేననేవాణ్ణి బతికే ఉన్నానని రుజువు చేసుకోవాలి.

కొంత డబ్బు జమైనాక దిన పత్రికల్లో ఓ ప్రకటన వేయించాను. నా ఫోటో కింద "నేను చావలేదు. బతికే ఉన్నాను" అని రాయించాను. చచ్చిన వాళ్ళ ఫొటోలు వేస్తారు కానీ ఇలా బతికున్నానంటూ ఫొటోలేమిటి? అని నవ్వుకున్న వాళ్ళూ ఉన్నారు. ముసలాడికి పిచ్చి పట్టిందని జాలిపడ్డ వాళ్ళూ ఉన్నారు.

జనన మరణ ధృవీకరణ ఆఫీసరు గారికి ఓ అర్జీ పెట్టుకున్నాను. నేను బతికే ఉన్నాననీ– గత కొన్ని నెలల క్రితం ఇచ్చిన మరణ ధృవీకరణ పత్రాన్ని ఉపసంహరించుకోమని. ఎన్నాళ్ళు ఎదురు చూసినా సమాధానం రాకపోవటం వల్ల కోర్టులో కేసు వేశాను. సదరు వెంకటేశు అనే

నేను బతికే ఉన్నట్టు తీర్పునివ్వవలసిందిగా కోర్టువారి ముందు విన్నవించుకున్నాను.

నా అనుకున్నవాళ్ళు నేను చచ్చిపోయానని మొఖంమీదే చెప్పేశారు. సదరు వెంకటేశు అనే నేను చచ్చిపోయినట్టు మున్సిపల్ అధికారి సంతకంపెట్టి, దానిమీద సీలు వేసి మరీ చెప్పాడు. ఇక నాకు మిగిలిన ఆశ కోర్టుతీర్పు ఒక్కటే. కేసు వేసిన రోజు నుంచీ ఎదురుచూపే- నేను బతికే ఉన్నానని కోర్టుముఖతా ఎప్పుడు వింటానా అని.

వెంకటేశు అనే వ్యక్తి గవర్నమెంటు రికార్డుల ప్రకారం చనిపోయాడనీ-చనిపోయిన వ్యక్తి కోర్టునెలా ఆశ్రయించగలడనీ జడ్జీ గారు మల్లగుల్లాలు పడ్డారు. ప్రభుత్వం దగ్గర ఉన్న సాక్ష్యాధారాల వల్ల వెంకటేశు అనే వ్యక్తి చనిపోయినట్టు రూఢిగా తెలుస్తోంది కాబట్టి చనిపోయిన వ్యక్తి తాను బతికేఉన్నట్లు చెప్పుకోవటం సాధ్యం కాదు కాబట్టి ఆత్మరూపంలో అఫిడవిట్ దాఖలు చేసి ఉంటాడేమోననుకోవటం హేతువుకు విరుద్ధం కాబట్టి ఈ కేసును అడ్మిషన్ చేసుకోకుండా కొట్టేస్తున్నామని కోర్టు వారు తీర్పు చెప్పారు.

నేను అధైర్యపడి నా ప్రయత్నాల్ని ఆపదల్చుకోలేదు. నేను బతికేఉన్నానని రుజువు చేసే వరకూ విశ్రాంతి తీసుకోను.

నేను కష్టపడి, డబ్బు కూడగట్టుకుని సంపాయించుకున్న పదెకరాల భూమి లాగేసుకున్నందుకు బాధగా లేదు. నా యింటిని నాకు కాకుండా చేసినందుకు దిగులుగా లేదు. నాకు నా అనేవాళ్ళు లేకుండా పోయినందుకూ దుఃఖం రావటం లేదు. కడుపుకింత కూడు పెట్టేవాళ్ళు కరువైనందుకు చింతలేదు. కాని నన్ను నేను కాకుండా చేశారే- అందుకు బాధ పడ్తున్నాను.

ఇపుడు నేననేవాణ్ణి బతికే ఉన్నానని రుజువు చేసుకోవటం చచ్చే చావుగా ఉంది నాకు.

ఓరోజు సాయంత్రం నా మనవళ్ళు చదువుకుంటున్న స్కూలుకెళ్ళాను. పిల్లలందరూ గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. పదేళ్ళ, పన్నెండేళ్ళ వయసున్న నా మనవళ్ళిద్దరూ నన్ను చూసి బిక్కమొగాలేసి నిలబడ్డారు.

"ఒరేయ్ . . . నన్ను గుర్తుపట్టలేదట్రా . . . నేనురా . . . ఇప్పటికైనా చెప్పండిరా నేనెవరో . . . ఈ గుండెకోతని భరించటం ఇక నావల్ల కాదురా" అన్నాను. నాకు తెలీకుండానే కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

"మాకు తెలీదు. అమ్మ కొడ్తుంది. నువ్వెళ్ళిపో" అంటూ వాళ్ళు వెనక్కెనక్కి వెళ్తున్నారు.

తోటి నర్సరీ పిల్లల్తో ఆడుకుంటున్న భాను నన్ను చూసి పరుగెత్తుకుంటూ వచ్చింది. దాని కళ్ళు సంతోషంతో మెరుస్తున్నాయి.

నాకు ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. "తల్లీ . . .  నీకైనా నేను తెలుసా" అన్నా గద్గద స్వరంతో.

అది నోరు తెరవబోతున్నప్పుడు "భానూ! అమ్మ కొడ్తుంది. నాన్న కూడా కోప్పడతాడు. నువ్వతనితో ఏమీ మాట్లాడకు" అంటున్న తన అన్నలవైపో క్షణం చూసింది.

తల తిప్పి నా వైపు చూసి–ఉషోదయంలాంటి తన అద్భుతమైన నవ్వుని ఉదారంగా వెదజల్లుతూ–పరుగెత్తుకుంటూ వచ్చి నా కాళ్ళని చుట్టేసింది. "తాతయ్యా! మరే మమ్మీడాడీకేం తెలీదు. అన్నలక్కూడా తెలీదు. నాకు తెల్సు తాతయ్యా. నువ్వు మా తాతయ్యవి."

జలజలా రాలిన నా కన్నీటి బిందువులు భాను తలమీద అక్షింతలుగా మెరిశాయి.

*(వార్త ఆదివారం 29 ఫిబ్రవరి 2004)*

☆☆☆

# చేతులుంటే ఎంత బావుణ్ణు!

మీరు నమ్మరేమో కానీ . . . నేను పుట్టడం నాకు గుర్తుంది.

ఆ రోజు నేనెంత సంబరపడ్డానో మీ మాటల్లో చెప్పలేను. కొత్త బాడీ – కొత్త టైర్లు – అనవరతం పని చేసే గుండెలా నాకమర్చిన ఇంజన్ – కళ్ళు చెదిరే రంగులు – ఓహ్ . . . తలారా షాంపూతో స్నానంచేసి, ఖరీదైన పట్టు చీర కట్టుకుని, కురుల్లో మల్లెపూలు తురుముకుని, వయ్యారంగా నడచివచ్చే కన్నెపిల్లలా నేను సర్వాంగసుందరంగా ముస్తాబై కార్ఖానా నుండి బైటికి వచ్చాను. చెప్పొద్దూ – నన్ను చూస్తే నాకే ముద్దొచ్చేంత అందంగా ఉన్నాను.

నన్ను నడపటానికి మొట్టమొదటి సారి డ్రైవర్ తన సీట్లో కూర్చున్నప్పుడు నాకు బోల్డంత సిగ్గేసింది. సిగ్గుతోపాటు చెప్పలేనంత భయం కూడానూ . . .

చార్మినార్ నుండి సికింద్రాబాద్ వెళ్ళే రూటు నాది. చార్మినార్‌ని చూసినపుడు ఎంత ముచ్చటేసిందో – అద్భుతమైన కట్టడం! రెండు కళ్ళు చాల్లేదనుకోండి . . .  ఎటొచ్చీ ఆ ఇరుకు గల్లీలూ – దుమ్మూ, ధూళీ – అగ్గిపెట్టెల్లా అంధకారంతో నిండిన యిళ్ళూ – పేదరికం . . .  నా కళ్ళు చెమర్చేవి.

గమ్యస్థానం చేరుకోటానికి ఎక్కే హిందువులూ . . . ముస్లింలూ – క్రిస్టియన్లూ . . . నాకివేవీ పట్టేవి కావు. వారి పాదాల స్పర్శకే నా తనువు పులకించి పోయేది. పసిపిల్లలు తమ బుల్లిబుల్లి పాదాల్తో నా గుండెలమీద తొక్కుతున్నంత తీయటి అనుభూతి . . . కోడిపెట్ట తన పిల్లల్ని రెక్కలకింద భద్రంగా దాచుకున్నట్లు వీళ్ళందర్నీ పొదవి నా కడుపులో దాచుకునేదాన్ని.

నన్నందుకోవాలని పరుగెత్తే పిల్లల్ని చూసినపుడల్లా చప్పున ఆగి, వారినెత్తుకుని ఒళ్ళో కూచోబెట్టుకోవాలనిపించేది. ఆపకుండా నన్ను పరుగెత్తిస్తున్న డ్రైవర్‌మీద బోల్డంత కోపం వచ్చేది. అయ్యో – పిల్లలు . . . పడ్తారేమోననే దిగులుతో గుండె నీరైపోయింది.

ఎంత అన్యాయమో చూశారా . . . నాలుగు కాళ్ళైతే అమర్చారు కానీ ఒక్క చేయైనా లేదే . . .  బాబూ . . . జాగ్రత్త . . . పడ్తావు అని అరిచినా వాళ్ళకు విన్పిస్తేగా – విన్పించినా వింటారా పాడా – వాళ్ళకదో సరదా . . .  వీరత్వం . . . నిలబడిన బస్ ఎక్కితే నామోషీ



Rupaye_Chettu.pm7 157 28/7/19, 12:03 AM

కాదూ–నా భయాలు వాళ్ళకేం తెలుస్తాయి? ఏ ఆడదాని మనసైనా సాటిమనిషి, ఆడదైనా మగైనా, ఎపుడైనా అర్థం చేసుకున్నారు గనకనా!

అదుగో – ఇప్పుడేకదూ చెప్పాను – అటు చూడండి . . . ఆ కుర్రవాడు నాతో పాటు ఎలా పరుగెత్తుతున్నాడో – ఎర్రగా . . . సన్నగా . . . నాజూగ్గా . . . ఆ జుట్టే – జులపాలు పెంచాడు. ఎటొచ్చీ జుట్టుకు రబ్బరు బ్యాండ్ పెట్టుకోలేదు – గుడ్డిలో మెల్ల. అయ్యో . . . పడ్తావు . . . నాకు స్లో కావాలనే ఉంది – పాన్ నముల్తూ, కండక్టర్‌తో బాతాఖాని కొడ్తున్న డ్రైవరే ఆ బాబుని పట్టించుకోవటం లేదు. దగ్గరకొచ్చేశాడులెండి . . . ఎంత బాగా పరుగెత్తుతున్నాడో . . . ఫ్చ్ . . . . అయినా ఆసియాడ్‌లో ఒక్క గోల్డ్‌మెడల్ కూడా రాదెందుకో? హమ్మయ్య . . . నన్ను అందుకున్నాడు. చేతుల్లేకున్నా నా శరీరాన్ని కొద్దిగా ఒంచి అతన్ని పొదవుకున్నాను . . . మీకు కన్పడదులెండి . . . మరేం చేయను? నాకు వీళ్ళంటే వల్లమాలిన ప్రేమ.

అవునూ – ఎందుకతను ముందుకు జరుగుతున్నాడు? వెనక చాలా స్థలం ఉందిగా – వెళ్ళి ఓ అమ్మాయి వెనక నిలబడ్డాడు. కుదుపొచ్చినపుడల్లా కావాలని ఆ అమ్మాయిమీదికి ఒరుగుతున్నాడు. ఆమెను చూసి వెకిలిగా నవ్వుతున్నాడు. ఇలాంటివే నాకసహ్యం – అయ్యో నాకు చేతులుంటే ఈ పిల్లల్ని క్షేమంగా దగ్గరకు తీసుకునేదాన్ని కదా అని ఎలా బాధ పడ్తానో . . . ఇలాంటి జులాయి వెధవల్ని చూసినపుడు, నాకే చేతులుంటేనా ఆ చెంపా ఈ చెంపా వాయించేదాన్ని కదా అని కూడా బాధ పడ్తాను. తప్పు వీళ్ళది కాదు. వీళ్ళు మైనం బొమ్మల్లాంటివారు. మనం ఎలా మలిస్తే అలా మారతారు. తప్పు వీళ్ళనికన్న తల్లిదండ్రులది. తమ కూతుళ్ళను మగపిల్లలు అల్లరిచేస్తే బాధపడి, కోపపడి, అసహ్యపడి, ఆవేశపడిపోయే తల్లులు – తమ కొడుకుల్ని ఎందుకు మందలించరు? పరాయి స్త్రీలతో ఎలా ప్రవర్తించాలో ఎందుకు నేర్పరూ–మీకే నా భాష అర్థమయ్యేట్టుంటే నేను మోసే ప్రతి ఆడదానికీ అర్థమయ్యేలా చెప్పేదాన్ని . . . మీ కొడుకులకు మర్యాదా మన్ననా నేర్పండని.

చూస్తూ చూస్తూనే ఆర్నెల్లు గడిచిపోయాయి. దసరా శెలవలు . . . స్కూళ్ళకెళ్ళే చిన్నారులకు ఆటవిడుపు – అలవాటుపడిన ఆ పాదముద్రల పరిష్వంగం కోసం నా శరీరం పరితపించేది.

విజయదశమి రోజు నన్ను బాగా అలంకరించారు. అరటికొమ్మలు కట్టారు. బంతిపూల మాలలతో నన్ను ముంచెత్తారు. నా మొహం మీద పసుపు కుంకుమల్ని అద్దారు. దసరా శుభాకాంక్షలు అంటూ చమ్కీలద్దిన అక్షరాలతో నేను మెరిసిపోయాను. పట్టలేని సంతోషంతో మురిసిపోయాను. చార్మినార్ నన్ను చూసి కళ్ళింతవి చేసుకున్నట్టు గుర్తు. అబిడ్స్ కూడలి నా

అందం చూసి నోరు వెళ్ళబెట్టినట్టు కూడా గుర్తు. నాక్కనిపించిన ప్రతి వ్యక్తినేకాదు . . . ప్రతి చెట్టునీ, ప్రతి పుట్టనీ పల్కరించాలన్నంత సంబరం నాలో.

జీవితం ఎంత బావుందీ! ఎంత మధురంగా ఉందీ! నా బ్రతుక్కి ఓ సార్థకత చేకూరింది. అనునిత్యం ప్రజల్ని ఓ స్థలం నుంచి మరో స్థలం దాకా ప్రేమగా మోసుకెళ్ళిదింపటం . . . ఎంత తృప్తిగా ఉంటుందో! ఆకాశంలో ఎగిరే విహంగంలా ఆనందంగా, హాయిగా, సంతోషంగా . . . నా బ్రతుకును చూస్తే నాకే ఈర్ష్యపుట్టింది.

దసరా వెళ్ళిన పక్షం రోజులకనుకుంటాను–గాలిలో ఏదో మార్పు . . . అంతా హష్ హష్‌లా . . . రహస్యం రాజ్యమేలుతున్నట్లు . . . భయం విస్తరిస్తోన్న వాసన . . . స్కూలు పిల్లలెవరూ రాలేదు. ఎప్పుడూ నిండు గర్భిణిలా ఉండే నేను ఒకరిద్దరితో అసంతృప్తి పడ్డాను. ఆ రోజు ఆదివారం కూడా కాదు. చార్మినార్‌కి ఇరువైపులా ఉండే దుకాణాలు పదకొండైనా తెరవలేదు. కారణం తెలియక కంగారుపడుతూ ఒళ్లంతా చెవులు చేసుకుని విన్నాను . . . కండక్టర్ అప్పారావుకి నా ఆరాటం అర్థమైందనుకుంటాను – డ్రైవర్ మునీర్‌ఖాన్‌తో చెప్తుండగా విన్నాను.

“నిన్న రాత్రి లోకల్ రౌడీ షీటర్ రాజూ పహిల్వాన్‌ని ఎవరో దారుణంగా పొడిచి చంపారట – అందుకు బంద్ చేస్తున్నారు” అన్నాడు అప్పారావు.

“గిదేంది భాయ్ సమఝౌతా లేదు . . . గీ బద్మాష్‌గాణ్ణి ఖతం చేస్తే బంద్ ఎందుకు చేస్తుంద్రు . . . ఖుషీ చేస్కోవాలి గానీ” అన్నాడు ఖాన్.

నాకు మనసంతా దేవినట్లయింది. రాజూ పహిల్వాన్ నాకూ తెల్సు. అతను పచ్చి నెత్తురు తాగే కసాయి అని అందరూ చెప్పుకోగా వినటం వల్లనుకుంటాను – అతను ఎక్కిన ప్రతిసారీ నా శరీరం భయంతో వణకటం నాకు గుర్తుంది. మనిషి కూడా అలానే ఉండేవాడు – ఎర్రటి కళ్ళు . . . మెలితిరిగిన గుబురు మీసాలు . . . కండలు తిరిగిన శరీరం . . . ఆరడుగుల విగ్రహం. అతన్ని చూస్తే చాలు, మిగతా ప్రయాణీకులు బితుకుబితుకుమంటూ పక్కకు ఒదిగేవారు. ప్రాణాలు అరచేత పట్టుకుని కూచునేవారు. నాకైతే ఏ అఘాయిత్యం జరిగిపోతుందోనని భయంతో టైర్లు వణికేవి.

వాడు ఆరు మర్డర్లు చేశాడట. వీడికో పార్టీ మద్దతు . . . వీడో ప్రజా నాయకుడైనట్లు. వీడు చస్తే, నరకాసురుణ్ణి వధించాక దీపావళి చేసుకున్నట్లు సంబరం చేసుకోవాలి కానీ బంద్ ఏమిటి? విడ్డూరం కదూ! జాతి జవసత్వాలు ఉడిగిపోయినట్లు ఎందుకయిందో . . . ప్రజలు నిర్వీర్యుల్లా, నిర్జీవుల్లా ఇలాంటివి ఎందుకు సహించి, భరిస్తున్నారో . . . వాడెవడో లోఫర్‌గాడు

చచ్చిపోతే షాపులు ముయ్యాలా? పిల్లలు స్కూళ్ళు మానేయాలా? ఇలా శాసించేది ఆ రౌడీగాడి తొత్తుమూకలా . . . దానికి ఓ రాజకీయ పార్టీ అండదండలా . . . వీళ్ళకు సిగ్గెందుకు వేయదో . . . చనిపోయిన వ్యక్తిమీది గౌరవంతో మనస్ఫూర్తిగానో, చంపినవారి మీద నిరసనతోనో వాళ్ళకు వాళ్ళు బంద్ చేసుకుంటే సబబేకానీ – ఇలా ముష్కరమూకలు కత్తులూ, కర్రల్తో బెదిరించి బలవంతంగా బంద్ చేయిస్తుంటే – వీళ్ళందరూ ప్రజాస్వామ్యంలో ఉంటూ కూడా తమ నోళ్ళను ఎందుకు బంద్ చేసుకున్నారో?

ఆలోచనల్లో నేను గమనించనే లేదు – నా ఎదురుగ్గా పదిమంది రౌడీలు నిలబడి ఉన్నారు.

“కౌన్‌రే బద్మాష్ గాడీమే? ఉతర్ . . . జల్దీ ఉతర్” అని అరుస్తూ కర్రల్తో గొర్రెల్ని అదిలించినట్లు అదిలిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్, ఉన్న ఓ అరడజను ప్రయాణీకులూ దిగిపోయారు. ఒక్కరైనా ఎదిరించరేం . . . ఎందుకని ప్రశ్నించరేం . . .

చెంప ఛెళ్ళుమన్నట్లు – ఓ రాయి బలంగా తాకింది. పక్క కిటికీ అద్దాలు భళ్ళుమన్నాయి. నేను నొప్పితో, అవమానంతో భగ్గుమన్నాను. ఆ బాధనుంచి తేరుకోకముందే మరో రాయి నా ముందు అద్దాన్ని తాకింది. ఆ అద్దం నా గుండెని గాయం చేస్తూ వేయి ముక్కలైపోయింది.

నా తప్పేమీ లేకుండానే నన్ను శిక్షిస్తున్నారు – నన్ను అన్యాయంగా గాయపరుస్తున్నారు – రాళ్ళు . . . విసురుగా తాకుతూ రాళ్ళు . . . నా వళ్ళు రక్తసిక్తమైపోతోంది. నా మనసులో అనుకున్న మాటలు వీళ్ళకు అర్థమయ్యాయా? తప్పును తప్పు అని చెప్పటం కూడా తప్పేనా . . . నా భావాల్ని వెల్లడించే ప్రాథమిక హక్కు కూడా నాకు లేదా . . . ఇంతటి దౌర్జన్యం ఎలా సహించాలో నాకర్థం కావడం లేదు.

నన్ను రక్షించటానికి ప్రజలెవ్వరూ రాలేదు . . . ప్రజానాయకులూ రాలేదు . . . మేం మీస్నేహితులం అంటూ పెద్ద పెద్ద అక్షరాల్లో రాసుకునే పోలీసులూ రాలేదు.

గాయపడిన శరీరమూ, మనసుతో మొదటిసారిగా నేను మా హాస్పిటల్‌కెళ్ళాను. ఇక్కడ శరీరాల్ని రిపేరు చేస్తారు కానీ నా మనసు మాటేమిటి?

మా హాస్పిటల్ మీ హాస్పిటల్స్‌లా కాదులెండి – అదృష్టం – మీకుమల్లే మందులు మింగించి వేరే రోగంతో చంపరు. నాకు కొత్త అద్దాలు బిగించారు. సొట్టలు సరిచేశారు – కొత్త రంగులు అద్దారు.

ఓ పది రోజుల తర్వాత నేను నవనవలాడే యవ్వనవతిలా ముస్తాబై – నా పనిలో మునిగిపోయాను. ఎట్లా అయినా ఒరిజినల్ ఒరిజినలే . . . అతుకులు అతుకులే. నా నడకలో ఒకప్పటి హొయలూ, హుందాతనం తగ్గినట్లు నాకు తెలుస్తూనే ఉంది. మనసుకూడా ఒకప్పటిలా

జలపాతంలా ఉరకలెయ్యటం లేదు – మెరుపులా ఒయ్యారపు విరుపుల్తో మురిసిపోవటం లేదు.

అయినా నాకిష్టమైన ప్రజాసేవలో పడి నా బాధని మర్చిపోయాను. ప్రజాసేవ అనే మాట వాడితే దగుల్బాజీ నాయకులు గుర్తుకు రాలేదా మీకు? ఆ మాటకు అర్థమే పెడర్థమైపోయిన దుస్థితిలో ఉన్నాం కదూ మనం.

నాయకులంటే గుర్తొచ్చింది – వినాయక చవితి ఇంకో వారమే ఉంది.

భాగ్యనగరంలో వీధివీధిన రకరకాల మంటపాలు – అందులో వివిధ భంగిమల్లో కొలువుతీరిన నిలువెత్తు బొజ్జగణపయ్య విగ్రహాలు – సంబరం . . . సందడి . . . గాలిలో తేలియాడుతూ వచ్చే పండగ వాసన...

ఇలాంటి వాతావరణం ఎంతటి సంతోషాన్నిస్తుందో – నా పిల్లలు ఆనందంగా ఉంటే నాకూ ఆనందం కదూ.

పది రోజులు పది సెకన్లలా గడిచిపోయాయంటే నమ్మండి. విగ్రహాల్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తారట . . . ఒకటే హడావిడి . . . డప్పుల మోత . . . ట్రాలీల్లో, లారీల్లో విగ్రహాలు . . . జనసందోహం . . . ఒక్కో వాహనంతో పాటు నడుస్తూ పోలీసులు . . . ఎక్కడపడితే అక్కడ ట్రాఫిక్ ఆగిపోతోంది. నేనుకూడా మెల్లగా కదుల్తున్నా.

అకస్మాత్తుగా అలజడి . . . ఆందోళన . . . రోడ్డుమీద హాహాకారాలు చేస్తూ ప్రజలు పరుగెత్తుతున్నారు. పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ తరుముతున్నారు.

డ్రైవర్ ఖాన్‌కి ముందుకెళ్ళాలో, వెనక్కితిప్పాలో తెలీని సందిగ్ధం . . .

వాళ్ళ మాటల్ని బట్టి నాకర్థమైనదేమంటే ఓ మసీదు ముందునుండి వూరేగింపు వెళ్తున్నప్పుడు డప్పులు వాయించకూడదని అభ్యంతరపెట్టారట. కాని వూరేగింపులోని జనం విన్లేదట. వాళ్ళకు కోపంవచ్చి రాళ్ళు రువ్వారట.

అయ్యో . . . ఇది మతోన్మాదం కాదు బాబులూ . . . మూర్ఖత్వం. నా బిడ్డల్లో చదువుకున్నవాళ్ళెంత శాతం? అంతా పామర జనం . . . వాళ్ళను క్షమించండి. తప్పుచేయటం మానవ సహజం . . . క్షమించటం దైవలక్షణం . . . పసితనం అని వదిలేయండి . . . ఆకలితో అల్లాడేవాళ్ళకు మతంకోసం పోరాడే తీరికెక్కడిది? ఇందులో స్వార్థ రాజకీయం ఉందేమో ఆలోచించండి . . .

నా ఆలోచనల్లో మునిగిపోయి చూడనేలేదు – నా చుట్టూతా పదిమంది తల్వార్‌లు పట్టుకుని నిలబడి ఉన్నారు. వాళ్ళు ముస్లింలో, హిందువులో నాకు తెలియటం లేదు. అప్పటికే డ్రైవర్,

కండక్టర్ దిగి తలో దిక్కుకీ పారిపోతున్నారు. హాహాకారాలు . . . ప్రాణభయంతో పరుగెత్తుతున్న ప్రజలూ . . . పిల్లలూ . . . నా ఖర్మానికి నన్ను వదిలేసిన ముసలితల్లిలా నేను . . .

ఏదో తడి . . . ఘాటు వాసన . . . పెట్రోల్ వాసన . . .నన్ను తడిపేస్తున్నారు . . . ముద్దలా . . . వూపిరాడకుండా . . . అయ్యో, తండ్రీ . . . ఎందుకిలా చేస్తున్నారు? నేను మీకేం నష్టం చేశాననీ . . . ఏ మతాన్నీ పల్లెత్తు మాట అనలేదే . . . మీకూ నాకూ ఎలాంటి శత్రుత్వమూ లేదే . . . నేను అజాత శత్రువుని . . . మిమ్మల్ని జీవితాంతం మోస్తూ బ్రతుకీడుస్తున్నదాన్ని . . . నడిస్తే మీ పాదాలు ఎక్కడ కందిపోతాయోనని తల్లడిల్లే పిచ్చి తల్లిని . . .

ఎవరో అగ్గిపుల్ల గీశారు. అతన్ని భయంతో కళ్ళు విప్పార్చి చూశాను. మొహంనిండా స్ఫోటకపు మచ్చలు . . . ఎర్రటి తాగిన కళ్ళు . . . నాకు గుర్తే . . . అతన్ని ఎన్నిసార్లు నా ఒడిలోకి లాక్కున్నానో. నా బిడ్డలు దుర్మార్గులైతే బాధ పడ్డాను కానీ మోయనని ఎపుడైనా మొండికేశానా? నేను మీ మేలుకోరేదాన్ని బాబూ . . . మీకోసం ఉన్నదాన్ని . . . మీ దాన్ని . . . అయ్యా బాబూ . . . నన్ను కాల్చకండి. భగ్గున మంట. నా వళ్ళంతా కారం రాసినట్లు . . . నా శరీరం కాలుతున్న వాసన . . . నేను దగ్ధమౌతూ వాళ్ళందరి మొహాలవైపు చూశాను. ఎర్రటి సంతృప్తి వాళ్ళలో . . . క్రూరమైన ఆనందం . . . వీళ్ళనేకదూ నేను ప్రేమగా అక్కున చేర్చుకుంది! నాకే చేతులుంటే ఎంత బావుణ్ణు . . . ఒక్కొక్కణ్ణి ఎత్తి మూసీలోకి విసిరేసి ఉండేదాన్ని.

******

నెలరోజులు షెడ్‌లో గడిపాను. నాలోని చాలా భాగాలు కొత్తవి వేశారు. నాకు పిల్లలు గుర్తొస్తున్నారు. పిచ్చి మనసు కదూ నాది. ఎపుడెపుడు బైటపడి మరలా వారి పాదాల స్పర్శని కౌగిలించుకుంటానా అన్న ఆతురత. ఏం చేయను . . . తల్లి మనసు . . . తిండి పెట్టకుండా మాడుస్తున్నా . . . కాళ్ళతో కొట్టినా . . . మాటల్తో హింసించినా . . . సంతానంపైన మమకారం చంపుకోలేని వెర్రి మనసు.

మరలా నేను నా పిల్లల్ని మోసే పనిలో బిజీ అయ్యాను.

నాకిప్పుడు రాళ్ళదెబ్బలు తినటం అలవాటైపోయింది. కిరోసిన్ వాసన అలవాటైంది. చీటికి మాటికి తగలబడిపోవటం కూడా అలవాటైంది. స్ట్రైకులు చేస్తే నేనే బలిపశువుని . . . బంద్‌లు జరిగితే నేనే వధ్యశిల మీద నిలబడిన వింతజీవిని . . . స్టూడెంట్స్‌కి సమస్య లొస్తే . . . నాకు రాళ్ళదెబ్బలు తప్పనిసరి. ఉద్యోగస్థుల కోరికలు తీరాలన్నా నా అద్దాలు

భళ్ళుమనాల్సిందే. ఏ పార్టీ తారతమ్యం లేకుండా ప్రభుత్వం మీద కసంతా నా మీదే తీర్చుకుంటారు.

నా మెటాలిక్ బుర్రకి ఇందులోని లాజిక్ ఎంత ఆలోచించినా అర్థం కాదు. నన్ను హింసిస్తే వీళ్ళకేం వస్తుంది? నన్ను కాలిస్తే వీళ్ళకేగా నష్టం. ఇంత చిన్న విషయాన్ని తెల్సుకోలేనంత మూర్ఖులా మనుషులు!

ఓసారి మాసిన గడ్డంతో, మెరుస్తున్న కళ్ళతో, విప్లవం నరాల్లో ప్రవహిస్తున్నట్లున్న కుర్రాడొకడు ఎక్కాడు. అతనిచేతిలో మాక్సింగోర్కీ రాసిన అమ్మ, శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం పుస్తకాలున్నాయి. అతని మాటల్లో ఆవేశం ఉంది – అతని వూహల్లో స్వర్గంలా భాసించే మరో ప్రపంచం ఉంది. అతను చెప్తుండగా మొట్టమొదటిసారిగా అన్నల గురించి విన్నాను.

అన్నలు అడవుల్లో ఉంటారట. నిరుపేదలకు అండగా, దోపిడీదారులకు సింహస్వప్నంలా, పేదా ధనిక భేదమేలేని సమసమాజ స్థాపన ధ్యేయంగా పోరాటం చేస్తున్నారట.

వాళ్ళను తల్చుకుని నా హృదయం వాత్సల్యంతో నిండిపోయింది. పేద, బడుగు వర్గాలకోసం ఎండనక, వాననక శ్రమిస్తున్న ఆ యువకుల్ని ఒక్కసారైనా కళ్ళారా చూడాలని మనసు ఉవ్విళ్ళూరేది. ఓ రోజు నా కోరిక తీరింది. నా ఎదురుగా నిలబడిన నలుగురు యువకులు అన్నలేనట. నాకైతే ఎంత సంతోషం వేసిందో – నాకే చేతులుంటే వాళ్ళను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఉండేదాన్ని కదా అని బాధ పడ్తూ ఓ క్షణం కళ్ళుమూసి తెరిచేప్పటికి వాళ్ళచేతుల్లో పెట్రోల్ డబ్బా ప్రత్యక్షమైంది. నేను భయంతో బిగుసుకుపోయాను. చివరి కత్తి పోటు తిన్న సీజర్ “యూ టూ బ్రూటస్”అన్నాడట – ఎవరో స్టూడెంట్ చెప్తుండగా విన్నాను. నా పరిస్థితీ అలానే ఉంది. బాబూ – మీరు ఏ వర్గం కోసం శ్రమిస్తున్నారో వాళ్ళ సేవకోసం ఉన్నదాన్ని. స్వంతవాహనాల మీద తిరగలేని పేద, మధ్య తరగతి ప్రజల్ని ప్రేమతో మోస్తున్నదాన్ని. నన్నెందుకు తగలబెడ్తున్నారో నాకర్థంకావడంలేదు తండ్రీ . . . మీ పోరాటం ప్రభుత్వం మీదనా? అమాయక ప్రజలమీదనా? నా మీదయ్యే ఖర్చుంతా ప్రజలనెత్తిన రుద్దబడుతుందన్న విషయం మేధావులైన మీకు తెలియదా? అగ్గిపుల్ల నా మీద పడి భగ్గుమన్నా – వీళ్ళ చర్య నా గుండెను మండించినదానికన్నా ఎక్కువ బాధ పెట్టలేకపోయింది.

******

రాగద్వేషాలకు అతీతమైన విరాగినిలా నేను – నాకు ముసలితనం వచ్చేసిన భావన – నిర్వేదం – నిర్వికార భావం – అకారణంగా కాలిపోవటం నా జీవితంలో విడదీయరాని భాగమైపోయింది. మా హాస్పిటల్‌కి నేను రెగ్యులర్ పేషెంట్‌ని.

ఈ మధ్యన నాకు చేతులు లేవే అన్న దిగులు బాధించటం లేదు. ఎవ్వరిపాదాల స్పర్శకోసం నేను ఎదురుచూడటం లేదు. ఎవర్ని చూసినా భయం వేయటం లేదు. నేనో నిజమైన యంత్రంలా మారిపోయాను.

ఓ రోజు ఇద్దరు యువకులు కత్తుల్తో బెదిరించి నన్ను ఆపారు. భావరహితంగా నేను ఆగిపోయాను. వాళ్ళు ప్రయాణీకుల్ని దోచుకుంటారనుకున్నాను. అలా జరగలేదు. వాళ్ళందర్నీ దింపేసి ఎప్పటికిమల్లే నన్ను తగలబెడ్తారని సిద్ధపడ్డాను. అలానూ జరగలేదు. నాలో రాగద్వేషాలు లేవని చెప్పాను కదూ – పొరపాటు, నాకు స్పందించే హృదయం ఉంది – కలత చెందే మనసుంది – అయ్యో . . . మీరిద్దరూ ఏం చేస్తున్నారు? మనుషుల్ని లోపలే ఉంచి, నన్ను పెట్రోల్‌లో ముంచెత్తారు. తలుపు దగ్గరా పెట్రోలు పోశారు. ఎవ్వరూ బైటకు రావడానికి అవకాశం లేకుండా కత్తులు పట్టుకుని ద్వారం దగ్గరే నిలబడ్డారు. ఇది అన్యాయం . . . అమానుషం . . . మీరీపని ఎందుకు చేస్తున్నారో నాకు తెలియదు . . . మీ సిద్ధాంతాలేమిటో తెలియదు. ఏమైనా సరే మీ సాటిమనుషుల్ని ఇలా సజీవంగా దహనం చేయటం రాక్షసత్వం. అయ్యా, బాబూ . . . కావాలంటే నన్ను కాల్చుకోండి. దీపావళి రోజు బాణాసంచా కాల్చినట్లు నన్ను కాల్చి సంబరపడండి. ఈ అమాయకుల్ని మాత్రం వదిలేయండి. వీళ్ళ ప్రాణాలు పోతే మరలా తిరిగిరావన్న విషయం మీకు తెలియదా? వీళ్ళ సంసారాల్ని గురించి ఓ క్షణం ఆలోచించండి. ఇంటిదగ్గర ఎదురుచూస్తున్న పెళ్ళాం పిల్లల గురించి ఆలోచించండి. మంటలు . . . మంటలు . . . శలభాల్లా మాడిపోతూ ప్రయాణీకులు . . . ఆర్త నాదాలు . . . చావుకేకలు . . . నాకు చేతులుంటే ఎంత బావుణ్ణు . . . వీళ్ళను భద్రంగా ఎత్తి కిందకు దింపి, నేను తృప్తిగా కాలిపోయి ఉండేదాన్ని. జీవితంలో ఎన్నడూ వూహించని విషాదంలో మండిపోతూ నేను . . .

*(కథామహల్ - దువ్వూరి శారదాంబ పోటీ కథా సంకలనం, అక్టోబర్ 1999)*

☆☆☆

# ఆశ్రమం

ఉదయం అయిదింటికే రఘురాంని నిద్ర లేపాను. "ప్లీజ్ అరుణా-ఇంకొద్ది సేపు నిద్ర పోనీ" అన్నాడు దుప్పటి ముఖం మీదికి లాక్కుంటూ.

"లాభం లేదు. తొందరగా లే. మనం ఈ రోజు స్వామీజీ వారి ఆశ్రమానికెళ్ళాలి. ఆరింటికల్లా హోమం ప్రారంభమవుతుంది. లే త్వరగా" అంటూ దుప్పటి లాగేశాను.

మేం బయల్దేరే సమయానికి పిల్లలింకా లేవలేదు. వాళ్ళ విషయం వాళ్ళ నాయనమ్మ చూసుకుంటానంది.

స్వామీజీ ఆశ్రమం హైద్రాబాదుకు ఇరవైకిలోమీటర్ల దూరంలో ఉంది. వనస్థలిపురం దాటాక మరో ఆరు కిలోమీటర్లు ముందుకెళ్లి, కుడివైపుకు తిరిగితే-విశాలమైన యాభై ఎకరాల స్థలంలో ఉందా ఆశ్రమం.

మేం వెళ్ళేటప్పటికే ఆశ్రమం వెలుపల చాంతాడంత క్యూ ఉంది. ఇసుక వేస్తే రాలనంత జనం-తిరునాళ్ళలోలా . . . ప్రవేశరుసుం రెండొందలు కట్టి ఇద్దరం లోపలికెళ్ళాం.

ఓ ఎత్తైన వేదిక ముందు వందలమంది భక్తులు కూచుని ఉన్నారు. రఘు మగవాళ్ళ వరుసల్లో వెనక్కి వెళ్ళి బాసింపట్టు వేసుకుని కూచున్నాడు. నేను ముందుకెళ్ళి వేదికకు దగ్గరగా కూచున్నాను-స్వామీజీని సమీపంగా చూడటంలో కలిగే ఆనందాన్ని అనుభవిద్దామని.

స్వామీజీ వేంచేస్తున్నారని ఓ శిష్యుడొచ్చి భక్తులకు విన్పించేట్టు పెద్దగా చెప్పాడు. అందరూ లేచి నిలబడ్డారు. కాషాయాంబరధారీ-ఆజానుబాహువూ అయిన స్వామీజీ-ముందు నడుస్తున్న శిష్యులు వేద మంత్రోచ్ఛారణ చేస్తూ ఉండగా-యాగవేదిక మీదికి చేరి పద్మాసనం వేసుకుని కూచున్నారు.

స్వామీజీ మొహం చాలా ప్రశాంతంగా ఉంది. వారి విశాలమైన కళ్ళు దివ్యజ్యోతుల్లా వెలుగుతున్నాయి-వారి పెదవుల మీద చిరుమందహాసం చెదరకుండా ఉంది.

హోమం ప్రారంభమైంది.

రఘు ఏంచేస్తున్నాడో చూడాలనిపించి తలతిప్పి చూశాను. కన్పించలేదు. పాపం రఘు-



Rupaye_Chettu.pm7 165 28/7/19, 12:03 AM

కేవలం నా కోసం వచ్చాడు. దేవుడే లేడంటాడు. మనుషుల్లోని మానవత్వమే తాను నమ్మే దేవుడంటాడు. స్వామీజీల వూసెత్తితే చాలు మండిపడతాడు.

"ఓ వేళ దైవచింతనే ముఖ్యమైతే దేవునికీ, భక్తునికీ మధ్యన ఈ స్వామీజీ దేనికి . . . మోక్షం కోసం ఈ స్వామీజీ కూడా ఎవరో ఓ దేవుణ్ణి ప్రార్థిస్తాడు కదా – అదే దేవుణ్ణి భక్తులు నేరుగా ప్రార్థిస్తే చాలదా" అంటాడు.

నేనూ, రఘూ ఒకే కాలేజీలో డిగ్రీ చేశాం. దేవుని మీద నమ్మకం విషయంలో తప్ప మిగతా అన్ని విషయాల్లో మా అభిరుచులు, ఆలోచనలు కలవటంతో సాన్నిహిత్యం పెరిగి ప్రేమగా మారింది. ఉస్మానియా యూనివర్శిటీలో రఘు యం.యస్సీ ఫిజిక్స్ చేశాడు– నేను హిస్టరీలో యం.ఏ. చేశాను. ప్రస్తుతం ఇద్దరం ఒకే కాలేజీలో లెక్చరర్లుగా పనిచేస్తున్నాం.

ఓ సంవత్సరం క్రితం నాకు జబ్బు చేసింది. విపరీతమైన తలనొప్పి . . . వాంతులు . . . ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. అన్ని రకాల వైద్య పరీక్షలూ చేయించాం. ఏ దోషమూ లేదన్నారు. అల్లోపతీ వదిలేసి హోమియో మందులు వాడాను. గుణం కన్పించలేదు. అన్నం సయించేది కాదు. తల గోడకేసి బాదుకుని పగులగొట్టే బావుంటుందనిపించేది. ఒక్క నెల రోజుల్లోనే పది కేజీల బరువు తగ్గి–ఎముకల పోగులా మారిపోయాను.

విసిగి, వేసారి జీవితం మీద విరక్తి పెంచుకోబోతున్న తరుణంలో నా స్నేహితురాలు విమల చెప్పింది "స్వామీజీ తాకితే చాలు–ఎటువంటి జబ్బైనా నయమైపోతుందని."

"హంబక్" అన్నాడు రఘు. "అబ్రహం కోవూర్ రాసిన పుస్తకాలిస్తాను–చదవండి. బాబాల్నీ, స్వామీజీలను నమ్మటం ఎంత మూఢత్వమో మీకే అర్థమౌతుంది" అన్నాడు విమలతో.

మందులు వాడీ వాడీ బేజారై ఉన్న నేను "ప్రయత్నిస్తే వచ్చే నష్టమేం లేదుగా" అన్నాను. విమల నన్ను వెంట పెట్టుకుని తనకు తెల్సిన కొంతమంది దగ్గరకు పిల్చుకెళ్ళింది.

వాళ్ళు–స్వామీజీ ఎంత గొప్పవారో, ఎంత మహిమ గలవారో, వారు తాకితేనే తమ రోగాలు చేత్తో తుడిచేసినట్లు ఎలా మాయమై పోయాయో పూసగుచ్చినట్టు చెప్పారు.

నాలో ఆశ మొలకెత్తింది. ఇంకొంతమంది నోటి ద్వారా స్వామీజీ గురించి విన్నాక ఆశ బలపడి నమ్మకంగా మారింది.

స్వామీజీ మరో రెండ్రోజుల్లో బాంబేలో ఉన్న తమ ప్రధాన ఆశ్రమానికి వెళ్ళిపోతారని తొందరపెట్టి–విమల నన్ను ఆశ్రమానికి పిల్చుకెళ్లింది.

"నీ ఇష్టాలు నాకు నచ్చకున్నా–నీ నమ్మకాలతో నేను విభేదించినా–నీ జీవిత భాగస్వామిగా వాటిని గౌరవిస్తాను" అని పెళ్ళికి ముందు మాటిచ్చిన రఘు మాతోపాటు ఆశ్రమానికొచ్చాడు.

విమల దగ్గరుండి నన్ను స్వామీజీ వద్దకు తీసుకెళ్లి నా అనారోగ్యం గురించి చెప్పింది. స్వామీజీ నా కళ్ళల్లోకి వాత్సల్యంగా చూస్తూ-తన కుడిచేతి చూపుడు వేలితో నా నుదురు తాకి "నీకేం ఫర్లేదు. నేనున్నాను. అంతా బావుంటుంది" అన్నారు.

ఆశ్రమం నుంచి తిరిగి వచ్చాక తలనొప్పి కొద్దిగా నెమ్మదించినట్లనిపించింది. ఆ రోజు కొద్దిగా తినగలిగాను. మరునాడు మరికొంత బాగుందనిపించింది. వారం తిరిగేసరికి తల నొప్పి పూర్తిగా తగ్గిపోయి-ఆకలి వేయటం ఆరంభించింది. మంత్రం వేసినట్లు రోగం తగ్గిపోవటం చూసి నేను ఆశ్చర్యపోయాను. అప్పటినుంచీ స్వామీజీకి పరమ భక్తురాలినైపోయాను. హోమం అయిపోయింది. మామూలుగా అయితే స్వామిజీ ప్రసంగం ఉండాలి. కానీ వారికి సుస్తిగా ఉందని, స్వామీజీ విశ్రాంతి తీసుకుంటారని ఓ శిష్యుడు భక్తులందరికీ చెప్పాడు.

బైటికొచ్చాక రఘు అడిగాడు- "అందరి అనారోగ్యాలూ తగ్గించే స్వామీజీకి అస్వస్థత ఏమిటీ?" అని. అతని స్వరంలో జీరాడుతూ వ్యంగ్యం . . .

"స్వామీజీ శిష్యులు చెప్తుంటే వినలేదా . . . ఎవరో భక్తుడు అనారోగ్యంగా ఉన్నాడట . . . అది తగ్గించటం కోసం స్వామీజీ ధ్యానంలో కూచుని అతని అనారోగ్యాన్ని తన శరీరంలోకి తీసుకున్నారట . . . ఎంతటి కరుణామయులో స్వామీజీ" అన్నాను అతని వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా. రఘు ఇంకేమీ మాట్లాడలేదు. మాట్లాడినా నిష్ప్రయోజనం అనుకున్నాడేమో.

*****

స్వామీజీని ఇంటికి ఆహ్వానించి పాదపూజ చేయాలని కోరిక. రఘుతో అంటే "నీ ఇష్టం" అన్నాడు.

సాయంత్రం నాల్గింటికి విమల వాళ్లింట్లో పాదపూజ ఉంది. వాళ్లు భార్యాభర్తలిద్దరూ స్వామీజీకి పరమభక్తులు. ప్రతి సంవత్సరం స్వామీజీని ఇంటికి ఆహ్వానించి పాదపూజ చేస్తారు.

విమల వాళ్లింటికెళితే ఆచరించాల్సిన పద్ధతులూ, చేయాల్సిన ఏర్పాట్లు తెలుస్తాయని బయల్దేరాను. నాతో పాటే రఘూ వచ్చాడు.

విమల భర్త పేరుమోసిన కాంట్రాక్టర్. బాగా సంపాయించాడు. బంజారాహిల్స్‌లో అతని ఇల్లు రాజభవనంలా ఉంటుంది.

మేం వెళ్ళేప్పటికి యిల్లంతా గులాబీ పూలతో అలంకరించారు. యింటి ముందు ఆకాశమంత కాకున్నా, అలా అన్పించేంత పెద్ద పందిరి వేశారు. ప్రవేశద్వారం దగ్గిర పూలతో అల్లిన కర్టెనా అన్పించేట్లు పొడవాటి మాలలు కట్టారు-పూల పరదా తొలగించుకుని లోపలికి వెళితే పన్నీరు వాసన పల్కరించేలా . . .

విశాలమైన హాల్లో ఖరీదయిన తివాచీ పరిచి ఉంది. హాల్లోని మిగతా ఫర్నీచర్ అంతా తీసేసి స్వామీజీ కోసం ఉచితాసనం ఏర్పాటు చేశారు. స్వామిజీకి మెత్తగా ఉండడం కోసం దాని మీద పట్టుపీతాంబరాలు పరిచారు. రెండు బుట్టల నిండా గులాబీ రేకులు తయారుగా ఉంచుకున్నారు.

సరిగ్గా నాలుగు గంటల ఇరవై నిమిషాలకు స్వామీజీ తన ఖరీదయిన మెర్సిడెస్ కారులో వేంచేశారు. మంగళ వాయిద్యాలు మోగుతుండగా–శిష్యులు వేద మంత్రోచ్చారణ చేస్తుండగా–విమలా, ఆమె భర్తా స్వామీజీకి చెరోవైపూ నిలబడి గులాబీ రేకుల్ని వారి పాదాలపై చల్లుతూ ఉండగా–చిరు మందహాసం ఇరువైపులా విసిరేస్తూ–స్వామీజీ తమ ఆసనం మీద కూచున్నారు.

కడు భక్తి ప్రపత్తులతో విమల దంపతులు వారి పాదాల ముందు వెండి పళ్ళెం ఉంచి స్వామీజీ పాదపద్మాల్ని పన్నీటితో కడిగి–తల మీద చల్లుకున్నారు.

స్వామీజీ గాల్లోకి చేయి తిప్పి విభూది సృష్టించారు. వాళ్లిద్దరి నుదుటిని కుడిచేతి బొటన వ్రేలితో తాకి విభూదిని వాళ్ళద్దరి చేతుల్లో వేశారు. వెంటనే వాళ్ళిద్దరూ సాష్టాంగ నమస్కారం చేసి వాళ్ళ తలల్ని స్వామీజీ పాదాల దగ్గర ఉంచారు.

స్వామీజీ పాలు మాత్రమే సేవిస్తారంటే–వెండి గ్లాసులో చిక్కటి పాలు తెచ్చిచ్చింది విమల. ఆమె, ఆమె భర్తా చెరోవైపు నిలబడి నెమలి ఈకలున్న వింజామరల్తో విసుర్తుండగా –స్వామీజీ చిద్విలాసంగా పాలను చప్పరిస్తూ–తివాచీ మీద కూచున్న భక్తుల వైపు వాత్సల్యంగా చూశారు.

స్వామీజీ భక్తుడొకడు నా దగ్గరకొచ్చి నోటికి అరచేతిని అడ్డంగా పెట్టుకుని, "పాద పూజలకు ఇంటికి ఆహ్వానించాలంటే మొదటగా స్వామీజీ అంగీకారం తీసుకోవాల"ని గుసగుసగా చెప్పాడు.

నేను స్వామీజీ ముందుకు ఒదిగి ఒదిగివెళ్ళి–వారి ముందు మోకాళ్ళ మీద కూచుని మంద్రస్వరంతో వారిని ఆహ్వానించాను.

స్వామీజీ చిరునవ్వుతో నా వైపు చూశారు. అదే అంగీకారం–స్వామీజీ ఎక్కువ మాట్లాడరు.

నేను తిరిగొచ్చి రఘు పక్కన కూచున్నాక–ఇందాకటి భక్తుడే మరలా మెల్లగా చెప్పాడు "మీరు పాదపూజకు పది వేలు కట్టాలి. మీకు రశీదు ఇస్తారు. స్వామీజీ వచ్చే తేదీ, సమయం వారి వీలుని బట్టి మీకు తెలియజేస్తారు"

"పదివేలా!" అన్నాను ఆశ్చర్యంగా . . . అయినా అతి మెల్లగా . . . అది నా రెణ్ణెల్ల నెట్ శాలరీ.

"స్వామీజీకి పాదపూజలు చేయాలనుకునే భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందమ్మా–స్వామీజీ అలసిపోతున్నారు. అంతటి శ్రమను తట్టుకోలేకపోతున్నారు. అందుకే అతి ముఖ్యమైన

వాళ్ళకే అటువంటి మహదవకాశం ఇవ్వాలని పాదపూజ ఫీజు పదివేలుగా నిర్ణయించారు" అన్నాడతను.

"భక్తి కాదన్మాట ప్రధానం. అతి ముఖ్యమైన వాళ్ళంటే డబ్బున్న వాళ్ళు" అన్నాడు రఘు నాకే విన్పించేంత మెల్లగా . . .

"రెండు మూడు రోజుల్లో ఆశ్రమానికొచ్చి పది వేలు కడ్తాను" అన్నాను.

"పైన ఫ్యాన్ అంత వేగంగా తిరుగుతున్నా వింజామరల్తో వీచటం ఎందుకో నాకర్థం కాలేదు" అన్నాడు దారిలో రఘు.

నేను సమాధానం ఇవ్వకుండా, "వారి మొహంలోని తేజస్సు గమనించావా?" అన్నాను.

"పాలూ, నెయ్యీ బాగా తిని స్వామీజీ శరీరం పుష్టిగా, నున్నగా, నిగనిగలాడ్తున్నట్లు తయారయింది. ఇక మొహంలోని దివ్యతేజస్సంటావా... రేపెలా గడుస్తుందోనన్న దిగులు లేకపోతే-ఫలానా పని చేయకపోతే బాస్ తిడ్తాడేమోనన్న భయం లేకపోతే-వద్దన్నా వచ్చి పడే లక్షల డబ్బుంటే-పాద పూజలు అందుకోవటం 'మాత్రమే' పని అయితే-మనందరి మొహాల్లోనూ అంత తేజస్సు ఉంటుందనుకుంటా" అన్నాడు.

*****

విమల వాళ్లింటి నుండి వచ్చినప్పటి నుండీ సన్నగా తలనొప్పి . . . రాత్రికి మరీ ఎక్కువైంది. తల బద్దలైపోయేంత తలనొప్పి . . . అన్నం సయించలేదు . . . వాంతికొస్తున్నట్లు ఫీలింగ్.

మరలా స్వామీజీ తమ అమృతహస్తాల్తో తాకితేగాని తగ్గదనిపించే తలనొప్పి . . .

"రఘూ-వెంటనే బయల్దేరు. ఆశ్రమానికి వెళ్ళాలి" అన్నాను ఉదయాన్నే నేను రెడీ అవుతూ.

రఘు పెద్దగా నవ్వాడు. ఓ నిమిషం వరకూ ఆపకుండా నవ్వాడు. నా కోపం చూసి నవ్వును ఆపుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు "యు విల్ బికం వాట్ యు థింక్-నువ్వేం ఆలోచిస్తావో అదే అవుతావు అంటారు మానసిక శాస్త్రవేత్తలు. అంతా మనసు చేసే మాయ. శరీరం మనసుకు బానిసలా-చెప్పినట్లు నడుచుకుంటుంది. స్యూడో ప్రెగ్నెన్సీలు, సైకో సొమాటిక్ రుగ్మతలు . . . ఇందుకు నిదర్శనాలు . . . దీపక్ చోప్రా తన 'క్వాంటం హీలింగ్' అనే పుస్తకంలో చెప్పిన విషయం అదే. మనిషికి మనసు అద్భుతమైన వరం-దాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోకపోతే అదే భయంకరమైన శాపం."

"ఏమో-నాకివేవీ తెలియవు. ఏ డాక్టరూ నయం చేయలేని రోగాన్ని స్వామీజీ తగ్గించారు. నాకు తెలిసిందే ఇదే."

"అలా తగ్గటంలో ఆశ్చర్యం ఏముంది? స్వామీజీ తాకితేనే జబ్బు తగ్గుతుందని నీవు బలంగా నమ్మావు. అందరూ కలిసి ఆ విధంగా నీకు హిప్నాటిక్ సజెషన్స్ ఇచ్చారు. దానికి నీ ఆటో సజెషన్స్ కూడా తోడై నీవు ఆశించింది జరిగింది. అంతశ్చేతన ఆడిన నాటకం అది. ఈ రోజు పేపర్లో చూళ్లేదా-రోగికి స్వస్థత చేకూరాలని అతని చుట్టూ నిలబడి, వరుసగా వారం రోజులు వంతులవారీగా ప్రార్థించారట. అతని రోగం తగ్గిపోయింది. అదేమీ మాయో, మహిమో కాదు, ఓ బలమైన నమ్మకం. నీ ఆరోగ్యం గురించి పాజిటివ్ సజెషన్స్ ఇచ్చుకో. నీకే రుగ్మతలూ ఉండవ్"

"నాకీ లెక్చర్లు వద్దు. మనం ఆశ్రమాని కెళ్ళాలి. అంతే. వస్తావా రావా" అన్నాను విసుగ్గా.

"నీ ఇష్టం-పద" అన్నాడు తను కూడా రెడీ అవుతూ.

మేము ఆశ్రమానికెళ్ళి వాకబు చేస్తే స్వామీజీ విజయవాడ వెళ్ళారని తెల్సింది.

అక్కడి భక్తులకు పాదపూజలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించి రెండ్రోజుల తర్వాత తిరిగి వస్తారట.

నేను హతాశురాలినైనాను. అగాధంలోకి వేగంగా జారిపోతున్న భావన. ఉన్న ఒక్క ఆధారమూ చేజారి-నీళ్ళలో వూపిరాడకుండా కొట్టుకుంటున్న ఫీలింగ్ . . .

"రఘూ-ఈ రోజు కాలేజీకి శెలవ పెట్టేద్దాం. మనం విజయవాడ వెళ్ళి స్వామీజీని కల్సుకుందాం. తొందరగా ఇంటికెళ్ళి బట్టలు సర్దుకుందాం పద. ఏదో ఒక బస్ దొరక్క పోదు" అన్నాను

రఘు నా వైపు విస్మయంగా చూశాడో క్షణం.

ఇంటికి బయల్దేరాం. మధ్య దారిలో "వైదేహి ఆశ్రమంలో నాకో పది నిమిషాల పనుంది. ఇక్కడికి ఆశ్రమం చాలా దగ్గర. వెళ్దామా?" అన్నాడు.

నాకు విపరీతమైన తలనొప్పిగా ఉంది. వళ్ళు తూలుతున్నట్లు . . . కళ్ళు తిరుగు తున్నట్లు . . . వీలైనంత తొందరగా ఇంటికెళ్ళి విజయవాడకు ప్రయాణం కావాలని ఉంది. అయినా రఘు అడిగింది కాదనలేక సరే అన్నాను.

మేం వెళ్ళి బయటి గేట్ తీయగానే ఇద్దరాడపిల్లలు మాకెదురొచ్చి నమస్కారం చేశారు. ఇద్దరూ పదేళ్ళలోపు పిల్లలే. ఆ కాంపౌండ్ లోపల ఓ కిచెన్ రూం, మరో పెద్ద హాల్ మాత్రమే ఉన్నాయి. పెరట్లో రకరకాల కూరగాయల మొక్కలు ఉల్లాసంగా తలలూపుతున్నాయి. ఈ అనాథ పిల్లలకు ఆహారంగా ఉపయోగపడ్తున్నందుకు అవీ సంతృప్తితో కదుల్తున్నట్లనిపించింది.

"ఈ అశ్రమం అనాథ ఆడపిల్లల కోసం ప్రారంభించారు. ప్రస్తుతం ఇరవై నాలుగు మంది

ఆడపిల్లలున్నారు. రెండేళ్ళ నుండీ పదేళ్ళ వయసులోపు పిల్లలు . . . " లోపలికి ప్రవేశిస్తున్నప్పుడు ఉపోద్ఘాతంలా చెప్పాడు రఘు.

మాకు హాల్లో రెండు కుర్చీలు వేసి కూచోపెట్టారు. పిల్లలందరూ వచ్చి మా ఎదురుగా వరుసల్లో కూచున్నారు. వాళ్ళందరూ హుషారుగా, ఉల్లాసంగా కన్పించారు.

వాళ్ళతోపాటే వచ్చిన స్త్రీని రఘు పరిచయం చేశాడు. "నీకెప్పుడూ చెప్తుంటాను చూడు సత్యవతిగారని–వీరే. ఈ పిల్లలందరికీ అమ్మ తనే. జీవితాన్ని వీళ్ళ సేవ కోసమే అంకితం చేసిన స్త్రీమూర్తి"

ఆ పొగడ్తకనుకుంటాను– ఆమె ఇబ్బందిగా కదలటం గమనించాను. ఆమెకు నలభై పైనే వయసుంటుంది. తను చేస్తున్న సేవ మనస్ఫూర్తిగా చేస్తున్నట్లు . . . ఆమె మొహంలోని ప్రసన్నతే చెప్తుంది. పిల్లల మొహాల్లోకి పరిశీలనగా చూశాను. ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాయా మొహాలు. మేము అనాథలం అనే భావం గుచ్చుకుంటూ, గాయం చేస్తూ వాళ్ళ కళ్ళలో కన్పిస్తుందేమోననుకున్నాను. కానీ అటువంటి ఛాయలు మచ్చుకైనా కన్పించలేదు. దానిక్కారణం సత్యవతిగారి ప్రేమ–వాత్సల్యం అయి ఉంటుంది. ఇరవై నలుగురు ఆడపిల్లల పెంపకం ఎంత కష్టం! మా ఇద్దరు పిల్లల్ని పెంచటానికే ఎంత సతమతమవుతున్నామో మాకు తెలుసు. అలాంటిది ఇంతమందికి జడలు . . . స్నానాలు . . . బట్టలు . . . చదువులు . . . వంటలు . . . సత్యవతిగారికి మనసులోనే అభివందనం చేశాను.

"మొట్టమొదటిసారి మేడం మన ఆశ్రమానికొచ్చారు. మీ పరిచయాలు చేస్కోండి" అంది సరస్వతి పిల్లల్ని ఉద్దేశించి.

ఒక్కో అమ్మాయి లేచి నిలబడి తన పేరూ–తరగతీ చెప్పింది. చివర్లో రెండేళ్ళ పాప నిలబడి– చేతులు కట్టుకుని "నా పేలు సేత" అంది. అందరూ నవ్వారు. సత్యవతి కూడా నవ్వి, "మా ఆశ్రమంలో అందరికంటే చిన్నపిల్ల ఇదే. పేరు శ్వేత. మీ వారు ధన సహాయం చేస్తున్నది ఈ పిల్ల కోసమే" అన్నారు.

ఆ పాప అందమైన నవ్వు అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. లేత గులాబీ రేకుల మీద మెరిసే తుహినకణంలా స్వచ్ఛమైన నవ్వు . . . చేతులు చాపాను. మెల్లగా నడుచుకుంటూ దగ్గరకొచ్చి నిలబడింది. ఎత్తుకుని ఒళ్ళో కూచోబెట్టుకున్నాను.

"ఈ పిల్ల అమ్మా నాన్న కూలికెళ్ళి తిరిగి వస్తూ లారీ యాక్సిడెంట్‌లో చనిపోయారు" సత్యవతి చెప్పింది విని మనసు బరువైంది. ఇలా విధివంచితులై దిక్కూ మొక్కూలేని పసిపిల్లలు ఎంతమంది ఉంటారో . . . ఎన్ని లక్షల అనాథాశ్రమాలు వెలిస్తే వారి జీవితాలు మొగ్గలోనే

వాడిపోకుండా ముద్దమందారాల్లా విరుస్తాయో!

"వీళ్ళు ఏ స్కూల్లో చదువుకుంటున్నారూ" అడిగాను.

"ఈ దగ్గర్లోనే ఓ స్కూలుంది. మా పిల్లలకు ఫ్రీగా చదువు చెప్తారు. పుస్తకాలు, నోటుబక్కులు కూడా వాళ్లే కొని పెడ్తారు. సాయంత్రాలు ఆ స్కూలు టీచరే వచ్చి పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చెప్తుంది" అంది సత్యవతి.

"మరి వీళ్ళ బట్టలు . . ."

"మీలాంటి దాతలిచ్చిన డబ్బుతో వీళ్ళకు సంవత్సరానికి రెండు జతల బట్టలు కుట్టిస్తాం. నాకు టైలరింగ్ వచ్చండీ. మెషిన్ తెప్పించి నేనే కుడ్తాను. ఎవరైనా పాత బట్టలు దానం చేస్తే అవీ వాడుకుంటారు"

"కొత్తవాళ్లను ఎలా చేర్చుకుంటారూ"–ఈ ఆశ్రమం గురించి ఇంకా తెల్సుకోవాలన్న కుతూహలం నాలో.

"మేం మొదట అనుకున్నది పాతిక మంది పిల్లల్ని చేర్చుకోవాలని. కానీ ఇరవై నలుగురి తోనే ఆపేయాల్సి వచ్చింది. ఇపుడు కొత్తవాళ్ళు వచ్చినా చేర్చుకునే ఆర్థిక స్థోమత లేదు"

"ఎందుకని?"

"మా ఆశ్రమంలో ఉన్న ఒక్కో అమ్మాయికి ఒక్కో దాత నెలకు అయిదు వందల చొప్పున విరాళం ఇస్తారు–ఆ పిల్ల పోషణార్థం. ఆ పిల్ల పెద్దయి చదువులన్నీ అయిపోయే వరకూ నెల ఖర్చులు దత్తు తీసుకున్న వాళ్ళే భరించాలి. కానీ మధ్యలో చాలామంది మానేస్తుంటారు. మేం కొత్త దాతల కోసం వెతుక్కుంటూ ఉంటాం. ఓ ముసలావిడ ఎప్పటి నుండో తిరిగిపోతుంది. ఆమె కోడలు పురిట్లోనే చనిపోయిందట. కొడుకు వేరే పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయాడట. వీళ్ల అతీగతీ పట్టించుకోడట. నాలుగేళ్ళ తన మనవరాల్ని చేర్చుకుంటే తనేదైనా వృద్ధుల ఆశ్రమానికి వెళ్ళిపోతానని ఆరు నెలల నుంచీ అడుగుతోంది. కానీ సరైన దాత దొరక్క వెనుకా ముందూ ఆడుతున్నాం."

రఘు ఆ నెలకివ్వాల్సిన అయిదు వందలు కట్టి రశీదు తీసుకున్నాడు.

"పిల్లలూ, ఓ పాట పాడండి . . . మేడం వింటారు" అంది సత్యవతి.

పిల్లలందరూ ముక్తకంఠంతో "నాదు జన్మభూమికంటె నాకమెక్కడుంది–సురలోక మెక్కడుంది" అంటూ శ్రావ్యంగా పాడారు.

మేం స్కూటర్ ఎక్కి బయల్దేరేటపుడు పిల్లలు–సత్యవతి బైటికొచ్చి మాకు వీడ్కోలు చెప్పారు.

ఈ ఆశ్రమం గురించి రఘు చెపితే వినటం తప్ప రావటం ఇదే మొదటిసారి. దారిలో

మేమిద్దరమూ ఏమీ మాట్లాడు కోలేదు. ఇంటికెళ్లాక "నీ తలనొప్పి ఎలా ఉంది" అని రఘు అడిగే వరకు నేను గమనించనేలేదు–నా తలనొప్పి తగ్గిపోయిన విషయం.

*****

"తొందరగా లే. బోల్డు పనుంది" రఘుని తట్టి లేపాను.

"ప్లీజ్ అరుణా. ఇంకా అయిదు కూడా కాలేదు" అన్నాడు దుప్పటి పైకి లాక్కుంటూ.

"అయిదు కాకపోవటమేమిటి–ఆరైంది. లే . . . మనం ఆశ్రమానికెళ్ళాలి"

ఆ మాట వినగానే రఘు మారుమాట్లాడకుండా రెడీ అయ్యాడు.

"పది వేలు పెట్టుకుంటే చాలు కదూ" అంటూ నా జవాబు కోసం చూడకుండా ఐదు వేల రూపాయల కట్టలు రెండు, ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు.

"స్వామీజీ  ఆదివారం వస్తే బావుంటుంది. లేకపోతే మనిద్దరం ఓ రోజు శెలవ పెట్టాల్సి వస్తుంది" అన్నాడు దారిలో.

నేనేమీ మాట్లాడలేదు.

కొంతదూరం వెళ్ళాక "రఘూ! నీకు స్వామీజీలంటే నమ్మకం లేదుకదా. పాద పూజ కోసం నేను పది వేలు ఖర్చు చేయటం నీకు కోపం తెప్పించటం లేదా?" అని అడిగాను.

రఘు నవ్వటం నాకు విన్పించింది. "ఎందుకూ కోపం? నీవు విద్యావంతురాలివి. విజ్ఞత కలదానివి. ఎవరి నమ్మకాలు వారివి. నీకు సంతోషం కలిగించే పని – అది స్వామీజీ పాదపూజైనా సరే–నాకు అభ్యంతరం అన్పించదు"

గాల్లో తేలిపోతున్న దివ్యానుభూతి . . . మాటల్లో ఎంత బలం ఉంటుందీ! ఒక్కో మాట అణుబాంబులా పేలి నాశనమూ చేయగలదు . . . మందానిలంలా తాకి మైమరపించనూ కలదు.

"నువ్వెంత మంచివాడివో" అన్నాను ప్రేమగా . . .  అతని భుజం మీదున్న నా చేయి 'నిజం' అన్నట్లు స్పర్శ ద్వారా ఆ విషయాన్ని అతనికి మరోసారి నొక్కి చెప్పింది.

పొగడ్తకనుకుంటాను– స్కూటర్ వేగం పెరిగింది.

మైకం లోంచి ఒక్కసారిగా బైటపడి "ఇటెక్కడికీ" అని అడిగాను.

సడన్‌గా బ్రేకు వేసి "ఇటేగా స్వామీజీ ఆశ్రమం" అన్నాడు రఘు.

"మనం వెళ్తున్నది ఆ ఆశ్రమానికి కాదు . . . వైదేహీ ఆశ్రమానికి. ఇరవై ఐదో అమ్మాయిని నేను దతత్త తీసుకోబోతున్నాను" అన్నాను.

*(రచన ఇంటింటి పత్రిక, డిసెంబర్ 2001)*

☆☆☆

# సలీం ఇతర రచనలు





# రూపాయి చెట్టు
కథా సంపుటి



ఈనాడు కథల్ని దళిత కథలని, స్త్రీవాద కథలని, ప్రాంతీయ కథలని విభజిస్తున్నారు. సలీం రచించిన కథలు అలాంటి విభజనకు లొంగవు. ఈనాడు మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని తన దృక్కోణంలోంచి విశ్లేషించే ప్రయత్నం చేశాడు రచయిత. ఇతను ఎన్నుకున్న ఇతివృత్తంలోనూ, కథాకథనంలోనూ కొత్తదనం ఉంది. పాఠకులను తన వెంట తీసుకెళ్ళగల్గే చక్కని శైలి ఈ రచయితకుంది. ఎలాంటి డొంక తిరుగుళ్ళు లేకుండా సూటిగా కథనంలోకి ప్రవేశించడం ఈ రచయిత ప్రత్యేకత. పాఠకులకు శాస్త్రీయ దృక్పథాన్ని, అభ్యుదయ దృక్పథాన్ని కల్గించాలన్న అభినివేశంకూడా ఈ రచయితకుంది.

**- ఆదివారం ఆంధ్రభూమి**

ఇతని రచనల్లో మారుతున్న మానవ సంబంధాలు, డబ్బుచెట్టు గిరికీలు కొడుతున్న సామాజిక స్థితిగతులు, మహానగరాల విస్తృతిలో కనుమరుగైపోతున్న ప్రకృతి రామణీయకత దర్శనమిస్తాయి.

**- విశాలాంధ్ర దినపత్రిక**

ఈ రచయిత భావుకుడు. సౌందర్య సరస్తీరాల్లో ఆడుకుని అలసిసొలసి పోవడమే కాదు. జీవితంలోని నిష్ఠుర వాస్తవాల్నికూడా గుర్తించగలిగిన వాడతను. కథ చెప్పే తీరులోని అందం రచయిత స్వంతం. ఈతని రచనాశైలి పాఠకుడిని ఆకట్టుకుంటుంది.

**- ఆంధ్రభూమి వారపత్రిక**

సలీం సాహిత్య స్వభావం మానవతావాదం. మానవ సంబంధాల్లోని మంచినీ, చెడునీ ఆయన కథలుగా మలుస్తారు. పతితుల పట్ల, బాధాసర్పదష్టుల పట్ల ఆయనకు అంతులేని జాలి. ఆ జాలి, కరుణ ఆయన కథలన్నింట్లోనూ కన్పిస్తాయి. సలీం కథలు చదువుతుంటే మానవ స్వభావాలను ఎంత బాగా పట్టుకున్నారా అని ఆశ్చర్యం కలుగుతుంది. వాదాల జోలికిపోని రచయిత సలీం. మనిషే ఆయన వస్తువు.

**- ఆంధ్రజ్యోతి వారపత్రిక**